శివపురాణము

(ఏడవ సంపుటము.)

మూర్తిత్రయప్రణీతము.



నడకుదుటి వీరరాజు పంతులు

సంపాదకుడు.

పిఠాపురము

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాల

౧౯౩౦

విషయసూచిక

		పుట.
౧	దానప్రశంస	౧
౨	వృషోత్సర్గపూర్వకథనము	౪
౩	మహీదానవిధి	౧౦
౪	కాంతారస్త్రా[illegible]పాయము	౧[illegible]
౫	తత్పురుష[illegible]ప్రతి[illegible]విధానము	౧౫
౬	సహస్రనామసంకీర్తనము	[illegible]
౭	తులాపురుషదానవిధి	౩[illegible]
౮	తులాపురుషవర్ణనము	౪౭
౯	బ్రహ్మాండవర్ణనము	౪౮
౧౦	నరకప్రశంస	౫౧
౧౧	హోమమంత్రప్రశంస	౫౩
[illegible]	పంచబ్రహ్మ[illegible]	[illegible]
౩	పంచబ్రహ్మస్వరూపమాహాత్మ్యము	[illegible]౩
౪	తత్పురుషవిధానము	[illegible]౫
౫	అర్చనాదివిధి	[illegible]
౬	వర్ణవి[illegible]ధనము	[illegible]
౭	సంసారచికిత్స	[illegible]
౮	స్త్రీస్వభావకథనము	[illegible]
౯	అరుంధతీప్రస్తావము	[illegible]
౧౦	కాలకీర్తనము	[illegible]

౨౧ కాలజ్ఞానము	౧౧౪
౨౨ ఛాయాపురుష పరిజ్ఞానము	౧౧౧
౨౩ జ్ఞానిగతికీర్తనము	౧౧౨
౨౪ లింగార్చనంబునకుఁ గారణము	౧౧౩
౨౫ లింగస్తోత్రము	౧౧౯
౨౬ ఆదిసర్గము	౧౨౦
౨౭ పృథూత్పత్తి	౧౨౨
౨౮ రక్షోత్పత్తి	౧౨౪
౨౯ దేవదానవాది సర్గము	౧౨౬,
౩౦ ఆదిపత్యకల్పనము	౧౩౧
౩౧ పృథుచరిత్రము	౧౩౨
౩౨ మన్వంతర చరిత్రము	౧౩౭
౩౩ యమునాదుల జననము	౧౪౩
౩౪ వంశకథనము	[illegible]
౩౫ పితృకల్పము	౧౫౮
౩౬ పితృసప్తక వివరణము	౧౬౩
౩౭ వ్యాసపూజ	౧౬౯.

శ్రీరామ శ్రీ

శివపురాణము

ధర్మసంహిత

దానప్రశంస

సత్పాత్రులకుఁ బ్రశస్తంబు లగుమహాదానములం గావించు వారు తరింపఁగలరు గోభూహిరణ్యదానములు పవిత్రములైనవి. వాని విప్రునకు నొసఁగినవారు నరకముఁగూడఁ దరింపఁగలరు. శ్రేష్ఠంబు లగు దానము లన్నియుఁ బాపనాశకంబులు. ప్రసిద్ధంబులగుగోభూవిద్యాదానంబులు మూఁడును తుల్యములైనవే కాని యందు విద్యాదాన మధికఫలప్రద మైనది. వృషభములను, గోవులను, వస్త్రములను, బాదరక్షలను నిత్యమును దానముచేయవచ్చును. అర్థించువారి కన్నపానముల నొసంగవలయును. దారిద్ర్యముచేఁ బీడితుండగు నర్థికి దానము చేయువాఁడు సర్వసౌభాగ్యవంతుఁ డగును. అసూయారహితుండై శ్రద్ధాపూర్వకంబుగ దానముచేయుట సకలయజ్ఞంబులకంటెను శ్రేష్ఠయజ్ఞం బగుచున్నది. బుద్ధిమంతుం డగువాఁ డెప్పుడు నీయజ్ఞమును జేయుచుండవలయును.

ఎట్టిదానంబులఁ బ్రతిగ్రహించుటవలన బ్రాహ్మణ్యము నశించునో వానిఁగూర్చి చెప్పెదను. అట్టిఘోరదానముల ననివార్యంబు

లగు నాపత్సమయములందుఁగాని పరిగ్రహింపరాదు. మృతశయ్యాదానము, కృష్ణాజినదానము, పుణ్యమును గైకొనుటకై చేయు పాపదానము, చండాలదానము, పతితదానము, మ్లేచ్ఛదానము, ఉభయతోముఖగోదానము, తులారోహణదానము, కురుక్షేత్రంబునఁ గావించు దానము, కృష్ణతిలదానము ననునీపదియును ఘోరదానంబులగాపునఁ బరిగ్రహింపఁదగినవి గావు. బుద్ధిహీనుండగు బ్రాహ్మణుఁడు లోభవశమున నీ పదింటిలో దేనిని బరిగ్రహించినను నరకపతితుఁ డగును. ఇట్టి ఘోరదానంబులు చేయువారు పరదారాభిగమనాదిపాపముల శరీరమునఁ గలిగించి పైనుంచుకొన్న తమపాపంబుల నన్నిటిని దానములు బరిగ్రహించిన వానిపైఁ బెట్టి తాముత్తమలోకగతు లగుదురు. మహాఘోరంబు లగునిట్టిదానములను బరిగ్రహించువారు సద్బ్రాహ్మణు లైనచో నట్టి ద్రవ్యమునంతయు దానము చేసివేయవలయును. అట్లు చేయుట కశక్తులైనచో నట్టిద్రవ్యంబునం దర్ధభాగంబునైనను సత్కార్యంబులకొఱకు వినియోగింపవలయును. ఇట్లు చేసిన వారును పాపముక్తులై పవిత్రగతు లగుదురు.

కాంచనదానము, శ్వేతతిలదానము, గజదానము, దాసీదానము, గృహదానము, రథదానము, అశ్వదానము, భూదానము, కన్యాదానము, గోదానము ననునీపదియును మహాదానములు. ఈదానములను బ్రతిగ్రహించువాఁడు దాత నుద్ధరించుటయే కాక తానును దరింపఁగలఁడు. దానములలో సువర్ణము ప్రధానమైనది. దక్షిణాలందుఁగూడ నదియే ప్రశస్తమైనది. స్వర్ణదానముకంటెఁ బవిత్ర మగునదియు, శ్రేయోదాయకం బగునదియు మఱియొకటి లేదు. నూఱుపాపంబులు చేసినవాఁడైనను సత్పాత్రునకు స్వర్ణదానంబు చేసినచోఁ దనకుఁ గలుగు నరకబాధలన్నియుఁ, దొలగుటయే గాక దనపుణ్యము గలవ

[illegible] సిద్ధి [illegible] స్వర్ణదానము చే [illegible]
సకలదురితములను సకలసౌభాగ్యములను బ్రసాదించును. సువర్ణదానము
చేయుట సకలదేవతలను దానసంతుష్టులం గావించిన ఫలము [illegible]
సర్వదేవతాస్వరూపుండు. కావున నగ్నిస్వరూపము [illegible]
తాశనాధావసథుయమునందు వేదప్రమాణముగా సువర్ణము కాంచ
నము స్థాపించి కర్మఫలం బొసగుచుందురు. స్వర్ణస్వర్ణంబులును
నపవిత్రంబులగు వస్తువులని యును విశుద్ధంబులగుచున్నవి సువర్ణము
దేవపితృగణంబులకును మానవులకును గూడ సర్వదా ప్రియమైనది స
కలపదార్థములను బరిశుద్ధంబులుగఁ జేయు జలముగూడ బంగారము
చేఁ బవిత్రంబగుచున్నది. కావున నగ్నిసంభవం బగు హేమము సకలవ
స్తువులకంటెను బవిత్రమైనది. ప్రాతఃకాలంబునఁ బ్రజ్వలితానలంబున
హోమంబు గావించి ప్రతిదినంబును స్వర్ణదానము చేయువానికి
సకలాభీష్టంబులును సిద్ధించును. సకలదానఫలంబులును స్వర్ణదానము
చే లభించును గావున స్వర్ణమే సకలస్వర్గసుఖభోగసంధాయకమైనది.
స్వర్ణదాతయగువానికి సమయమందు ప్రభాకరతుల్యంబై ప్రభావంతం
బును, నప్సరోగణపరివేష్టితంబును, గంధర్వగానసమాచితంబును, హం
సవాహనయుతంబును, మనోవేగసంపన్నంబు నగుదివ్యవిమానము నధి
రోహించి దివ్యమాల్యానులేపనాదినానాభోగంబు లనుభవించుచు స్వ
ర్గలోకంబున యథేచ్ఛావిహారంబు సేయుచుండును. కావున మానవు
లు శక్తికొలఁదిగ స్వర్ణదానము చేయవలెను. ఇంతకంటెఁ బాపమో
చనంబున కెట్టియుపాయమును లేదు. పవిత్రహృదయముతో సువర్ణ
దానము చేయువారు బహుసహస్రవర్షంబులు స్వర్గభోగము లనుభవిం
పఁగలరు.

అని సనత్కుమారుండు చెప్పుటయు వ్యాసుండు మునుల నిట్లు

ప్రశ్నించెను. దేవశేఖరా! నీవు లోకమంగళకరంబులును, బ్రహ్మోక్తంబులు నగు వివిధధర్మంబులంగూర్చి కీర్తించియుంటివి. మఱియు భూదానంబునుగూర్చి యించుక తెలుపవలయును. ఏదానము స్వల్పంబుగఁ జేసినను మండలాధిపత్యమును, వివిధభోగంబులును, ఇహపరసుఖంబులును లభించునో మానవులేదానంబువలన సంపల్లాభముం గాంతురో యాదానముంగూర్చి ప్రశంసింపవలయును.

పృథుచక్రవర్తి పూర్వచరితము

సనత్కుమారుఁ డిట్లు చెప్పఁ దొడంగెను. మునివరేణ్యా! పుణ్యసమయములందు మహాతీర్థములయందు నివేదితంబులగు సకలదానములును మహాఫలదాయకంబులే యగును. అందుశ్రేష్ఠమగు దానంబునుగూర్చి పురాతనేతిహాసమును దెలిపెద నాకర్ణింపుము. పూర్వకాలంబునఁ జిత్రరథుఁ డనునొక రాజు గలఁడు. ఆతఁడు సప్తద్వీపములకు నధీశ్వరుఁడై సకలభోగంబుల ననుభవించుచుండెను.

ఒకప్పు డమ్మహారాజు దివ్యరథారూఢుండై ససైన్యంబుగ నాకపురంబునకుం బోయి తన బాహుబలంబుచే సకలదేవతాసహితంబుగ దేవముఖ్యుని నిర్జించి స్వర్గంబునందుఁగూడఁ దనశాసనమును వ్యాపింపఁ జేసెను. ఆతఁ డిట్లు సచరాచరంబగు త్రైలోక్యమును బాలించుచుండ నారాజ్యమును, దనయైశ్వర్యమును గాంచి తానే విస్మితుం డగుచుండెను. ఆతని [illegible] వేలమంది తనయు లుండిరి. ఆతనికోశాగారమున ధనం బక్షయమై యుండెను. ప్రజలందఱు నారాజునెడల ననురక్తులై యుండిరి. ఆతని కనేకంబులగు నుత్తమవాహనంబులును జనపదంబులును నుండెను. రాజ్యమునందంతటను నిత్యప్రజాభివృద్ధియే కాని యకాలమరణములెన్నడును లేకుండెను. ఆనృపాలునిరాణి సౌభాగ్యవతియు సౌంద

శ్వవతియునై యుండెను. ఈవైభవ మంతయుం జూచికొని యాతఁడు “ పూర్వజన్మంబున నేను గావించినధర్మకార్యముల బలమువలననే నాకిట్టిమైశ్వర్యము లభించినది. ఇప్పు డిట్టిధర్మాచరణంబు గావించినచో నుత్తరజన్మంబునఁగూడ మరల నిట్టిసంపద లభించునో మహాత్ములవలనఁ దెలిసికొని యట్టిధర్మకర్మంబు లాచరించెదను. ” అని నిశ్చయించుకొని వసిష్ఠమునీంద్రుని సందర్శించి “ మహాత్మా ! నాకీభూమండలంబున నవ్యాహత మగునధికారమును, అప్రతిమం బగురూపమును, సుందరీమణియగు దేవియు, శరీరమున నారోగ్యమును, ఐశ్వర్యమును, అసాధారణశక్తియు, అన్నపానాదులయందు సామర్థ్యమును సమస్తమును లభించియున్నవి. ఎందును నాకెట్టిలోపంబును లేదు. గజసహస్రబలుండనై సకలశత్రునాశనము గావించితిని. నాకు సత్సంతానము లభించినది. భృత్యులెల్లరును నాయెడల విధేయులై, ప్రజలందఱు ననురక్తులై యున్నారు. నాయందు భూపరిపాలనశక్తి సంపూర్ణమై యున్నది. నేను తలఁచుకొన్నచో నెట్టికార్యమునైనను గావింపఁగలను. నేనెట్టిధర్మలోపంబును జేయుట లేదు. నాపూర్వజన్మసుకృతమువలననే యివియన్నియు లభించినవని భావించుచున్నాను. పూర్వమున నేనెట్టిధర్మకార్యములం గావించితినో యానతీయవలయును ” అని ప్రార్థించెను.

ఆరాజేంద్రునివచనంబులకును, ధర్మాసక్తికిని వసిష్ఠమునీంద్రుండు సంతుష్టుండై యిట్లు చెప్పందొడంగెను. మహారాజా ! భూలోకంబున మధ్యదేశంబునం దవంతినామకంబగునగరంబు గలదు. పూర్వమాపట్టణమును ధర్మశాసకుం డగుధర్మపాలుండను రాజు పరిపాలించుచుండెను. అప్పుడు నీవు నికృష్టంబగు నొకకులంబున జన్మించి యాపురంబున వసించుచుంటివి. ఇట్లుండ నారాజ్యంబున బహువర్షంబులు

ఓటరు ననావృష్టి యగుటచే దుర్భిక్షంబు తటస్థించుటయు నితరజనం బులతోఁగూడ నీవాపురంబును బరిత్యజించి వనంబునఁ బ్రవేశించి భార్యాసహితంబుగ నందు జీవించుచుంటివి. క్రమముగా భూమండల మంతయు నెండిపోయెను. వనంబులును ఫలశూన్యంబు లైపోయెను. ఇట్టి యవస్థలో నీవును నీ భార్యయును క్షుద్బాధకు సహింపఁజాలక కట్టెల నమ్ముకొనుటచే నెట్లో పొట్టపోసికొనుచుంటిరి.

ఒకనాఁడు మీరిద్దరును గట్టెలమోపుల నెత్తుకొని నగరంబును జేరి వానిని విక్రయించుటకై యింటింటికిని దిరిగితిరి. కాని కొనువా రెవ్వరును లేకపోయిరి. ఆకలిబాధను దాళఁజాలకుండియు మీరట్లే సాయంకాలమువఱకు నగరమంతటను బరిభ్రమించుచునే యుంటిరి. క్రమముగా మీరొక వర్తకుని మందిరముకడకుం బోయితిరి. అచ్చటఁ గొందఱు బ్రాహ్మణులు మంత్రపఠనముచేయుచు హోమాదులు చేయుచుండిరి. అది యంతయుం జూచుచుఁ జలి యగుచుండుటచేఁ గొన్ని కట్టెలను మంటవైచుకొని చలిబాధఁ దీర్చుకొనుచు మీరిరువురు నాసమీపమునఁ గూర్చుండి యుంటిరి. ఆనాఁడు మాఘపూర్ణిమ. చంద్రగ్రహణముగూడ నైయుండెను.

అప్పు డావణిగ్వరుం డుపవాసంబుచేసి భక్తిశ్రద్ధలతో విష్ణుదేవుని బూజించి నూఱుపలంబుల స్వర్ణమయం బగుభూమి నాపుణ్యసమయంబునఁ బుణ్యపురుషుం డగు సత్పాత్రునకు దానము గావించెను. ఓరాజా ! పూర్వజన్మంబునఁ జండాలుఁడవై యున్న నీవును నీసతియును గూడ నత్యుత్తమం బగుస్వర్ణభూదానముచేయుచున్న వర్తకునిం గాంచి సంతప్తహృదయంబులతో “ అయ్యో ! నిరుపేదల మగుమన మట్టిపుణ్యకార్యమును జేయఁజాలకుంటిమిగదా ! పూర్వజన్మమునందిట్టిధర్మము నొనరించకుంటచేతనే మనకిట్టిగతి గలిగెను. ఉత్తరజన్మమునఁ

గూడ మనకింతే కాఁబోవదు." అని విచారించితిరి. ఆధర్మప్రభావఫలం
బువలననే మీకీజన్మమునం దీశ్రేయస్సుదయము లభించినది. కావున
నీవీజన్మమునం దుత్తమదానంబులం గావింపుము. అందువలన నీకు
దేవదుర్లభంబు లగునక్షయఫలంబులు సిద్ధింపఁగలవు. నీపూర్వచరిత్ర
మును వినిపించితినిగదా! నీవును సర్వకామదం బగుభూదానమును
జేయుము. భూదాతల కెన్నఁటికిని స్వర్గచ్యుతి గలుగదు. స్వర్ణగోదా
నము చేయుచుండ నాసక్తులై చూచువారుగూడఁ బాపవిముక్తులై
యుత్తమగతుల నందుదురు. రాజేంద్రా! నీకు శుభ మగుఁగాక!
సర్వద్వీపమయంబగుభూమిని దానము చేయుచుండఁగాఁ గాంచి
తాము దానము చేయవలయు నని సంకల్పించుకొనువారు గూడ
నట్లు చేయఁజాలకున్నను దానఫలంబు నందుదురు.

పూర్వకాలంబున మహాబలసంపన్నుండగు పృథుసార్వభౌముం
డు దేవమానవదానవసహితం బగుభూమండలం బంతయును బరిపాలిం
చుచుండెను. ఆచక్రవర్తిని భూమండలమున మహర్షులును, స్వర్గం
బున దేవగంధర్వాదులును బాతాళంబున దానవోరగాదులును గీర్తిం
చుచుండిరి. ఆతఁడు దయతోఁ బొసంగినదానివలననే తక్కినరాజు
లందఱును జీవించుచుండిరి. సూర్యోదయము మొదలుగ నస్తమయం
బువఱకునుగల త్రిభువనంబులయందు నాతనిరాజ్యము వ్యాపించి
యుండెను. సర్వరత్నమయంబును, సప్తద్వీపసమన్వితము నగుభూమం
డలము నాతఁడు ధర్మయుక్తముగఁ బరిపాలించుచుండెను. ఆతనిరాజ్య
మునం దెందును నధర్మమనునది లేకుండెను. ప్రజలలో నన్యాయప
రులు, తస్కరులు మొదలగుదుష్టజనులు లేకయుండిరి. ఆతని ధర్మ
పాలనమువలన రాజ్యమంతయు నీతిబాధావిరహితమై యుండెను. ఆస
చ్చరిత్రుఁడు [illegible] సమంబుగ నొనరించెను.

ఆయుదారచరితుని బలోత్సాహరూపగుణాదులం గాంచి యా ర్చిదేవి విస్మయావిష్టహృదయయై "స్వామీ! పూర్వజన్మంబున మన ము గావించిన సత్కర్మంబులవలననే మనకిట్టియైశ్వర్యము లభించి నది. ఇంక నుత్తరజన్మంబునం గూడ నిట్లుసిద్ధించుటకుం దగినయుపాయ మాలోచింపవలయును. అని ప్రార్థించెను. పృథుచక్రవర్తి యామా ట లాలించి యానందించి యందుల కేమి చేయవలయునో నిశ్చయిం పంజాలక యొకనాఁడు వేదవిదులగు బ్రాహ్మణులను బిలిపించి వారికిం బ్రణామాదిసత్కారంబులం గావించి సభాసీనులం జేసి వినయమధుర స్వరంబుతో "మునిపుంగవులారా! మీరు నాయెడల ననుగ్ర హంబు గలదేని నాయడిగినప్రశ్నంబునకు సదుత్తరంబు నీయవల యును. మీరు సుప్రసన్నులై యున్నారు. కావున నాప్రార్థనమును చెల్లింపవలయును."

అని ప్రార్థించుటయు మునులు పరమానందభరితులై మహా రాజా! నీమనంబునం గలిగిన సంశయం బేదియో తెలుపుము. మేము దానికిం దగినప్రత్యుత్తరం బీయంగలము. నీధర్మపరిపాలనంబునకు మేము సంతుష్టులమైతిమి. సంతుష్టుండగుబ్రాహ్మణుఁడు సంశయవిచ్ఛే దంబును, హితోపదేశంబును, అహితనివారణంబును గావించి కాని భుజింపఁడు. అని యానతిచ్చుటయు పృథుసార్వభౌముండు "ముని వరులారా! నేనును, నాయిల్లాలును బూర్వజన్మంబునం దెట్టిసుకృ తంబు గావించుటచే మాకీదుర్లభంబగు వైభవము లభించినది? త్రిభు వనంబులయందు నప్రతిహతులగుసకలభూపాలురును నాకు వశీభూతు లైయున్నారు. అనంతం బగుకోశంబును, అసమానం బగుబలంబును, అసాధారణం బగునారోగ్యంబును నాకు లభించియున్నవి. నా తేజము దేవతలకుంగూడ దుర్నిరీక్ష్యమైయున్నది. నాగృహిణియు రూపగుణం

చులచే త్రిలోకసుందరీమణులను మించి యున్నది. ఇట్టినేను నాపూర్వచరిత్రమును నెఱుగగోరుచున్నాను. ఏ సత్కార్యంబుచే మాకిట్టి యుత్తమజీవితము లభించెనదో దయయుంచి సెలవీయవలయును.

అని ప్రార్థించుటయు మునులు దగని నాలోచించి యాసార్వభౌమునిప్రశ్నకుఁ బ్రత్యుత్తరం బిచ్చుటకై మరీచిని నియోగించిరి. ప్రజాపతినందనుండును, ధర్మజ్ఞులలో నగ్రగణ్యుడు నగుమరీచి చాలసేపటివఱకు యోగదృష్టినిమగ్నుండై యుండి సర్వంబును గ్రహించి మహారాజుం గాంచి మృదుమధురస్వరముతో "ఓసార్వభౌమా! నీవు పూర్వజన్మంబున శూద్రకులంబున జన్మించి పరమపాపరాయణుండవై కాలము గడుపుచుంటివి. నీభార్య యగునీమె పతివ్రతాశిరోమణియై నిత్యమును నీయిచ్ఛవచ్చినరీతిని మెలంగుచు నీకు శుశ్రూషఁగావించుచుండెను. క్రమముగా నీవు నిర్ధనుండవై పనులయింటఁ గూలిపనులు చేసికొనుచు జీవింపుచుంటివి. అన్నవస్త్రముల నొసంగఁజాలక నీవెంత త్రోసివైచుచున్నను, నీసతిమాత్రము నిన్నుఁ ద్యజింపక నీసేవ సేయుచునే యుండెను.

ఇట్లుండ నొకప్పుడొకవృషలుం డయోధ్యానగరంబున విష్ణుమందిరంబున స్వర్ణభూదానముం గావింప సంకల్పించి యాస్వర్ణభూమిని నీచేమోయించి యటకుఁ దీసికొనిపోయెను. అప్పుడు నీవును నీ భార్యయుఁగూడ నవ్విష్ణుమందిరంబును సమ్మార్జనాదిక్రియలచే విశుద్ధంబు గావించితిరి. ధర్మపరుం డగునట్టిదాతకుఁ బరిచర్యలం గావించుటచేతనే నీపాపములన్నియును నశించినవి. ఆదాత స్వర్ణభూదానము చేయుచుండ నాసక్తితోఁ దిలకించుటవలన నీకీజన్మమునం దింతటి మహత్త్వము లభించినది. ఇట్టిచో నింతటిమహాదానముం గావించిన దాత కెట్టిఫలంబు లభించునో యెవ్వరు చెప్పఁగలరు? అట్టిమహాదాత తన

వంశంబునం బూర్వులను నూర్వురను, బరులనునూర్వురనుగూడ నుద్ధరింపఁగలఁడు. ఆపుణ్యపురుషుఁడు సూర్యచంద్రు లున్నంతవఱకును స్వర్గసుఖంబుల ననుభవించుచుండును. ధర్మార్థకామమోక్షము లాతనికిఁ గరతలామలకములై యుండును. మహీపాలచంద్రా! భూదానమునం కింతటిమహిమ యున్నది. భూదానము చేయవలయు నని మనఃపూర్వకముగఁ గుతూహలపడినవాఁడుగూడ స్వర్గంబు నందఁగలఁడు. భూదానప్రాశస్త్యముం గూర్చి శ్రద్ధతో నాలకించువాఁడును, బఠించువాఁడునుగూడ సర్వపాపవిముక్తులై స్వర్గసుఖంబుల నందఁగలుగుదురు.

— మహీదానవిధి. —

ఉత్తమమధ్యమాల్పస్థితులు గలమానవులు తమశక్తికిఁ దగినట్లు భూదానముం గావించియు సంపూర్ణఫలంబునే కాంచఁగలుగుదురు. లక్షసువర్ణములచేఁగాని, వేయింటిచేఁగాని, నూటింటిచేఁగాని, యంతకును శక్తిచాలనివా రేఁబదింటిచేఁగాని యేకహస్తపరిమితంబైనను, ద్విహస్తపరిమితంబైనను, త్రిహస్తపరిమితంబైనను భూప్రతిమను జేయింపవలయును. కేవల మశక్తులగువారు తామ్రముచేఁ జేయింపవచ్చును. ఆభూమియందుఁ బర్వతస్థానంబులయందు రత్నంబుల నిలుపఁజాలనివారు హేమరజంబును నిక్షేపింపవలయును. ఆభూమికి మధ్యస్థానంబున మేరువును, పూర్వభాగంబున మందరమును, దక్షిణంబున గంధమాదనంబును, పశ్చిమంబున నీలపర్వతంబును, ఉత్తరంబున విపులశైలంబును నిర్మింపవలయును. మేరువునకూర్ధ్వభాగంబున వైడూర్యమాదిరంబున బహురత్నంబుల నుంపవలయును. దక్షిణంబున విద్రుమంబును, పశ్చిమంబున మహానీలమును, ఉత్తరంబునఁ బద్మరాగమును నిలుపవలయును. రత్నాభావంబునఁ గాంచనరజంబైనను, దదభావం

బున మౌక్తికాదికంబైనను నిక్షేపింపవలయును. అనంతరము నలుదెసలను వరుసగా కడిమి, నేరేడు, రావి, మారేడుచిగుళ్లను నిలుపవలయును. అవి దొరకనిచోఁ దములపాకులైన నుంపవలయును. మేరుమందరాదిపర్వతంబులకు వెలుపల లవణసముద్రమును గల్పించి యాస్థానమును బవిత్రమగులవణముచే నింపవలయును. దానికి వెలుపల ప్లక్షద్వీపమును రచించి యందిక్షుసముద్రస్థానమును చెఱకురసముచే నిండింపవలయును. దానివెనుక శాల్మలిద్వీపమును నేతితో సర్పిసముద్రమును, దానితరువాతఁ గుశద్వీపమును పెరుఁగుతో దధిసముద్రమును, దానివెలుపల క్రౌంచద్వీపమును పాలతో దుగ్ధసముద్రమును, దానికి బాహ్యమున శాకద్వీపమును తేనెతో మధుసముద్రమును, దత్పరంబునఁ బుష్కరద్వీపమునునిర్మింపవలయును. ఆపుష్కరద్వీపమును జలజయుతంబగువిమలసలిలంబులచేఁ బూరింపవలయును. ఇట్లు సర్వలక్షణసమన్వితంబుగ నిర్మింపఁబడిన భూప్రతిమను వేదియందు స్థాపింపవలయును. ఈదానమునుగూర్చి పదివేలసంవత్సరములు చెప్పినను సంపూర్తిగఁ జెప్పఁజాలము. కావున సంక్షేపముగఁ జెప్పితిని.

పిమ్మట నేకహస్తపరిమితం బగు కుండమును నిర్మించి యందగ్నిప్రతిష్ఠాపనంబు చేసి మహావ్యాహృతులను బఠించుచు శ్వేతసర్షపసహితంబులగుతిలలచే హోమము చేయవలయును. మఱియుఁ దత్తన్మంత్రములతో విష్ణుహోమమును, వసుహోమమును గ్రహాదిక్పాలకహోమంబులను గావించి పృథ్వీహోమంబు చేసి “భూమిదేవి పర్వతంబులకు నాధారస్వరూపా! నీవు బలవంతులలో శ్రేష్ఠుఁడవు. సకలంబునకు నాశ్రయుండవు. అనంతుఁడవు. పురుషోత్తముఁడవు. మఱియు దేవతాగణంబులచేఁ బూజితుండవు. అట్టి నిన్ను నేను పూ

జించుచుంటిని నాయభీష్టప్రదానముం గావింపుము. నీవీభూమండలమును సృజించి వరాహరూపంబున ధరించియుంటివి. నీవు భూదాతవును ప్రతిగ్రహీతవునై యుంటివి. నేను నీకీ హేమభూదానంబు చేయుచుంటినిగావున దీనిని బ్రతిగ్రహించి నాయభిమతంబుల సిద్ధింపఁజేయుము" అను నీమంత్రముతో యథాశాస్త్రంబుగ వస్త్రాభరణంబులతోఁ బూజించి "ధరణీధరుండు ప్రీతుండగుఁగాక" యని బ్రాహ్మణునకు దానము చేయవలయును. అట్లు దానము చేయువాఁడు తన వంశమున నతీతుల నిరువదితరంబులవారి నుద్ధరించి పదునలుగురింద్రులు పరిపాలించునంతవఱకు తాను స్వర్గంబున నుండి సకలభోగంబుల ననుభవించుచు ననంతరము భూమండలమునం దేకచ్ఛత్రాధిపతియై జనింపఁగలఁడు. ఆవెండట్లు మరల జన్మించియు ధర్మకార్యతత్పరుండై దానప్రభావంబునఁ గ్రమంబుగ ముక్తిం గాంచఁగలుగును.

కాంతారత్రాణోపాయము

సనత్కుమారుండు మఱియు నిట్లు చెప్పందొడంగెను. పాపకర్ముండగు మానవుఁడు తపంబుచే శరీరంబును బరిశుద్ధంబు గావించుకొని క్రమంబుగఁ బాపవిముక్తుండు కాఁగలఁడని యిదివఱకే చెప్పియుంటిని. మానవుని దేహమధ్యంబుననుండు ప్రాణమంతర్జీవము. గృహమధ్యంబునం గలధనమే బాహ్యజీవము. ఇందు తపంబుచే నంతర్జీవమును, దానముచే బాహ్యజీవమును శాసించుటవలననే మానవునకు ముక్తిలాభంబు గలుగును. అని చెప్పుటయు వ్యాసమునీంద్రుండు మహాత్మా! ఈకలియుగంబున మానవులు సదాచారవిహీనులును, పాపనిరతులును, మూఢులు నై యుందురు. పాపకర్మంబులవలన వారు నిరంతరమును నరకయాతనలనే యనుభవింపవలసినవా రగు

దురు. అట్టినరకంబులయందు దుస్తరంబగు గభీరకాంతారము గలదు. ఆదుర్గమకాంతారయాతన యేతపంబువలన, నేదానమువలన విన ష్టంబు గాఁగలదో యానతీయవలయును. అని ప్రార్థించారు.

సనత్కుమారుం డిట్లనియెను. కార్తికమాసంబునఁ గృష్ణచతు ర్దశియందు సమాహితచిత్తుండై గంధపుష్పంబులచేతను,ఉత్తమంబులగు భక్ష్యాదుల నివేదనంబుచేతను భగవానుం డగుదామోదరు నారా ధింపవలయును. ప్రస్థపరిమితంబు లగునల్లనువ్వులచే సర్వలక్షణసంప న్నం బగుగజమూర్తిని, సువర్ణంబుచే సవత్సంబగుధేనువును నిర్మించి వానికి నలుదెసలను దీపదానంబు గావింపవలయును. అందు గజప్రతి మకు ముక్తాఫలంబులచే నేత్రంబులను, విద్రుమచ్ఛదం బగు రౌప్యం బుచే దంతములను, సువర్ణంబుచేఁ దిలకంబును, చామరంబులచేఁ గర్ణంబులను, కాంస్యంబుచే ఘంటాద్వయంబును, దుకూలంబుచేఁ గక్షను నిర్మించి కుంభస్థలంబులయందు మౌక్తికంబులను, మస్తకంబున సిందూరంబు నుంచి విచిత్రవసనంబులచే నాచ్ఛాదించి ముక్తామాలి కలచే సర్వాంగముల నలంకరింపవలయును. దానితోఁగూడఁ గాష్ఠపా దుకలు; చర్మపాదుకలు, ఛత్రము, ఉదకకుంభము, పీఠము, దర్పణ మును జేయింపవలయును. శక్తిగలవాఁ డీవస్తువుల నన్నిటిని బంగార ముతోఁ జేయింపవలయును. ఈదానవిషయంబున విత్తశాఠ్యము చే యంజనదు. ఆగజంబున కగ్రిభాగంబున నష్టదళపద్మంబును లిఖించి కుంకుమచే నాపద్మమును బూరించి యందు కర్ణికాస్థానంబున విష్ణుదే వుని, శంకరుని, బ్రహ్మాదేవుని బూజించి పూర్వదళంబునుండి క్రమం బుగ "పర్జన్యం మను, మదుత్పాంతుం నగుదేవేంద్రునకు నమస్కా రము" అను మంత్రముతో నింద్రుని "జాతవేదుండ నగు హవ్యవాహ నుండ నగువహ్నికి నమస్కారము" అనుమంత్రముతో నగ్నిని "పితృ

పతియు నానందదాయకుండు నగుయమునకు నమస్కారము" అను మంత్రముతో యముని, "నిరయాత్మకుండును,ధర్ముండు నగు నిర్ఋతి నాథునకు నమస్కారము"అని నైరృతిని, "భవభీతార్తిహరుండును,జల పతియు నగువరుణునకు నమస్కారము" అనుమంత్రముతో వరుణుని, "హరిణవాహనుండును, జగత్ప్రాణుండు నగువాయువునకు నమస్కారము" అనుమంత్రముతో వాయువును, "స్మేరస్మయమదయుతుం డగు ధననాథునకు నమస్కారము" అనుమంత్రముతోఁ గుబేరుని, "పశుపతియు, సర్వేశ్వరుండు నగుశివునకు నమస్కారము" అను మంత్రముతో మహాదేవుని బూజింపవలయును. "రక్షకుండును, బ్రహ్మాద్యాత్మకుండును, విశ్వరూపుండును, దేవుండు నగు కాంతార పతికి నమస్కారము" అనుమంత్రముతోఁ గాంతారపతిని, కల్పోక్త విధానంబునఁ గాంతారదేవతలను బూజించి మరల విశ్వనాథుండును, దేవదేవుండు నగువిష్ణుదేవు సన్నుతించి కృతాంజలిపుటుండై "ఓప్రభూ! కేశవా! నేనీగజంబు నారోహించి దుర్గమం బగుకాంతారమును సుఖంబుగఁ దరించునట్లనుగ్రహింపుము. ఈగజరాజము నాకు భద్ర ఘటంబును, కామధేనువును, కల్పవృక్షమును, చింతామణియు నగుం గాక" అనుమంత్రము బఠించుచు మణిహేమాభరణశోభితంబగు నాగాశిని బ్రాహ్మణునకు దానము చేయవలయును. అనంతరము దీపదానంబు చేసి రాత్రి భుజింపవలయును.

ఈదానము కార్తికపూర్ణిమయందును జేయవచ్చును. శక్త్యను సారంబుగ విధివిధానంబున నీదానముం గావించువానికి యమపురమా ర్గంబున భయంబును, నరకదర్శనంబును గలుగవు. అతఁడు పాపము క్తుండై సుహృద్బంధుజనంబులతోఁ గూడఁ బనునలుగురింద్రులు పాలిం చునంతపఱకు స్వర్గంబున విహరించుచుండును. జ్యేష్ఠపుష్కరంబున

నూటుకపిలలను దానము చేసినఫల మొక్క-కాంతారగజదానంబు వలన సిద్ధించును. ఉభయముఖశతగోదానఫలంబును, దివాకరుండు రాహుగ్రస్తుండైయున్న పుణ్యసమయంబునఁ గావించిన భూదానఫలంబును దీనితోసమానంబులు గాఁజాలవు. నూటుసారులు కృష్ణాజినదానంబు చేసినఫలము దీనివలన లభించును. గజాశ్వగోదానఫలంబులు దీనివలన సిద్ధింపఁగలవు. తిలజలధేనుదానంబులఫలముకంటె శతగుణాధికఫలము తద్వస్తునిర్మితంబగునిగజదానంబువలనఁ జేకూరును. కాంతారగజదానంబిట్లు ప్రశస్తంబైనదని యెఱింగి గజశ్రేష్ఠమును విధ్యుక్తముగఁ బూజించి "ఓయష్టదిగ్గజేశ్వరా! కాంతారహస్తిస్వరూప మహాదేవా! నీకు నమస్కారము. ఈదానఫలంబువలనఁ గాంతారకారి యగునారాయణుండు ప్రీతుండగుఁగాక" అనుమంత్రము నుచ్చరించుచు బహుకుటుంబసంపన్నుండగుసద్బ్రాహ్మణునకు దానము చేయవలయును. ఇందువలన సకలపాపహరంబును, పుణ్యవృద్ధియు, స్వర్గలాభంబును గలుగును. ఈప్రకరణమును బఠించువారును, ఆలకించువారును దానఫలంబును గాంచఁగలరు. ఈదానము చేయవలయునని మనఃపూర్వకముగఁ గుతూహలపడువారికిఁగూడ స్వర్గావాసంబు సిద్ధింపఁగలదు.

— చక్షుష్ట్రశివవ్రతవిధానము —

పూర్వయుగంబున జంబూద్వీపమునందు నూటక్షౌహిణులసైన్యమున కధీశ్వరుండును, ధార్మికుండు నగునొకరాజుండెను. ఆతఁడష్టవిదులయందగ్రేసరుండును, వేదశాస్త్రార్థపారగుండును, ధర్మిష్ఠుండును, సత్యవాదియు, బలశాలియు, దాతయు, భోగక్షముండును, అతిథిప్రియుండునై కీర్తింపఁబడుచుండెను. ప్రతిదినంబు నాతఁడు సోమ

బ్రాహ్మణులకు హేమశస్త్రాదిదానములు గావించుచు, నర్థులకును దీనులకును వారివారికోరికలం దీర్చుచు శ్రద్ధాపూర్వకంబుగ దానంబులు గావించుచుండెను. ఇట్లు శతానీకుండనుమహారాజు చిరకాలంబువఱకును మంగళమయంబుగ రాజ్యమును బరిపాలించి సహస్రానీకుం డనునొకకుమారుంగాంచి యనంతరము కాలవశంబున మృతుం డయ్యెను.

అంతట సహస్రానీకుండు కులక్రమాగతం బగురాజ్యంబున కధీశ్వరుండై న్యాయయుతంబుగను, ధర్మసహితంబుగను, పృథ్వీశాసనంబు గావించుచుండెను. ఆతఁడు రూపంబునఁ జంద్రుని, ప్రతాపంబున సూర్యునిం బోలి శత్రువులనను బరిపాలించుటయందు లోపము చేయక సర్వజనరంజకుండై యుండెను. కాని యాతఁడు తనతండ్రిచేసినట్లు బ్రాహ్మణులకుమాత్రము దానములు చేయుట లేదు. ఇట్లు చాలకాలంబు గడచుటయు ప్రతిగ్రహాలోపవశంబున నెట్టియాధారమును లేకుండుటచే బ్రాహ్మణు లందఱును మహారాజును దర్శింప వచ్చిరి. సహస్రానీకుండును శ్రద్ధాభక్తులతో బ్రాహ్మణులందఱను యథావిధిగఁ బూజితులం గావించుటయు వారు ప్రహృష్టహృదయులై యందఱు నేకవాక్యంబుగ నాసరపాలునుద్దేశించి మహారాజా! మేము మనవిచేయఁబోవువిషయము నేకాగ్రచిత్తంబున సమాహితంబుగ నాకర్ణింపవలయును. మీతండ్రి నిత్యదానంబులచే బ్రాహ్మణుల మగు మమ్ముఁ దనియించుచుండుటచే మేమెల్లరమును నభీష్టవస్తుసంపన్నంబులగుమాగృహంబులయందు యథాసుఖంబుగఁ గాలక్షేపము చేసికొనుచుంటిమి. ఇప్పుడు మీపరిపాలనమునం దట్లు బ్రాహ్మణసత్కారంబు జరగుట లేదు. అందుచే నిలువఁజాలక కొందఱుభూసురు లీనగరమును విడిచి పోయియున్నారు. కేవలము మేముమాత్రమే సపరివారంబుగఁ

గష్టముల ననుభవించుచు నిందు నివసించి యుంటిమి. నృపాలశేఖరా! నిత్యమును దారిద్ర్యమ్మునచేఁ బీడితుల మగుచున్నమాకును నేఁడో రేపో నగరమును విడువవలసివచ్చునని తోఁచుచున్నది.

అని భూసురులు మనవి చేయుటయు నమ్మహీంద్రుఁడు నవ్వుచు నో విప్రవరులారా! న్యాయానుసారంబుగ బ్రాహ్మణులకు దానము చేయుటవలనఁ బరలోకంబున మహాఫలంబు గలుగునను మాట సత్యమే. కాని యందులకుఁ గారణమేమో యించుక వినఁగోరుచున్నాను. దానమువలన స్వర్గప్రాప్తియు, మరల సుఖసౌభాగ్యమయం బగుజన్మమును గలుగునందురు. నాతండ్రి యిప్పుడు స్వర్గంబున నెట్టిభోగంబుల ననుభవించుచున్నాఁడో తెలిసికొని యథార్థముగఁ దెలుపఁ గోరెదను. అనుటయు బ్రాహ్మణు లిక మాఱుమాట చెప్పలేక మహారాజుకడ సెలవు గైకొని యట్లే తెలిసికొని చెప్పెద మని మనవి చేసి దీనమానసంబులతో గృహంబులకుం బోయిరి. తరువాత వారం దఱు నొక్కచోఁ జేరుకొని మృతుఁడైనయమ్మహారా జెచ్చట నెట్లుండెనో గ్రహించుట కుపాయము నాలోచింపఁదొడంగిరి. కాని వారి కేమార్గమును గోచరించుట లేదు. రాజావమానశంకచే వారు చాల దినంబులవఱకు నాయాలోచనలోనే నిమగ్నులై పోయిరి.

అప్పుడు వారిహోమాదినిత్యకర్మంబు లన్నియు విలుప్తంబులై పోయెను. అందుచే నాదిత్యుండు వ్యాకులితుండయ్యెను. రాజులు ధర్మయుక్తముగఁ బరిపాలించుచున్నను దేశంబున ననావృష్టి గలిగెను. అగ్నియందు బ్రాహ్మణులు నివేదించునాహుతులు సూర్యునకుఁ జెందును. ఆతనియనుగ్రహంబున వృష్టియు, దానిమూలంబున నన్నంబును, దానివలన సకలజీవులకును దృప్తియుఁ గలుగుచుండును. వీని కన్నిటికిని మూలకారణం బగునాహుతిప్రదానము లేకుండుటచేఁ

క్రమముగా నివి యన్నియును లోపించిపోయెను.

ఇది యంతయుం గాంచి జగన్మిత్రుండగుసూర్యభగవానుండు మిగుల విచారించి బ్రాహ్మణరూపధరుండై భూసురులచెంతకుం బోయి "ఓభూసురవరులారా! మీరు నిత్యకర్మంబులను బరిత్యజించి యేల యిట్లు విషణ్ణులై యున్నారు? మీకుఁ బ్రధానంబులగుపంచయజ్ఞములే యనంతఫలదాయకములు. నిత్యకర్మంబులం దీర్చుచు నన్యఫలాకాంక్షులై వానిని బరిత్యజించువారి కెట్టిసుప్రశస్తదానాదిసత్కర్మంబులును సఫలంబులు గానేరవు. సకలఫలదాయకంబు లగుపుణ్యతీర్థంబులుగూడ నిత్యకర్మపరిత్యక్తులయభిమతంబునుం దీర్చుటకు సమర్థంబులు గానేరవు. చతురాశ్రమవాసులకును నిత్యకర్మంబులగుపంచయజ్ఞములు భుక్తిముక్తిదాయకములై యుండును. కావున వానినెన్నండును ద్యజింపరాదు. నిత్యకర్మంబుల విడువకుండఁగనే నైమిత్తికంబుల నాచరింపవలయును. నిత్యకర్మంబుల కవిరుద్ధంబు లగునైమిత్తికకర్మంబులు శతగుణాధికఫలదంబు లగుచున్నవి. ఎన్నఁడు నెట్టిప్రతిగ్రహంబును జేయనివాఁడును, నిత్యజపపరాయణుండు నగుబ్రాహ్మణుఁడే మరణించినయానృపునిస్థితిగతులంగూర్చి తెలుపఁగలఁడు."

అని బోధించుటయు బ్రాహ్మణులాభాస్కరునకుఁ బ్రణామంబులు గావించి పరమానందముతో నాభూసురోత్తమునికొఱకుఁ బురంబునఁటుదెసల నన్వేషింపనారంభించిరి. ఆపట్టణంబున నట్టివిప్రసత్తముం డొండును వారి కగపడలేదు. వారట్లు తిరుగుచుండఁగా నొక్కచో నూర్ధ్వబాహుండును, నిరాలంబుండును, ఏకపాదస్థితుండును, తపోనిరతుండును, ద్విజోత్తముండు నగుభార్గవుని సందర్శించి ప్రణామంబులు గావించి యందఱు నాతనిఁ బరివేష్టించి యాతనిజపావసానసమయమును నిరీక్షించుచుండిరి. సూర్యదేవుండును పశ్చిమంబునకు వాలిన

పిమ్మట నాభాదేవశ్రేష్ఠుండు జపంబును ముగించి దేవపితృతర్పణాంబులను, మఱియు నితరంబులగుసత్యకర్మంబులను దీర్చికొని తన్నుఁ బరివేష్టించియున్నబ్రాహ్మణుల నందఱం గాంచి కృతాంజలియై యర్ఘ్యపాద్యాదివిధులచే వారి నర్చించి ఫలమూలాదినివేదనంబున వారిని బరితృప్తులం గావించి యాగమనకారణముంగూర్చి ప్రశ్నించెను. అప్పుడవ్విప్రులు తమవచ్చినకార్యము నాతని కెఱింగించుటయు భార్గవుండు తనలో “ఇప్పు డేమిచేయవలయును ? వీరికోరికను నిరాకరించి నే నెప్పటియట్లు నాతపంబు చేసికొనుట మంచిదా? కాక దీనులై వచ్చి యాచించుచున్న వీరికష్టములను దొలఁగించుటకై ప్రయత్నించుట మంచిదా ? ఆపన్నులగుజీవుల కభయదానంబు గావించుట తపంబు కంటెను నధికధర్మం బగుచున్నది. సకలజీవులకును దానముచేయుట కంటె నొక్కజీవియం దైనను దయచూపుటయే యుత్తమధర్మం బని పెద్దలు చెప్పుదురు.” అని వితర్కించుకొని భార్గవుండు బ్రాహ్మణసహితుండై యమపురంబునకు బయలుదేఱెను.

ఆతనిం గాంచి సూర్యదేవుండును దక్షిణాభిముఖంబుగఁ బ్రయాణము సాగించెను. భార్గవుండును దపోబలంబున శీఘ్రగామి యగు భాస్కరు ననుసరించి యశ్రమంబుగఁ బోవుచుండెను. ఇట్లాయిరువురును క్రమంబుగ నెనుబదియెనిమిదివేలయోజనముల యమమార్గము నతిక్రమించి పోవుచుండిరి. అచ్చట జలము లేదు. తినుటకన్నము లేదు. నిలుచుటకుఁ జెట్లనీడయైనను లేకుండెను. కేవలము దేవదానవులకుఁగూడ దుస్సహం బగుచలిమాత్ర మంతటను వేధించుచుండెను. ఆప్రదేశమంతయు నంధకారబంధురమై యుండెను. ఆవెనుక నిరువదియెనిమిదికోట్ల దుస్సహనరకంబులు గానవచ్చుచుండెను. ఎవ్వరో శత్రువులు మెడఁబడికొట్టుచున్నట్లు కడుపుమండుకొని పోవుచుండఁ

పాతకర్ములగు జీవులు నరకంబులయందలి యాతనల ననుభవింపఁజా లక కాపింపుచుండు నార్తనాదంబు లాతనికి వినవచ్చుచుండెను. వారు పడుచున్న బాధలన్నియు నాతని కగపడుచుండెను.

అట్లాతఁడు పోవుచుండ మార్గమధ్యంబున దండపాణి యగు బ్రాహ్మణుఁడొకఁ డాతని నడ్డగించి "నీవు నాకు దానము నీయకుండ నెచ్చటికిఁ బోయెదవు ? పూర్వము నీవు నాకేమి యిచ్చెద నని వాగ్దానము చేసియుంటివో జ్ఞప్తికిఁ దెచ్చుకొనుము" అని గద్దించుటయు భార్గవుం డింపక నేపు చింతించి "ఔను. నేను నీకొక పురాణము నిచ్చెద నని చెప్పి యుంటిని. అదియేనా నీవిప్పు డడుగుచున్నది ? నే నింటికిఁ బోయి తీసికొనివచ్చి యిచ్చెదను. ఇప్పటికి నన్నుఁ బోనిమ్ము!" అనియెను. బ్రాహ్మణుఁ డామాట విని "తరువాత నిచ్చెదను" అను మాట మీభూలోకమునందే గాని యిచ్చటఁ జెల్లనేరదు. ఇప్పుడే నాకీయవలసినది యిచ్చి పోవలయును." అని నిర్బంధించెను. అప్పుడు భార్గవుండు నేనేమియును దీసికొని రాలేదనియెను. బ్రాహ్మణుఁ డామాటలు విని దానికిఁ బ్రతిగ నీసుకృతఫలమునం దర్ధభాగము నాకీయవలయు నని కోరెను. దానికి భార్గవుం డంగీకరింపకుండుటయు సూర్యదేవుండు భార్గవునకు బోధించి యాతనిపుణ్యమునందు షష్ఠాంశము నాబ్రాహ్మణుని కిప్పించి యాతని బంపివైచెను. తరువాతఁ గొంతదూరము చనునప్పటి కొకగొల్లవాఁడు భార్గవు నడ్డగించి నీ గోవును గాచినందులకు నాకీయవలసినవేతనము నాలుగుమిరుపగింజలమెత్తుబంగారువాణెము (కాకిణి) ను దెమ్మని యడిగెను. ఆకాలమున నది స్వల్పమగుటచే గొల్లవాఁ డాతని నడుగలేదు. భార్గవుండును మఱచిపోయెను. ఇప్పుడు దానికి బదులుగా భార్గవుఁ డాగోపాలునకుఁ దనసుకృతముసందు షష్ఠభాగము నీయవలసివచ్చెను. ఇట్లు

మార్గమధ్యమునందు చాకలి, ధర్మకారుఁడు, వస్త్రకారుఁడు, తీర్థయాత్రల సేవింపఁజేయువాఁడును నాతనిఁ దనుకీయవలసినధనముంగూర్చి పీడించిరి. వారికిఁ గూడ సుకృతమునందుషష్ఠభాగము నీయవలసివచ్చుటచే బ్రాహ్మణోత్తముఁ డగుభార్గవుఁడు నిస్తేజుండై పోయెను. ఇఁక నాతఁ డొక్కయడుగైనను ముందఱికి వేయఁజాలక పోయెను.

అప్పుడు దివాకరుం డాతని బట్టుకొని శతానీకమహారాజను భవించుచున్న నిరయముకడకుఁ దీసికొనిపోయెను. ఒకకుంభమధ్యమునఁ బచనముచేయఁబడుచున్న యన్నరపాలుం గాంచి భార్గవుఁడు విస్మితుండై పోయెను. అతఁడు కొంతసేపట్లు యుండి రాజును సమీపించి ‟ మహారాజా ! నీవు పూర్వము బ్రాహ్మణులకు షోడశమహాదానంబులను గావించితి. రత్నములు, వస్త్రములు, గ్రామములు, నగరములు మొదలగువానిని సమర్పించి భూసురులను దనియించితివి. తపంబువలనను భక్తితోఁ గావించినదానంబువలనను స్వర్గప్రాప్తి యగునని మునులు చెప్పుదురు. అట్టిచో నీవిప్పుడు యమకింకరులచే నిర్బంధితుండవై నరకయాతనల ననుభవించుచుంటివి. దీనికిఁ గారణంబేమియో తెలుపవలయును.” అనియడుగుటయు శతానీకుండు భూసురోత్తమా ! ఈవిషయంబున సత్యమును వచించుచున్నాను. వినుము. నేనజ్ఞానవశంబునఁ బరులకడ సంపాదించినధనంబుచే బ్రాహ్మణులకనేకదానంబులఁ గావించితిని. ఆద్రవ్యమును సేకరించుపట్టున నామూలమునఁ బ్రజలు పీడితులైరి. ప్రజాసంతాపమున బయలువెడలిన యనలజ్వాలలమూలముననే ప్రేతమూర్తి నగునేనిప్పు డీనరకమునందు రేయుంబవలు దహింపఁబడుచున్నాను. మహాత్మా ! నీవు నన్నీదుఃఖమునుండి విముక్తుం గావింప నెంతువేని శీఘ్రంబుగ భూలోకంబునకుఁ బోయి సాఘుసంగంబు గావింపుమని నాకుమారునకు బోధింపుము.

సాధుసంగంబుకంటె నన్నుద్ధరించుటకితరోపాయం బేదియును లేదు. అని ప్రార్థించెను.

ఆమాట లాలించి భార్గవుండు తనప్రభువునకును, సకలమానవగణంబులకును హితంబు గోరి యాదిత్యుంగూర్చి యిట్లు ప్రార్థించెను. ఓసూర్యదేవా! సాధువులు తీర్థస్వరూపులు గావున వారిదర్శనము పుణ్యదాయకమైనది. తీర్థసేవనము కాలక్రమంబున ఫలించును గాని సాధుసంగము సద్యఃఫలము నొసంగుటకు సమర్థమై యుండును. పుణ్యకర్మవిహీనులకు దేవతలయందును, ఉత్తములగుబ్రాహ్మణులయందును, తపస్వులయందును భక్తి గలుగదు. పాపక్షయసమయంబుననే మానవులకు దానధ్యానంబులయందు బుద్ధి ప్రసరించును. నీదర్శనమాత్రంబుననే నరకవాసులెల్లరును సుఖానుభవముం గాంచుచుండుటచే నీవు దేవతాశ్రేష్ఠుండవని నిస్సంశయంబుగ గ్రహింపఁ గలిగితిని. కాని ధర్మహీనుండ నగునేను నీసమ్ముఖంబున దేవతుల్యంబగునవస్థయందుండియు నించుకంతయు సుఖము నందఁజాలకున్నాను. కావున మానవులకుఁ బాపవిమోచకంబును, స్వర్గసుఖదాయకంబు నగు నుత్తమధర్మం బేదియైననున్నచో లోకమంగళంబుకొఱకు నాధర్మముంగూర్చి యానతీయవలయును. సంసారు లగుమానవులు క్షేత్రదారగృహాదులకొఱకు కెన్నికష్టముల ననుభవించి ప్రయత్నింతురో యావిధముగా ధర్మముకొఱకుఁగూడ శ్రమపడకున్నచో స్వర్గమోక్షాదిఫలంబులఁ బడయఁజాలరా యేమి? ఈవిషయంబునుగూర్చి విస్పష్టంబుగ నానతీయవలయును.

అని భార్గవుండు ప్రార్థించుటయు భాస్కరుండు విప్రోత్తమా! లోకహితంబుకొఱకు నీకీవిషయంబున సత్యము నెఱింగించుచున్నాను. సర్వసంపత్సమృద్ధికిఁ గారణంబును, సంకీర్తనంబువలనను, నమస్కారం

బువలననుగూడ ఫలదాయకంబు నగుధర్మముంగూర్చి నీవు నన్నుఁ బ్రశ్నించితివి. దీనింగూర్చి చెప్పుటవలన జిహ్వా పవిత్రం బగుటయే కాక శ్రేయోభివృద్ధికూడఁ గాఁగలదు. కావున సకలపాపహరంబగు నట్టిధర్మముంగూర్చి చెప్పెదను వినుము. చైత్రమాసము వత్సరంబున కాదియు, శివాదిసకలదేవతలకును బ్రియకరంబునై యున్నది. ఆమాసమునం దేవతలందఱును స్వర్గమునుండి భూమండలంబునకుఁ గ్రీడార్థమై యరుదెంచి ప్రతివత్సరమును సుఖవిహారంబు గావించి సంప్రీతులై నిజలోకంబులకు విచ్చేయుచుందురు. శంకరుండును బాలకరూపముం దాల్చి కన్యామూర్తులగుప్రమథులతోడను, భగవతియగుగౌరితోడను గలసి చైత్రమాసంబున భూలోకమునవిహరించుచుండును. కార్తికమాసంబున దీపదానము చేయునట్లు చైత్రమాసంబునఁగూడ మహాదేవునకును, నితరదేవతలకును బ్రీతికరంబుగా దీపారాధనాదిమహోత్సవంబులం గావించువారు పాపాత్ములైనను దేవలోకగాము లగుదురు. కావునఁ గృష్ణచతుర్దశియందుగాని, శుక్లచతుర్దశియందుగాని యుపవసించి మహాదేవునుద్దేశించి బ్రాహ్మణునకు గోదానంబు చేయువారు పాపవిముక్తులై స్వర్గసుఖంబు లందఁగలరు.

అని యోగ్లాదిత్యభగవానుం డానతిచ్చుటయు భార్గవుండు పరమానందభరితుండై మరల భూలోకంబునకు వచ్చి మంత్రిపురోహితసామంతద్విజమండలపరివేష్టితుండై కొలువున్నసహస్రానీకునిం దర్శించి యెల్లవిషయంబులను సవిస్తరంబుగ వినిపించెను. అంత సహస్రానీకుండు ప్రహృష్టమానసుండై తానువచ్చువఱకును భార్గవుని రాజధానియందే యుండ నియోగించి న్యాయపూర్వకంబుగ ధర్మము నార్జించుటకై విదేశంబునకుం బోయెను. అందొకచో నొకపుష్కరిణి త్రివ్వఁబడుచుండెను. సహస్రానీకుం డాకూలివారితోఁ గలసి తానును

గతుండును, బుద్ధిగతుండును, అహంకారరూపుండు నగురుద్రుండు నాపాపంబుల హరించుంగాక ” అనుమంత్రములతో శివపూజ గావించి యూపాత్ర నుత్తమబ్రాహ్మణునకు దానము చేయవలయును. అట్లు చేయువారు మహాఫలసిద్ధునును, సురూపసౌభాగ్యభోగైశ్వర్యవంతులు నగుదురు. నాలుగుమాసంబు లుభయచతుర్దశులయందు నిమ్మహావ్రతంబు నిర్వర్తించుపుణ్యులు సహస్రానీకునివలెఁ దమకులంబున సహస్ర పురుషుల నుద్ధరించి పాపశూన్యులై దేవతలకుఁగూడఁ బూజనీయులై శివలోకంబున సుఖోపవిష్టులై యుండఁగలరు. రాత్రులను, పగళ్లను, మధ్యాహ్నంబులను, అపరాహ్ణంబులను, సంధ్యాకాలంబులను వారు మనోవాక్కాయంబులచేఁ గావించినదురితంబు లన్నియును నశింపఁగలవు. భక్తిపూర్వకంబుగ నేకభుక్తంబును, అయాచితాహారంబును, నక్తభోజనంబును, నిరాహారంబును గావించి యీవ్రతంబును విధ్యుక్తముగ నాచరించువాని కపారంబగు పుణ్యములభింపఁగలదు. ఇట్లు చతుర్దశియందు భక్తిశ్రద్ధలతో శివపూజ చేసి నియమవ్రతుండును, శుచియు, నేకాగ్రచిత్తుండునై శివసహస్రనామంబులఁ గీర్తింపవలయును. అసమర్థుండగువాఁడు మహాదేవునిదివ్యనామంబుల నాకర్ణింపవలయును. అట్టివానికి సకలపాపవిముక్తియు, శివలోకావాసంబును సిద్ధింపఁగలవు.

సహస్రనామసంకీర్తనము.

సనత్కుమారుం డిట్లనియెను. వ్యాసమునీంద్రా! శ్రీవణమాత్రంబున సకలపాపౌఘవినాశకంబును, ముక్తికారణంబునగు శివసహస్రనామావళిఁగూర్చి చెప్పుచున్నాను. ఈస్తవంబునుగూర్చి చెప్పుటకు నేను సమర్థుండను గాను. అమ్మహాదేవుని యనుగ్రహంబుచే

నాకాదివ్యనామంబు లన్నియును స్మృతిపథంబునం దోంచుచున్నవి. ముందుగ నేనద్దేవుని సన్నుతించి యాతనిచే ననుజ్ఞాతుండనై యనంత నిధనుండును, సర్వయోనియు, మహాత్ముండును, అవ్యక్తుండు నగు శివుని నామసమూహము నించుక వర్ణించెదను. వరదుండును, వరేణ్యుండును, విశ్వమూర్తియు జ్ఞానమయుండును, మహాదేవుండు నగు చతురాననుండు వీనికిం గర్త. దధిని మథించి నవనీతమును గల్పించి నట్లుగా బ్రహ్మదేవుండు విశేషపర్యాలోచనంబు చేసి మహాదేవుని యయుతనామమధ్యమునుండి యీనామసహస్రము నుద్ధరించియున్నాండు. పర్వతంబులలో హిమవంతంబునుం బోలి శర్వుని సర్వనామంబుల యందు నీనామావళి సారభూతమైనది. సర్వపాపహరంబును, చతుర్వేదపారతుల్యంబును, మహాఫలదాయకంబు నగు నీనామసహస్రమును సంయతచిత్తంబునం బ్రయత్నపూర్వకంబుగం బఠించి ధ్యానము చేయవలయును. ఈస్తోత్ర ముత్పాతశాంతికరంబును, పుష్టికరంబును, రక్షోఘ్నంబును, బావనంబునైనది. దీనింగూర్చి భక్తిశ్రద్ధలు గలవారికే బోధింపవలయును. శ్రద్ధావిహీనులును, నాస్తికులు నీనామంబులను వినందగినవారు గారు. సర్వభూతాత్మకుండును, పినాకపాణియు నగు మహాదేవుని ద్వేషించువారు పితృపితామహాదులతోంగూడ నరకపతితు లగుదురు. అట్టిపాపాత్ములుగూడ సంత్యాకాలంబున ధ్యానయోగస్వరూపంబును, ఉత్తమధ్యేయంబు నగునీనామావళి నాలకించినచోం బరమపదప్రాప్తు లగుదురు. ఈస్తోత్రము పవిత్రంబును, మంగళమయంబును బుణ్యాకలితంబును, గళ్యాణప్రదంబునైనది. సర్వలోకపితామహుండగు జలజాసనుండు తొల్లి యీస్తవముం గూర్చి దీనికి సకలస్తవరాజం బని పేరిడియెను. అది మొదలుగా నిట దేవతలచేంగూడం బూజితంబై స్తవరాజం బని ప్రశస్తిం గాంచెను. ఈనామసహస్ర

మప్పుడే బ్రహ్మలోకమునుండి యవతరించి సకలలోకంబులనువ్యాపించెను. శ్రేష్ఠులకు శ్రేష్ఠుండును, శాంతులకు శాంతుండును, ద్యుతులకు ద్యుతియు, యోగులకు యోగియు, కారణంబులకుఁ గారణుండును నగుదేవుం డెవ్వఁడో, ఎవ్వనినుండి సకలలోకంబులును సంభవంబులగుచుండునో, ఎవ్వనివలనమరల భవంబు లేకుండునో యట్టిసర్వభూతాత్మభూతుండును, అమితతేజస్వియునగు మహాదేవుని సహస్రనామంబులంగూర్చి యాకర్ణింపుము. ఈనామశ్రవణమంత్రంబున నఖిలాభీష్ట సిద్ధి యగును.

స్థిరుఁడు, స్థాణువు, ప్రభువు, భానుఁడు, ప్రవరుఁడు, వరదుఁడు వరుఁడు, సర్వాత్ముఁడు, సర్వవిఖ్యాతుఁడు, శర్వుఁడు, సర్వకరుఁడు, ఉద్భవుఁడు, జటి, చర్మి, శిఖి, ఖడ్గి, సర్వాంగుఁడు, సర్వభానుఁడు, హరుఁడు, హిరణ్యాక్షుఁడు, సర్వభూతహరుఁడు, ప్రవృత్తి, నివృత్తి, నియతుఁడు, శాశ్వతుఁడు, ధ్రువుఁడు, శ్మశానచారి, భగవానుఁడు, ఖేచరుఁడు, ఖేచరోద్భవుఁడు, అభివంద్యుఁడు, మహాకర్మ, తపస్వి, భూతభానుఁడు, ఉన్మత్తవేషుఁడు, ప్రచ్ఛన్నుఁడు, సర్వలోకప్రజాపతి మహారూపుఁడు, మహాకాయుఁడు, సర్వరూపుఁడు, మహాశనుఁడు, విశ్వరూపుఁడు, విరూపుఁడు, విశ్వభోజి, వామనుఁడు, మనువు,లోకపాలాంతర్హితాత్మ, ప్రసాదుఁడు, హయగర్దభి, పవిత్రుఁడు, మహాత్మ, నియమము, నియమాశ్రియుఁడు, సర్వవర్మ, స్వయంభువు, అనాది, అవ్యయుఁడు, సౌమ్యరూపుఁడు, విరూపాక్షుఁడు, సోముఁడు, నక్షత్రసాధకుఁడు, చంద్రుఁడు, సూర్యుఁడు, శని, కేతువు, గ్రహము, గ్రహపతి, వరుఁడు, అద్రి, అద్ర్యాలయుఁడు, కర్త, మృగబాణార్పణుఁడు, అనఘుఁడు, మహాతపుఁడు, దీర్ఘతపుఁడు, అదీనుఁడు, దీనసాధకుఁడు, సంవత్సరకరుఁడు, మంత్రము, ప్రమాణము, పరమతపము, యోగి, యోజ్యుఁడు, మహాస్యుఁడు, మహామాత్రుఁడు, మహాతపుఁ

డు, సువర్ణరేతుఁడు, సర్వజ్ఞుఁడు, సుబీజుఁడు, వృషవాహనుఁడు, దశ
బాహుఁడు, అనిమిషుఁడు, నీలకంఠుఁడు, ఉమాపతి, విశ్వరూపుఁడు,
స్వయంశ్రేష్ఠుఁడు, బలి, వైరోచనుఁడు, గణహంత, గణకర్త, గణపతి,
దిగ్వాసుఁడు, కామ్యము, పరమపవిత్రుఁడు, మంత్రము, సర్వభావ
హారుఁడు, హరుఁడు, కమండలుధరుఁడు, ధన్వి, బాణహస్తుఁడు, ప్రతా
పవంతుఁడు, అశని, శతఘ్ని, ఖడ్గి, పట్టిసుఁడు, ఆయుధి, మహాత్ముఁ
డు, స్రువహస్తుఁడు, సురూపుఁడు, తేజము, తేజస్కరుఁడు, ఉష్ణీషి,
సువక్త్రుఁడు, అత్యుగ్రుఁడు, వినతుఁడు, దీర్ఘుఁడు, హరినేత్రుఁడు, సతీ
ర్థుఁడు, కృష్ణుఁడు, సృగాలరూపుఁడు, సర్వార్థుఁడు, ముండుఁడు, కుండి,
కమండలువు, అజుఁడు, మృగరూపి, గంధమాలి, కపర్ది, ఊర్ధ్వరేతుఁ
డు, ఊర్ధ్వలింగుఁడు, ఊర్ధ్వశాయి, నభస్థలుఁడు, త్రిజటి, చీరవాసుఁ
డు, రుద్రుఁడు, సేనాపతి, విభుఁడు, అహశ్చరుఁడు, నక్తము, తిగ్మము
మనువు, సువర్చసుఁడు, గజహంత, దైత్యహరుఁడు, లోకము, లోక
ధాత, గుణాకరుఁడు, సింహశార్దూలరూపుఁడు, ఆర్ద్రచర్ముఁడు, ధరా
ధరుఁడు, కాలయోగి, మహానాదుఁడు, సర్వావాసుఁడు, చతుష్పథుఁ
డు, నిశాచరుఁడు, ప్రేతచారి, భూతచారి, మహేశ్వరుఁడు, బహుభూ
తుఁడు, బహుధరుఁడు, సర్వాధారుఁడు, అమితగతి, నృత్యప్రియుఁడు,
నృత్యతృప్తుఁడు, నర్తకుఁడు, సవిలాసుఁడు, ఘోషకుఁడు, మహాతపుఁ
డు, ప్రాంశువు, నిత్యుఁడు, గిరిచరుఁడు, నభస్సు, సహస్రహస్తుఁడు,
విజయుఁడు, వ్యవసాయి, అనిశ్చితుఁడు, అమర్షణుఁడు, మర్షణాత్ముఁ
డు, యజ్ఞహంత, కామనాశకుఁడు, దక్షయజ్ఞాపహారి, సుపథుఁడు,
మధ్యముఁడు, తపోపహారి, బలవంతుఁడు, ముదితుఁడు, అర్థుఁడు, అజి
తుఁడు, వరుఁడు, గంభీరుఁడు, గంభీరఘోషుఁడు, గంభీరబలవాహ
నుఁడు, న్యగ్రోధరూపుఁడు, న్యగ్రోధుఁడు, వృక్షకర్ణుఁడు, అభీతుఁడు,

విధుఁడు, సుతీక్ష్ణదశనుఁడు, మహాకాయుఁడు, మహాననుఁడు, విష్వక్సేనుఁడు, హర్యక్షుఁడు, సంయుగాపీడవాహనుఁడు, తీక్ష్ణబాహువు, హరి, యజ్ఞుఁడు, మహాశయుఁడు, కర్మకాలవిదుఁడు, విష్ణుప్రసాదితుఁడు, యజ్ఞము, సముద్రుఁడు, బడబాముఖుఁడు, లంబనుఁడు, లంబితోష్ఠుఁడు, బహుమాయాపయోనిధి, మహాంగుఁడు, మహాదంష్ట్రుఁడు, మహాజిహ్వుఁడు, మహాముఖుఁడు, మహానాధుఁడు, మహారోముఁడు, మహాకేశుఁడు, మహాజటుఁడు, అసపత్నుఁడు, ప్రసాదుఁడు, ప్రత్యయుఁడు, గిరిసాధకుఁడు, స్నేహనుఁడు, అస్నేహనుఁడు, అజితుఁడు, మహాముని, వృక్షకారుఁడు, వృక్షకేతువు, అనలుఁడు, వాయువాహనుఁడు, మండలి, వాయుధాముఁడు, దేవదానవదర్పహుఁడు, అథర్వశీర్షుఁడు, సామాస్యుఁడు, రిపుహంత, అమితేక్షణుఁడు, యజుఃపాదభుజుఁడు, గుహ్యుఁడు, ప్రకాశుఁడు, జంగముఁడు, అమోఘార్థప్రసాదుఁడు, అభిగమ్యుఁడు, సుదర్శనుఁడు, ఉపహారుఁడు, ప్రియుఁడు, సర్వుఁడు, కనకుఁడు, కాంచనస్థిరుఁడు, నంది, నందికరుఁడు, భవ్యుఁడు, పుష్కరుఁడు, పతి, స్థిరుఁడు, తపనుఁడు, తాపసుఁడు, ఆద్యుఁడు, ఘృణి, యజ్ఞుఁడు, సమాహితుఁడు, నక్తుఁడు, కలి, కాలుఁడు, మకరుఁడు, కాలపూజితుఁడు, సుగణుఁడు, గణకారుఁడు, భూతభావనుఁడు, సారథి, భస్మశాయి, భస్మగోప్తుఁడు, భస్మరూపుఁడు, తరంగణుఁడు, అగణుఁడు, లోపుఁడు, మహాత్ముఁడు, సర్వపూజితుఁడు, శంకువు, త్రిశంకుసంపన్నుఁడు, శుచి, భూతనిషేవితుఁడు, ఆశ్రమస్థుఁడు, కపోతస్థుఁడు, విశ్వకర్మపతి, వరుఁడు, శాఖుఁడు, విశాఖుఁడు, కుంభాండుఁడు, అర్థజాలుఁడు, సునిశ్చయుఁడు, కపిలుఁడు, అకపిలుఁడు, శూరుఁడు, ఆయువు, అపరోరగుఁడు, గంధర్వుఁడు, అదితి, తార్క్ష్యుఁడు, అవిజ్ఞేయుఁడు, సుసారథి, పరశ్వధాయుధుఁడు, దేవుఁడు, అర్థకారుఁడు, సుబాంధవుఁడు,

తుంబవీణుఁడు, మహాకోపుఁడు, ఊర్ధ్వరేతుఁడు, జలేశయుఁడు, ఉగ్రవంశకరుఁడు, పాశధారుఁడు, అనిందితుఁడు, సర్వాంగరూపుఁడు, మాయావి, సుహృత్తు, అనిలుఁడు, అనలుఁడు, బాంధవుఁడు, బంధుకర్త, సుబంధువు, రవిలోచనుఁడు, సుయజ్ఞారి, సుకామారి, మహాదంష్ట్రుఁడు, అసమయోధుఁడు, బాహువు, అనిందితుఁడు, శర్వుఁడు, శంకరుఁడు, ధనదుఁడు, ధనుఁడు, అమరేశుఁడు, మహాదేవుఁడు, విశ్వదేవుఁడు, సురారిహంత, దీధితి, అహిర్బుధ్నుఁడు, చేకితానుఁడు, హరి, అజైకపాదుఁడు, కపాలి, త్రిశంకుఁడు, అజితుఁడు, శివుఁడు, ధన్వంతరి ధూమకేతువు, స్కందుఁడు, వైశ్రవణుఁడు, ధాత, శక్రుఁడు, విష్ణువు, మిత్రుఁడు, త్వష్ట, ధ్రువుఁడు, ధని, ప్రభావుఁడు, సర్వగుఁడు, వాయువు, అర్యముఁడు, సవిత, రవి, ఉదగ్రుఁడు, విధాత, మాంధాత, భూతభావనుఁడు, హుతతీర్థుఁడు, వాగ్మి, సర్వకాలగుణావహుఁడు, పద్మవక్త్రుఁడు, మహావక్త్రుఁడు, చంద్రవక్త్రుఁడు, మనోజవుఁడు, బలవంతుఁడు ఉపశాంతుఁడు, పురాణుఁడు, కురుఁడు, కర్త, కాలరూపి, కురుభూతుఁడు, మహేశ్వరుఁడు, సర్వాశనుఁడు, సర్వశాయి, సర్వప్రాణిపతి, దేవదేవుఁడు, సుఖాసక్తుఁడు, సత్తు, అసత్తు. సర్వరత్నవిదుఁడు, కైలాసశిఖరవాసి, హిమవద్గిరిసంశ్రియుఁడు, కులహారి, కులకర్త, బహుబీజుఁడు, బహుప్రదుఁడు, వణిక్కు, వర్ధనుఁడు, వృక్షుఁడు, నకులుఁడు, చందనచ్ఛదుఁడు, నారపీరుఁడు, మహాజంతుఁడు, ఆలోకుఁడు, మహౌషధుఁడు, సిద్ధార్థకారి, సిద్ధార్థుఁడు, ఛందోవ్యాకరణాంతరుఁడు, సింహనాదుఁడు, సింహదంష్ట్రుఁడు, సింహగుఁడు, సింహవాహనుఁడు, ప్రభావాత్మ, జగత్కాలుఁడు, తలుఁడు, లోకహితుఁడు, జ్ఞానసారుఁడు, నవగ్రాంగుఁడు, కేతుమాలి, శుభాననుఁడు, భూతాశయుఁడు, భూతపతి, అహోరాత్రానందితుఁడు, వామనుఁడు, సర్వభూతాత్మ, నిల

యుఁడు, విభుఁడు, భవుఁడు, అమోఘుఁడు, సంజయుఁడు, పార్శ్వుఁడు జీవనుఁడు, ప్రాణధారి, ధృతిమాన్, ఆత్మవాక్, దక్షుఁడు, సత్కృతుఁడు, యుగాధిపుఁడు, గోపాలుఁడు, గోయుధి, గ్రాహుఁడు, గోచర్మవసనుఁడు, హరుఁడు, హిరణ్యబాహువు, గుహాపాలుఁడు, ప్రవేశితుఁడు, ప్రతిష్ఠాయి, మహాహర్షుఁడు, జితకాముఁడు, జితేంద్రియుఁడు, గాంధారుఁడు, సురాలుఁడు, తనువు, ఆత్మ, గతి, వరుఁడు, మహాగీతుఁడు, మహానృత్యుఁడు, అప్సరోగణసేవితుఁడు, మహాకేతువు, వికర్తచరేశ్వరుఁడు, ఆవేదనీయుఁడు, ఆవాసుఁడు, సర్వగంధసుఖావహుఁడు తోరణుఁడు, తారణుఁడు, వాయువు, పర్జన్యుఁడు, హుతాశనసహాయుఁడు, ప్రశస్తాత్మ, హుతాశనుఁడు, ఉగ్రతేజుఁడు, మహాతేజుఁడు, జయుఁడు, విజయుఁడు, కాలవిదుఁడు, జ్యోతిషానయుఁడు, సిద్ధి, సంధివిగ్రహుఁడు, శిఖి, దండి, జటి, జ్వాలి, మూర్తిజుఁడు, దుర్ధరుఁడు, వణిక్కు, వైష్ణవి, పణవి, తాళి, కాలుఁడు, కాలకంటకుఁడు, నక్షత్రుఁడు, విగ్రహుఁడు, వృద్ధి, గుణవృద్ధి, అయోగముఁడు, ప్రజాపతి, దిశాబాహువు, విభాగుఁడు, సర్వతోముఖుఁడు, విమోచనుఁడు, సురగణుఁడు, హిరణ్యకవచి, ద్రవి, మేఢ్రజుఁడు, బలచారి, మహాచారి. సూతుఁడు, సర్వతూర్యనినాది, సర్వవాద్యపరిగ్రహి, బాలరూపి, బిలావాసి, హేమమాలి, తరంగవిత్తు, త్రిదశుఁడు, త్రివృత్తు, ఛందము, సర్వబాధవిమోచకుఁడు, బంధనుఁడు, సురేంద్రశత్రువినాశి, సాంఖ్యప్రసాది, దుర్వాసుఁడు, సర్వనాధునిషేవితుఁడు, ప్రస్కందనుఁడు, విభాగుఁడు, అతులుఁడు, యజ్ఞసామవేది, సర్వవాసుఁడు, సర్వచారి, దుర్వాసుఁడు, వాసవుఁడు, అమరుఁడు, హేముఁడు, హేమకారి, యజ్ఞుఁడు, సర్వధారి, ధరోత్తముఁడు, లోహితాక్షుఁడు, మహాక్షుఁడు, పింగాక్షుఁడు, విశారదుఁడు, సంగ్రహుఁడు, నిగ్రహుఁడు,

కాముఁడు, సర్పచీరనివాసనుఁడు, ముక్తుఁడు, వియుక్తదేహి, దేహారి, సర్వకామదాయి, సర్వకాలప్రసాదుఁడు, సుబలుఁడు, బలరూపధారి, సవాకాశుఁడు, నిరూపి, నిపాని, ఉరణుఁడు, ఖగుఁడు, రౌద్రరూపాంశువు, ఆదిత్యుఁడు, వసువు, అగ్ని, సువర్చసి, వసువేగుఁడు, మహావేగుఁడు, మనోవేగుఁడు, నిశాకరుఁడు, సర్వావాసి, ప్రియావాసి, అపదేశకారి, హరుఁడు, ముని, ఆత్మాకరుఁడు, లోకుఁడు, సంభోజ్యుఁడు, సహస్రభోజ, పక్షి, పక్షిరూపి, విశ్వదీపుఁడు, విశాలపతి, ఉన్మాదుఁడు, మదనాకారుఁడు, అర్థము, అర్థకరుఁడు, అవముఁడు, వామదేవుఁడు, వాముఁడు, ప్రాగ్దేవుఁడు, వామనుఁడు, సిద్ధయోగాపచారి, సిద్ధుఁడు, సిద్ధార్థసాధకుఁడు, భిక్షువు, భిక్షురూపి, విషాణి, మృదువు, అవ్యయుఁడు, మహాసేనుఁడు, విశాఖుఁడు, షష్టినాగుఁడు, విశాలపతి, వజ్రహస్తుఁడు, ప్రతిష్టంభి, వజ్రస్తంభనుఁడు, క్షమావ్రతకరుఁడు, కాలుఁడు, మనువు, మధుకరుఁడు, చలుఁడు, వానస్పత్యుఁడు, వాజిమేధుఁడు, ఆశ్రమపూజితుఁడు, బ్రహ్మచారి, లోకచారి, సర్వచారి, సుచారవిత్తు, ఈశానుఁడు, ఈశ్వరుఁడు, కాలుఁడు, నిశాచారి, అనేకదృక్కు, నిమిత్తస్థుఁడు, నిమిత్తుఁడు, నంది, నందికరుఁడు, హరుఁడు, నందీశ్వరుఁడు, నందిమంతుఁడు, నందివర్ధనుఁడు, భగాక్షినిహంత, కాలుఁడు, బ్రహ్మవిద్వరుఁడు, చతుర్ముఖుఁడు, మహాలింగుఁడు, చతుర్లింగుఁడు, లింగాధ్యక్షుఁడు, లోకాధ్యక్షుఁడు, మహాధ్యక్షుఁడు, యుగావహుఁడు, బీజాధ్యక్షుఁడు, బీజకర్త, అధ్యాత్మానుగతి, బలి, ఇతిహాసకర్త, కల్పుఁడు, సోత్తముఁడు, జలేశ్వరుఁడు, దంభుఁడు, దంభకరుఁడు, రంహుఁడు, వశ్యుఁడు, వశ్యకారి, కలి, లోకకర్త, పశుపతి, మహాకర్త, మహౌషధుఁడు, పరమాక్షరుఁడు, బలవంతుఁడు, శుక్రి [illegible] బహుప్ర

సాధుఁడు, సుస్వప్నుఁడు, దక్షిణోఘుఁడు, అమిత్రజిత్తు, వేదకారుఁడు, సూత్రకారుఁడు, విద్వాంసుఁడు, పరముఁడు, తపస్సు, మహామేఘని నాది, మహాఘోరవశీకరుఁడు, అగ్నిజ్వాలి, మహాజ్వాలి, అతిధూ ముఁడు, హుతము, హావి, వృషణుఁడు, శంకరుఁడు, నిత్యుఁడు, వర్చస్వి, ధూమకేతనుఁడు, నీలుఁడు, సర్వాంగుఁడు, లుబ్ధుఁడు, శోభనుఁడు, నిరవగ్రహుఁడు, స్వస్తిదుఁడు, స్వస్తిభాగుఁడు, భాగి, భాగకారి, లఘువు, ఉత్సంగుఁడు, మహాంగుఁడు, మహాగర్భపూరుఁడు, యువ, కృష్ణ వర్ణుఁడు, సువర్ణుఁడు, సర్వప్రాణేంద్రియుఁడు, మహాపాదుఁడు, మహా హస్తుఁడు, మహాకాయుఁడు, మహాయశుఁడు, మహామూర్ధుఁడు, మహా నేత్రుఁడు, మహామాత్రుఁడు, విశాలయుఁడు, మహాదంతుఁడు, మహా కర్ణుఁడు, మహేష్వువు, మహానుగుఁడు, మహానాది, మహాగ్రీవుఁడు, సుశాంతధారి, మహాచక్షువు, మహావక్త్రుఁడు, అంతరాత్మ, మృగాల యుఁడు, మహాకటి, మహాగ్రీవుఁడు, మహాబాహువు, ప్రతాపవం తుఁడు, సంయోగి, వర్ధనుఁడు, వృద్ధుఁడు, నిత్యవృద్ధుఁడు, గుణాధి కుఁడు, నిత్యధర్మసహాయుఁడు, దేవాసురపతి, పతి, అయుక్తుఁడు, యుక్తబాహువు, ద్వివిధుఁడు, సుపర్వణుఁడు, ఆషాఢుఁడు, సుషా ఢుఁడు, ధ్రువుఁడు, హరిహరుఁడు, హరుఁడు, వసువు, ఆవృత్తిమం తుఁడు, నిత్యుఁడు, వసుశ్రేష్ఠుఁడు, మహారథుఁడు, శిరోహారి, విసర్పి, సర్వలక్షణభూషితుఁడు, అక్షరుఁడు, అక్షరయోగి, సర్వయోగి, మహాబలి, సమామ్నాయుఁడు, అసమామ్నాయుఁడు, తీర్థసేవి, మహారథుఁడు, నిర్జీవుఁడు, జీవనుఁడు, వాసి, నీరసుఁడు, బహుక ర్కశుఁడు, రత్నప్రభూతుఁడు, రత్నాంగుఁడు, మహాహ్రదనినాదకారి, మూలుఁడు, విశాఖుఁడు, సర్వభృత్తుఁడు, వ్యక్తుఁడు, అవ్యక్తుఁడు, సిద్ధి, ఆరోహణుఁడు, నిరూహుఁడు, శైలహారి, మహాతపుఁడు, సేనా

కల్పుఁడు, మహాకల్పుఁడు, యోగము, యోగకరుఁడు, హరుఁడు, యుగరూపుఁడు, మహారూపుఁడు, అయనుఁడు, గహనుఁడు, శరుఁడు, శౌర్యనిర్వాపణుఁడు, వాదుఁడు, పండితుఁడు, విశ్వలోచనుఁడు, బహుమాలి, మహామాలి, సుమాలి, బహులోచనుఁడు, విస్తారుఁడు, భవనుఁడు, క్రాముకుఁడు, కుసుముఁడు, సుఫలోదయుఁడు, వృషజుఁడు, వృషభాంగాంగుఁడు, మల్లిబిల్వుఁడు, జటాధరుఁడు, ఇందుఁడు, విసర్గుఁడు, సుముఖుఁడు, సురుఁడు, సర్వాయుధధారి, నిరవనుఁడు, సుధన్వి, సంగాధారుఁడు, మహాహనువు, గంధమాలి, భగవానుఁడు, సర్వకర్మోత్థానుఁడు, మంథానుఁడు, బహుళుఁడు, వాయువు, సకలుఁడు, సర్వలోచనుఁడు, ఉరస్తాలి, కరస్తాలి, ఊర్ధ్వసంహననుఁడు, వటిఘ్ని, ఛత్రపత్రిసువిఖ్యాతుఁడు, సర్వలోకాశ్రయుఁడు, మహాత్ముఁడు, ముండుఁడు, విరూపి, వికృతి, దండి, ముండవికర్షణుఁడు, హర్యక్షుఁడు, కోకసుఁడు, చక్రి, దీప్తజిహ్వుఁడు, సహస్రపాదుఁడు, సహస్రమూర్ధుఁడు, దేవేంద్రుఁడు, సర్వభూతమయుఁడు, గురువు, సహస్రబాహువు, సర్వాంగుఁడు, శరణ్యుఁడు, సర్వలోకధారి, పవిత్రుఁడు, త్రిమధువు, మంత్రము, కనిష్ఠుఁడు, కృష్ణపింగళుఁడు, బ్రహ్మదండవినిర్మాత, శతఘ్ని, శతపాశధృక్కు, పద్మగర్భుఁడు, బ్రహ్మగర్భుఁడు, జలగర్భుఁడు, జలోద్భవుఁడు, గభస్థుఁడు, బ్రహ్మవిదుఁడు, బ్రహ్మ, బ్రహ్మిష్ఠుఁడు, బ్రాహ్మణుఁడు, గతి, అనంతరూపి, నైకాత్మ, తిగ్మతేజుఁడు, తమోగదుఁడు, ఊర్ధ్వగాత్మ, పశుపతి, వాతరంహుఁడు, మనోజవుఁడు, చందని, పద్మనాళాగ్రుఁడు, సురభి, ఉత్తరణుఁడు, నరుఁడు, కర్ణికారుఁడు, మహాసర్గుఁడు, నీలమాలి, పినాకధారి, ఉమాపతి, ఉమాకాంతుఁడు, జాహ్నవీహృదయంగముఁడు, వరుఁడు, వరాహుఁడు, వరదుఁడు, దేవేశుఁడు, సుమహాస్వనుఁడు, మహాప్రసాదుఁడు, అన

ఘుఁడు, శత్రుహంత, శ్వేతపింగళుఁడు, ప్రీతాత్మ, ప్రయతాత్మ, సంయతాత్మ, ప్రధానవిదుఁడు, సర్వపార్శ్వసుతుఁడు, తార్క్ష్యుఁడు, ధర్మసాధారణుఁడు, ధరుఁడు, చరాచరాత్మ, సూక్ష్మాత్మ, సువృషాంకుఁడు, వృషేశ్వరుఁడు, సాధ్యుఁడు, ఋషి, వసువు, ఆదిత్యుఁడు, వివస్వంతుఁడు, సవిత, అర్చితుఁడు, వ్యాసుఁడు, సర్వార్థసంక్షేపి, విస్తారుఁడు, పర్యయుఁడు, భయుఁడు, ఋతువు, సంవత్సరము, మాసము, పక్షము, సంధ్య, సమాపకుఁడు, కళ, కాష్ఠ, లవము, మాత్ర, ముహూర్తము, అహస్సు, క్షప, క్షణము, విశ్వక్షేత్రుఁడు, బీజలింగుఁడు, బీజము, ఆద్యుఁడు, అనిందితుఁడు, సర్వాది, సదసద్వ్యక్తి, పిత, మాత, పితామహుఁడు, స్వర్గద్వారము, ప్రజాద్వారము, మోక్షద్వారము, త్రివిష్టపము, నిర్వాణము, హ్లాదనుఁడు, బ్రహ్మలోకపరాగతి, దేవాసురవినిర్మాత, దేవాసురపరాయణుఁడు, సురాసురగతి, దేవుఁడు, దేవాసురనమస్కృతుఁడు, దేవాసురమహామాత్రుఁడు, దేవాసురమహేశ్వరుఁడు, దేవాసురమహాశ్రియుఁడు, దేవాసురగణాధ్యక్షుఁడు, దేవాసురగణాగ్రణి, దేవాసురగురువు, దేవాసురపరిష్కృతుఁడు, దేవాసురమహామంత్రుఁడు, దేవాసురమహేశ్వరుఁడు, దేవాసురమయుఁడు, చింత్యుఁడు, అచింత్యుఁడు, దేవాత్మ, సంభవుఁడు, ఉద్భిజ్జుఁడు, శుక్రుఁడు, అవేద్యుఁడు, విరజుఁడు, విరజాంబరుఁడు, ఇజ్యుఁడు, హస్తి, సురవ్యాఘ్రుఁడు, దేవసింహుఁడు, నరర్షభుఁడు, నిరాయుధుఁడు, వరశ్రేష్ఠుఁడు, సర్వదేవోత్తమోత్తముఁడు, గురువు, కాంతుఁడు, నిజుఁడు, సర్వుఁడు, పవిత్రసర్వవాహనుఁడు, ప్రయుక్తుఁడు, శోభనుఁడు, వజ్రుఁడు, ఈశానుఁడు, ప్రభువు, అవ్యయుఁడు, శృంగి, శృంగప్రియుఁడు, రాజు, రాజరాజు, నిరామయుఁడు, అభిరాముఁడు, సురగణు[illegible], విరాగు[illegible], స్వర్గస్థాని, [illegible]కుఁడు, విశ్వదేహుఁడు,

హరిణుఁడు, బ్రహ్మవర్చసి, స్థావరగణపతి, నవమేంద్రియవర్ధనుఁడు, సిద్ధార్థుఁడు, సర్వభూతార్థుఁడు, నిత్యుఁడు, సత్యవ్రతుఁడు, శుచి, వ్రతాది, పరమబ్రహ్మ, భక్తపరమగతి, విముక్తుఁడు, దీప్తతేజుఁడు, శ్రీమంతుఁడు, శ్రీవర్ధనుఁడు, గజుఁడు——

అనునీనామంబులచే శంకరుండు ప్రసన్నుండగువఱకును నేను స్తోత్రంబు గావించి యుంటిని. బ్రహ్మాదిదేవతలకును, మహాత్ములకును గూడ నవేద్యంబగుతత్త్వముగల స్తవనీయుండును, బూజనీయుండును, వందనీయుండును, జగత్పతియు నగుమహాదేవు నిట్లు స్తోత్రము చేయవలయును. నేనమ్మహాదేవుని యాజ్ఞానుసారంబుగ భక్తితో, యజ్ఞపతియు, గతిమంతులకుఁగూడగతియు నగుభగవానునిస్తవంబు చేసితిని. నిత్యయోగపరాయణుండగుమానవుండు, శుచియై పుష్టివర్ధనం బగు నీసహస్రనామావళిచే శంకరునిస్తుతించి యాత్మోద్ధరణంబునకు సమర్థుండు గాఁగలఁడు. ఈనామములు పరబ్రహ్మస్వరూపములు. ఇవి స్వయముగా బ్రహ్మదేవునిచేఁ గీర్తితంబు లయ్యెను. ఋషులును, దేవతలునుగూడ నీసహస్రనామములచేతనే యవ్విభుని వినుతించుచుందురు. ఈవిధముగా నాత్మగతిస్వరూపుండగుమహాదేవునింగూర్చి యాస్తికభావముతో శ్రద్ధాసహితంబుగ జన్మజన్మాంతరంబులయందును స్తోత్రము చేయువారికి భక్తప్రియుండగుశంకరుండు తనసాయుజ్యమును బ్రసాదింపఁగలఁడు. జాగ్రదవస్థయందును, నిద్రయందును, మార్గమధ్యంబునందును, ఎల్లవేళలందును నీశివస్తోత్రముం గావించుచుండువారికి సుఖసౌభాగ్యములు వర్ధిల్లుచుండును. అట్టివారికిసహస్రజన్మములయందు గావించినపాపంబు లన్నియు నశించి నిశ్చలం బగునీశ్వరభక్తి లభించును. సర్వాంతఃకరణంబులచేతను బరమేశ్వరునియందలి యేకాగ్రభక్తియె ముక్తికేకాధారంబై యున్నది. అచంచలంబగునీశ్వరభక్తి

దేవతలకుఁగూడ దుష్ప్రాపంబైనది. అట్టిచో మానవమాత్రుల కెట్లు లభింపఁగలదు ? ఈశ్వరప్రసాదమువలననే మానవులకు భక్తి యుదయింపఁగలయును. ఆభక్తివలననే తద్భావగతులగుమానవులకుఁ బరమపదప్రాప్తి యగుచుండును. మహాదేవునియందు నిశ్చలభక్తిభావం బుదయించినంతనే భక్తవత్సలుండగు శంకరుండు ప్రసన్నుండై ముక్తిం బ్రసాదించుచుండును.

మహేంద్రకల్పుండును, విశుద్ధబుద్ధియు నగుతండిమునీంద్రుం డీస్తవరాజముచేఁ గృత్తివాసుని స్తుతించి యుండెను. ఈస్తవమును భగవానుండగుశంకరుండు స్వయముగా బ్రహ్మ కుపదేశించి యుండెను. ఆతఁ డింద్రునకును, ఆతఁడు మృత్యువునకును, మృత్యువు రుద్రగణంబులకును దీనింగూర్చి బోధించియుండెను. ఆరుద్రగణంబులవలనఁ దనమహాతపంబునకు ఫలంబుగా బ్రహ్మసభయందు తండిమునీంద్రుం డీస్తోత్రరాజమును బడసెను. ఆతండి శుక్రునకును, ఆతఁడు గౌతమునకును, ఆతఁడు ధీమంతుండగువైవస్వతునకును, ఆతఁడు నారాయణునకును, ఆతఁడు యమునకును, ఆతఁడు మృకండునకును, ఆతఁడు మార్కండేయునకును, ఆతఁడు నాచికేతునకును, ఆతఁ డుపమన్యునకును, ఆతఁడు శ్రీకృష్ణునకును బోధించుటయుఁ గ్రమక్రమముగా నీస్తవరాజము లోకమంతటను బరివ్యాప్తంబయ్యెను. ఇది సర్వకామదంబును, భోగదాయకంబును, సర్వసిద్ధిప్రదంబును, స్వర్గసాధనంబును, ఆరోగ్యకరంబును, ఆయుష్కరంబును, ధనధాన్యప్రదాయకంబు నైనది. దానవులు, యక్షులు, రాక్షసులు, పిశాచములు, యాతుధానులు, గుహ్యకులు, భుజంగులు మఱియెవ్వరునుగూడ నీస్తోత్రమునకు విఘ్నంబును గల్పింపఁజాలరు. శుచియు,బ్రహ్మచారియు, జితేంద్రియుండునై యోగభంగంబు గాకుండునట్లు వత్సరపర్యంతము

నియమముతో నీస్తోత్రపారంబు గావించువాఁడు శంకర సాక్షాత్కారముం బొందఁగలఁడు. మహాదేవునిసన్నిధిని నిత్యము నీ స్తోత్రమును బఠించువాఁడు సర్వపాపవిముక్తుండై యశ్వమేధఫలంబును గాంచఁగలుగును.

—♦ తులాపురుష దానవిధి ♦—

వేదవ్యాసుఁడు సనత్కుమారునితో శివుఁడిట్లనియెను. మహాత్మా! ధర్మమువలననే యర్థకామమోక్షంబులు మూఁడును లభించుచున్నవి. ఆకారణముచేతనే పండితులగువారు తపోదానవ్రతాదినియమంబులచే ధర్మాచరణంబునకుఁ బ్రయత్నించుచుందురు. సాత్వికతపంబువలన స్వర్గంబును, అనంతరము క్రోధలోభవివర్జితంబగు రాజత్వమును బిమ్మట జన్మాంతరంబున శంకరపదప్రాప్తియు లభించును. రజోగుణబహుళం బగు తపంబువలన రాజసప్రకృతి యగును. తమోయుతంబగు తపంబువలన క్రూరకర్మంబును నిష్ఠురప్రకృతియు నగును. రజస్తమంబులచే నాక్రమింపఁబడని తపమే సాత్వికంబని కీర్తింపఁబడుచున్నది అదియే ప్రశస్తమైనది. పర్ణభక్షులును, వాయుభక్షులును, విపినావాసులు నగుమునీంద్రులు సాత్వికతపంబునే యాచరించుచుందురు. రాగాంధులగు మానవులు వనవాసులై యుండియు దోషంబులనే గావించుచుందురు. సాధువులు గృహస్థులై యున్నను జితేంద్రియులై తపంబు చేయుచుందురు. నిరాగులును, అనింద్యకర్ములు నగువారికి గృహమే తపోవనంబుగా గలదు. చతుర్థాశ్రమము జితేంద్రియులకుఁగూడ సుదుశ్చరమైనది. గృహస్థాశ్రమముకూడ శ్రేష్ఠతమమైనదియే. బుద్ధిమంతులగువారయ్యాశ్రమమునం దనేకవిధంబులగు

ధర్మకార్యంబుల నిర్వర్తించుచుందురు. తపస్వులు విపినక్లేశంబు లను
భవించుచుఁ దపంబు చేయుచు తుర్ధారులై యన్నదాత లగుగృహస్థు
లయిండ్లకేతెంచుచుందురు. గృహస్థులు వారిని బరితృప్తులంగావించి
వారితపఃఫలంబులయందు భాగములను గ్రహించుచుందురు. కావున
నే సకలాశ్రమంబులయందును గృహస్థాశ్రమము శ్రేష్ఠమైనది.
ఈయాశ్రమధర్మముల నుచితరీతిని నిర్వహించువా రిహలోకంబున
విపులైశ్వర్యంబు లనుభవించి పరంబున స్వర్గసుఖంబులం గాంచఁగ
లరు. అట్టిగృహస్థులకుఁ బ్రమాదవశంబునఁగలుగుచుండు పాపంబు
లెట్టిదానంబుచే వినష్టంబు లగునో యానతీయవలయును.

అని ప్రార్థించుటయు సనత్కుమారుం డిట్లు చెప్పందొడఁ
గెను. సర్వపాపహరంబును, సర్వసంపత్కరంబును, ఐహికాముష్మిక
ఫలప్రదంబు నగునట్టిదానంబునుగూర్చి వర్ణించెద నాకర్ణింపుము.
ఆదాన మొకశుభదినంబునఁ జంద్రమౌళియగు మహాదేవునిపూజించి
నిత్యనైమిత్తికకర్మంబులందీర్చినవెనుక శక్త్యనుసారంబుగఁ గావలయును.
పరద్రవ్యముచే దానముగావించువారు నిరయదర్శనము చేయకుండఁ
బరమగతిం గాంచఁజాలరు. ప్రజాపీడనమూలంబున లభించినద్రవ్య
ముచే దానములం జేసిన శతానీకమహారాజునరకగామియై పుత్త్రిసహా
యంబుననఁగాని తరింపఁజాలకపోయెను. ఇతరులసొమ్ముతోఁ గావించిన
దానములుగూడ నట్లే నిష్ఫలంబులైపోవును. సత్రాదిధర్మస్థానంబు
లయందుఁ జేసినదానములలో సగముపుణ్యము వానిని బ్రతిష్ఠించినవా
రికిఁ జెందఁగలదు. బహువిత్తసాధ్యంబును, దేహశుద్ధికరంబును, స్వర్గ
ప్రదంబు నగునీతులాపురుషదానము ప్రశంసనీయమైనది. పూర్వకా
లమునందు రాజవధంబువలనం గలిగినపాపముచేఁ బీడితుండగుభార్గవ
రాముఁ [illegible] దానము [illegible] చేసెను. పాప

కర్మనిరతులును, వధబంధనక్రియాపరులగునృపులును, సంకరస్త్రీసమాసక్తులును, మద్యపానతత్పరులును, అభక్ష్యభక్షకులును, భ్రూణహంతకులును, గురుతల్పగులును, మిథ్యావాదులును, విరుద్ధజాతిసంభవులును, అయాజ్యయాజకులునుగూడ నీదానముచే విశుద్ధులగుదురు.

పాపక్షయంబును గోరుమానవులు పూర్వ మీశ్వరునిచేఁ బ్రశంసింపంబడిన యీయజ్ఞమును గావింపవలయును. ఈయాగమునందు ఇంద్రుఁడు, వరుణుఁడు, వాయువు, యముఁడు, నిరృతి, శంభుఁడు, సోముఁడు వీరింగూర్చి హోమములం గావింపవలయును. మొట్టమొదట గ్రహనక్షత్రపతింగూర్చి మహావ్యాహృతులచే హోమంబుచేసి, సప్తమంత్రములతో హోమంబుగావించి శాకల్యహోమమును నిర్వర్తింపవలయును. అనంతరము యథాక్రమంబుగ సకలదేవతలకు నాహుతు లొసంగి దృఢంబులును, బలయుతంబులు నగు రెండు స్తంభములను నిర్మింపవలయును. తరువాత వినాయకకార్తికేయులను సుగంధవస్త్రాదులచేఁబూజించి సోమద్విజశూలపాణుల నారాధింపవలయును. అందు మహాదేవును స్మరించి రుద్రసూక్తంబును బఠించుచు నాసనార్ఘ్యపాద్యాదులను సమర్పించి “ఓశూలపాణీ! నీవు నాయజ్ఞంబునుగూర్చి దయచేయుము. నాగోత్రీయుండవగునీ వుమాసహితంబుగ నాపూజల నంగీకరింపుము. బ్రహ్మచేతను, సూర్యరశ్మిచేతను బవిత్రంబగునాపూజను బలిసహితంబుగ రుద్రుండు పరిగ్రహించుఁగాక! సూర్యకిరణంబులచేఁ బవిత్రంబులగు నీసుగంధకుసుమముల నుమాసహితుడగుమహాదేవుండు స్వీకరించుఁగాక! వనస్పతిరసంబును, దివ్యంబును, సర్వగంధంబులయందుత్తమంబును, సకలదేవతలకు నాఘ్రాణయోగ్యంబును నగునీధూపమును శంకరుండు గ్రహించుఁగాక! అగ్నియు, శక్రుండును, జ్యోతియు, సర్వతేజోమయుండును,

ప్రభాకసుందరును, మహాతేజుండునగుశివుండు ఉద్దీపమును గైకొనుం గాక !" అని యర్చించి పృథివికధిపతి యగునగ్నిని, సురాధిపతియగు నింద్రుని, దినాధిపతియగుసూర్యుని, నక్షత్రాధిపతి యగుసోముని నుద్దేశించి హోమము చేసి మిగిలినదానిని వ్యాహృతులచే హోమము చేయవలయును.

అనంతరము తులయందు ద్రవ్యము నుంచి "ఓతులా ! ధరణీదేవి నీతల్లియు, బ్రహ్మదేవుండు నీతండ్రియునై నీవు సత్యధర్మస్వరూపముం గాంచినదానవే యైనచో నిన్నారోహించిన నన్ను భరింపుము" అని ప్రార్థించి తులారోహణంబు చేసి బ్రాహ్మణు నుద్దేశించి "ఓనరసత్తమా ! నీవు సత్యబలంబుచే మహాత్ములగుమునిగణంబుల కంటెను శ్రేష్ఠత్వముం గాంచితివి. కావున మత్ప్రదత్తంబగు నీద్రవ్యమును స్వీకరింపుము." అని దానము చేయవలయును. ఇట్లొకసారి దానము చేసినచో సర్వపాపవిముక్తియు, రెండుసారులు చేసినచో గణాధిపత్యలాభమును, మూండుసారులు చేసినచో మహాదేవసాయుజ్యంబును లభించును. పూర్ణిమ, యుగాది, చంద్రసూర్యగ్రహణములు మొదలగుపవిత్రసమయములయందును, దివ్యక్షేత్రంబులయందును దానముచేయువారు కృతార్థులగుదురు. తులాపురుషదానవిధానము నాకర్ణించువారును, ఈగ్రంథమును దానము చేయువారును, ఈదానము గావింపవలయు నని కుతూహలపడువారునుగూడ సర్వపాపవిముక్తులై స్వర్గలోకావాసు లగుదురు.

—• తులాపురుషవర్ణనము. •—

విశుద్ధాంతరంగుండును, అక్లిష్టకర్ముండును, మహాత్ముండును, మహామునియు నగుభార్గవరాముసకు దేవదేవుండగు శూలపాణి యొ

దుకోటి కీర్తులా పురుషదానమాహాత్మ్యమునుగూర్చి తెలిపియు జెనో యాతఁడెందుకోటి కీదానముచేసియుండెనో యానతీయవలయు నని వేదవ్యాసుం డడుగుటయు సనత్కుమారుండు చెప్పందొడంగెను. మునిశ్రేష్ఠా! లోకప్రసిద్ధకుశికుం డనురాజేంద్రుం డపుత్రకుండై యతి యుండెను, మహాబలవంతుండునగుపుత్రునిం గోరి కఠోరతపంబుగావించుటయు నింద్రుం డాతనియెడలఁ బ్రసన్నుండై తానే స్వయముగా గాధియను నామంబుతో నాతనికి బుత్రుండై యవతరించెను. ఆగాధిరాజునకు సత్యవతి యను నొకపుత్రికారత్నంబు జనించెను. గాధియాతనయను ఋషిపుత్రుండగు ఋచికున కిచ్చి పెండ్లి చేసెను. అందువలన నమ్మునికుమారుం డారాజునెడల నతిప్రీతుండై యొకమహాయజ్ఞంబును గావించి చరువును గ్రహించి రెండుపాత్రములయందు దాని వేర్వేరుగ నుంచి తనభార్యచేతికిచ్చి దీనిని నీవును, రెండవదానిని నీతల్లియు భుజింపుఁడని నిర్దేశించి చెప్పెను. ఈచరుసేవనంబున నీతల్లికి దీప్తిమంతుండును, అజేయుండును, క్షత్రియవరుండునగుకుమారుండును, నీకుఁ దపస్సంపన్నుండును, శమదమాదిగుణాభరణుండును ద్విజశ్రేష్ఠుండు నగుతనయుండును గలుగుదు రని తాఁ జెప్పి యుండెను. సత్యవతి యాచరుపాత్రద్వయమును భద్రపఱచియుంచుకొనెను.

మఱికొన్ని దినంబులకుఁ దీర్థసేవనంబునకై పోయినగాధిరాజు పత్నీసహితంబుగ ఋచికాశ్రమంబునకు విచ్చేసెను. అప్పుడు సత్యవతి పరమానందముతో దల్లికి చరుద్వయముం జూపించి తననాథుండు చెప్పినవిషయమంతయు నెఱింగించెను. తల్లి యామాట లాలించిహర్షపరవశయై ప్రమాదవశంబునఁ దనయభాగమును దాను భుజించి తనయంశమును బుత్రిక కిచ్చెను. ఆపరివర్తనమును గ్రహింపఁజాలక సత్యవతియు దానిని భుజించెను. అనంతరము సత్యవతి ప్రదీప్తదేహంబు

న, ఘోరదర్శనుండగు, క్షత్రియాంతకుండగు భార్గవుని గర్భము
న దాల్చియుండుటను మహర్షియగు ఋచీకుండు యోగదృష్టిచే
గ్రహించి వరవర్ణిని యగు సత్యవతినుద్దేశించి శుభదా! నీతల్లి పొరపా
టున నీభాగంబగు చరువును సేవించినది. అందుచే నీజననికే బ్రహ్మ
నిష్ఠానిధి యగుతనయుండు కలుగఁగలఁడు. నేనాచరువునందు నాత
పోబలం బంతయు వినియోగించితిని. నీతల్లి భాగమును నీవుగ్రహిం
చుటచే నీగర్భమునందు క్షత్రతేజస్సంపన్నుం డగు పుత్త్రుండు గలు
గును. అందుచే నాతఁడు బ్రాహ్మజాతియందు నికృష్టుం డగును" అని
చెప్పుటయు సత్యవతి విచారముతో "నాథా! నీవుజగంబులనుసృష్టిం
చుటకుఁగూడ సమర్థుండవు. అట్టినీకు సుపుత్త్రప్రదానముచేయుట యే
పాటిపని? కావున నన్ననుగ్రహించి నాకుసత్సంతానమును బ్రసాదింపు
ము" అని వేఁడుకొనుటయు మునీంద్రుండు "ప్రియా! నేను సమం
త్రకంబుగ నగ్నిస్థాపనంబు చేసి యాచరువును సిద్ధపఱచితిని. దానిని
వేర్వేఱుగ విభజించి యిచ్చితిని. ప్రమాదవశంబున నవి వ్యత్యస్తముగ
నుపయోగింపఁబడియెను. ఇఁక వానిబలంబుల ననుసరించి సంతా
నము కలిగితీరును. దీనిని దప్పించుట కెవ్వరికిని సాధ్యముగాదు" అని
యూరకుండుటయు సత్యవతి "స్వామీ! నేనట్టిసంతానమువలన సంతు
ష్టినందఁజాలను. నాపుత్త్రుం డట్టివాఁడు గాక పౌత్త్రున కట్టిలక్షణ
ములుండునట్లుగనైన ననుగ్రహింపవలయు నని ప్రార్థించెను. ఋచ
కుం డట్లె యగుఁగాక యని యనుగ్రహించెను.

పిమ్మటఁగొన్నాళ్లకు సత్యవతి తపోనిరతుండును దాంతుండు
ను, భృగువంశధరుండు నగు జమదగ్నియను తనయుం గాంచెను.
గాధిరాజునకును వేదవేదియు తపోనిధియు, చండపావకసన్నిభుండు
నగు విశ్వామిత్రుం డనుపుత్త్రుండు గలిగెను. ఆజమదగ్నికి బ్రాహ్మణు

గ్ర తేజోనిధియగు పరశురాముం డుదయించెను. ఆకాలమునందు హైహయవంశజుండును, కృతవీర్యతనయుండునగు నర్జునుం డనురాజు మిగుల దేజస్వియు, బలాఢ్యుండునై తనసహస్రబాహువులచేఁ జతుర్భానునివలెఁ బ్రకాశించుచుండెను. ఆతఁడు తుషితునిచేఁ దనబాణముఖంబున నగ్నిజ్వాల యుదయించునట్టివరంబును గాంచి యాశరానలంబుచే గ్రామములను, నగరములను, ఘోషములను, బట్టణంబులను సమస్తమును దహింపఁజేయఁదొడంగెను. ఒకప్పు డయ్యర్జునుం డాశ్రమారణ్యమును గాల్చుచుండ నాపస్తంబుండను మునీంద్రుండు దగ్ధంబగుచున్న తనయాశ్రమంబును గాంచి క్రోధప్రదీప్తుండై «భార్గవరాముచే ఖండితంబగు నీశరము భూపతితం బగుఁగాక.” యని యక్కార్తవీర్యార్జునుని శపించెను.

పరశురాముండు విద్యార్థియై శివసన్నిధికిం బోయి యమ్మహాదేవునివలన సకలశాస్త్రంబుల నభ్యసించి యస్త్రవిద్యయందుఁగూడ నతినిపుణుండై ధనుర్ధరశ్రేష్ఠుం డయ్యెను. ఇట్లుండ నొకప్పుడు రాజగు నర్జునుండు జమదగ్నియాశ్రమంబునకు వచ్చుటయు జమదగ్ని యాతనికి నతిథిసత్కారంబులం గావించెను. అప్పుడు రాజయ్యాశ్రమంబునందున్న కామధేనువుం గాంచి సంతసించి «నీకెన్నియేని గోసహస్రంబుల నిచ్చెదను, నాకీధేనువు నీయవలయును” అని యమ్మునిం బ్రార్థించెను. ముని యందుల కంగీకరింపకుండుటచే ముష్కరుం డగునయ్యర్జునుండు బలవంతముగ నాగోవును దీసికొనిపోవుచుండెను. ఇంతలోఁ బరశురాముం డచ్చటికి వచ్చి యారాజుదుర్నయముం గాంచి సహింపక పరశుధారియై యాతని నెదుర్కొని మహారణంబు గావించి తుద కాయర్జునుని సహస్రబాహువులను ఖండించివైచి తపంబు చేసికొనుటకై మహేంద్రశైలంబునకుం బోయెను. పిమ్మట నాతఁడు మరలన

త్రవిద్యాపరిశ్రమంబునకై శంకరునిసన్నిధికిం బోయెను. ఆసమయంబునఁ గార్తవీర్యునిపుత్రులందఱుంగలసి యాశ్రమంబునకుంబోయిమహాహావంబు గావించి యందు జమదగ్నిమునీంద్రుని నిహతుం గావించి పోయిరి. ఆవార్తనాలకించి మహాకోపియగు పరశురాముండు రాజసింహం డగునర్జునుని సపుత్రకంబుగ నిహతుం గావించుటయే కాక తనజనకునిశరీరమునం దెన్నిగాయములు తగిలెనో యని సారులు క్షత్రియవినాశంబు గావింపవలయు నని ప్రతిజ్ఞం గావించి యుక్తభూమండలమంతయు నరాజకంబు గావించెను. రాజపత్నులందఱు నరణ్యంబులకుం బోయి యాశ్రమంబుల నాశ్రయించి యుండి మహాత్ములవలనఁ బుత్రలాభంబులు గాంచుచుండిరి. కొంతకాలమునకు వివిధముగా మరల క్షత్రియకులములు వర్ధిల్లుచుండుటం గాంచి పరశురాముండు క్రోధోద్రిక్తుండై పోయి మరలక్షత్రరక్తంబుచే భూతలంబంతయుఁ బంకిలంబుగాఁ జేసినై చెను. అనంతరము మరలఁ ధరామండలమంతయును ధరామరులకు దానంబు చేసి మరలఁ దపంబునకుం బోయెను. మరల బ్రాహ్మణుల వలన క్షత్రవంశం బుత్పన్నం బయ్యెను. ఆరాజకుమారులందఱునుబల పరాక్రమసంపన్నులైరి. మరలఁ భార్గవరాముండు వచ్చి గర్భస్థశిశుసహితంబుగ క్షత్రవంశం బంతయును నిర్మూలంబు గావించెను. కొందఱు రాజపత్నులుపుత్రయుక్తు లెట్లో పుత్రరక్షణము గావించుకొని దాఁగియుండిరి.

పరశురాముఁడిట్లు మహావధంబువలనం గలిగినపాపము శమింపఁజేయుటకై యిరువదియొక్కమారులు కశ్యపునకుఁ భూరిదక్షిణాసహితంబుగ గోభూదానములం గావించి యుండెను. అందువలనను, దపోనియమాదులవలననుగూడ హత్యాదోషంబు శమింపకుండుటచే నాతఁ డశ్వమేధయాగంబు గావించి పవిత్రుండగుటకుపాయంబు చెప్ప

వలయు నని కశ్యపునిఁ బ్రార్థించెను. కశ్యపముని బ్రాహ్మణాతనికి సర్వ దానశ్రేష్ఠంబును, పాపనాశకంబు నగుతులాపురుషదానముంగూర్చి యుపదేశించెను. పరశురాముం డమ్మహాదానంబు గావించి విగత పాపుం డయ్యెను.

ఇమ్మహాదానంబునందు స్వర్ణాభావంబయ్యెనేని రజతంబు నుప యోగింపవచ్చును. మంగళాకాంక్షి యగువాఁడు మధువు, ఘృతము, గుడము, వస్త్రము, సువర్ణము మొదలగువానితోఁ దులారోహణంబు గావింపవలయును. మనోవాక్కర్మంబులచే శక్త్యనుసారంబుగఁ దులా పురుషదానంబు చేయువాఁడు మహాపాపవిముక్తుం డగును. తులాపు రుషదానంబున నెట్టిపాపంబులైనను వినష్టంబులు గాఁగలవు. అట్టి వాఁడు స్వర్గపదంబు నధిరోహింతు రనుట కెట్టిసంశయమును లేదు. రాత్రులను, పగళ్లను, సంధ్యలను, మధ్యాహ్నంబులను, నిశాంతంబు లను మనోవాక్కర్మంబులచేఁ గావించినపాపంబు లన్నియును దులాపు రుషదానంబున నశింపఁగలవు. "బాల్యయౌవనవార్ధక్యంబులయందు జ్ఞానాజ్ఞానకృతంబు లగు నాపాపంబు లన్నియును దులాపురుషరూపి యగునిమ్మహాదేవునియనుగ్రహంబున నశించుఁగాక! నాచేనార్జింపఁబడి నట్టియు, నాకాశ్రయభూతంబైనట్టియు సర్వస్వము నీతులయందు సమ ర్పింపఁబడినది. ఈధనముతోఁగూడ నాదుష్కృతంబు లన్నియును నాకు దూరంబులగుఁగాక! మదర్జితంబు లగుపుణ్యంబులన్నియు నన్నుఁ జెందుఁగాక" అని పలుకుచు దులారోపితంబగుధనమంతయును బ్రాహ్మణులకు దానము చేయవలయును. ఈదాన మొక్కబ్రాహ్మణుని కే చేయంజనదు. ఈతులాపురుషమహాదానంబు చేయువాఁడు నిష్క ల్మషుండై పదునల్వురిండ్రులు పరిపాలించునంతకాలమువఱకును స్వర్గ సుఖంబు లనుభవింపుచుండును.

బ్రహ్మాండవర్ణనము.

ముక్తికాము లగుమానవులు సంసారసంతరణార్థులై సర్వోత్తమం బగు బ్రహ్మాండదానము గావింపవలయును. బ్రహ్మాండదానము వలన సకలదానఫలంబులును సిద్ధింపఁగలవు. అమ్మహాదానము చేయువారు సప్తలోకాధిపు లగుదురు. బ్రహ్మాండదాతయగువాఁడు సూర్యచంద్రులును భూమండలము నున్నంతవఱకు బహుబాంధవసహితుండై దేవభవనంబున సర్వాభీష్టఫలంబులననుభవించుచు సుఖించుచుండును. పిమ్మటవిష్ణుసారూప్యంబు గాంచి సకలదేవతాదుర్లభంబగుదివ్యపదంబు నందఁగలుగును.

ఓవ్యాసమునీంద్రా! ఈబ్రహ్మాండముంగూర్చి సంక్షేపముగఁ జెప్పెద నాకర్ణింపుము. దీనిని విన్నమానవులు సకలపాపవిముక్తు లగుదురు. సర్వకారణంబును, అవ్యక్తంబును, అనామయంబునగు నేశివపదమునుండి యీసమస్తంబును సముత్పన్నంబై యందు విలీనంబగుచుండునో యాదివ్యపదంబునుండి యాకాశంబును, దానినుండి వాయువును, దానినుండి యగ్నియు, దానినుండి జలంబును, దానినుండి పృథ్వియు సంజనితంబు లయ్యెను. ఈపంచభూతసమ్మేళనంబువలన నొకయండం బుదయించెను. కాలాంతరంబున నయ్యండంబు పగులుటయు దానినుండి బ్రహ్మయుద్భవించెను. జలమధ్యంబునందున్న యాయండమునందు పాతాళభువనంబు లేడును, ఊర్ధ్వభువనంబు లేడును నంతఃస్థితంబులై యుండెను. అది తనవైశాల్యంబుకంటె ద్విగుణితం బగునున్నతిం గాంచి యుండెను. దాని కనంతుం డను నాగేంద్రుం డాధారుఁడై యుండెను. ఆతఁడే విష్ణుం డని కీర్తింపఁబడుచుండును. బ్రహ్మదేవుని యాజ్ఞచే నాతఁడే యీసమస్తమును ధరించి యుండెను. ఆతనిగుణంబులఁ గీర్తించుటకు దేవదానవులలో నెవ్వరును

గూడ సమర్థులు గాఁజాలరు.

దేవర్షిగణపూజితుండును, సిద్ధులచే ననంతనామకీర్తితుండును, స్వస్తికాకారుండును, విమలభూషణవిశిష్టుండును, సహస్రమస్తకుండును, నవ్యక్తుండు నగు నయ్యనంతుండు ఫణామణిసహస్రంబులచే దిఙ్మండలములఁ బ్రకాశింపఁజేయుచుండును. ఆతనిమదఘూర్ణితంబులగునేత్రము లగ్నిగోళములవలెఁ బ్రదీప్తంబులై యుండును. ఆతని మస్తకంబునఁ గిరీటమును, గళంబున మాల్యములును, కర్ణంబులఁ గుండలంబులును ప్రకాశించుచుండును. శుభ్రహారంబులను, నీలవసనంబును దాల్చి మహోద్రిక్తుండగునాతఁడు సాయంకాలమున గంగాప్రవాహశోభితంబగు నున్నతకైలాసనగముం బోలి విలసిల్లుచుండును. లాంగలముసలహస్తుం డగునాతఁడు విష్ణుశక్తిస్వరూపిణి యగు వరుణకన్యచే నుపాసితుండై యుండును. ఆతనివదనంబునుండి కల్పాంతంబున విషాగ్నిశిఖాసముజ్జ్వలుం డగురుద్రుం డుద్భవించి జగత్త్రయంబును గ్రసించును. సకలసురపూజితుం డగునాశేషుండు పాతాళమూలమునం దుండి యీభూమండలము నావగింజవలె భరించుచుండును. ఆతని దివ్యరూపబలప్రభావంబులు దేవతలకుఁగూడ వర్ణనాతీతంబులు. కుసుమమాలికవలె భూమండలమును శిరంబునఁ దాల్చి ఫణామణిప్రభలచే దశదిశల వెలిగించు నాతనిమాహాత్మ్యము నెవ్వ రెఱుంగఁగలరు? అయ్యనంతుండు విఘూర్ణితనయనుండై యావులించినప్పుడు గిరికాననసహితంబుగఁ బృథ్వియంతయును జలించిపోవుచుండును. దేవగంధర్వోరగాదులుకూడ నాతనిగుణంబులకంతంబును గానఁజాలకుండుటచే నాతని కనంతుండను నామము గలిగెను. నాగకాంతలకరపల్లవముల యందలిరక్తచందన మాతనినిశ్శ్వాసానిలముచేఁ జిమ్మఁబడి దశదిశలనను లేపించుచుండును. పురాణముని యగుగర్గుం డయ్యనంతు నారా

ధించి సూర్యాదిగ్రహంబుల చారంబునకు ఫలగ్రహణంబు చేయఁగలి గెను. అతఁడు తనమస్తకంబున మహీమండలంబును నితరలోకంబు లను, దేవదానవమానవాదులను భరించి యుండును.

ఓమునివరేణ్యా! పాతాళము, సుతలము, వితలము, నితలము, మహాతృతలము, అగ్నిసుతలము, రసాతలము ననునీయేడులోకంబు లును విస్తారంబుకంటె నున్నతియందు ద్విగుణీకృతంబులై యుండును. అచ్చటి రత్నభూములు సూర్యకిరణంబులవలెఁ బ్రకాశించుచుండును. అందనేకముగ రత్నప్రాసాదములును హేమభూములునుగలవు. అందు దానవులు, దైత్యులు, మహాభాగులగునాగులు, రాక్షసులును నివ సించి యుందురు. మహామునియగునారదుం డొకప్పుడు స్వర్గంబునకు వచ్చి పాతాళము స్వర్గముకంటెను రమణీయం బైనదని చెప్పియుండె ను. వివిధాభరణంబులకుఁ గాంతిదాయకంబులును, హృదయాహ్లాదక రంబులు నగునమూల్యమణిగణంబులచే విరాజిల్లు పాతాళముతోఁ దుల్యం బగులోకము మఱి యెందున్నది? నిరంతరము నందందు విహ రించు దేవకన్యలచే మనోజ్ఞంబగు పాతాళ మెట్టిముక్తపురుషునికైనను రాగముం గూర్పక మానదు. ఆలోకమునఁ బగలు సూర్యరశ్మియు, రాత్రి చంద్రకాంతియును లేవు. శీతాతపబాధ లెందును లేని యా లోకము మణిప్రభాసముజ్జ్వలమై, సకలామోదదాయకమై దివ్యాన్న పానంబులచేతను, దివ్యభోగంబులచేతను సర్వసమృద్ధంబై యుండును. అందజ్ఞాతముగనే కాలము గడచిపోవుచుండును. అంతలివనోపవనం బులు కోకిలారావంబులచేతను, సరోవరంబులును, నదులును గమల కుసుమంబులచేతను నింపుగూర్చుచుండును. ఆపాతాళవాసు లగు దైత్యోరగాదులు తపోబలంబుచే సకలసుఖభోగంబుల ననుభవించు చుందురు.

— నరకప్రశంస. —

సనత్కుమారుండు మఱియు నిట్లు చెప్పందొడంగెను. వ్యాస
మునీంద్రా! పాతాళంబున కుపరిభాగంబున రౌరవము, సూకరము,
రోధము, తాలము, వివసనము, మహాజ్వాల, తప్తకుంభము, లవణము,
విలోహితము, వైతరణి, పూయావహము, క్రిమిలము, క్రిమిభోజనము,
అసిపత్రవనము, లాలాభక్షణము, బహిర్జ్వాల, అధశ్శిరము, సందంశ
ము, కాలసూత్రము, తమము, అవీచి, రోధనము, శ్వభోజనము, అ
దృష్టము, మహారౌరవము, శాల్మలి యను నరకంబులు గలవు. పాపా
త్ములగు మానవు లందు వివిధక్లేశంబుల ననుభవించుచుందురు. విప్ర
వధవిషయంబునఁ గూటసాక్ష్యంబు నిచ్చినవాఁడును, సురాపానరతుం
డును, నిత్యాసత్యవాదియు నగువాఁడు రౌరవంబునం బడును. భ్రూ
ణహంతయు, పరధనాపహారియు, గోఘాతుకుండును, శైశున్యాదులచే
విశ్వద్వేషియు, సురాపాయియు, బ్రహ్మఘ్నుండను, స్వర్ణహారుండును
ఇట్టివారిసంసర్గముగలవాఁడును, రాజఘాతియు, వైశ్యహంతకుండును
సూకరనరకపతితులగుదురు. మాతృగామియు, భగినీరతుండును, దు
హితృగామియుఁ దప్తకుంభనరకంబునఁ బడుదురు. సాధ్వియగుభార్య
ను విక్రయించువాఁడును, బాలఘాతియు, భగవిక్రేతయు, భక్తపరి
త్యక్తుండును తపలోహనరకదుఃఖంబు ననుభవించును. గురుధిక్కారి
యు, కుటుంబమున కిడక పరోక్షమున భుజించువాఁడును, దైవదూష
కుండును, వేదవిక్రేతయు, అగమ్యాగామియు, తపఖలనరకంబునఁ బడు
ను. మర్యాదాదూషకుం డవీచిరోధనరకంబునను, దేవద్విజపితృరత్న
దూషకుండు క్రిమిభక్షనరకంబునను, లోభాత్రశ్రాద్ధాదులచేఁ గర్మాచర
ణంబు గావించువాఁడు క్రిమిలనరకంబునను, యజ్ఞంబులయందు దేవ
దానవమానవపితృతర్పణంబు గావింపక భుజించువాఁడును, శత్రువి

షాదిప్రయోగంబు చేయువాఁడును లాలాభక్షనరకంబునను గూలు దురు. అసత్ప్రతిగ్రహుండును, అయాజ్యయాజియు, అభక్ష్యభక్ష కుండును నగుబ్రాహ్మణుఁడు విశసనరకంబునను, సోమవిక్రయుఁడు రుధిరాంధనరకంబునను, మిత్రద్రోహియు, మధులోభంబున మక్షికా ఘాతుకుండు నగువాఁడు వైతరణియందును బతితులగుదురు. యౌవన మదంబున మర్యాద నతిక్రమించి యపవిత్రజీవనంబు గావించువాఁడు కృష్ణనరకంబునను, నిష్కారణంబుగ వృక్షచ్ఛేదనంబు సేయువాఁ డసి పత్రవనంబునను, మేషాదిసాధుమృగహంతకులు వహ్నిజ్వాలానరకం బునను, సాధుగృహదాహకు లగ్నిమయనరకంబునను, వ్రతలోపంబు గావించువారు సందంశనరకంబునను, బ్రహ్మచర్యవ్రతచ్యుతులును, బు త్రులకిడ నధ్యయనంబు సేయువారును శ్వభోజననరకంబునను నిపతి తు లగుదురు.

ఇట్టినరకంబు లింకను ననేకశతసహస్రంబు లున్నవి. వానియం దుఁ జేరి పాపాత్ములు ఘోరయాతనల ననుభవించుచుందురు. నరకకా రణంబు లగుపాపంబులును బహుప్రకారంబులై యుండును. మనోవా క్కర్మంబులచే వర్ణాశ్రమధర్మచ్యుతు లగువారుగూడ నరకగాము లగు దురు. స్వర్గమునుండి దేవత లధోముఖులయి నరకవాసులను దర్శించు చుందురు. కాని నారకు లధోముఖులైయుండుటచే దేవతలను దర్శింప నేరరు. స్థావరంబులును, క్రిములును, మత్స్యాదిజలచరంబులును, పసుపక్షిమృగంబులును మొదలగుజీవులు స్వర్గమునందువలెనే నరక మునందును వసించియుండును. ప్రాయశ్చిత్తపరాఙ్ముఖులుగూడ నిరయ గాము లగుదురు. పాపంబునకుఁ దగినప్రాయశ్చిత్తము మునులచే నిర్దే శింపఁబడియెను. గురుపాపంబునకు విశేషంబుగను, లఘుపాపంబునకు స్వల్పంబుగను ప్రాయశ్చిత్తంబు గావింపవలయునని స్వాయంభువమను

వు వచించెను. ప్రాయశ్చిత్తానుష్ఠానంబుచే సకలపాపంబులును వినష్టంబు లగును. పాపము చేసితి ననిపరితపించువానికి సర్వప్రాయశ్చిత్తంబులకంటెను శివస్మరణమే శ్రేష్ఠమైనది. త్రిసంధ్యలయందును, రాత్రులందును మహాదేవుని స్మరించుటవలనఁ బాపక్షయం బగును. మహాదేవస్మరణంబునఁ బాపక్లేశంబులు నశించి స్వర్గప్రాప్తియగుటయే కాక ముక్తికూడ లభింపఁగలదు. భక్తిపూర్వకంబుగ శివుని స్మరించు వారు పాపముక్తు లగుటచే వారికి నరకగమనంబు లేదు. స్వర్గనరకములు పుణ్యపాపములపరిణామములు. లోకంబునఁ గేవలసుఖదంబును, గేవలదుఃఖప్రదంబు నగునది యేదియును లేదు. సుఖదుఃఖములు మనఃపరిణామమాత్రములు. కావున జ్ఞానమే పరబ్రహ్మంబును సత్యంబు నైనది. ఈవిశ్వం బంతయుజ్ఞానమయమైనది. జ్ఞానముకంటె నుత్తమంబగునది లేదు.

భూమండలప్రశంస

ఓపరాశరతనయా! జంబు, ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, పుష్కర, శాకద్వీపములేడును, లవణ, ఇక్షురస, సుర, సర్పి, దధి, దుగ్ధ, జలసముద్రంబులచేఁ బరివృతంబులై యుండును. అందు జంబూద్వీపమధ్యంబునఁ గనకమయంబగుమేరుశైలము విరాజిల్లుచుండును ఆపర్వతము పదియాఱుయోజనంబులలోతున నాటుకొన్నదై యెనుబదినాలుగువేలయోజనముల యున్నతి గలిగి శిఖరభాగంబున నిరువది రెండువేలయోజనముల విస్తీర్ణము గలదై భూమియనెడుపద్మమునకుఁ గర్ణికాకృతిని విలసిల్లుచుండును. దానికి దక్షిణమున హిమవంతంబును హేమకూటనిషధగిరులును, నుత్తరమున నీలశ్వేతవర్ష పర్వతంబులును గలవు. ఈనగంబు లన్నియు రత్నవిశిష్టంబులును, అరుణరాగసమంచి

తంబులు నై దశసహస్రయోజనవిస్తృతంబులును, ద్విసహస్రయోజనో
న్నతంబులు నై యుండును. ఈజంబూద్వీపంబున మేరువునకు దక్షిణం
బున భారతవర్షము, కింపురుషవర్షము, హరివర్షమును గలవు. ఉత్తర
మున రమ్యకవర్షమును తరువాత నుత్తరకురుభూములును గలవు. ఇవి
యొక్కొక్కటి నవసహస్రయోజనపరిమితంబులు. తన్మధ్యంబున ని
లావృతవర్షంబును దానినడుమ నున్నతంబగు మేరువును విరాజిల్లుచుం
డును. మేరువునకు నలుదెసల నవసహస్రయోజనపరిమితంబగు నిలా
వృతవర్షమున్నది. అయ్యిలావృతంబునకుఁ దూర్పున మందరమును,
దక్షిణమున గంధమాదనము, పశ్చిమమున విపులము, ఉత్తరమున సు
పార్శ్వము నను నయుతయోజనోన్నతంబులగు నాల్గు శైలములుఁగలవు.
వానికిఁ గేతుస్వరూపములై యేకాదశశతయోజనపర్యంతము కదంబ
జంబూవటపిప్పలభూజంబులు వ్యాపించి యున్నవి. జంబూ వృక్షము
చేతనే జంబూద్వీప మని పేరు గలిగినది. దానిఫలంబులు మహాగజ
ప్రమాణములై యంతటను రాలుటవలన వానిరసము జంబూనదియై
నలుదెసలనుండియుఁ బ్రవహించుచుండును. ఆపర్వతవాసు లానదీజల
పానంబు చేసి స్వస్థచిత్తులును, ఖేదదుర్గంధజరారహితులును, అక్షయు
లు నైయుందురు. ఆనదీతీరమృత్తిక మందవాయుశోషితంబై సిద్ధాలం
కారయోగ్యంబగు సువర్ణం బగుచున్నది.

మేరువునకుఁ బూర్వంబున భద్రాశ్వవర్షంబును, బశ్చిమంబునఁ
గేతుమాలావర్షంబును గలవు. వానికినడుమనే యిలావృతవర్షమున్నది.
దానికిఁ దూర్పునఁ జైత్రరథవనంబును, దక్షిణమున గంధమాదన
మును, పశ్చిమంబున విభ్రాజంబును, ఉత్తరమున నందనంబును గలవు.
మేరువునకు నలుదెసలను అరుణోదము, మహాభద్రము, శీతోదము,
మానసము నను దేవభోగ్యంబు లగుసరోవరములు గలవు. మేరువు

నకుఁ బూర్వంబున సీతాంజన, కుముద, కురర, మాల్యవంతాదులును దక్షిణమునఁ ద్రికూట, శిశిర, పతగ, రజత, నిషధాదులును, పశ్చిమంబున శిఖివాస, వైదూర్య, కపిల, గంధమాదనాదులును, ఉత్తరమున శంఖచూడ, ఋషభ, హంస, కాలంజరాదులును కేసరపర్వతంబును గలవు. మేరువునకుఁ జతుర్దశసహస్రయోజనోపరిభాగంబున స్వర్గవిఖ్యాతం బగు బ్రహ్మపురంబును, దాని దిగ్విదిక్కులయం దష్టదిక్పాలకుల పురవరంబులును విలసిల్లుచుండును. బ్రహ్మపురము నలుదెసల నుండియు, విష్ణుపదోద్భవ యగు గంగ శశిమండలమును దడుపుచు స్వర్గమునుండి నిపతితం బగుచుండును. ఆగంగానది సీత, అలకనంద, చక్షు, భద్ర యనునామంబులచేఁ జతుర్విధంబుల విభక్తంబై మేరువునకునాల్గువైపులను బ్రవహించుచు మహాసాగరమునఁ జేరుచుండును. సునీలము, నిషధము, మాల్యవంతము, గంధమాదనము ననునీనాల్గు శైలంబులకు నడుమ మేరువు కర్ణికాకారంబున నొప్పుమీఱుచుండును. ఆమేరువునకు, భరతకేతుమాలాభద్రాశ్వకురుభూములు పత్రాకృతిం దాల్చి బహిస్సీమలైయుండును. దానిజఠరదేశంబున దేవకూటంబు గలదు. దానికి దక్షిణోత్తరంబులం గల గంధమాదనకైలాసములు పూర్వపశ్చిమవ్యాప్తంబులై యుండును. పూర్వపశ్చిమంబులం గల నిషధనీలంబులు పూర్వోత్తరవ్యాప్తంబులై యుండును. ఈసకల భూధరంబులయందలి భూభాగములును దేవగంధర్వయక్షరాక్షససేవితంబులగు పురకాననాదులచే నలరారుచుండును. ఆశైలద్రోణులయం దహోరాత్రములు దేవదానవులు విహరించుచుందురు. అవియన్నియు ధార్మిక నిలయంబులై భూతలస్వర్గములై పాపాత్ములకు దుర్గమంబులై యుండును. తక్కిన కింపురుషాదివర్షంబులుగూడ శోకాయాసోద్వేగక్షుత్ప్రభయాదిరహితంబులైయుండును. అందలిప్రజలు స్వస్థచిత్తులును, నిరాం

తకులును, దుఃఖవర్జితులును, దశసహస్రవర్షజీవులు నైయుందురు.

* * * * *

మును లిట్లు ప్రశ్నించిరి. మహాభాగా! సర్వార్థసాధకంబును, భుక్తిముక్తిప్రదంబును, మంగళదాయకంబు నగు మహాదేవుని షడక్షరపరమమంత్రముంగూర్చి నీవు పూర్వము వచించియుంటివి. మేమింకను బరమసాధనంబులగు మంత్రములను వినఁగోరుచున్నాము. సూతమహాండవ్యాదిమునులును, సిద్ధులును బూర్వమేమంత్రబలంబుచే శివప్రసాదముం గాంచఁగలిగిరో యామంత్రములంగూర్చి తెలుపవలయును. అనుటయు సూతుండిట్లనియెను.

తపోధనులారా! తొల్లి శంకరుఁడు కుమారున కుపదేశించిన శివప్రియంబగు మంత్రముంగూర్చి తెలిపెదను వినుఁడు. మొదటఁ బ్రణవంబును, పిమ్మటఁ బ్రాసాదబీజంబును నుచ్చరించి పంచమస్వర సహితంబును బిందుయుతంబునగుచవర్గతృతీయాక్షరమును రెండుసారులుచ్చరించి తరువాతవిసర్గయుతం బగుపవర్గతృతీయాక్షరము నుచ్చరింపవలయును. ఇదియే మహాదేవుని సర్వార్థసాధకం బగుపరమమంత్రము. ఇది శ్రేష్ఠంబును, బరమంబును, బవిత్రంబును మోక్షదంబును బరమవిభుస్వరూపంబు నైనది. దీనివలన మహాపాతకోపపాతకాదులన్నియు నశింపఁగలవు. ఈమంత్రమును నూఱుసారులు జపించుచు మహాదేవుని బుష్పములతోఁ బూజించువాఁడుపాపదూరుండై కోటిజన్మార్జితపుణ్యలాభంబు నందును. త్రిసంధ్యలయందు నీమంత్రరాజమును శతవారంబులు జపించువానికి మృత్యువు వశమగును. సృష్టిన్యాసక్రమంబున లలాటము, వక్త్రము, హృదయము, నాభి, గుహ్యము, బాహువులు, హస్తములు, పార్శ్వములు, పృష్ఠము, జానులు, జంఘలు, గుల్ఫములు, పాదములు వీనియందుమంత్రస్మరణపూర్వకం

బుగ న్యసించువాఁడు శతకోటిజన్మపాపవిముక్తుండై, వజ్రోపలాదిమహా వర్షణంబువలనను, చోరవ్యాఘ్రాదిభయంబువలనను, జ్వరాదిరోగంబులవలనను, సకలదుఃఖంబులవలనను ముక్తుండగును. అట్టివానికి సంగ్రామవిజయంబును సౌభాగ్యంబును లభించును.

ఈమంత్రము నెల్లప్పుడును దివారాత్రములు మనంబున జపించుచుండుసాధకుండు సిద్ధుం డగును. మృత్యుంజయయంత్రస్థితుండై సతీసహితంబుగఁ ద్రిసంధ్యలయందు నీమంత్రమును జపించువాని కుపవాసహోమబ్రహ్మచర్యాదులతో నిమిత్తంబులేక సర్వకర్మంబులయందును సిద్ధిలాభంబగును. మఱియు సుఖాసీనుండై శ్రేష్ఠం బగుకుంభముద్రం దాల్చి యాత్మదేహంబున దాలుదేశస్థితంబగు సహస్రదళశ్వేతపద్మమునుండి సుధాకరుం డమృతవర్షణంబు చేయుచున్నట్లు భావించుచు నీమృత్యుంజయమంత్రరాజమును ధ్యానింపవలయును. ఇట్లు చేయువానికి దివ్యరూపంబును, అణిమాదిసిద్ధియు, స్వేచ్ఛాగతియు, కామరూపంబును లభించును. అతఁడు సర్వజ్ఞుండును, సర్వగుండును, వ్యాప్తుండును, దూరదర్శియు నగును. ఒకసంవత్సర మట్లు సమాహితచిత్తంబున నుపాసించినచో నీసద్గుణంబు లన్నియు లభించును. ఈ ధ్యానాభ్యాసమువలన ఖేచరత్వముకూడ లభించును. ఈమంత్రప్రభావము తొల్లి మహాదేవుండు దేవికికిని, కార్తికేయునకును, నందికిని బోధించి యుండెను. నేనద్దానిని సంక్షేపముగఁ జెప్పితిని. ఈమంత్రరాజముచేతనే యగస్త్యాదిమహర్షులు జరామరణవర్జితులైరి.

ఒకప్పుడు భవాని శివుం గాంచి "మహాత్మా! ఈజగంబంతయును గామక్రోధాదులచేతను, రజస్సుచేతను, సుఖదుఃఖాదులచేతను వ్యాకులమైయున్నది. ఇందు మానవులకు మోక్షోపాయంబునుగూర్చి యొఱింగింపవలయును." అనుటయు శంకరుం డో దేవి! ఈదేహము

నందు దీనికంటెభిన్నంబగు నహామనునదియే పండితులకుఁ జింతనీయ మైనది. ఆమూలమున జ్ఞానలాభముం గాంచువారు భవబాధముక్తు లగుటకు సమర్థులగుదురు. "నేను, నాది" యను భ్రాంతియే దుఃఖ కారణ మగునజ్ఞానము. "ఇది నాదికాదు" అను తెలివియే సుఖకర మగుజ్ఞానము. ఈజ్ఞానాజ్ఞానములే మోక్షమునకును బంధమునకును హేతువులు. తనదేహమే తనది కానప్పుడు తనకు దారపుత్రాదులు ను, గృహక్షేత్రాదులు నెక్కడివి? అట్టిబంధమునఁ దగిలినవానికి ముక్తిలేదు. ఈపాశుపతయోగరహస్యమును సంక్షేపముగఁ జెప్పితిని. అనిన దేవి యోదేవా! ఈనీతత్త్వ మజితేంద్రియులకు బోధపడునది కాదు. చంచలహృదయము లెప్పుడు నహంభావమునే బోధించుచుం డునుగదా! కృతయుగాదులయందుఁగూడ నెన్నియో జన్మాంతరంబు లకుఁగాని యింద్రియవిజయంబు లభించుటలేదు. అట్టిచో నల్పాయు ష్కులగు కలిప్రజల కట్టిభాగ్య మెట్లుసిద్ధించును. కావునఁ బాపయు క్తులగుమానవులు భవార్ణవంబును దరించుసులభోపాయంబు నానతీయ వలయును. అని వేఁడుటయుఁ గృపామయుం డగుపరమేశ్వరుండు లోకహితార్థినివగునోదేవి! క్లేశనాశకం బగుక్రియాయోగముంగూర్చి చెప్పెదను వినుము.

పరమాత్మయందుఁ జిత్తసంకలనంబు గావించుయోగము సాధు వులకుమాత్రమే సిద్ధించుచున్నది. బాహ్యార్థంబు లగుమూర్తిపూజా జపాదులచేఁ గావించు నాత్మయోగము క్రియాయోగ మనంబడును. కావున మొట్టమొదటఁ గ్రియాయోగము నాచరింపవలయును. పరమ పదలాభంబునకుఁ గ్రియాయోగంబుకంటె నన్యోపాయం బేదియును లేదు. మనంబును గ్రియాయోగాశ్రితంబుగఁ జేసి యెల్లవర్ణంబులవా రును మదనుష్ఠానతత్పరులై లింగార్చనంబు చేయవలయును. అట్టివా

లికి దుర్లభం బేదియును లేదు. లింగపూజయందు నైష్ఠికులును, తద్గత చిత్తులును, తత్కార్యాసక్తులును, తదాశ్రితులును, జపపూజానిరతులును, లింగార్చనాసక్తులును, వ్రతోపవాసతత్పరులును, హింసావర్జితులు నగునరోత్తములు రుద్రతుల్యులై నాలోకంబున వసించియుందురు. ఈశ్వరుండ నగునన్ను సర్వాంతర్యామిగ నవలోకించుచు, సర్వభూతంబులును నాకంటె భిన్నంబులు గావని భావించువాఁడు నిస్సంశయముగా రుద్రుఁడే యగుచున్నాఁడు. స్థావరజంగమాత్మకంబగు బ్రహ్మాండంబంతయు మత్స్వరూపంబని గ్రహించువాఁడు రుద్రస్వరూపుఁడే యగును. స్వర్ణరజతాదులచేఁగాని, తదితరధాతువులచేఁగాని, రత్నశిలామృత్తికాదులచేఁగాని విధివిధానంబున లింగనిర్మాణంబు చేసి స్థాపించి ప్రతిదినంబును భక్తిపూర్వకంబుగ వివిధపూజోపహారంబులచే నర్చింపవలయును. సర్వకాలంబులయందు, సర్వావస్థలయందును పార్శ్వంబులను, ఎదుటను, వెనుకను, ఊర్ధ్వాధోదేశంబులను నన్ను ధ్యానించువాఁడు ముక్తుం డగును. మద్భక్తుండగువాఁడు ప్రణతుండై శుద్ధజలఘృతాదులచే నభిషేకించి చందనాగరుకర్పూరాదులచేతను, మనోహరగీతవాద్యాదులచేతను, విశుద్ధవసనభూషణాదులచేతను మత్ప్రీతికరంబుగ లింగార్చనంబు నావింపవలయును. నాచరిత్రశ్రవణంబునందాసక్తుఁడై, నన్నీశ్వరునిగ ధ్యానించుచు, నాపురాణంబుల నాలించుచు మత్పరాయణుం డగుమానవుఁడు సర్వాభీష్టభోగంబులను బడయఁగలఁడు. నాసేవయం దాసక్తుండగువానికిఁ బరమపదంబు లభింపఁగలదు. చిత్తగతంబును, బుద్ధిగతంబును, దేహగతంబు నగునహంకారంబును గోచరించుచుండు మంగళప్రదుండగురుద్రుఁడే శివుఁడు. అతఁడే స్థావరజంగమాత్మంబగుసమస్తమునకును గర్త. ఇట్టిజ్ఞానంబు గలమానవుఁడు భవబంధవిముక్తుం డగును. నాయందే వి[illegible]గించుపక

కర్మంబులు ననంతఫలదంబులై జీవుల నుద్ధరింపఁగలుగును. ఇది మానవులకు సులభంబగుమోక్షసాధనము క్రియాయోగమును, జ్ఞానయోగమునుగూడ ముక్తిసాధనములే. కాని జ్ఞానయోగము దేవతలకుఁగూడ నసాధ్యమైనది. క్రియాయోగమున దేవత్వమును బిమ్మట ముక్తియు లభించును. వాయుయుతం బగువహ్ని తృణరాశిని దహించినట్లు లింగార్చనముచే సమస్తపాపములును నశింపఁగలవు. శివారాధనంబు సేయనిజన్మము నిరర్థకమైనది. శివపూజలేక మణికనకవస్త్రభూషణాదిభోగంబులు లభింపవు. బహుయుగంబులకుఁ గర్మభూమియందు మానవజన్మంబు గాంచియు లింగార్చనంబు చేయనివాఁడు నిర్భాగ్యుఁడు. ద్విజాతులు వేదమంత్రంబులచేతను, అనధికారులగుశూద్రులు పౌరాణికమంత్రంబులచేతను లింగార్చనంబు చేయవలయును. సకలమంత్రంబులును, జరాచరజగంబును శివునియందుఁ బరివ్యాప్తంబులైయున్నవి.

పంచభూతములును, చంద్రసూర్యాదులును, శివప్రకృతులే. సకలదేవతలును మంత్రాత్మకులు. ఆమంత్రము లన్నియు బిందువు నాశ్రయించి యుండును. ఆబిందువు నాదమునందును, నాదము పరమాత్మయందును సుస్థితంబైయుండును. సర్వమయుండగు నమ్మహాదేవుం డామంత్రంబులచేఁ బూజితుండగును. యకారంబున కష్టమంబగుబీజమును బిందుయుక్తం బగుద్వాదశమాత్రలతోఁ జేర్చి యుచ్చరించినఁ షడంగన్యాసయోగ్యం బగుశివమంత్రంబగును. ఈమంత్రోపాసనమే శివపూజ యగుచున్నది. ఇట్లు శివపూజ చేయువాని కిహపరంబులయందు సర్వాభీష్టసిద్ధియగును. ఈమంత్రము సత్యమై సర్వవ్యాప్తమై నిత్యమైయున్నది. కావున దీని నతిప్రయత్నంబున ధ్యానించుచు నారాధింపవలయును. మహాతపముయుతంబును, గళాయుక్తంబు

నగుపంచమంత్రజ్ఞానంబు లేనివాఁడు మాహేశ్వరుండు గాఁడేరఁడు. ఈమంత్రపంచకము సకలమంత్రంబులయందును శ్రేష్ఠమైనది. ఈమంత్రోపాసనంబునఁ బ్రాప్తింపని సిద్ధు లేవియును లేవు. ఈమంత్రసాధనంబువలన దేవమానవగంధర్వరాక్షసాద్యాదిసిద్ధులుగలుగును. దీనిప్రభావంబునఁ త్రైలోక్యస్త్రీవశ్యంబును, నణిమాదిసిద్ధులును లభించును. దేవతలు, దైత్యులు, సిద్ధులు, యక్షులు, ఉరగులు, రాక్షసులు మొదలగువా రందఱు నిమ్మంత్రబలంబునకు వశీభూతు లయ్యెదరు. మృత్యుపీడ, గ్రహబాధ, మున్నగునవి యీమంత్రస్మరణమాత్రమునఁ దొలఁగిపోవును. దీనిప్రభావముచే స్థావరజంగమనఖదంతోద్భూతంబులగువిషయంబులన్నియు వినష్టంబు లగును. ఈదివ్యమంత్రము నూఱుసారులు జపించిన శతజన్మపాపంబులు నశించును. మఱియు స్వర్గమోక్షలాభంబులు సిద్ధించును.

——♦ పంచబ్రహ్మాఖ్యానము ♦——

మనోరమం బగుగుప్తదేశంబున శుచిస్నాతుండై యేకాగ్రచిత్తంబున మంత్రజపపూర్వకంబుగ నంగన్యాసకరన్యాసంబులు గావింపవలయును. "ఓంహ్రాంహృదయాయనమః" అని హృదయంబును, "ఓంహ్రీంఅఘోరేభ్యఃశిరసేస్వాహా" అని శిరంబును, "ఓంహ్రూంఘోరఘోరతరేభ్యఃశిఖాయైవషట్" అని శిఖను, "ఓంహ్రైంసర్వతఃసర్వేభ్యఃకవచాయ నమః" అని కవచంబును, "ఓంహ్రౌంనమస్తేరుద్రరూపేభ్యో నేత్రాభ్యాంవషట్" అని నేత్రంబులను "ఓం హ్రఃఅస్త్రాయఫట్" అని చతుర్దిశలను న్యసింపవలయును. అనంతరము నాదబిందుకళాయుతంబును రకారయుక్తంబు నగుహకారమును హృదయంబున నిలిపి పూజించి తదుత్సంగదేశంబున దండశిశిరాంకు

శకశక్తిధ్వజధారిణి యగు నఘోరేశ్వరి నారాధింపవలయును. “అఘోరేశీ హ్రీం హుం ఫట్” అను నిమ్మహామంత్రముచేఁ బూజితయైయద్దేవి ప్రత్యక్షప్రసన్న కాఁగలదు. ఈరీతిగా నేకాగ్రచిత్తంబున మానసికారాధనంబు గావించినచో నిహపరలోకంబులయందు సర్వాభీష్టంబులును సిద్ధించును. కపాలమాలికాలంకృతుండును, చతుర్భుజుండును, లలాటలోచనుండును, శూలపాణియు, నభయప్రదుండును, చంద్రశేఖరుండు నగుమహాదేవుని ధ్యానించినచో నభిమతసిద్ధియగును. ఆరాధకుం డెట్టియవస్థయందున్నను శంకరుని బూజించునప్పుడు పవిత్రుఁడేయగును.

శుచిప్రదేశంబున లింగస్థాపనంబు చేసి లక్షజపించి బిల్వపుష్పంబులచే హోమం బాచరించువానికి మహాదేవుండు సాక్షాత్కరించి యణిమాదిసిద్ధులను బ్రసాదించును. అష్టైకమలకుసుమంబులచేఁ బూజించి హోమంబు చేయువాఁడు జరామరణవివర్జితుండగును. శ్రీపత్రిములు, గుగ్గులు మొదలగువానిచే విధ్యుక్తముగ వ్రేల్చువాఁడు పాతాళంబున సిద్ధుండగును. క్లేశనాశకంబగు నీఘోరమంత్రమును సర్వదా జపించువాఁడు సర్వార్థసిద్ధుం డగును. తిలాహోమంబున గ్రహపీడావినాశంబును, ఘృతశర్కరాహోమంబున నాయుర్వృద్ధియు, క్షీరసమిధలతోడి హోమంబున సమృద్ధియు నగును. అఘోరదేవునివలెనే యఘోరేశ్వరింగూర్చికూడ జపార్చనంబులు గావించువాఁడు ద్విగుణీకృతఫలసిద్ధుం డగును. అఘోరేశ్వరి నారాధించువానికిఁ ద్రిభువనదుర్లభంబులగునభీష్టంబు లన్నియు సిద్ధింపఁగలవు. అఘోరేశ్వరీముద్రను దేవీప్రసన్నతకొఱకుఁ బ్రదర్శింపవలయును. ఉభయహస్తాంగుళంబుల నభిముఖంబులుగఁ జేసి తద్ద్వయంబుచే ననామికాద్వయంబును గ్రహించి యుభయమధ్యమాంగుళులచే [illegible]

ష్టంబుల నాశ్లేషించి యధోముఖముద్రం గావించి లలాటంబున నుంచి నేత్రనిమీలనంబు చేసి జిహ్వాచాలనం బొనర్చుచు సర్వసిద్ధిప్రదం బగు పరమమంత్రము స్మరింపవలయును. అందువలన సర్వార్థసిద్ధియు, దేవాసురమానవాదిగ్రహపీడావినాశంబును సర్వజనవశ్యంబును లభించును. లింగంబునం గాని భూతలంబునం గాని యిట్లు పూజించువాఁడు సర్వార్థసిద్ధుం డగును. ఈపూజాఫలంబువలన నిహపరసుఖంబులు లభించును. ఆగమోక్తంబులగు పంచమంత్రంబులచేతను శివపూజం గావించువానికి స్వర్గమోక్షంబులు సిద్ధించును. కావున నిశ్చలభక్తి యుక్తులై సర్వకామఫలప్రదంబగుశివపూజం గావింపవలయును.

—♦ పంచబ్రహ్మమాహాత్మ్యము. ♦—

సనత్కుమారుం డిట్లనియెను. ఓవ్యాసమునీంద్రా! స్థావరజంగమాత్మకం బగునీజగం బంతయును బంచభూతమయమైనది. దీని యందు సకలజీవులును దమతమకర్మవశంబున నుదయించుచుందురు. ఆహారనిద్రాభయమైథునాదులు సకలజీవులకును సమంబులై యుండును. అందు జ్ఞానులు కర్మం బాచరించియు సంసారబద్ధులు కారు. జ్ఞానహీనులగుపశువులు కర్మబద్ధులై పుట్టుచుఁ జచ్చుచుందురు. మఱియుఁ బాపాత్ములై నరకపతితు లగుచుందురు. పాపభోగానంతరంబున బహుజన్మపరంపరలం గాంచి తుదకు నీచమానవజన్మంబు గాంచఁ గల్గుదురు.

ఒకప్పుడు పంచబ్రహ్మవిధానముంగూర్చి పార్వతి ప్రశ్నించుటయు శివుం డిట్లు బోధించెను. దేవీ! సర్వసిద్ధిప్రదాయకంబును శివభక్తుల కిహపరసాధకంబు నగుపంచబ్రహ్మవిధానమును జెప్పెద వినుము. కపిలగోసంబంధములైన పంచగవ్యంబులచే నభిషేకించి యష్టకం

బును జపించి యష్టసహస్రతిలహోమంబు చేయువాఁడు పాపముక్తుం డును, కలశంబున జలంబునిక్షేపించుచు నయుతజపంబు చేసి ప్రతిది నంబు నయ్యుదకంబుచే స్నానంబు చేయువాఁడు లక్ష్మీసమయుతుండును, బుత్రవంతుండు నగును. సూర్యోదయంబు మొదలుగ నస్తమయపర్యం తముచు దక్షిణామూర్తిమంత్రమును జపించుచు నెనిమిదివేలహోమ ము చేయువాఁడు సకలోపపాతకవిముక్తుండగును. పంచామృతమిశ్రి తం బగుగుగ్గులుహోమంబువలన యక్షరాక్షసాదివశ్యంబును, సంగ్రా మవిజయంబును, అక్లేశంబును గలుగును. విపత్సమయంబులయందు మహాదేవునిదక్షిణభాగంబున నుపవసించి త్రిరాత్రంబు లక్షసహస్ర జపం బాచరించి దధిమధుఘృతయుతంబులగుసమిధలచే వేల్చువాఁ డు విపన్ముక్తుం డగును. కపిలగోదధిఘృతమధుమిశ్రితంబగునోదనంబు చే సహస్రహోమంబు చేయువానికి సుపుత్రలాభం బగును. ఘృత యుతం బగుగుగ్గిలముచే సహస్రహోమంబు చేసిన సకలలోకవశ్యంబు ను, లక్షహోమంబు చేసిన నిధిలాభంబును బ్రహ్మహత్యావిముక్తియు శివసాయుజ్యంబును సిద్ధించును. భిక్షాహారియై మంత్రజపంబు చేయు చు జలంబునుగాని, బిల్వపత్రంబునుగాని, బిల్వఫలంబునుగాని మహా దేవుని కర్పించువాని కశ్వమేధఫలంబు లభించును. సఘృతంబు లగు వ్రీహితిలాదులతోఁగూడ సుధనీమూలంబులను శతహోమంబు గావిం చువానికులంబునం దెన్నఁటికిని దారిద్ర్యంబు గలుగదు. దుర్గమపథం బులఁ జరించునప్పుడును, భయాతురుండైనప్పుడును నదీతరణంబు చేయునప్పుడును అష్టశతమంత్రజపంబు చేసిన క్షేమంబు గలుగును. ఊర్ధ్వబాహుండై సూర్యాభిముఖంబుగ శివార్చనంబు చేయువాఁడు బ్రహ్మహత్యావిముక్తుండును, సప్తదినంబులు సలిలస్థుండై జలమాత్ర మును పానము చేయుచు శివపూజ చేయువాఁడు సురాపానాదిపాపవిము

క్షీణించును, ఏకమాసంబు నిరాహారియై, విషయంబుల విసర్జించి త్రిసంధ్యలయందు జపంబు చేయువాఁడు సర్వపాతకవిముక్తుం డగును గావున నీచప్రతిగ్రహ, నీచాన్న భోజనాదిదోషవిముక్తుండును నగును. నిత్యంబును మానసజపంబు చేయువానికి గజసింహాదిక్రూరమృగంబులవలనను, శత్రువులవలనను భయంబు గలుగదు. మనంబున నిత్యమైన ధ్యానరతుం డగువాఁడు కాయసిద్ధుండును, బరమపదప్రాప్తుండు నగును. పంచమంత్రజపంబులవలన సకలదోషవినాశంబును, శివసాయుజ్యంబును గలుగుననుట కెట్టిసంశయమును లేదు.

తత్పురుషవిధానము

ఓ దేవీ! తత్పురుషమంత్రముచే లక్షబిల్వంబుల బరహోమంబు చేయువాఁడు బ్రహ్మహత్యావిముక్తుం డగును. నిర్భయంబుగ రాత్రికాలంబున మేకకుడిచెవిని స్పృశించుచు దక్షిణామూర్తిలింగంబున జపించువాఁడు రూపవంతుండై యక్షిణీసిద్ధుం డగును. నామోచ్చారణంబు చేయుచు ఘృతయుతంబు లగుకరవీరకుసుమంబులచే వ్రేల్చువానికి సప్తదినంబులలో స్త్రీవశ్యంబును, కర్ణికారపుష్పహోమంబు చేయువానికి వత్సరార్ధమధ్యంబున దేవగంధర్వరమణీవశ్యంబును గలుగును. శివలింగంబు నాశ్రయించి నియతచిత్తంబునఁ బ్రతిదినంబును మంత్రజపంబు చేయువాఁడు శరీరశివసాయుజ్యంబు నందును. సూర్యాభిముఖుండై జపించువాఁడు పాపముక్తుండగును, లవణయుక్తతిలాహోమంబు చేయువాఁడు వశీకృతశత్రుండగును, ఘృతతిలహోమంబు చేయువాఁడు కీర్తిమంతుండగును, దూర్వాయుతంబుగఁ [illegible] హోమంబు చేయువాఁ డాయుష్మంతుండగును, [illegible] హోమము [illegible]యువాఁడు [illegible]విముక్తుండగును, [illegible] హోమంబు చేయువాఁడు నిశ్చయభ్రమం..

నగును. గ్రహణంబులయందు దక్షిణామూర్తిలింగముంగూర్చి యష్టస హస్రజపంబు చేయువానిసర్వాభీష్టంబులును సిద్ధించును. ఒకవత్సరము గాని, యంతకెక్కుడుగఁగాని సర్వదా జపించువానికి కన్యకాశీఘ్రసిద్ధి యగును. ఏకవత్సరము దక్షిణామూర్తిలింగంబున జపించువానికి స్వయముగ నేనే సిద్ధిప్రదానముం గావింతును. పంచగవ్యాశనుండై జపించువానికిఁ బరమాత్మప్రాప్తి యగును. మితాహారియై నిత్యము జపించువాఁడు ముక్తుం డగును. పర్వంబులయందు జపించువానికి సర్వక్రతుఫలసిద్ధి యగును. శ్మశానంబున జపించిన సర్వభూతవశ్యం బగును. శ్వేతసర్షపంబులచే హోమము చేసిన శాంతిలాభం బగును. వశీకరణంబునకు రక్తపుష్పంబులచేతను, మారణంబునకు నీలపుష్పంబులచేతను, విద్వేషణంబునకుఁ బీతకుసుమంబులచేతను, ఉచ్చాటనంబునకు ధూమ్రప్రసూనములచేతను హోమము చేయవలయును. సర్వార్థసాధకంబగునీమంత్రజపంబువలన సర్వపాపవిముక్తియు, శివసాయుజ్యంబును లభించును.

—♦ అర్చనావిధి. ♦—

ఓ దేవీ! అఘోరార్చనంబునకుఁ దిథినక్షత్రంబులతోఁగాని, యుపవాసముతోఁగాని నిమిత్తము లేదు. అఘోరస్మరణమాత్రంబుననే సర్వపాపక్షయం బగును. ప్రథమంబునఁ బంచగవ్యంబులచే శివాభిషేకంబు చేసి మంత్రముచేఁ బూజించి అయుతజపంబు గావించి సహస్రఘృతహోమంబు గావించినచోఁ ద్రిలోకవశ్యం బగును. చతుర్దశి యందుఁగాని, యష్టమియందుఁగాని, నుపోషితుఁడై వసను గ్రహించి మహాదేవునిదక్షిణభాగంబున నుండి యష్టోత్తరసహస్రజపంబు చేయుచు నరకపాలంబునఁ గజ్జలంబును సిద్ధపఱచి దానిచేఁ గాటుకపెట్టుకొన్నచో

సాధకుఁడు సిద్ధపురుషుఁ డగును. మఱియుఁ గృష్ణాష్టమినాఁడు జితేంద్రియుఁడు దూరదర్శియై వెలిఁగించి పూర్వముఖుఁడై శాంకరి చేసి యుపయోగించినచో క్షణమాత్రంబుననే యదృశ్యసిద్ధిఁ గాంచి బ్రహ్మేంద్రాదిలోకగమనశక్తియు. దివ్యదృష్టియు సిద్ధించును. వేయివారు లఘుమంత్రించిన గోరోచనముచేఁగాని శివనిర్మాల్యముచేఁ గాని ధూపము చేసినచో భూతబేతాళరాక్షసాదిగ్రహంబులును, జ్వరాపస్మారాదిరోగంబులును వినష్టంబు లగును. కృష్ణచతుర్దశియందు శ్మశానంబున రోగమృతంబగుశవమును సుగంధజలంబులచే నభిషేకించి మండలమధ్యంబున నిలిపి గంధపుష్పంబులచే నలంకరించి శుద్ధవస్త్రాచ్ఛాదితంబు గావించి కపిలగోనవనీతంబుచే విలేపించుచు అష్టశతజపం బాచరించినచో శవంబు క్రమంబుగ లేచి సాధకుని సర్వాభీష్టంబులను బ్రసాదించి మరల క్షణమాత్రంబున నిశ్చేష్టంబగును. కృష్ణచతుర్దశియందు రాత్రి సమయంబున హరితాళచూర్ణముం గల్పి శివలింగమునకు దక్షిణభాగంబున నుంచి యష్టోత్తరశతజపంబు చేసి యాహరితాళమును మేన విలేపించుకొన్నచో నదృశ్యసిద్ధియు, యథేచ్ఛాగమనంబును గల్గును. దక్షిణామూర్తిదేవునిసన్నిధి నుండి లక్షజపం బాచరించి తద్దశాంశము బిల్వపత్రహోమంబు చేసినచోఁ ద్రివిధంబు లగుసిద్ధులును లభించును. మంత్రమును నిత్యంబును జపించువానికి సర్వరోగవిముక్తియుఁ గీతసంగీతాదివశ్యంబును గలుగును. అట్టివానికి లభింపని సిద్ధి లేమియు నుండవు. వారు స్వశరీరంబుతోనే పాతాళాదిలోకంబులఁ జేరఁగలరు. బ్రహ్మచర్యవ్రతనియమంబుతో నొకమాసము పంచగవ్యాశినులై జపించినచో బ్రహ్మహత్యాదిసర్వపాపవిముక్తుండగును మహాలింగంబు నాశ్రయించి షణ్మాసంబులు ఫలమూలాశనంబుచే గాని భిక్షాశనంబుచేఁగాని, జపంబు చేయువానికి శివసాక్షాత్కారం బగును. ఓ దేవదేవా! నిత్యంబును

రాధింపవలయును. జపధ్యానపరాయణుం డగుయోగి యోగాభ్యాస మూలంబునను, ప్రదక్షిణనమస్కారరూపం బగుక్రియాయోగంబువలనను సేవింపవలయును. పూజాదులకు భక్తియే కారణ మైనది. పరమేశ్వరుడు భక్తిగ్రాహ్యుండు. సకలాశ్రమంబులను, సకలవర్ణంబులను గలబాలవృద్ధాదిసకలజనంబులును ప్రతిదినము శ్రద్ధావంతులై భక్తియోగంబు నాశ్రయించి సిద్ధు లగుదురు. అట్టివారికి శివసాక్షాత్కారం బగుననిన నాశ్చర్యమేమి? ఆత్మయందు సర్వభూతస్థితుండగు శివుని భావించుచు మంత్రజపంబు గావించి సర్వసిద్ధులును లభించును. శివుండను, సర్వభూతంబులను, స్థావరజంగమాత్మకంబగుసర్వజగంబును నేనేయని భావింపంగలయోగి వత్సరార్ధంబున సిద్ధుం డగును. సర్వదా సర్వభూతంబులయందు నుండువాండను నేనే యని మనంబున ధ్యానించుచు జపించువాండు శివస్వరూపుం డగును.

ఓ వామనా! నదీనదసముద్రపర్వతాదులయందుంగాని గృహంబునంగాని పశ్చిమాభిముఖంబుగ శివలింగంబును స్థాపించి సిద్ధికాముం డగునరుండు కపిలగోమయంబుచే నలికి పంచగవ్యంబుచే నభిషేకించి సద్యోజాతమంత్రంబుచే నభిమంత్రించి, వామదేవమంత్రంబున దిగ్వాదిక్కులం బ్రోక్షించి, అఘోరమంత్రంబున రక్షాబంధనంబు గావించి తత్పురుషమంత్రముచే గంధపుష్పనైవేద్యంబులు చేసి, మస్తకంబున నీశానమంత్రముచే పిండించి యుండంబున యీశానమంత్రంబుచే నిత్యపూజ గావింపవలయును. దేవాసురప్రతిష్ఠితం బగు లింగముగాని, స్వయంభూలింగముగాని లక్షణవిహీనమైనను, స్ఫుటితమైనను, విశీర్ణంబైనను సిద్ధిప్రదంబే యని యోగి దాని నుద్ధరింపవలయును. నిత్యమును లింగము నాశ్రయించి శ్రద్ధతో నీశానమంత్రము జపించువాండు షణ్మాసంబులలోగాని, వత్సరములోగాని సిద్ధుం డగును. నాభిదఘ్నజ

లంబునం దుండి సమాహితచిత్తంబున జపించువానికి దివ్యదృష్టి లభించును. అష్టోత్తరసహస్రవారంబు లీశానమంత్రితంబులగు బీజంబుల క్షేత్రనిక్షేపంబు గావించినచో నిరుపద్రవంబుగ సస్యసంపత్తి యగును. క్షీరవృక్షసమిధలనే వేల్చిన శాంతిలాభంబును, పర్వతాగ్రంబునం దుండి జపించిన శంకరసాక్షాత్కారంబును, శ్రద్ధతో లక్షజపంబు చేసిన సర్వపాపవిముక్తియు, భుజించుచు జపించిన దివ్యతేజంబును, నిత్యైకశతజపంబున మంత్రసిద్ధియు లభించును. దుష్టభోజనంబును, గం[illegible]పథగమనంబును గలుగు కాలంబులయం దీశానస్మరణంబు సేయవలయును. ఈయాచారము ననుసరించు శివపూజాతత్పరులగువారు సర్వపాపవిముక్తులై శివలోకగమనోద్యుక్తు లగుదురు.

ఓభవానీ! ఋషులు [illegible], విమలతపోనిరతులు నగువారు నిరంతరము నన్నారాధించుచుందురు. వారికి మత్సదృశంబగు జ్ఞానంబు లభించును. తపంబుచేగాని శివలోకగమనంబు గలుగదు. తపోబలంబుననే దేవర్షిమునిగణంబులు స్వర్గాదిసుఖానందంబులం గాంచుచుందురు. దుర్ధరంబులును, దురారాధ్యంబులును, సుదూరంబులును, దురతిక్రమంబులు నగునవి యవియు దపస్సాధ్యంబులగును. తపంబు మాత్రమే దురతిక్రమమైనది. నేనును, బ్రహ్మయు, విష్ణువు నుగూడ మీయందుం దపోనిష్ఠులమై యుందుము. దేవీ! నీవును దపస్వినివే. తపఃప్రభావముచేతనే నన్నుం బతిగాం బడయంగల్గితివి. తపంబుచే సర్వాభీష్టంబులు నిహలోకంబుననే సిద్ధించును. హితజనకం బగునట్టి తపముసాత్వికంబనియు, రాజసంబనియు, తామసంబనియు మూఁడు విధముల నొప్పుచుండును. దేవతలును, ఊర్ధ్వరేతస్కులగుయతులును గావించుతపము సాత్వికము. క్రూరకర్ములగు రాక్షసాదులతపము తామసము. నస్సహాయంబుల శీతాతపాదులచే శరీరంబును బీడిం

రాధింపవలయును. జపధ్యానపరాయణుం డగుయోగి యోగాభ్యాస మూలంబునను, ప్రదక్షిణనమస్కారరూపం బగుక్రియాయోగంబువలనను సేవింపవలయును. పూజాదులకు భక్తియే కారణ మైనది. పరమేశ్వరుఁడు భక్తిగ్రాహ్యుఁడు. సకలాశ్రమంబులను, సకలవర్ణంబులను గలబాలవృద్ధాదిసకలజనంబులును ప్రతిదినము శ్రద్ధావంతులై భక్తియోగంబు నాశ్రయించి సిద్ధు లగుదురు. అట్టివారికి శివసాక్షాత్కారం బగుననిన నాశ్చర్యమేమి? ఆమ్నాయంబు సర్వభూతస్థితుండగు శివుని భావించుచు మంత్రజపంబు గావించి సర్వసిద్ధులును లభించును. శివుండును, సర్వభూతంబులును, స్థావరజంగమాత్మకంబగుసర్వజగంబును నేనే యని భావింపఁగలయోగి వత్సరార్ధంబున సిద్ధుం డగును. సర్వదా సర్వభూతంబులయందు నుండువాఁడను నేనే యని మనంబున ధ్యానించుచు జపించువాఁడు శివస్వరూపుం డగును.

ఓవరాననా! నదీనదసముద్రపర్వతాదులయందుఁగాని గృహంబునఁగాని పశ్చిమాభిముఖంబుగ శివలింగంబును స్థాపించి సిద్ధికాముం డగువాఁడు కపిలగోమయంబుచే నలికి పంచగవ్యంబుచే నభిషేకించి సద్యోజాతమంత్రంబుచే నభిమంత్రించి, వామదేవమంత్రంబున దిక్పాలకుల స్థాపించి, అఘోరమంత్రంబున ధూపాదుల గావించితత్పురుషమంత్రంబుచే గంధపుష్పాలంకారంబు చేసి, మస్తకంబున నీశానమంత్రంబుచే పూజించి మంత్రపూర్వకంబుగా నీశానమంత్రంబుచే నిత్యపూజ గావింపవలయును. దేవాసురప్రతిష్ఠితం బగు లింగముగాని, స్వయంభూలింగముగాని లక్షణవిహీనమైనను, స్ఫుటితమైనను, శీర్ణంబైనను సిద్ధిప్రదంబే యని యెఱింగి దాని నుద్ధరింపవలయును. నిత్యమును లింగము నాశ్రయించి త్రైస్వరశివశాసమంత్రమును జపించువాఁడు ఒక్కసంవత్సరంబునఁగాని, వత్సరార్ధంబునఁగాని సిద్ధుం డగును. నాభిదఘ్నజ

లాబునం దుండి సమాహితచిత్తంబున జపించువానికి దివ్యదృష్టి లభించును. అష్టోత్తరసహస్రవారంబు లీశానమంత్రితంబులగుబీజంబుల క్షేత్రనిక్షేపంబు గావించినచో నిరుపద్రవంబుగ సస్యసంపత్తి యగును. క్షీరవృక్షసమిధలనే వేల్చిన శాంతిలాభంబును, పర్వతాగ్రంబునం దుండి జపించిన శంకరసాక్షాత్కారంబును, శ్రద్ధతో లక్షజపంబు చేసిన సర్వపాపవిముక్తియు, భుజించుచు జపించిన దివ్యతేజంబును, నిత్యైకశతజపంబున మంత్రసిద్ధియు లభించును. దుష్టభోజనంబును, గంధపథగమనంబును గలుగుకాలంబులయం దీశానస్మరణంబు సేయవలయును. ఈయాచారము ననుసరించు శివపూజాతత్పరుండగువాడు సర్వపాపవిముక్తుండై శివలోకనివాసి యగును.

ఓభవానీ! తపస్సుచేయువారు, విమలతపోనిరతులు నగువారు నిరంతరము నత్యుగ్రతప మొనరింతురు. వారికి మత్సదృశంబగు స్థానంబు లభించును. తపంబుచేగాని శివలోకగమనంబు గలుగదు. తపోబలంబుననే దేవర్షిమునిగణంబులు స్వర్గాదిసుఖానందంబులు గాంచుచుందురు. దుర్ధరంబులును, దుర్లాభ్యంబులును, సుదూరంబులును, దురతిక్రమంబులు నగునవి యన్నియు దపస్సాధ్యంబులగును. తపంబు మాత్రమే దురతిక్రమమైనది. నేనును, బ్రహ్మయు, విష్ణుండునుగూడ మీయందుఁ దపోనిష్ఠులమై యుందుము. దేవీ! నీవును దపస్వినివే. తపఃప్రభావముచేతనే నన్నుఁ బతిగాఁ బడయఁగల్గితివి. తపంబుచే సర్వాభీష్టంబులు నిహలోకంబుననే సిద్ధించును. హితజనకంబగునట్టి తపముసాత్త్వికంబనియు, రాజసంబనియు, తామసంబనియు మూఁడు విధముల నొప్పుచుండును. దేవతలును, ఊర్ధ్వరేతస్కులగుయతులును గావించుతపము సాత్త్వికము. క్రూరకర్మంబగురాక్షసాదులతపము తామసము. దస్నహాంకారంబుల శీతాతపాదులచే శరీరంబును బీడిం

వంచేయుచుండుట గావించు నభీష్టసాధకంబగునదియు తామసము భక్తి గావించు దేవపూజాధ్యానంబులు సాత్త్వికపూజంబులు. అద్వైత భావంబుచే నిరాకారనిఖిలాధారంబును గ్రహించుటగు ముక్తియు సిద్ధించును. అదియే యుత్తమమైనది. నిశ్చలధర్మనిష్ఠ, స్నానము, పూజ, జపము, హోమము, శౌచము, అహింస, వ్రతము, ఉపవాసము, మౌనము, ఇంద్రియనిగ్రహము, జ్ఞానము, విద్య, సత్యము, అక్రోధము, దానము, క్షమ, దమము, దయ, వాపీకూపతటాకాదిప్రతిష్ఠ, దేవాలయప్రతిష్ఠ, చాంద్రాయణాదులు, యజ్ఞము, ఉత్తమతీర్థాశ్రమసేవ మొదలగునవి ధర్మప్రాప్తి కుపాయములు. మఱియు బాధితులకు సుఖప్రదములు. సంక్రాంతి, వివిధయోగము, నాదము, ఉత్క్రాంతి, ధ్యానము, బిందులయము, జ్యోతిర్దర్శనము, ఉన్మనీభావము, ధారణ, ప్రాణాయామము, నాడీసంచారజ్ఞానము, ప్రత్యాహారము, నిరోధము, కాష్ఠావస్థ, మృతావస్థ మొదలగునవి జ్ఞానసాధనములు. వీనివలన సకలపాపక్షయం బగును. నారీశయ్యాసనంబును, యానంబును, వస్త్రంబును, ధూపవిలేపనంబులును, తాంబూలభక్షణంబు నను నివియును గానైశ్వర్యములు. సువర్ణము, తామ్రము, గృహము, అశ్వము, రత్నము, ధేనువు, వేదశాస్త్రవిచక్షణత, నానాచిత్రరసాదిద్రవ్యము, నృత్యగీతాలంకారములు, శంఖభేరీమృదంగాదివాద్యములు, గజేంద్రము, ఛత్రము, చామరము మొదలగునవి భోగస్వరూపములు. కామి యగువాడు వీనియం దనురక్తుండగును.

స్నేహ మస్త్రమువంటిది. దానియందు జీవులు తిలలంబోలి పీడితులగుచుందురు అయినను మాయామోహితులై స్నేహమునే విశేషముగా నాశించి కష్టసుఖదుఃఖములం గాంచుచుందురు. జీవులెట్లనగా సంసారచక్రమునందు బరిభ్రమించుచు నుందురు

నానాయోనులం బుట్టుచుఁ గాలవశంబునఁ దుదకు దుర్లభంబగు మానవజన్మంబు గాంచుచుండును. పుణ్యవశంబునం గూడ మానవజన్మంబు లభించుచుండును. గుణలఘుకర్మానుసారంబుగ విచిత్రగతు లేర్పడుచుండును. మానవుండై జనించియు స్వర్గమోక్షసాధకంబును, గల్యాణప్రదంబు నగువనుష్ఠానంబు సేయనివాఁడు మరణానంతరంబునఁ జిరకాలంబువఱకును శోకతప్తుండగుచుండును. మానవజన్మము దేవాసురదుర్లభమైనది. అది లభించినప్పుడు నరకకారణంబులుగాని సత్కర్మంబుల నాచరింపవలయును. స్వర్గమోక్షయత్నంబు సేయుచున్నను మానవధర్మములైనఁ బాలింపవలయును. మనుష్యజన్మము ధర్మమూలకమైనది, అది సర్వప్రయోజనంబులకును సాధకమైయుండు. భోగవశంబున నితరయత్నంబులు చేయకున్నను మానవుండు మూలరక్షణంబునైనఁ గావింపవలయును. మానవత్వంబున దుర్లభంబగు బ్రాహ్మణుండై పుట్టియు నాత్మకల్యాణసాధనంబు చేయనివానికంటె నవివేకి యెవ్వఁడుండును? సకలద్వీపంబులకంటె నీద్వీపమునందే యుపార్జితకర్మఫలంబు భోగ్యం బగుచుండును. ఇందుఁ గర్మఫలమే స్వర్గమోక్షరూపంబునఁ బ్రాప్యంబగును. ఈభారతవర్షంబున మానవుండై పుట్టి యాత్మమంగళమును సాధింపనివాఁ డాత్మవంచకుండగును. ఇదియె కర్మభూమి, ఇదియే ఫలభూమి; ఇందుఁ గావించిన కర్మంబులకు స్వర్గాదులయం దనుభవ మగుచుండును. శరీర మారోగ్యముగా నున్నంతవఱకు సత్కర్మంబు లాచరింపవలయును. అస్వస్థుండై యున్నప్పు డన్యప్రేరితుండయ్యును ధర్మాచరణంబు చేయఁజాలఁడు. అనిత్యంబగు నీశరీరమూలంబున నిత్యవస్తుసాధనముం గావింపఁదలంచనివానికి నిత్యవస్తుసిద్ధి లేకుండుటయే కాక యనిత్యంబగుశరీరముకూడ వినష్టంబైపోవును. అహోరాత్రరూపంబున నాయువు ఖండఖండంబులుగ

నశించిపోవుచున్నను నేల తెలిసికొనఁజాలరు ? ఎప్పుడు వచ్చి పైఁబడు నో యించుకంతయుఁ దెలియఁబడని మృత్యువిషయంబున నేల నిశ్చింతులై యుందురు? మృత్యుహాతులై సర్వమును విడిచి యేకాకులై పోవలసి వచ్చునని యెఱింగియుండియు దారిబత్తెముకొఱకెప్పుడైన నెవ్వరికైన నించుకంత ధనదానము నేల చేయకున్నారు? దానరూపం బగుపాథేయము గలవారికి యమాలయపథము సుగమమై యుండును. అది లేనివారు క్లేశముల ననుభవింపవలయును. మరణానంతరము పుణ్యమెవ్వరిముందు నడచుచుండునో వారికి స్వర్గపథంబునఁ బ్రతిపద మునందును సుఖలాభం బగుచుండును. పుణ్యము స్వర్గదంబనియు, పాపము నరకకారణం బనియు నెఱింగి పుణ్యకార్యంబులఁ జేయుచుఁ బాపములఁ ద్యజింపవలయును.

ఈశ్వరశరణ్యులగువారికి నరకంబును యమదర్శనంబును గలుగదు. అట్టివారు మహాపాపులైనచో శివాజ్ఞచే భారతవర్షంబునఁ గొంతకాలముండి యంతంబున శివపురంబుఁ జేరుదురు. ఎల్లవిధంబుల శివశరణ్యులగువారు జలంబులపైఁ బద్మపత్రంబులవలెఁ బాపలిప్తులు గాకయుందురు. శివనామంబు గీర్తించువారికి నరకయమభీతులు లేవు. కావున జ్ఞాను లగువారు సర్వదా శివభక్తులై యుండవలయును.

—♦ వర్ణవిశేషకథనము. ♦—

వ్యాసుం డిట్లనియెను. ఓమునులారా! బ్రాహ్మణత్వము దుర్లభమైనది. ప్రకృత్యనుసారంబుగ మానవులు బ్రహ్మక్షత్రియవైశ్య శూద్రు లగుచుందురు. బ్రహ్మముఖమునుండి బ్రాహ్మణులును, బాహువులనుండి క్షత్రియులును, ఊరువులనుండి వైశ్యులును, పాదములనుండి శూద్రులును జనించినట్లు వేదప్రమాణము గలదు. ఇట్టిస్థితిలో నుచ్చతియు, నవనతియు నెట్లు తటస్థించుచుండు నని యడుగుటయు

సనత్కుమారుం డిట్లు చెప్పం దొడంగెను. వ్యాసమునీంద్రా! పండితుఁడైనను దుష్కృతపరిభావముచే భ్రష్టులగుచుందురు. కావున శ్రేష్ఠత్వము లభించినప్పుడు దానిని రక్షించుకొనుచుండవలయును. బ్రాహ్మణత్వమును త్యజించి క్షత్రియస్త్రీయందు సంతానముం గల్గించువాఁడు బ్రహ్మభ్రష్టుండై క్షత్రియత్వముం గాంచును. అధర్మాచరణవశంబున నిట్టిపరివర్తనం బగుచుండును. తమోగుణమయంబులగు సహస్రజన్మంబులయనంతరమున లభించినయుత్తమస్థానమును బ్రమాదవశంబున వినష్టంబు గావించుకొనఁగూడదు. శూద్రాన్నముదరస్థమై యుండ మరణించిన బ్రాహ్మణుండు సాగ్నికుండైనను, విద్వాంసుఁడైనను దప్పక శూద్రుండై జన్మించును. బ్రాహ్మణుం డొక్కఁడు బ్రాహ్మణ్యము నవమానించుచు భోజ్యాభోజ్యసంగ్రహణంబు లేకుండు వాఁడు క్షత్రియజన్మంబు గాంచును. శూద్రుండయ్యును స్వకర్మనిరతుండై యున్నచో వైశ్యుం డగును. వైశ్యుండైనను శాస్త్రాన్వేషియు, విద్వాంసుండును, అగ్నిహోత్రుండును, యజ్ఞశేషాన్నభోజియు నగువాఁడు క్షత్రియుం డగును. ఉత్తమదక్షిణలతో యథావిధిగ యజ్ఞంబులఁ జేయుచు, నధ్యయనం బాచరించి స్వర్గకాముండై శ్రేష్ఠుల నారాధించుచు, నిత్యదానము, ధర్మపాలనము, ధర్మశాస్త్రశ్రవణము, ఋతుకాలపత్నీగమనము, సర్వాతిథేయత్వము, సర్వభూతసంతర్పణము, త్రివర్గానుష్ఠానము, గోబ్రాహ్మణాపదయందునఁగాని, యాత్రంబునఁగాని రణాంగణమునఁ గాంచిన యగ్నిమంత్రపూతుం డగు క్షత్రియుండు బ్రాహ్మణుండై విధిజ్ఞుండును, యాజ్ఞికుండును దేవప్రియుండు నగుచు బహుకాలము స్వర్గభోగంబు లనుభవించును. దుర్లభంబగు బ్రాహ్మణత్వ మతికష్టంబునఁగాని ప్రాప్తింపదు. కావున దాని నెల్ల విధముల రక్షించుకొనవలయును.

ధర్మయుద్ధంబువలన లభించుపుణ్యము అగ్నిష్టోమాదియజ్ఞంబులవలనఁగూడఁ బ్రాప్తింపదని యజ్ఞవిదులు చెప్పుదురు. శత్రుసైన్యమును మర్దించుచు సమరనిహతుండగువీరుఁడు ధర్మార్థకామసంపాదకంబగుయజ్ఞఫలంబు నందును. ద్వంద్వరణంబునఁ బ్రతివీరుని నిర్జించుయాతనియానంబు నధిరోహించువాఁడును, యుద్ధంబునఁ బరాజయంబొందుచు నెదురుగనివాఁడును విష్ణుపదప్రాప్తు లగుదురు. యుద్ధంబు సేయుచు నిహతుండు గానివాఁ డశ్వమేధచతుష్టయఫలంబుఁ గాంచును. శస్త్రబలంబున నప్రతిహతుండై సేనాముఖంబున నిలుచువాని కెన్నటికిని స్వర్గచ్యుతి లేదు. రాజుగాని, రాజపుత్త్రుఁడుగాని, సేనానాయకుఁడుగాని కేవలక్షత్రియుఁడుగాకున్నను ధర్మానుసారంబుగ రణనిహతులైనచో నిశ్చయముగ వారికక్షయలోకావాప్తి యగును. యుద్ధంబున శస్త్రాహతిచే నెన్నిరోమకూపంబులు విక్షతంబులగునో సర్వకామదంబులగు నన్ని యక్షయలోకసుఖంబు లాతనికిఁ జేకూరును. వీరాసనంబును, వీరశయ్యయు వీరలోకావాసంబునకు హేతువులు. గోబ్రాహ్మణపరిభవవిషయంబున నిహతుం డగుయోధుఁడు పుణ్యశీలురంబోలి స్వర్గలాభంబు నందును. బ్రహ్మహంతయైనను, గోబ్రాహ్మణప్రభువిషయంబునఁ బ్రాణంబులు విడుచువాఁడు పాపముక్తుఁడగును. తనభగ్నసైన్యమును రక్షించుకొనుచు నజేయుఁడై నిలుచువీరుఁడు జీవించియున్నచో విశేషఫలంబును, మరణించినచోఁ బునరావృత్తిరహితం బగుస్వర్గమును గాంచును. గోబ్రాహ్మణప్రభువులకొఱకు క్రూరజంతునిహతుం డగువాఁడు సద్గతిం గాంచును. ధనమున్నచో ననేకయాగములఁ జేయను వచ్చును గాని రణమరణంబుఁ గాంచుటమాత్రము దుష్కరము. సకలవర్ణంబులకంటెను క్షత్రియులకు రణయజ్ఞము సద్గతిహేతువైనది. వేదవిదుం డగువిప్రుఁడైనను నాతతాయియై హింసకుఁడై యెదిరింపవచ్చు

జాతిని వధించినచో బ్రహ్మహత్యాదోషంబు లేదు. శుశ్రూషాపరులును, భీతులునగు యోధులను వధించువాడు బ్రహ్మహత్యాదోషముం గాంచును. వ్యాధిగ్రస్తుండును, దుర్బలుండును, బాలకుండును, స్త్రీరక్షితుండును, దీనుండును, జనఘాతవర్జితుండును, భగ్నధనుండును భిన్నగుణుండు నగువాని రణంబున వధింపఁ గూడదు. ముక్తకేశిమై పలాయితుం డగువాఁడును, యుద్ధభయంబున జడుండై యున్మత్తుం డగువాఁడు, పర్ణశాఖాతృణగ్రాహియు, ఉపస్థాపియు వధార్హులు గారు. నేనిఁక యుద్ధము చేయఁజాల ననువాఁడును, నీవాఁడనని లొంగినవాఁడును, వృద్ధుండును, రణానభిజ్ఞుండును క్లీబుండ ను మొదలగు వారిని ప్రమాదవశంబుననైన వధింపఁగూడదు. తపోయజ్ఞంబులవలన బ్రాహ్మణులకు లభించుపుణ్యము సమరనిహతు లగు క్షత్రియులకు సిద్ధింపఁగలదు. ధర్మయుద్ధంబున హతుండగువాఁడు వేదవేదాంగపరిశీలనంబువలనను, యోగంబువలనను, వానప్రస్థవలనను లభించుఫలముం గాంచును.

—♦ సంసారచికిత్స ♦—

సనత్కుమారుం డిట్లనియెను. సాత్యవతేయా! నరునిపురుషశరీరము పంచభూతంబులచేతను, ధర్మబలమువలన దివ్యశరీరము భూతసారంబుచేతను క్షణమాత్రంబున నుత్పన్నం బగును. మిశ్రకర్మఫలంబున గలుగుదేహము నానాపరిణామంబువలన నుదయించును. ఆస్థిదేహంబులుగలజీవసముదాయమునందు తృణగుల్మలతాదు లుద్భిజ్జము లనియు, క్రిమికీటాదులు స్వేదజంబులనియు, మత్స్యసర్పవిహంగాదు లండజంబు లనియు, మానవచతుష్పాదులు జరాయుజంబు లనియుఁ జతుర్విధంబులఁ బరగుచుండును. తేజస్తత్త్వంబును, జలసిక్తంబు నగు

భూమి వాయుతేజోయుతం బగు నాకాశసంబంధమున బీజప్రాప్తంబగుచు న్నది. ఋతుకాలంబునం దట్టి బీజములు జలసిక్తంబులై స్ఫీతంబులును, మృదులంబులునై క్రమంబుగ మూలముం గాంచును. పిమ్మట నమ్మూలంబునుండి క్రమంబుగ నంకురంబును, పత్రంబును, నాళంబును, కాండంబును, ముకుళంబును, పుష్పంబును, క్షీరంబును జనించి యా క్షీరంబుచేఁ దండులంబులుత్పన్నంబులై యవిపక్వంబులైనంతనే యోషధి విశుష్కంబై పోవును. ఫలపరిపాకంబున నోషధులన్నియును నిర్జీవంబు లగును. అందు యవప్రభృతి సప్తదశౌషధంబులు శ్రేష్ఠములు. తక్కినవి కనిష్ఠములు. యవాదిసస్యంబులు కర్తితంబులును, మర్దితంబులునై ముసలోలూఖలశూర్పాదులచేఁ బరిశోధితంబులై జలాగ్నిసాహాయ్యంబున భక్ష్యభోజ్యపేయలేహ్యచోష్యపిచ్ఛిలంబులను షడ్విధఖాద్యరూపంబులఁ బరిణమించును. పరస్పరసంయోగంబున వానికి వివిధంబులగు రుచులును షడ్విధరసంబులును గలుగును. ఆయన్నము జీవులచే భుజింపఁబడి స్థూలాశయంబునఁ జేరి ప్రాణవాయువును స్థాపించును. ఆవాయువు భక్ష్యపేయవస్తుమధ్యంబునఁ బ్రవేశించి మొదట నన్నజలంబులను వేఱుపఱచి యగ్నిపై జలంబును, జలముపై నన్నమును, నిలిపి తాను తనవాయురూపముతో జలాధోభాగంబున నిలిచి యగ్నిని బ్రజ్వలింపఁజేసి జలంబున కుష్ణముం గూర్చుటచే నన్నము పరిపక్వం బగును. పిమ్మట నాపక్వాన్నమునందు కిట్టము, రసము నని రెండురూపము లేర్పడును. అందుకిట్టము విష్ఠామూత్రకఫాదిద్వాదశవిధమలరూపమై శరీరమునుండి బహిర్గతం బగును.

జీవులహృత్పద్మమధ్యమునుండి దేహమంతటను సర్వనాడులును వ్యాపించి యుండును. ప్రాణవాయు వానాడులయందు రసంబు నింపుటయు నవి స్ఫీతంబులై వ్యాపించును. అందలి శరీరోష్ణముచే

బక్వంబై యొడలంతటను వ్యాపించి చర్మరక్తరూపంబునఁ బరిణమించును. ఆరక్తమునుండి రోమమాంసంబులును, మాంసమునుండి కేశస్నాయువులును, స్నాయువులనుండి సిరాస్థినఖమజ్జలును, మజ్జనుండి యుత్పత్తినిదానం బగుశుక్రంబును నుత్పన్నంబు లగును. అన్నపరిణామం బిట్లు ద్వాదశవిధంబు లనిపండితులు చెప్పుదురు. ఈశుక్రము నుండియే దేహోత్పత్తి యగును. ఋతుకాలంబున నిసృష్టం బగుశుక్రము గర్భంబునఁ జేరి వాయుపరిచాలితంబై శోణితసమ్మిళితం బగును. జీవులు కర్మవశంబుచే శుక్రక్షరణసమయంబున సర్వేంద్రియపరివృతులై గర్భమధ్యంబునఁ జేరుటకు బాధ్యులగుదురు. శోణితసంకలితం బగుశుక్ర మొకదినంబునకుఁ గలలాకృతిని పంచదివసంబులకు బుద్బుదరూపమును గాంచును. వారముదినములలో నాబుద్బుదము మాంసపేశియై ద్వివారంబులకు జర్మరక్తంబులచే దృఢత్వముం జెందును. దానినుండి పంచవింశతిదివసంబులకు బీజమునుండి యంకురంబులవలెనే దేహాంకురంబు లుదయించును. ఒకమాసంబున కటి గ్రీవము శిరము, స్కంధము, పృష్ఠవంశము, ఉదరము నను పంచరూపంబుల విభక్తంబగును. మాసద్వయంబునకు హస్తపాదపార్శ్వకటిగాత్రంబులును, మాసత్రయంబునకు సర్వాంగాంకురసంధులును, మాసచతుష్కంబున కంగుళులును, మాసపంచకంబునకు ముఖనాసికాకర్ణదంతగుహ్యంబులును, మాసషట్కంబునకు నాభిపాయూపస్థాదులును, సకలగాత్రసంధులును సముత్పన్నంబు లగును. అష్టమమాసంబున సకలాంగప్రత్యంగములును, మస్తకకేశాదినిఖిలావయవంబులును సుస్పష్టముగ నేర్పడును. అప్పుడు శిశువు మాతృభక్షితంబులగు నాహారంబుల వలన నేర్పడు షడ్రసంబులను నాభినాళమునుండి గ్రహించుచు ప్రాణపంచకయుతుండై దినదినంబును వర్ధిల్లుచుసంపూర్ణుండై పూర్వస్మృతిం

గాంచి పూర్వోపభుక్తంబు లగు సుఖదుఃఖనిద్రాస్వప్నములను, జన్మమృత్యుపరంపరలను గూర్చి చింతించుచు నేనిఁక గర్భనరకదుఃఖంబులఁ దొలఁగించు శుభకర్మములం గావించి సంసారనాశకంబగు శివజ్ఞానంబు నాశ్రయించి తరించెద నని భావించుకొనుచుండును. గర్భవాసకాలంబున జీవుఁడు గర్భనరకపీడితుండై మోక్షోపాయముం జింతించుచు జరాయువేష్టితుండై పర్వతంబులనడుమఁ జిక్కువడినవానిం బోలి కాలక్షేపము చేయుచుండును. మఱియు సాగరగర్భపతితుండై వ్యాకులుండైనవిధంబున గర్భోదకనిమగ్నుండై ప్రాణమాత్రావశిష్టుండై విచారించుచుండును. గర్భకుంభపతితుం డగుజీవి జఠరానలంబువలనఁ దప్తకుంభపతితుం డగువానివలె దగ్ధుం డగుచుండును. ప్రతప్తసూచీముఖంబులచే వేధింపఁబడువానిం బోలి గర్భస్థుం డగుజీవి బాధపడుచుండును. గర్భవాసంబు కంటె నతిదారుణంబగు క్లేశం బెందును లేదు. ఏడవమాసమునుండియే జీవులు గర్భమధ్యంబునందుండి సకలబాధల నొందుచుందురనియు, వారికప్పుడు కేవలధర్మబుద్ధియే యుండు ననియుఁ బెద్దలు చెప్పుదురు. ఇక్షుయంత్రంబునఁ జెఱకులవలెను, గానుగునందుఁ దిలలవలెను గర్భస్థజీవులు పీడితు లగుచుందురు. ఈశరీర మస్థిస్తంభకలితంబును, స్నాయురజ్జుబంధితంబును, రక్తమాంసమృత్తికాలిప్తంబును, విణ్మూత్రభాజనంబును, కేశతృణాచ్ఛన్నంబును, వ్యాధిలీలారంగంబును, క్లేశాకరంబును, ఏకమాత్రిముఖద్వారవిశిష్టంబును, కర్ణరంధ్రాది వాతాయనాష్టకయుతంబును, ఓష్ఠద్వయకవాటాంచితంబును, దంతజిహ్వార్గళబంధితంబును, భోగతృష్ణాతురంబును, మహాంధకారపూర్ణంబును, రాగద్వేషవివశంబును, అమేధ్యపూర్ణగర్భవినిర్గతంబు నగునస్థిపంజరమాత్రం బనియే యెఱుంగవలయును. అందెనిమిదివేలయాఱువదిమాంసపిండులుగలవు. దానియందంతటను సార్ధత్రి

కోటిరోమకూపంబులును నాడులును వ్యాపించి యుండును. ఆరోమకూపంబులనుండి నిత్యమును స్వేదాదిమలంబులు బహిర్గతము లగుచుండును. దాని కిరువదినఖంబులును, ముప్పదిరెండు దంతములు నుండును. అందు చిత్తం బొకకుడవంబును, కఫం బొకయాఢకంబును, వస వింశతిపలంబులును, కపిలధాతువు దశపలంబులును, పలలము పంచార్ధపలంబులును, మేదస్సు దశపలంబులును, మహారక్తము త్రిపలంబులును, మజ్జ ద్వాదశపలంబులును, శుక్ర మర్ధకుడవంబును సిఁడియుండును. శుక్రమే దేహులకు బలంబును బీజంబు నని యెఱుంగునది. మఱియు సహస్రపలంబులు మాంసపిండంబులును, శతపలంబులు రక్తంబును, అపరిమితంబు లగువిణ్మూత్రంబులు నందు నిండి యుండును. ఆత్మనిత్యంబును, విశుద్ధంబు నైయుండియుఁ గర్మవశంబున నిట్టి యశాశ్వతంబును, నశుద్ధంబునగుగృహంబును గల్పించుకొని యుండును. ఈదేహము శుక్రశోణితంబులచే నుత్పన్నంబై విణ్మూత్రపూర్ణంబై యుండుటచే నిత్యము నపరిశుద్ధమై యుండును. అమేధ్యపూర్ణంబగుఘటము పైనెంత కడిగినను బరిశుభ్రంబు గానట్లు మలపూర్ణంబగు శరీరము జలస్నానాదులచేఁ బవిత్రంబు గానేరదు. అతిపవిత్రంబులగు పంచగవ్యంబులును, సుగంధమనోహరాన్నపానాదులును దేహమధ్యంబునం జేరి క్షణమాత్రంబుననే యపవిత్రంబు లగును. ఇట్టిస్థితిలో శరీరంబుకంటె నపవిత్రం బగువస్తువిం కేమున్నది ? నిరంతరమును స్రవించుచుండు మలంబులం గాంచుచుండియు, వానికాధారం బగుశరీర మెట్లు పవిత్రమైయుండునని భావింపఁగలను ? ఎంత గడిగినను బొగ్గు మాలిన్యమును విడువనట్లు పంచగవ్యకుశోదకాదులచే నెంతశోధించినను శరీరము నిర్మలము కాఁజాలదు. పర్వతము జలప్రవాహములం బోలె నిరంతరమును మలవాహినుల వెలువరించుచుండు నీదేహ మెట్లు

పవిత్రం బగును? విణ్మూత్రపాత్రం బగునీగాత్రంబున కెంతయు శుచిత్వంబు లేదు. దేహమలస్పర్శమాత్రంబున మృత్తికాజలాదులచే హస్తశోధనంబు గావింపవలసియుండు నట్టిమలభాండము నందు విషయం బున హస్తంబునకు విరాగంబు గలుగుటలేదు. ఎట్టి సుగంధపుష్పాదులచే సంస్కరించినను కుక్కతోఁక యెట్లును దిన్నఁబడనియట్లు శరీరము తనస్వభావదుర్గంధమును విడువదు. దుర్గంధమలంబుల దర్శించుచు నాఘ్రాణించుచు నుండియుగూడ మానవుఁడు స్వశరీరంబుపై విరక్తి నందకుండు టెంతయాశ్చర్యము! మోహమాహాత్మ్య మెట్టిదియో గాని శరీరము నం దంతటను దోషంబులనే కాంచుచుండియు జీవులు దానియందే ముగ్ధులగుచున్నారు. స్వదేహదుర్గంధముం గాంచియు విరక్తి నొందని వానికి విరాగకారణము నెవ్వరుం జేయింపఁగలరు? సర్వజగంబును బవిత్రమైనదియే కాని దేహముమాత్ర మపరిశుద్ధమైనది. దేహమలంబుచేఁ బవిత్రవస్తువుగూడ నపవిత్రంబగును. దేహదుర్గంధాపనోదనంబునకై శౌచవిధి నిర్దేశింపఁబడినది. కాని యంతఃకాలుష్యము మరణపర్యంతము, గంగాజలమంతటిచేతను, బర్వతోపమంబగు మృత్తికచేతను శోధించినను విశుద్ధంబు గానేరదు. అఖిలతీర్థస్నానంబు చేసినను, తపమాచరించినను [illegible] తుమ్మ లెన్నటికిని బవిత్రములు కాఁజాలవు. [illegible] చర్మపాత్రమునకు తీర్థజలాభిషేచనంబువలన నేమిప్రయోజనము? [illegible] లగువారలకు ప్రవేశంబు గావించినను నప [illegible]. అంతఃకాలుష్యలగువారి కాజన్మాంతగంగాస్నానం [illegible] నిష్ఫలంబు లగుచున్నవి. భావదుష్టుల కాజ్యప్రజ్వలితంబగు హోమానల [illegible] బడి భస్మమైనను లాభము లేదు. నిత్యాగ్నిహోత్ర [illegible], నిత్యదేవాలయస్థితంబులగు విహంగము [illegible] తీర్థావగాహ [illegible] దేవపూజాదులవలన ఫలంబు [illegible].

ఎల్లయెడలను భావశుద్ధియే పరమశౌచము. కౌఁగిలింత తల్లి బిడ్డలయెడల నొక్కటియే యైనను భావము మాత్రము విభిన్నమైనది. కాంత పుత్రినొకభావమునను, భర్తనొకభావమునను గౌఁగిలించుకొనును. నిశ్చలభావులగువారు కాంతాలింగితులయ్యును గామముక్తులుగారు. బంధమోక్షంబులకు భావమే కారణమైనది. కామాదులచే నాక్రాంతుం డయ్యును మానవుఁడు భావవిశేషముచే ముక్తుండు గాఁగలఁడు. అంతర్భావవిశుద్ధి గలవాఁడే మోక్షమున కధికారి యగును. సద్భావుం డగు, నిర్మలతేజంబు నగుమానవుఁడు దానహోమాదులం గావించి పుణ్యలోకంబు లన్నిటిని పేరఁగలఁడు. జ్ఞానంబనుజలముచేతను, వైరాగ్యమనుమృత్తికచేతను మానవులయవిద్యామలంబు విదూరితం బగును. స్వభావముచే నపవిత్రమగుశరీరము నిస్సారంబగుకదళీస్తంభమువలెఁ జర్మమాత్రసారమైనది. దోషబహుళం బగుదేహము గాంచి విజ్ఞుం డగువాఁడు విరాగుండై నిశ్చలబ్రహ్మావలంబనంబు గాంచి సుస్థిరుండై యుండును. అజ్ఞానదోషంబునను వివిధకర్మవశంబునను జీవులకు దుస్సహంబగుజన్మదుఃఖము గలుగునని పండితులు చెప్పుదురు. విద్వాంసులు కోటిగ్రంథములలో బోధించిన విషయ మొక్కశ్లోకార్థమునఁ జెప్పుచున్నాను. "మమత్వము పరమదుఃఖకరము. నిర్మమత్వమే పరమసుఖాశ్రయము." అనేకరాజన్యులు నిర్మములై సంసారవిముక్తులైరి. శతసహస్రవ్యక్తులు మమత్వముచే సంసృతిబద్ధులైపోయిరి. గర్భవాసంబున దగ్ధస్మృతి గలజీవులు ప్రసవకాలంబున విశాలోకమూర్ఛితులై తిరస్కృతిం గాంచుచుందురు. జన్మించినంతనే మోహసంస్కారం బగుఘోరవాహ్యావాయుప్రభావముచే దేహులకు జ్వరంబును, జ్వరహేతుకం బగుమోహంబును బ్రాదుర్భూతం బగును. ఆసమ్మోహంబువలననే స్మృతిభ్రంశంబై పూర్వ

కర్మవశంబున జన్మాసక్తి యుదయించును. అందుచే విషయానురక్తుం డగుచు యాథమానవుం డెన్నఁడును బవిత్రహితకార్యప్రవృత్తుండు గాఁ జాలఁడు. అట్టివానికి ఆత్మ, పరమవస్తువు, దేవుఁడు అనుజ్ఞానమే కలు గదు. ఆతఁడు కన్నులుండియుఁ జూచుటకైనను, చెవులుండియు విను టకైనను, శక్తుండు గాఁడు. సమతలంబున నడచుచుండియు నడుగడు గునకుఁ బడిపోవుచుండును, బుద్ధియుండియుఁ బెద్దలబోధల నెఱుంగ నేరఁడు. అతఁడు గర్భోద్భవివశుండై వివిధక్లేశంబుల నందుచుండును. అందుచేతనే భగవానుండగు శంకరుండు గర్భస్థితిం గలిగించునట్టి యు, గర్భదుఃఖమును బ్రకటించునట్టియు, మోక్షసాధనం బగునట్టియు శాస్త్రములు బ్రకాశించెను. సర్వార్థసాధనం బగునట్టి శివజ్ఞానం బు న్నను మానవు లాత్మహితకార్యప్రవృత్తులు గాకుండు టెంతచిత్రము! బాల్యంబున నింద్రియంబు లస్ఫుటంబు లగుటచే జీవులు ఘోరదుఃఖం బు లనుభవించుచుండియు నేమియుఁ జెప్పఁజాలకుందురు. దంతోద్గమ కాలంబున బాలగ్రహాదిపీడలచేఁబలుదుఃఖంబు లందుచు క్షుత్పిపాసా పీడితులై దుఃఖించుచు, నజ్ఞానంబుచే విణ్మూత్రంబులనుగూడ భ క్షించుచుందురు. కౌమారంబున దల్లిదండ్రులచే నాజ్ఞాపితులగుచుం డియు నాత్మహితంబు గావించుకొననేరక యధ్యయనసమయంబుల గురుతాడితులగుచు దుఃఖించుచుందురు. యౌవనంబున నింద్రియలం పటులై కామరాగాదులచేఁ బీడితులగుచు నాశాపాశంబులఁ జిక్కి సుఖహీనులై యుందురు. మోహాంధులగుయువకు లీర్ష్యావశంబున స ర్వదా దుఃఖితులగుదురు. విషయానురాగము కేవలదుఃఖహేతువు. కాముకులకు రాత్రులయందు నిద్రయు, దివసంబులయం దర్థోపార్జనాది ప్రయత్నంబును లేదు. కాంతాసక్తులగుపురుషులకు స్వేదబిందువులం బోలి శుక్రము వినష్టం బగుచు నసుఖంబుఁ గూర్చును. స్త్రీసుఖము

ముష్టరోగికండూతివంటిదని యెఱుంగవలయును. రమణీసంయోగసుఖము మలమూత్రవిసర్జనంబువలనం గలుగుసుఖమువంటిదే యని పంచచూడుండు వచించెను. కాని మోహాంధు లట్లు భావింపఁజాలరు. సర్వదోషాకరంబగు సతీసంయోగసుఖము నామమాత్రమైనది. అవమానముచే మానంబును, వియోగముచే సంగమంబును, జరచే యౌవనంబును నశించుచుండ మానవుల కిఁక సుఖ మెక్కడిది? జరాగ్రస్తులగుమానవులసకలాంగములును శిథిలములై, కేశములు పలితంబులై శక్తులు నష్టములైపోవును. ప్రథమంబున స్త్రీపురుషులకుఁ బరస్పరప్రీతిదాయకమగునవస్థ జరాగ్రస్తమైనంతనే యుభయులకు నప్రీతికరంబైపోవును. యౌవనంబునఁ దనసౌందర్యముం గాంచి సంతసించువాఁడు వృద్ధావస్థయందుఁ దనరూపము తనకే వికృతముగఁ దోఁచుచున్నను విరక్తుండు గాకుండుట యెంతయవివేకము! జరాయుతుండగుపురుషుని బత్నీపుత్రులును బంధువులునుగూడ నశకుండని యనాదరింతురు. భృత్యులుగూడ నాతని లక్ష్యము చేయరు. వార్ధకమునందు మానవుఁడు ధర్మార్థకామమోక్షసాధనంబున నశక్తుండగును గావున యౌవనమునుండియే ధర్మాచరణంబునకుఁ గడంగవలయును.

—♦ స్త్రీస్వభావకథనము ♦—

ఓమునీంద్రా! స్త్రీస్వభావముం గూర్చి చెప్పెదను వినుము. లఘుచిత్త లగుకాంతలు సకలదోషంబులకు నాకరములు. ఈవిషయంబునఁ బంచచూడానారదసంవాదమును పండితులు వర్ణించి యున్నారు. పూర్వ మొకప్పుడు దేవర్షియగునారదుండు లోకసంచారంబు చేయుచుఁ ద్రిలోకసుందరియగు పంచచూడయను వారాంగనం గాంచి యోసుందరీ! నాకుఁ గలిగిన యొకసందేహమును నివారింపుమని యడు

గుటయు నయ్యప్సరవెలంది నాశక్తికొలఁదిఁ బ్రయత్నించెద ననియెను. అప్పుడు నారదుఁడు నారీస్వభావముఁగూర్చి నాకెఱింగింపవలయు నని కోరుటయు నవ్వాలుఁజేడియు ఓమునీంద్రా! నేనాఁడుదాననై స్త్రీనింద గావించుట యుచితము గాదు. స్త్రీలచరిత్రస్వభావములు నీవె యెఱుంగనివి గావు. అట్టినీవు నన్నిట్లు ప్రశ్నించుట సమంజసము గాదు. అని చెప్పిన నారదుఁడు ఓరమణీ! సత్యము వచించుటెవ్వారికి నెన్నఁటికిని నెట్టెడలను దోషము గాదనియెను. అంతఁ జారుహాసిని యగుపంచచూడ సత్యంబులును, శాశ్వతంబులు నగుస్త్రీదోషములంగూర్చి యిట్లు చెప్పందొడఁగెను. నారదమునీంద్రా! కాంతలెంతటికులరూపవతులైనను, సనాథలైనను మర్యాద నతిక్రమింపక మానరు. కావున స్త్రీలకంటెఁ బాపవస్తువు లీజగంబున నింకేవియును లేవు. పతి యెంత ప్రసిద్ధుఁడైనను, ధనరూపవంతుఁడైనను, వశవర్తియైనను గాంత యాతనిలోపమునే యన్వేషించుచుండును. మఱియు స్త్రీలకుఁ గల గొప్పదోష మేమనిన వారు నిస్సంశయముగా సిగ్గువిడిచి ఘోరపాపులగుపురుషులనుగూడ సేవింతురు. తమ్ముఁ బ్రార్థించుచుఁ దఱచుగ దర్శించుచు కొలఁదిమాత్రమునైనను నాశ్రయించుపురుషులకు వారు లోఁబడిపోవుదురు. కులమర్యాదలకు లొంగియు, పరిజనంబులకు భయపడియుఁ గాంతలు భర్తృవశవర్తినులై యుందురుగాని లేకున్నచో వారు కోరినపురుషులతోనే యుందురు. ఆవిషయంబున వారికి వయస్సుతోఁగూడ నిమిత్తము లేదు. సురూపియైనను, కురూపియైనను పురుషుఁ డన్నంతనే వారికి భోగపాత్రుఁ డగుచుండును. భయముచేఁగాని, దయచేఁగాని, ప్రయోజనముచేఁగాని, కులబాంధవసంపర్కముచేఁగాని కాంతలు కాంతులకు వశవర్తులగుట లేదు. వారెప్పుడును యౌవనవతులును, సర్వాలంకారభూషితలు నగువారాంగనల ప్రవృ

తిని భావించుచుందురు. స్వామిప్రియలై, బంధుగురుజనాదరపాత్రలై సురక్షిత లగుకామినులును పంగ్వంధజడవామనకుబ్జాదిపురుషులయందుఁగూడ నాసక్త లగుదురు. ఈలోకంబున స్త్రీలకు నగమ్యుం డగుపురుషుండు దొరకుచు లేఁడు. కులశీలంబులు కనకధనము లేకున్నను పరపురుషునియందే కామాసక్త లగుదురుగాని భర్తలందు ననురక్తలు గాంజాలరు. అన్యపురుషాభిలాషయునను, బంధుజనభయంబునను, వధబంధనాదిసంశయంబులవలనను మాత్రమే స్త్రీలు పతివ్రతవర్తనులై యుందురు. స్త్రీలు చపలస్వభావలు, స్వేచ్ఛలు, దుర్గ్రాహ్యలు నని ప్రాజ్ఞులు చెప్పుదురు. కాష్ఠంబులచే నగ్నికిని, నదీజలంబులచే సముద్రునకును, పాపజీవులచే యమునకును బోలె పురుషులచే యువతులకుఁ దృప్తి తీరదు. ఇట్టియువకాంతలయం దింకఁ గొన్ని మోరహస్యవిషయంబులుగలవు. రూపవంతునిం గాంచినంతనే రమణీహృదయము కరంగక మానదు. కామదాతయు, నాదరప్రియవచనుండును, రక్షకుండును సర్వోత్తముండునై యున్నను గాంతలు కాంతుని వంచింపక మానరు. రమణీమణులకు రతియందు దృప్తి కలిగినట్లు పరమాన్నాలంకారార్థసంచయంబులవలనంగూడఁ గలుగదు. అంతకుండును, శమనుండును, మృత్యువును, పాతాళంబును, బడబాముఖంబును, అసిధారయు, విషంబును, సర్పంబును, మహానలంబును గలసి యొకరూపును గాంత యొకయెత్తుగా నెంచంగనగును. పంచభూతంబులను, జగంబులను, స్త్రీపురుషులను విధాత యెప్పుడు సృజించెనో యప్పటినుండియు స్త్రీజాతి కిట్టి దుష్టత్వము సంఘటిల్లి యున్నది.

అని చెప్పుటయు వ్యాసుం డోమునివర్యా! ఈజగంబున మూఢమానవులు దురదృష్టవశంబున [illegible] గాంతలయందే యాసక్తు లగుచుందురు. ఈసంగతి నాకు మేలుగఁ దెలియకున్నది. మద

నుండు స్త్రీలకంటెం బురుషులకే దుర్జయుం డని తోఁచుచున్నది. ఓతపోధనా! మన్మథునిచే విజితుండు గాని పురుషుం డెవ్వఁడైన నున్నచో నాతనిచరిత్రముం దెల్పుము. స్త్రీలు సహధర్మచారు లని మహాత్ములు చెప్పినమాట నాకు విరుద్ధముగఁ దోఁచుచున్నది. స్త్రీ లస్వతంత్ర లని వేదములుఁగూడఁ దెల్పుచున్నవి. కావున సహధర్మిణీశబ్ద ముపచారవిధిమాత్రమే యని బోధయగుచున్నది. ఈవిషయంబున నెంతయాలోచించినను నాకు గాఢాంధకారముగానున్నది. దీనిం గూర్చి మీరెఱింగినవిషయం బేమైననున్న నెఱింగింపఁగోరెదనని ప్రార్థించుటయు సనత్కుమారుం డిట్లనెను.

సాత్యవతేయా! పూర్వకాలంబున నష్టావక్రుం డను నొక బ్రాహ్మణుండు వదాన్యుం డను ఋషిచెంతకుం బోయి గుణవతియు, సచ్చరిత్రయు, సాధ్వియు నగునాతనితనయను బ్రభయనువానిని దనకిచ్చి పెండ్లి చేయవలయు నని యర్థించెను. అంతవదాన్యుండు “నీవుత్తర దిక్కుం జూచి వచ్చినచో నేను నీకీకన్యక నీయఁగలను” అని చెప్పెను. అష్టావక్రుఁ డందులకంగీకరించి యుత్తరదిక్కు నెట్లు దర్శింపవచ్చునని యడుగుటయు వదాన్యుం డోకుమారా! అలకాపురియు, హిమాలయంబును దాఁటి సిద్ధచారణసేవితంబగు కైలాసమును దర్శించి ముందటికిం బోయినచో రమణీయంబును, మనోజ్ఞంబును, మేఘసన్నిభంబు నగు నీలవనభూమి గానవగును. అచ్చటఁ దపస్వినియు,వృద్ధయు, దీక్షితయు, మహాభాగయు నగునొకరమణీమణిని దర్శింపఁగలవు. ఆమెను బ్రయత్నపూర్వకంబుగఁ బూజించి నీవు మరలి వచ్చినచో నీకు నాతనయ నిచ్చి పెండ్లి చేసెదను. నీవీప్రతిజ్ఞను నిర్వహింపఁగలవేని పోయి రమ్మని చెప్పెను. అష్టావక్రుండును సమ్మతించి యోసాధుపుంగవా! నేనిప్పుడే పయనంబై నీయానతిచ్చినతావునకుం బోయి వచ్చి నాప్రతి

జ్ఞను జెల్లించుకొందును. మీవచన మవశ్యముగ సత్యము గావలయును. అని భగవానుం డగునష్టావక్రుం డుత్తమం బగునుత్తరంబున సిద్ధచారణసేవితం బగు హిమాలయంబునకుం జని యటఁ బుణ్యవాహిని యగుబాహుదానదిం గాంచి యందు యధావిధిగ నవగాహనంబుచేసి యత్తిరంబున శయనించి ప్రాతఃకాలంబున లేచి మరల స్నానముచేసి రుద్రాణీకూపంబునకుఁ బోయి యందును సుస్నాతుండై యటనుండి కైలాసంబునకుం జని పిమ్మట నలకాపురప్రాంతంబున యక్షరక్షితంబగు మందాకినిం దర్శించి యందు స్నానంబు చేసి తీరంబునఁ గూర్చుండి యుండఁ గుబేరానుచరు లగుయక్షు లాతని దర్శించి యోమునిసత్తమా! అలకేశ్వరుండు మీదర్శనార్థియై యరుదెంచుచున్నాఁడని విన్నవించిరి. ఇంతలోఁ గుబేరుండును వచ్చి యాబుషివర్యునిఁ బూజించి మహాత్మా! మీరెట్టిసంశయంబును లేక నాయం దనుగ్రహించి మన్మందిరంబునకు విచ్చేయవలయు నని ప్రార్థించి యమ్మునీంద్రుని దన గృహంబునకుం దోడ్కొనిపోయెను.

అచ్చటఁ గుబేరుం డమ్మునిచంద్రు నర్ఘ్యపాద్యాసనాదిపరిదానంబులచేఁ బూజితుంగావించి సుఖోపవిష్టుం జేయుటయు దేవగంధర్వాదు లాతనిఁ బరివేష్టించి యాసీనులై యుండిరి. అప్పుడు ధనేశ్వరుండు మధురస్వరముతో మునీంద్రా! మీకు సర్వోత్తమం బగునాతిథ్యముం గూర్చుటయే మాకుఁ గర్తవ్యము. మీయనుజ్ఞయైనచో మీవినోదంబుకొఱకు దేవకాంతలు నృత్యగీతంబులఁ గావించెదరని మనవి చేసెను. అందుల కమ్మునితల్లజుండు వల్లె యనుటయు ఘృతాచి, మిశ్రకేశి, ఊర్వశి, రంభ, అలంబుస, చిత్ర, విశ్వాచి, సుకేశి, సుముఖి, హాసిని, రతిప్రియ, మనోహర మొదలగు దివ్యప్రధానాప్సరలు నృత్యములఁ గావింప నారంభించిరి. గంధర్వులు దివ్యవాద్యంబుల మ్రోగిం

చుచుండెను. ఇట్లు నృత్తగీతవాద్యములు చేయుంబడ నేకరీతిగా జరగి పోవుచుండెను. బాహ్యభయంబుచే నొకనిమిషమైనను విరమింపంబడుట లేదు. అప్పటినుండి దేవియు నారాధకుఁడు యట్లే చూచుచుండెను. ఈ రీతిగా నొకదివ్యవత్సరము గడచిపోయెను. అప్పుడు యక్షనాథుం డో తపోధనా! ఈవినోదములతో సింహామించుక నొకదివ్యవత్సరమై నది. ఇంకను నాకేమి కావలయునో యాజ్ఞాపింపవలయును. మేము దాసులము మీసేవకులము. అని విన్నవించుటయు మౌనిశేఖరుండు పరితుష్టుండై యో రాజరాజా! నీపూజలచే నేను సంతుష్టుండనైతిని. నీవక్ష్యదయాపరంపరలచే వర్ధిల్లెదవుగాక! నేను కార్యార్థినై పోఁదలం చి యుంటిని. అని చెప్పి యానిధినాథునిచే ననుపకంబు వడసి యట నుండి సత్వరంబుగ నుత్తరాభిముఖుండై కైలాసమందరహేమశైలంబు లం గడచి కైలాసంబునకుం బశ్చిమమైన సమస్తభాగంబునుండి పయ్య నంబు సాగించుచుం గ్రమంబుగం బోయి నందనవనసన్నిభం బగు నొక యరణ్యంబున రమణీయంబగు నాశ్రమంబును సందర్శించెను. అచ్చట స్వర్ణరత్నమయంబులగు శుభ్రశైలంబులును, రత్నభూములును, మనో జ్ఞపుష్పాదులు గల్గు మునీంద్రునకు నయనానందముం గూర్చెను. అందు చే నాతండు సంప్రీతుండై రమణీయంబులగు వివిధవృక్షంబులం దర్శించు చు నట రాజరాజభవనతుల్యంబగు నత్యుత్కృష్టం బగు రత్నమయమం దిరంబును బొడగాంచెను. ఆదివ్యభవనము దివ్యవిమానంబులపై విహరించుచున్న యచ్చరవేల్పులచే రమణీయంబులగు శిఖరంబులు గల కాంచనస్ఫటికశిలాతలములచేతను, మందారకుసుమాకీర్ణముగు మందా కినీప్రవాహము చేతను, మరకతకాంతికలితంబు లగువివిధమణిగృహాం బులచేతను [illegible]. దానికి సమీపమున నొకమనోహరసర [illegible] [illegible]ను.

అష్టావక్రుం డప్పుడు గృహద్వారంబు చేరంజని దాని వైచి త్ర్యంబున కచ్చెరువంది తన్నుందానే మఱచిపోయెను. కొంతసేపటి కాసంయమివరుండు స్మృతిం దెచ్చుకొని ముందరికిం బోయి యుచ్చైస్స్వరంబుతో "ఈస్థానమునం దున్నవా రెవ్వరైన నగువారు గాక! వారు నేనిచ్చటి కతిథినై వచ్చితి నని తెలిసికొందురుగాక!" అనిపలుకుటయు నంతలోనే యాభవనద్వారమునుండి వివిధాలంకారవిభూషితలును, ప్రసన్నవదనలును, మనోహరవిగ్రహలు నగునేడ్గురుకన్యకలు ఋషిసమ్ముఖంబునకు విచ్చేసిరి. ఆసుందరీమణులందఱు నాతనికి వందనంబులు గావించి లోనికి దయచేయవలయు నని ప్రార్థించుటయు నతికుతూహలంబున నమ్మునిసత్తముండును వారితోఁగూడి సమ్మోదాంతరంగంబునఁ బ్రవేశించెను. ఆభవనాభ్యంతరమున విశుద్ధవసనయు, సర్వాలంకారభూషితయు, రత్నపర్యంకాసీనయు నగునొకకన్య యమ్మునివరుం గాంచినంతనే లేచి యెదురేఁగి నమస్కరించుటయు నష్టావక్రుండు శుభం బగుఁగాక యని దీవించెను. నాశ్చర్యముగ నయ్యువతి యాతపోధనుని సుఖాసీనుం గావించి సత్కారావృత్తయై యాతనిసన్నిధిని నిలిచియుండెను. ఆకన్యకలందఱును గాఢాసక్తలై యున్నట్లు వారిలక్షణములంబట్టి యష్టావక్రుండు గ్రహించి విస్మితుండై "ఓ కాంతలారా! మీలో నిత్యసదాచారవతులును, నిత్యవిశుద్ధహృదయులు నగువారెవ్వరో వారే నాకాతిథ్యమును నిర్వహింపవలయును. తక్కినవారందఱును తమతమగృహంబులకుఁ బోవచ్చును." అని యాజ్ఞాపించుటయు సుందరీరత్నము లగునేడ్గురుకన్యకలును మునివరునకు వందనంబులు చేసి సెలవుఁగైకొని వెడలిపోయిరి. ఒకకన్యమాత్రము పర్యంకోపవిష్టుం డగునయ్యతిథిసన్నిధిని నిలచియుండెను. ఆ వృద్ధరూపిణియై యాతనికిఁ బరిచర్యలఁ గావించుచుండెను. ఎట్టులనే

పైనపిమ్మటఁ బ్రశంసితవ్రతుండగు నమ్మహర్షి రెండవపర్యంకమును జేరి శయనించుచు నక్కామినిం గాంచి యోభద్రా! చాలరాత్రియైనది. నీవును శయనింపఁగూడదా?" అనియెను. అమ్మునివచనంబు లాలించినంతనే యక్కన్య గడగడవడంకుచు శీతబాధితయైనదానివలె ఋషిశయ్యం జేరి "మహాత్మా! నీయాగమనంబు సుఖజనకం బగుఁగాక!" అని పలుకుచు బాహుయుగళంబుచే నాతని గాఁగిలించుకొనియెను. కాని యాసంయమివరుండు నిర్వికారుండై కాష్ఠప్రతిమవలె వంతలో నిశ్చేష్టుండైపోయెను. అప్పు డాయువతీమణి దుఃఖితయై "ఓమహాత్మా! నేను కామమోహితనై యున్నదానను. అతివలు పురుషులకంటె నధీరలు గదా! ఓబ్రహ్మతేజా! ఇందు నీదోషమించుకంతయును లేదు. నేను నీపొందు గోరివచ్చితిని. నాకోరికసఫలంబు సేయుము. నీయం దనురక్త నగునాయెడలం బ్రసన్నుండ వగుము. ధర్మాత్మా! ఇదియే నీతపఃఫలము. దర్శనమాత్రంబుననే నిన్నుఁ గామించి సేవింపఁగోరిన నన్ననుగ్రహింపుము. నాసర్వస్వమునకును నాకును నీవే ప్రభుండవు. సకలసంపన్నస్థానం బగునీమందిరంబును, సర్వసురరమణీయం బగునీయుద్యానంబును సర్వంబును నాయవియ. నేను నీసకలమనోరథంబులను సమకూర్పఁగలను. రమణీయం బగునీపుష్పోద్యానమున నాతోఁగలసి యథేచ్ఛావిహారివై సుఖింపుము. నేను నీయధీనను. నావలన దేవమానవభోగంబులం గాంచుచు విహరింపుము. కాంతలకుఁ బురుషసంసర్గంబుకంటెఁ గామింపఁదగిన యుత్తమభోగం బేదియును లేదు. మదనార్తలగుకామినుల స్వేచ్ఛాగమనంబును బ్రతప్తవాలుకాప్రదేశముగూడ నడ్డగింపఁజాలదు." అని యనేకవిధంబులఁ బ్రార్థించుటయు నష్టావక్రుండు "ఓభద్రా! ఎట్లయినను నేను పరదారగమనం బాచరింపఁజాలను. అది కేవలము ధర్మ

శాస్త్రదూషితమైనది. నేను సత్యము చెప్పుచున్నాను. నాకు విషయాభిజ్ఞత యెంతమాత్రమును లేదు. పుత్రార్థినై మాత్రమే గార్హస్థ్యము నభిలషించుచున్నాను. పుత్రసంతతిఫలంబువలన స్వర్గగమనంబు సేయం దలంచితిని. ఓరమణీమణీ! నాధర్మమును నిశ్చయముగ గ్రహించి నీవిక్కార్యమునుండి విరతినందుము." అని చెప్పుటయు నా సుందరి "ఓవిప్రోత్తమా! రతిప్రియ లగు రమణులకుఁ గామదేవుని కంటె వాయువరుణానిలాదిదేవతలు ప్రియులు గాఁజాలరు. శతసహస్ర స్త్రీజనంబులలోఁ బతివ్రత యొక్కతెయైన నుండుట కష్టము. కామార్తలగు యువతులు జననీజనకులను, భ్రాతలను, భర్తలను, బంధువులను, కులమును, దేవునిఁగూడఁ బరిగణింపక కూలంబును గూల్చి ప్రవహించు వాహినులంబోలి కులనిపాతనంబు గావింపఁగలరు. స్త్రీల బహుదోషంబులంగూర్చి ప్రజాపతి సవిస్తరంబుగఁ దెలిపియున్నాఁడు" అని యుగ్గడించుటయు మునీంద్రుండు నిశ్చలచిత్తుండై "ఓయబలా! ఆతురపడకుము. మెల్లగఁగూర్చుండి నేనేమి చేయవలయునో చెప్పుము" అనియెను. అప్పుడవ్వాలంది "ఓమహాప్రజ్ఞా! కొన్నిదినంబులు మద్భవనంబున నుండుము. దేశకాలానుసారంబుగ సర్వంబును దిలకించి కృతకృత్యుండవై స్వస్థానంబునకు వేంచేయుదువుగాక" అని కోరెను.

అష్టావక్రుండును దనయిచ్ఛవచ్చినంతకాల మటనుండుట కంగీకరించెను. ఆసుందరీమణి యఖిలాంగకములు నొక్కొక్కటిగ దర్శించిన నతిలోకరమణీయములై యుండెను. కాని యామె కేవలము వృద్ధురాలుగ నగపడుచుండుటం గాంచి యాతఁడు మిగుల విచారించి తనలో "ఈగృహదేవత యగునీవెలఁది యిట్టివృద్ధభావముం గాంచుటకు నిశ్చయముగా నేదియో శాపము కారణమై యుండును. అట్టిశాపకారణముంగూర్చి యీమెను బ్రశ్నించుట యుచితము గాదు." అని భా

వించుకొనుచుండెను. ఇట్లా ఘడియలంతయు గడచిపోయెను. అప్పుడాకోమలి ‘‘మునీంద్రా! సంధ్యామేఘసంకలితం బగుసవితృమండలముం దిలకించితిరా! ఇప్పు డేమి చేయవలయునో యానతిచ్చెదరుగాక’’ అనుటయు నతండు ‘‘ఓచెలువా! స్నానజలంబును గొనితెమ్ము! జితేంద్రియుండనై స్నానముం దాల్చి సంధ్యోపాసనంబు సేయవలయును’’ అని చెప్పెను. ఆమెయు నట్లే యని దివ్యపరిమళతైలంబును స్నానజలంబును సమకూర్చి యమ్మునియనుజ్ఞం గాంచి యాతనియొడలంతటను తైలమర్దనంబు గావించి స్నానశాలకుం గొనిపోయి సుపరిష్కృతంబగుపీఠంబున నాతని నాసీనుం గావించి యభిషేచనంబు నిర్వర్తించి యనంతర మతిరుచ్యంబులగు దివ్యఖాద్యంబులచే నమ్మునిశేఖరుని బరితృప్తుం గావించెను. ఇట్లారాత్రి యంతయును మునివరునకుఁ దెలియకుండఁగనే వేగిపోయెను. అప్పుడు పూర్వదిక్తటంబున సూర్యోదయం బగుటను సందర్శించి మునివరుం డదరిపడి లేచి స్నానసంధ్యోపాసనంబులు నిర్వర్తించి యానెలంతం గాంచి యిఁక నిప్పుడు చేయవలసిన దేమియని యాడిగెను. అవ్విలాసిని యప్పు డాతనికి మధురాహారంబులం గొనితెచ్చి నివేదించుటయు మునీంద్రుండు వానిని మితంబుగ భుజియించెను. ఈవిధముగాఁ బగలతిక్రమించి రాత్రియగుటయు నామె యాతని శయ్యాభవనంబునకుం దోడ్కొనిపోయెను. అందు రమణీయంబు లగు రెండు పర్యంకములు సిద్ధపఱుపఁబడి యుండెను. అష్టావక్రుఁ డొకశయ్యపై శయనించి తనచెంతకే వచ్చి నిలిచియున్న యక్కామినియభిప్రాయంబును గ్రహించి ‘‘ఓభద్రా! నామనం బెన్నఁటికిని బరదారాసక్తంబు గానేరదు నీవిటనుండి పోయి యాపర్యంకముపైఁ బండుకొని సుఖంబుగ నిదురింపుము. నీకు శుభంబగుఁగాక’’ అనుటయు నాహేలావతి ‘‘మహాత్మా! నేను స్వతంత్రురాలను.

కావున నీవు నావలన ధర్మభంగంబు గాదనుము" అనియెను. మునీం ద్రుండును విస్మితుండై "ఏమి స్త్రీవైయుండియు స్వాతంత్ర్య వైయుంటి వి? స్త్రీలకెంతయును స్వాతంత్ర్యంబు లేదని శ్రుతిస్మృతిధర్మవచనంబు గలుగఁగదా!" అనియు నీ పలుకులు నామె దిట్టాదృష్టుల విడుచుచు "మునిప్రవరా! దుర్లభమనోరథనగు నేను కామపీడితనై మిగులఁ బరితపించుచుంటిని. నీయందనురాగంబుచేఁ గామబాణసహాయక భ్రాంతలంబునం బొరలుచు దుఃఖించుచున్న నన్ననుగ్రహింపుము. నీవుఁ బరదారగమనదోషశంక గలదేని నేను నీకిప్పుడే యాత్మార్పణంబు గావించుకొనుచున్న దానను. నా ప్రాణగ్రహణంబు గావించి నిశ్చింతుండవై నాయభిమతంబు దీర్పుము. నేను సత్యము చెప్పుచున్నాను. ఇందు నీకెట్టిదోషంబును లేదు. నిక్కముగ నేను స్వతంత్రనే యని యెఱుంగుము. ఈవిషయంబున నేమైన దోషంబు గలదేని నిశ్చయముగ నది నాదే యగుఁగాక! ఇట్లు వేడుకొనుచున్న యబలనగు నన్ను విగ్రహించి పర విడిచినచో శివధర్మగర్హితుండవు గాఁగలవు." అని వేఁడుకొనుటయు నష్టావక్రుండు "కాంతామణీ! విధినతిక్రమించి యథేచ్ఛాచారియగు పురుషునకు సకలదోషంబులును సంఘటిల్లక మానవు. నీవెన్ని చెప్పినను నేను పరదారరతుండను గాఁజాలను. నా మాట విని నీవు నీ శయ్యం జేరి సుఖంబుగ నిద్రింపుము" అనియెను. అక్కామినియును దనపట్టు విడువక "ఓ విప్రకులచూడామణీ! నీ పదకమలంబులకుఁ బ్రణామంబులు గావించెదను. నా యెడఁ బ్రసన్నుండవగుము. నాచిత్తము నీయందే యనురక్తంబై యున్నది. సర్వస్వతంత్రనగు నన్నుఁ బరిగ్రహించి నాయభీష్టసిద్ధిం బ్రసాదింపుము" అని ప్రార్థించెను. కాని ధీరుఁడగు నష్టావక్రుఁడు [illegible] కాంతా! నీవు స్వ[illegible] తెయుం

దుట కెందు నెట్టియవకాశమును లేదే! నీకుమాత్రి మట్టిస్వాతంత్ర్య
ము లభించుటకుఁ గారణమేమి?" అనుటయు నామె నేను చిన్నతన
మునుండియు బ్రహ్మచారిణినే యనియు, నందుచేఁ గన్యకనే యగుదు
ననియు నీవిషయంబున నవిశ్వాసంబుఁ జూపవలదనియు విన్నవించెను.
మునివరుం డామాట లాలించి "ఓమానినీ! మనమిరువురమును బ్రహ్మ
చర్యవ్రతనిరతులమే కావునఁ దద్విరుద్ధంబగుకార్యంబు గావించుట
మనయుభయులకు నుచితంబు గాదు. నీవిప్పుడుగూడ నీబ్రహ్మచర్య
వ్రతమును గాపాడుకొనుము" అని ప్రత్యుత్తరం బిచ్చి తనలో
"ఆహా! దివ్యాభరణభూషిత యగునిక్కన్య నాసన్నిధిని నిలిచి నన్నభి
లషించుచున్నది. కాని యీమె దివ్యస్వరూప మొక్కొక్కప్పుడు
జరాదూషితంబై కానవచ్చుచుండుటకుఁ గారణ మేమై యుండును?
ఇప్పు డీమె పరమరూపవతియగు కన్యకయై యున్నది. ముందేమగు
నో? ఎట్లయినను నానియమమును స్వశక్తిచే నిలుపుకొనవలయును.
ఈపరీక్షయం దుత్తీర్ణుఁడనైనచో సర్వశ్రేయములును నాకు లభింపఁ
గలవు" అని భావించుకొని "ఓసుందరీమణీ! నిన్నొక్కమాట యడు
గుచున్నాను. బ్రాహ్మణకామ్యానుసారంబుగ సత్యమును వచింపుము.
అసత్యము చెప్పఁగూడదు. అప్పుడప్పుడు నీవు నీరూపమును వికార
ముగాఁ జేసికొనుటకుఁ గారణ మేమి?" అని ప్రశ్నించుటయు నాసతీ
తిలకమిట్లు చెప్పందొడంగెను.

ఓసత్యప్రతిజ్ఞా! బ్రాహ్మణోత్తమా! కామమనునది భూమ్యా
కాశంబులను వ్యాపించియున్నదని తెలిసికొనుము. నేనుత్తరదిక్కాం
తను. స్త్రీచాపల్యంబునుగూర్చి సర్వంబును నీసన్నిధిని బ్రదర్శించి
తిని. ఏమైననేమి! సకలలోకంబులను జయింపఁగలయసాధారణ సామ
ర్థ్యము నీయందున్నది. ఓయనఘా! ఎంతటివృద్ధురాండ్రైనను గామ

జ్వరపీడితులు గాకమానరని నీకుఁ దెలియఁజేయుటకే నారూపమును మార్చుకొని యిన్నిమాయలం గావించితిని. విజితేంద్రియుండవగుని యెడల బ్రహ్మేంద్రాదిదేవతలందఱును బరితుష్టులైయున్నారు. ఓము నిశేఖరా! వదాన్యుండు నీకుఁ గన్యాదానంబు సేయందలంచి యిట్టియుపదేశంబుగావించుటకే నిన్నిచ్చటికిఁ బంపియున్నాఁడు. ఆతని యుత్తరమును సర్వసంపన్నంబుఁ గావించి నేను కృతకృత్యనైతిని. నీవిఁక సురక్షితుండవై యాశ్రమంబుగ గృహంబునకుఁ బోవచ్చును. పరమపతివ్రతయు, రూపవతియు నగుకన్యకామణి నీకు లభింపఁ గలదు. ఈశ్వరానుగ్రహంబున నామె సుపుత్రవతియు నగును. బ్రాహ్మణధర్మానుసారంబుగ సత్యంబు నివేదించితిని. బ్రాహ్మణ కామ్యము సకలలోకంబులను నతిక్రమించునుగదా. నీవిఁక వెళ్ళ యవచ్చును. సర్వోత్తమమహాపంబున నీవు నీకార్యమును సాధించితివి. సర్వవృత్తాంతంబును నావలన నాలకించితివిగదా! ఇంకను బ్రశ్నింప వలసినదేమైన నున్నచో నడుగుము. మహర్షియగువదాన్యునియొక్క గృహముకూడ నీమూలంబున నాకు లభించినది. ఆతనిప్రియంబుకొ ఱకే నిట్లు నీయెడలం బ్రవర్తించితిని. అని చెప్పెను. అష్టావక్రుం డంతయు నాలించి కృతాంజలిపుటుండై సెలవుగోరి యాదేవియనుజ్ఞం గాంచి పయనంబై కతిపయదినంబులకు స్వాశ్రమంబుఁ జేరి స్వజనంబు లచే నాదృతుండై కొన్నిదినంబులు విశ్రమించి యనంతర మొక నాఁడు పరమానందముతో ధర్మానుసారంబుగ మహర్షియగు వదా న్యునిచెంతకుం బోయి దర్శించుటయు, నాతఁడు పరమాదరంబున సన్మానించి "కుమారా! నాచెప్పినవిధంబున సకలస్థలంబులను సంద ర్శించితివిగద!" అని ప్రశ్నించెను. అష్టావక్రుండును సుప్రీతాంత రంగుండై "మునీంద్రా! నేను నిరాయుష్మం గాంచి ప్రథమంబున

గంధమాదనంబునకుం బోయి యానిర్ఘరంబునం గలమహావనంబును దర్శించితివి [illegible] పాపంబులం బ్రహ్మాండంబు జరగినది ఆ మహాచరిత్రము చెప్పలేను. కాక మీ యుద్దేశము [illegible]" అని సంక్షేపంబుగ సర్వంబును నివేదించితిని [illegible] సుఖముహూర్తంబునం దినములయందు [illegible] యథాశక్తిగ [illegible] గావించెను. అప్పా వక్రముం [illegible] యగు నవ్వధూమణిం బరిగ్రహించి సుఖం బుండెను. నిరంతరకామాసక్తలగు కామినీమణులందెవ్వరో యొకరిద్ద ఱుమాత్రమే పతివ్రతలుందురు. ఎవ్వరినామస్మరణ మాత్రముచేత సకలకలికలుషంబులును నశించునో యట్టిస్త్రీగాని, పురుషుడుగాని లోకంబున నతిదుర్లభులై యుందురు.

— అరుంధతీప్రస్తావము —

పూర్వమొకప్పు డింద్రుండును సూర్యుడును, వైశ్వానరుండును గలసి యాలోచించుకొనిరి. సతులకుం బతులును, విప్రులకు సూర్యాగ్నులును, గృహస్థుల కతిథులును, క్షత్రియులకు ద్విజులును దేవతలై యుండురు. పతులు సతులచేతను, సూర్యాగ్నులు విప్రులచేతను, అతిథులు గృహస్థులచేతను, బ్రాహ్మణులు క్షత్రియులచేతను సంతృప్తులైనచో బ్రహ్మేంద్రాదిసకలదేవతలును వారిచే సంతృప్తు లగుదురు. సతులకుం బతులవలన నిహలోకంబున సకలాభీష్టంబులును, పరంబున సద్గతులును లభించును. కావునం గాంతలయందిట్టిసత్యము గలదేమో మనము పరీక్షింపవలయును. మిథ్య, సాహసము, మాయ, మూర్ఖత, లోభము, అపవిత్రత, నిర్దయ యనునీచగుణంబులును వారికి సహజంబులు. వారిలోం గొందఱు సత్యధర్మపరాయణ లున్నా

రనికూడ వినుచున్నాము. ఆనాఁడు బ్రాహ్మణులలో గృహధర్మనిరతు లును, క్షత్రియులలో స్వధర్మపాలకులును గాంచఁబడిరి. వసిష్ఠ పత్నియగు నరుంధతి పతివ్రతాశిరోమణి. స్వాహాదేవి సప్తర్షిపత్నులరూపములు దాల్చి యగ్నిని వలచినప్పుడు పతివ్రతయగు నరుంధతీరూపము మాత్రము గాంచఁజాలక పాతివ్రత్యసంభవ యగు నామెను సందర్శించి "ఓ కల్యాణీ! ఈజగంబున నీవొక్కతెవె పతివ్రతవు. నేనుగూడ నీవలె సౌభాగ్యవతిని గాఁజాలనన్న దితరకాంతలెట్లు? యేము ... బంధువులగు ... బతికెరన్న ... నిత్య సౌభాగ్యంబును గాంచఁగోరుదును.' అని స్తోత్రంబు గావించెను.

ఇట్లు దేవతలచేతనే పతివ్రతయగా గీర్తింపఁబడు కాంతలే ప్రశంసనీయలు. గుణవతులే గుణములను గ్రహింపఁగలవారు గదా! కావున మనమిప్పుడు స్త్రీలపాతివ్రత్యమును గూర్చి తెలిసికొనుటకు సతీరత్నమగు నరుంధతీదేవినిఁ గోరవలయును. అని సూర్యేంద్రా గ్నులు నిశ్చయించుకొని బయలుదేఱి వచ్చుచు మార్గమధ్యంబున నే కలశకక్షయై జలాహరణార్థమై పోవుచున్న పతివ్రతయగు నరుంధతీ దేవిం గాంచి ప్రహృష్టహృదయులై యామెసమ్ముఖంబున సాష్టాంగనమస్కా రించిరి. పతిదేవత యగునరుంధతి యాదేవత్రయమును గాంచి భక్తి పూర్వకంబుగఁ బ్రదక్షిణనమస్కారంబు లాచరించి "ఓ దేవతలారా! మీరిచ్చట విచ్చేయుటకుఁ గతమేమో యానతీయవలయును" అని ప్రార్థించెను. అప్పుడమ్మువ్వురు దేవతలును "దేవీ! ... యంబు నడిగి తెలిసికొనవలయు ననిమేము వచ్చితిమి. మాప్రశ్నంబునకుఁ బ్రత్యుత్తరం బిచ్చి మమ్ముఁ గృతార్థులఁ గావింపుము." అని యడిగిన యరుంధతి యమ్మహాత్ములం ...

జలంబు గొనితెచ్చునంతవఱకును మీరు మన్ననాంబుగ నిరీక్షించి యుండుడు. నేను వచ్చి మీప్రశ్నకు నాశక్తికొలఁది నుత్తరంబిచ్చెద ననియెను. అంతనా కేసత్రియమోసతీమణీ! నీవంతశ్రమపడ నక్కఱ లేదు. నీకలశమును మేమింతలో జలపూర్ణంబు గావింతుము. మేము శీఘ్రముగఁ బోవలయును గావున నిప్పుడే మాసంశయములను దీర్ప వలయునని కోరెదము. అని కోరుటయు నాసతీతిలకంబు సమ్మతించి నాజల కలశంబును జలపూర్ణముగాఁ జేయుఁడని కోరెను. అప్పుడింద్రుండు "తపోబ్రహ్మచర్యబలంబుచే సజ్జనసు స్వర్గప్రాప్తుం గావింపఁగలదని నేను సర్వదా నాన్యాయ్యబలయెడల యథార్థతత్పరుండనై యుంటి సత్యంబేని నిమిషమాత్రంబున నీఘటంబు పాదమాత్రజలపూర్ణం బగుఁగాక" అనియెను. అనంతర మగ్నిదేవుండు "నేను హవ్యకవ్యం బులనొసఁగి, బ్రాహ్మణసంతర్పణంబులచేతను లోకమ్ములఁ బ్రోచుచునగుట సత్యంబైనచో నీకుంభంబున ద్వితీయపాదభాగ ముదకపూర్ణం బగుఁ గాక" అనియెను. పిమ్మట సూర్యదేవుండు "నేను బ్రాహ్మణులచే పూజితుఁడనై యొసంగు నర్ఘ్యజలంబుల ప్రభావంబుచేతనే మందేహాది రాక్షసభయంబు వాసి సుఖంబుగ దినదినాభ్యుదయంబు గాంచుచుం డుట నిజంబైనచో నీకుంభంబునందలి తృతీయపాదభాగము నీరం బులచే నిండుఁగాక" అనియెను. తరువాత నరుంధతీదేవి నిజస్థానం బు లభింపనంతవఱకును, విశేషించి పరపురుష సాహచర్యసంభాష ణంబులు సిద్ధింపనంతవఱకునుమాత్రమే సతులపతివ్రతారక్షణంబగుట కవ కాశంబు గలుగుటయు, కాంతలకు నిరంతరబంధుసంరక్షణమే యుచితధర్మం బగుటయు సత్యంబైనచో నీపాత్రంబు జలప్రపూర్ణం బగుఁగాక" అనియెను. ఇట్లా నలుగురును సత్యంబులు గావించినంతనే యాజలభాజనంబు సంపూర్ణంబుగ జలపూరితంబయ్యెను.

అది యంతయుం గాంచి సూర్యనారాయణుఁ డుత్సాహయుక్తుఁడై యు పుద్దేశించి "సతీమణీ! మదీయానుమతి లేనిదే యీ కేళీస్థానమునకేతెంచితిమి. శ్రీఘ్రముగా నీవే యీ సందేహమును నివారించితివి. నెలవారంగనలో నీకు సాటి యెవరు లేరని" యను టయు నరుంధతీదేవి "ఓ సూర్యదేవా! ఈ జగము నందు నవనీతమవహ్య మా నవమాదిభేదంబులఁ బ్రకాశించు యోగులు మున్నగువారు స్పృశింపఁ బడిన వారే. ఈ విషయము నెల్లరు నెఱుంగుదురు" అని చెప్పెను. అంతట లాలించి సప్తఋషులు యథాస్థానములు నిజావాసంబులకుం బోయిరి.

కాలజ్ఞానము

మహేశ్వరుండు పార్వతికిట్లు చెప్పఁదొడఁగెను. దేవీ! కాల చిహ్నంబులం జూచి సన్నిహితమగు నాశకాలము దినము, పక్షము మాసము, ఋతువు, అయనము, సంవత్సరము మొదలగు కాలభేదంబుల ననుసరించి దేహంబునందు గాన్పించు లక్షణంబులం బట్టి మృత్యు చిహ్నంబుల గ్రహింపవచ్చును. ఆకస్మికంబుగ దేహంబునఁ బాండువర్ణంబు గాన్పించినను, శరీరోర్ధ్వభాగము రక్తవర్ణంబై తోఁచినను, ముఖకర్ణనయనజిహ్వలకును, దంతపంక్తులకును జడత్వంబు తటస్థించినను షణ్మాసంబులకు మరణంబు గలుగును. అకారణంబుగ సూర్యచంద్రాదుల తేజంబులఁ జూడలేనివారును, అనావృతస్థానంబుల నంధకారము గాంచువారును షణ్మాసంబులకు మృతులగుదురు. సప్తర్షిమండలము నిత్యకంపితం బగుచున్నను, ఇతరాంగంబులు శూన్యంబు లగుచున్నను, తాలువు లెల్లప్పుడుచు శుష్కంబు లగుచున్నను మాసంబునకే

యాయుశ్శేషం బగును. వారిపి స్తకఫంబులు విస్తృతంబులైనను, నాసికా రంధ్రంబు [illegible] ముసు [illegible] గుచున్నను పక్షం బుననే మరణించును. ముఖకంఠంబులు విశుష్కములై యున్నను జిహ్వా స్థూలంబైనను, దంతంబు లార్ద్రంబులైనను ఆఱుమాసంబుల లోనే వినాశంబు గలుగును. [illegible] జలతైలఘృతదర్పణాదులయందుఁ బ్రతిబింబంబును గన జాలనివారును [illegible] జూచువారును షణ్మాసమధ్యంబున [illegible] బై తోఁచినను, [illegible] ముకంబు నధకంబుగ [illegible] బులు. సూర్యచంద్రమండలంబులు [illegible] రహితంబులై తోఁచినను, కేవలగోళాకారంబులై యగపడినను, [illegible] విగతజీవులగు దురు. అరుంధతిం గనఁజాలనివారును, అంతరాళంబున రథవాహనాది రూపములం గాంచువారును, చంద్రమండలమును గళంకశూన్యంబుగఁ జూచువారును, అక్షిదోషంబు లేక నక్షత్రంబుల వీక్షింపఁజాలని వారును షణ్మాసమధ్యంబున మరణింతురు. నిర్మేఘంబగునంతరాళం బున మెఱపులుదోఁచినను, పరిచితగృహంబునందు దిగ్భ్రాంతి గలిగి నను, మాసషట్కంబునకుఁ గాలగతుం డగును. రాత్రులయందింద్ర ధనువును, మధ్యాహ్నంబున నుల్కాపాతంబును గాంచువారును, కాక గృధ్రాదు [illegible] దిరుగువారును, సప్తర్షిమండలంబును, స్వాతీప థంబును గానబడనివారును, [illegible] సూర్యచంద్రగ్రహ ణంబులఁ గాంచువారును ఆఱుమాసంబులలో మరణింతురు. మక్షికాదులు ముసురుకొనుచుండు దేహముగలవారు మాసమధ్యంబున మరణిం తురు. కాకగృధ్రసారసాదులు లకారణంబుగఁ దలపైవ్రాలుట శీఘ్ర మృత్యుసూచకము. ఈమరణచిహ్నంబులు బాహ్యంబులు:—వామదక్షి

ఓంకారంబులు క్రమంబుగ జాగ్రత్సూత్రాత్మకంబులగుటచే శుక్లకృష్ణప క్షంబులుగాఁ బరిగణితంబులగుచుండును, దాని రెండు చేతులను రెండు పక్షంబులగు నట్టి. మానవుండు సుస్నాతుఁడు జితేంద్రి యుండునై యిష్టదేవతాస్మరణబు చేయుచు కరద్వయంబును జల చేఁ గడిగి లక్షణ పిమ్మట గంధపుష్పయుతంబుగఁ జేసి యందలి శుభాశుభలక్షణంబులు దెలియఁగవలయును. ఎడమహస్తంబునఁ గనిష్ఠాం గుళిమొదలు వృద్ధాంగుళిపర్యంతమునుగల నైదు వ్రేళ్ళను బహువ నేనుపర్వంబులను పంక్తిపక్షంబుగఁ బ్రతిపదాదిగఁ బంచదశదినంబులని యు అట్లే దక్షిణహస్తంబునఁ గృష్ణపక్షదివసంబులనియును భావించుచుఁ బూర్వముఖంబుగాను యుత్తరముఖముగాను సుఖాసీనుఁడై కర ద్వయంబును సంపుటంబుగఁ జేసి నవాక్షరయుతంబగు దుర్గామంత్రమును అష్టోత్తరశతవారంబులు జపించి యనంతరము హస్తద్వయమునందలి ప్రతిపర్వమును బాగుగఁ బరీక్షింపవలయును. అందే పర్వంబునందు భృంగాకృతిని నల్లనిమచ్చ యగపడునో యాపక్షంబునందా తిథి యందు మరణము తటస్థించునని నిశ్చయింపవలయును.

ఓ దేవీ! ఇంక స్వరచిహ్నంబులం జెప్పెదను. మానవులు వీనిని గ్రహించియే గమనాగమనంబులు భావించుచుండవలయును. వాయుగతితత్త్వముం బట్టియే యాత్మజ్ఞానముం గాంచవలయును. క్షణము, త్రుటి, లవము, నిమేషము, కాష్ఠ, కళ, ముహూర్తము, అహోరాత్రము, పక్షము. మాసము, ఋతువు, అయనము, వత్సరము, యుగము. కల్పము, మహాకల్పము మున్నగు కాలవిశేషముల ననుసరించి యథాక్రమంబుగఁ బరమకారణుం డగు మహాకాలుండు సర్వంబును సంహరించుచుండును. నాసికకు వామదక్షిణమధ్యభాగం బులు త్రిపథంబులు. అయిదుదినంబులవఱకు నొక్కవామనాడియం

డినమే ప్రాణవాయువు ప్రసంచరించుచున్నచో మూఁడువత్సరంబులును, పది దినంబులవఱకు ప్రసంచరించిన రెండువత్సరంబులును, అట్లు పదును దినంబులవఱకైన నొకవత్సరంబును, ఇరువదిదినంబులవఱకైన నాఱు మాసంబులును, ఇరువదియైదుదినంబులవఱకైన మూఁడుమాసంబులును, ఇరువదియాఱుదినంబులవఱకైన రెండునెలలును, ఇరువదియేడు దినంబులవఱకైన నొకమాసంబుమాత్రము జీవింతురని గ్రహింపవలయును.

—♦ కాలజ్ఞానము ♦—

శంకరుం డిట్లనియెను. ఓ దేవీ! పృథివ్యాపస్తేజోవాయ్వాకాశంబుల సమాయోగంబువలనను పాంచభౌతికం బగుశరీరం బగుచున్నది. పంచభూతంబులలోను నాకాశము సర్వవ్యాప్తమై యుండు. సమస్తపదార్థములు నాకాశమునందే లీనములు నుత్పన్నంబులు నగుచు గుణాతీతంబై నిర్గుణకారణరూపస్థితంబై యుండును. కావునఁ బాంచభౌతికం బగు దేహమునకు వినాశంబు నిశ్చయమైనది. తపోధనులగు జ్ఞానులకుంగూడ శరీరవినాశనంబు దప్పదు. అని బోధించుటయుఁ బార్వతి నాథా! ధియంకరమూర్తి యగు కాలుండు నీచే ద్రష్టింపఁబడి నిస్స్వభావుఁడవైన నీవనేకవిధంబులఁ బోధించుటయు నీవాతనిమేలఁ బ్రసన్నుఁడవై యదృశ్యరూపంబుతో నిజాంగంబున నాథాకారముగ విహరించుచుంటి వట్లు నీవనుగ్రహించిన విషయము నేనెఱుంగుదును. ఈమూలమున మరల నాతఁడు జేయవలసిన క్రమున్నైన విజయ మిమునుండెను. అట్టి యదృశ్యమూర్తికిని వినాశంబున నేమున్నది? అనిన శివుండిట్లనియె మహాదేవుండు దేవి! ధ్యానపరాయణులగు యోగులు మాత్రమే కాలమును నశింపఁజేయఁగలరు. పాప

శూన్యులగు యోగులు తెల్పు కాలమును నిర్ణయింపఁగలుగుదురో స్పష్టముగఁ జెప్పెదను వినుము. ఈ పంచభూతమయంబు లగు శరీరములు భ్రాంతగుణ సంకలితంబులై యుండును. పృథివ్యంశ వాయ్వాకాశాదులచే మిశ్రితంబగు టచే శరీర ముత్పన్నంబగును. ఆకాశమునుండి వాయువును, దాని నుండి తేజంబును, దానినుండి జలంబును, దానినుండి పృథివియు జనించెను. ఆకాశము మొదలుగఁ బంచభూతంబులు నుత్తరోత్తరాధికగుణ కలితంబులై యుండును. అందు ఆకాశమున కొకగుణంబును, వాయువునకు రెండుగుణంబులును, తేజమునకు మూడుగుణంబులును, జలమునకు నాల్గుగుణంబులును, పృథ్వికి నైదుగుణంబులు గలవు. శబ్దస్పర్శరూపరసగంధంబులు గుణవాచకంబులు. పంచభూతంబులును గుణక్షయంబులైనప్పుడు దేహనాశంబును, గుణవృద్ధులైనప్పుడు దేహాభివృద్ధియు నగుచుండును. అందువలన యోగులు ధ్యానబలంబుచే దేహాశ్రితంబులగు భూతగుణంబులను స్థిరంబులుగఁ జేసి కాలంబును జయించుచుందురు. యోగులు తెల్పు కాలంబును నిర్ణయించెదరో చెప్పెదను వినుము. ఈదివ్యజ్ఞానము పరమగుహ్యమైనది. దీని ననధికారుల కుపదేశింపఁగూడదు. శ్రద్ధాభక్తిసమన్వితులును, సుబుద్ధులును, ఆస్తికులును, పవిత్రులును, ధార్మికులు నగువారికే యీజ్ఞానలాభంబున కర్హులు.

ఉత్తమాసనంబునఁ గాని, శయ్యయందుఁ గాని యుపవిష్టులై యోగాభ్యాసంబు చేయవలయును. ప్రదీపసాన్నిధ్యంబునఁ, అంధకారావృతంబు నగు మందిరంబున నుండి యుదయము సిద్ధించు సమయంబున ముహూర్తకాలము తర్జన్యంగుళులచేఁ గర్ణరంధ్రములను మూసి ప్రాణాయామాభ్యాసంబు గావింపవలయును. ఇట్లు చేసినచో నుదరంబునందలి వహ్నియం దుదయించుశబ్దము కర్ణములకు వినవచ్చును.

అయ్యానలంబునచే భుజించినయన్నము క్షణమాత్రంబునఁ బచితం బగును. రెండుగడియలకాలము ప్రాణాయామము చేసి యాశ్వంబు నుపాసించువానికి వ్యాధిసకలరోగంబులు నుపద్రవంబులును శాంతిం బొందగలవు. ప్రాణాయామపరు లగుదురు. మఱియు దీనివలన దివ్యగమనంబును, సర్వజ్ఞత్వంబును, సకలసిద్ధులను లభింపఁ గలవు. వర్షాకాలమేఘమువలె ధ్వనించుచున్న యాశబ్దము నుపాసించువారు సంసారబంధ విముక్తు లగుదురు. క్రమముగా నట్టిశబ్దము సూక్ష్మాతిసూక్ష్మం బగుచుండును. ఇది శబ్దబ్రహ్మధ్యాన విధానము. ముక్తికారణంబును, సుఖదంబును, అవ్యయంబును, సకలోపాధిరహితంబును. బరమంబు నగు నీపరమతత్త్వముంగూర్చి నాస్తికులకు బోధింపఁజనదు. కాలమృత్యుపాశంబులచే బద్ధు లగుచున్నవారు నీతత్త్వంబు నెఱుంగంజాలరు. బ్రహ్మజ్ఞానంబు లభింపనంతవఱకును సంసారపరిభ్రమణంబు తప్పదు. కావున నిద్రాలస్యశూన్యులై విఘ్నజనకంబు లగునింద్రియంబులను జయించి రాత్రికాలంబున నుక్తమాసనంబునం దుండి నిత్యము శ్రవణానందకర బ్రహ్మతత్త్వము నుపాసింపవలయును. దీనివలన మృత్యుజయము, కాయసిద్ధి, ఆరోగ్యము, ఆయుర్వృద్ధి మొదలగునవి సిద్ధింపఁగలవు. బ్రహ్మాదులీయుపాసనంబునకు తృప్తులును, దక్షులునుగూడ నగుదురు యగుదురు. దీనికి మంత్రబీజంబులతో నిమిత్తము లేదు. శబ్దబ్రహ్మము నగుచున్నయాశబ్దము కేవలకుంభకాభ్యాసము వలననే సర్వసిద్ధిప్రదంబగు నాయోంకారరూపముగా నుచ్చరింపఁగలఁడు. అట్టిశబ్దము నవవిధంబులుగాఁ బండితులచే నిర్ణీతంబయ్యెను. జనకోలాహలము, సముద్రఘోషము, భ్రమరగుంజనము, ఘంటానాదము, వీణానాదము, వేణువాదనము, దుందుభిస్వనము, శంఖారావము, మేఘగర్జనము ననునివి నవవిధశబ్దములు. అవ్యక్తంబులగు నీశబ్దంబులను

బరిత్యజించి కేవలము నోంకారమునమాత్రమే యవలంబించి యోగు లు సర్వదా యోగాభ్యాసంబు చేయుచు పాపపుణ్యఫలభోగులు గాక యుందురు. బాహ్యశబ్దంబు లెవ్వానికిని గోచరింపనివారి కాఱుమా సంబులలో మరణంబు గలుగును. అభ్యాసయుక్తులైన యోగులు నిరం తరబ్రహ్మాభ్యాసనంబు గావించి మృత్యువును జయించుటకు సమర్థ లగుచుందురు. నిరంతరశబ్దబ్రహ్మాత్మధ్యానమున బాగ వినబడుచున్న చోఁ గ్రమంబుగ మృత్యుజయకారణంబును, అవ్యక్తస్వరంబు నగు జనకోలాహలధ్వనియు, రోగనాశకరంబై పాపనాశకప్రక్షాళనముం గా వించు కాంస్యధ్వనియు, భూతగ్రహవిషభయవినాశకంబగు భ్రమర ఝుంకారమును గోచరించును. ఈనాదమధురస్వరంబు లెవ్వానికిఁ బ్రయోగ్యం బగును. చతుర్థంబగు ఘంటానాదము శత్రుమారణో చ్చాటనంబుల కుపయోగించును. దీనివలన దేవతాకర్షణాసక్తు లగుదురన్న మానవులమాట లెక్కయేమున్నది. యక్షగంధర్వనాగులు గూడఁ బ్రసన్నులై యభిమతార్థంబుల నొసఁగుదురు. పంచమంబగు వీణానాదంబువలన యోగులకు సర్వాభీష్టసిద్ధి గలుగును. వేణురవంబు వలన దూరదృష్టియు, సర్వజ్ఞత్వంబును గలుగును. దుందుభిధ్వానం బున జరామరణభయవినాశం బగును. శంఖారావంబునఁ గామరూ పంబు లభించును. మేఘగర్జనంబునఁ బాదుకాసిద్ధియు, సర్వవస్తుసంద ర్శనశక్తియు, సర్వలోకగమనంబును సిద్ధించును.

ఓ భవానీ! ప్రాణాయామపరాయణులగు యోగులు పక్షమ ధ్యంబునం గలిగెడు మృత్యువును గూడ జయించుటకు శక్తులగుదు రు. హృదయస్థంబగు వాయువు సర్వదా వహ్నిని దీపింపఁజేయుచుం డును. ఆవాయువు బాహ్యాభ్యంతరంబులం దెల్లెడల వ్యాపించి యుం డును. జ్ఞానవిజ్ఞానోత్సాహాదులు సర్వంబును వాయుప్రవృత్తులు. వాయు

జయంబు గాంచినవానికి సకలజగంబులును వశీభూతంబు లగును. జరామరణంబుల నిర్జింపఁదలఁచినచో వాయుధారణంబునకుఁ బ్రయత్నింపవలయును. లోహకారకుంభము గొట్టముచుండి నోటితో గాలినూఁదుచుఁ జేతులతోఁ దనపనులం గావించుకొనునట్లు యోగి సమస్తశరీరమును వాయుపూర్ణంబు గావించి యోగాభ్యాసంబు గావింపవలయును. సహస్రశీర్షంబును, సహస్రనయనుండును, సహస్రకరచరణుండును నగునారాయణుం డెట్లు జగంబులను వ్యాపించి దశాంగుళంబు లతిక్రమించి యుండును. వ్యాహృతిపూర్వకంబగుగాయత్రిని శిరోమంత్రసహితంబుగ నాయతప్రాణుండై త్రివారంబులు జపించినఁ బ్రాణాయామం బగును. సూర్యచంద్రాదిగ్రహంబుల కుదయాస్తమయంబులు గలవుగాని ప్రాణాయామపరులకుఁ బరమగతిలాభం బయిన నిఁకఁ బునరావృత్తి లేదు. బహువత్సరంబులు కుశాగ్రజలపానమాత్రంబున జీవించుచుఁ దపంబు చేసినమహాఫలము ప్రాణాయామతత్పరులకు లభింపఁగలదు. ప్రతిదినంబును ప్రాతఃకాలంబునఁ బ్రాణాయామం బాచరించువారు సర్వపాపవిముక్తు లగుదురు. శ్రద్ధాన్వితుండై నిర్జనస్థానంబున నిత్యంబును బ్రాణాయామసాధకుం డగువాఁడు జరామరణవివర్జితుం డగును. సర్వసిద్ధులు నాతనికి లభించును. ఆసిద్ధునకుఁ దేజోమయంబగుసుందరదేహంబును, బుద్ధియు, బలపరాక్రమంబులును వాయుగమనంబును, సుఖంబును, సర్వజ్ఞత్వంబును లభించును.

అంధకారమయంబును, నిశ్శబ్దంబు నగు నిర్జనప్రదేశంబున స్వస్తికాసనంబున వసించి యోగులు యోగాభ్యాసంబు చేయుచు శిఖాభావసంతుకంబగు దివ్యతేజము భ్రూమధ్యంబున దర్శింతురు. అట్లు ధ్యానమూలంబునఁ దేజోదర్శనంబు చేసి యేకాగ్రచిత్తంబున ముహూర్తమాత్రమోంకారమ్ముఁ గాంచుచుఁ దేజోమయుం బగుపర

బ్రహ్మస్వరూపమును ధ్యానింపవలయును. ఆధ్యానవశంబున శ్వేత రక్తపీతనీలవర్ణంబులును, ఇంద్రధనుస్సుంబోలి చిత్రవర్ణంబులును గల జగదీశ్వరుని పరమజ్యోతిని దర్శింపవలయును. భ్రూమధ్యంబున లలాట స్థానంబునఁ బ్రాతఃకాలప్రభాకరునిఁ బోలిన తేజంబును దర్శింపఁగల యోగసిద్ధులకు స్త్రీవశ్యంబును, సర్వక్రియాపాటవంబును, పరకాయ ప్రవేశశక్తియు, నణిమాదిసిద్ధులు, సర్వజ్ఞత్వంబును, దూరదృష్టి దూరశ్రవణంబులును, అదృశ్యత్వంబును, కామరూపంబును, ఆకాశ గమనంబును లభించును. యోగాధ్యయనశీలురును, వివిధశాస్త్రజ్ఞులగు పండితులును, జ్ఞానులును గూడఁ దమతమకర్మానుసారంబుగ ఫలభోగం బులం గాంచుచుందురు. కావున నెల్లవారును యోగసిద్ధులు కాఁజా లరు. పాపచిత్తులగుమానవులు పాపఫలప్రదంబగునరకంబు గలదని యెఱింగియుండియు, నజ్ఞానులై, శాస్త్రబోధంబు వినుచుండియు బధిరులై మఱిమఱి పాపంబులనే గావించుచుందురు.

ఇఁక నాగ్నేయగుహ్యోపాసనంబువలన యోగులెల్ల మృత్యుం జయు లగుదురో చెప్పెదను. యోగులు సిద్ధసింహాసనాసీనులై జితేంద్రియులును, అంజలిబద్ధులునై చంచురూపంబు గూర్చి స్వవక్త్రము నుండి మెల్లమెల్లగ వాయువుఁ బీల్చుచుండవలయును. అందువలన జీవన ప్రదంబగుజలము తాలుద్వయమునుండి స్రవించును. అమృతమయం బును శీతలంబు నగునయ్యుదకంబు నాఘ్రాణించుచు వాయుమూలం బున దానిం గ్రహించి ప్రతిదినంబును పానము చేయువారు మృత్యు భయవిరహితులగుదురు. ఆజలపానంబువలన క్షుత్పిపాసారాహిత్యం బును, దివ్యసుందరశరీరంబును, తేజంబును, నాగబలంబును, అశ్వవేగంబును, పక్షిదృష్టియు, దూరశ్రవణంబు, ధర్మాదివ్యాధ కసద్మశరూపంబును గ గుయ ఈ సర్వపమునందైన దేవగుహ్యా

బగుపరమార్థముం దెల్పెద నాకర్ణింపుము. యోగులు తాలుమధ్యంబున జిహ్వను నిల్పి యోగాభ్యాసంబు గావించుచుండఁ గ్రమంబుగఁ గొంతకాలంబునకు లంబికాయోగసిద్ధి యగును. అట్టిజిహ్వచేఁ దాలుస్పర్శంబు గావించినంతనే యందుండి శీతలామృతరసంబు వెలువడును. యోగులు నిరంతర మట్టిసుధారసమును పానంబు చేయుచు నమరత్వంబు గాంచఁగలరు. లంబికాగ్రంబును సూక్ష్మంబుగఁ జేసి మూలాధారపద్మంబును దృఢంబుగఁ జేయుటయు, శిరస్థితం బగుశుక్లపద్మముగుండి బిందురూపంబున వెలువడు రసం బమృతరూపంబునఁ బరిణమించి సర్వోత్కృష్టంబును, సర్వదేవతానందకరంబును, సర్వవస్తుసారంబును, సంసారసాగరోత్తారకంబును, పాపభయనివారకంబు నగును. అయ్యమృతరసంబుచే ప్లావితదేహులగు యోగులు క్షుత్పిపాసావివర్జితులును, దీర్ఘజీవులు నగుదురు.

—♦ ఛాయాపురుషపరిజ్ఞానము ♦—

ఓదేవీ ! మానవులకు సకలపాపవిముక్తికారణ మగుఛాయాపురుషజ్ఞానముం దెల్పెద నాకర్ణింపుము. శుక్లమాల్యాంబరధారియై యుపవేశనస్థానమును జందనధూపాదులచే సువాసితంబుగఁ జేసి సూర్యచంద్రులకు వెనుకనుండి సర్వాభీష్టప్రదం బగుపంచాక్షరమంత్రమును భక్తిశ్రద్ధలతో జపించుచుఁ బంచభూతంబులును, అంతఃకరణచతుష్టయము ననుపదార్థంబులతోఁ బంధయుతంబై యున్న తనదేహము వలనం దోఁచుఛాయను దర్శించి దాని నాకసంబున శ్వేతవర్ణంబుగఁ గాంచుచుఁ బరమకారణం బగుశివమంత్రమును జపించువాఁడు బ్రహ్మహత్యాదిసకలపాపవిముక్తుం డగును. ఆ ఛాయ సకలాంగపూర్ణంబై తోఁచినచో నెట్టిభయంబును లేదు. అది మస్తకశూన్యంబైనచో

షణ్మాసంబులకు మరణం బగును. మఱియు నది శుక్లవర్ణంబైన ధర్మలాభంబును, కృష్ణంబైనఁ బాపసంచయంబును, రక్తంబైన బంధనభయంబును, పీతంబైన శత్రుమిత్త్వంబును గలుగునని యెఱుంగవలయును. ఆఛాయ బాహుశూన్యంబైనచో బంధునాశంబును, ముఖశూన్యంబైనచో భోజనద్రవ్యాభావంబును, కటిశూన్యంబైనచో దారవినాశంబును, జంఘాశూన్యంబైనచో ధనక్షయంబును, చరణశూన్యంబైనచో విదేశగమనంబును దటస్థించు నని తెలియనగును. సాధకుండు సకలావయవపూర్ణంబగు నాస్వచ్ఛాయను దర్శించుచు, దేహమనంబుల నైక్యంబు చేసి శివహృదయస్వరూప మగు పంచాక్షరమంత్రమును జపింపవలయును. ఇట్లొకసంవత్సరంబు జపించినచో జగంబున సాధకునకు లభింపని సిద్ధి లేవియు నుండదు. అణిమాదిసిద్ధులును, ఖేచరత్వంబునుగూడ సిద్ధించును.

ఓ దేవీ! భవిష్యద్విషయంబులు విజ్ఞాతంబు లగునట్లు మఱియొక విధానంబు చెప్పెద నాలకింపుము. అస్థేయంబును, సర్వాకృతంబు నగు కుండలీశక్తియం దానుస్యూతంబయ్యు నదృశ్యంబై యుండును. బ్రహ్మాండశిరస్స్థితంబులగు వేదశ్రుతులచే సన్నుతంబై, ఖేచరంబయ్యును సర్వజీవస్థితంబై, దృశ్యంబును, నదృశ్యంబును, అచలంబును, నిత్యంబును, వ్యక్తంబును, అవ్యక్తంబును, సనాతనంబును, అవర్ణంబును, వర్ణయుతంబును బిందుమాలినీనామకంబునగు నాదిమశక్తిని సర్వదా సందర్శింపఁగల యోగిపుంగవులు కృతకృత్యులగుదురు. సర్వతీర్థస్నానఫలంబును, సర్వదానఫలంబును, సర్వయజ్ఞఫలంబును తద్దర్శనమాత్రంబున లభించుననుట కెట్టిసంశయమును లేదు. కావునఁ బండితులు నిత్యము నిట్టియోగాభ్యాసంబు గావించుచు సర్వసిద్ధులం గాంచుచుందురు. యోగమువలన ముక్తి కూడ సిద్ధించును. ఇది భుక్తిముక్తిదాయకం బగు యోగతత్త్వము.

—♦ జ్ఞానిగతికీర్తనము ♦—

పురుషులలోఁ గొందఱు జ్ఞాననిష్ఠులును, గొందఱు తపోనిష్ఠులునై వివిధరీతులఁ గానవచ్చుచున్నారు. ఇయుత్తమపథం బేదియో బోధింపవలయునని శర్వాణి ప్రార్థించుటయు శంకరుండు చెప్పందొడంగెను. ప్రియా! ఈకథాంతత్వము నెఱింగింతును వినుము. తీర్థంబులయందును, పర్వతంబులయందును, వృక్షవాటికలయందును నుత్తమమధ్యమాధమభేదంబులచేఁ ద్రివిధంబులఁ బరగుపురుషులుందురు. బాగుగఁ బరీక్షించితిమేని మానవలోకంబున సత్తము లేరనియే చెప్పవచ్చును. అజ్ఞానులగు మానవులనేకశతంబులఁ గాంచుచుండియు నాత్మశ్రేయస్సు నెఱుంగఁ జాలకున్నారు. స్థావరంబులు గమనశక్తిని, చతుష్పాత్తులు వచనశక్తిని, మానవుల స్వర్గవాసమును, దేవతలు మోక్షపదమును వాంఛించుచుందురు. యజ్ఞతపోదానాదులచే స్వర్గలాభం బగుట నిశ్చయమే. కాని స్వర్గవాసులగు మానవులు తమకు మరల నటనుండి పతనంబు గలుగును. కావున నిత్యానందదాయకం బగుమోక్షంబును గోరుచుందురు. బ్రహ్మయు, విష్ణువును నేనునుగూడఁ గామక్రోధాదిదోషంబులచే సర్వదా కర్మబద్ధులమే యైయుంటిమి. కావున కల్ప కాయము సాంసారికమగుచుండును. ముక్తిస్పృహులును, జ్ఞానవనగుయోగులు జ్ఞానము నొందఁజాలకపోవుటను గర్మపాశవిముక్తులగుదురు. పుణ్యాత్ములగు ముముక్షులకును, తపస్వులకును జ్ఞానలాభంబు సిద్ధించనప్పుడు యోగశాస్త్రాభ్యాసంబును, పురాణశ్రవణంబును గర్తవ్యములగును. వానివలనఁ బాపక్షయంబును బుణ్యసంచయంబు నగునని యెఱుంగవలయును. శాస్త్రాలోచనంబువలనను బురాణశ్రవణంబువలను గ్రమముగా జ్ఞానలాభంబు గలిగి సంసారబాధనివృత్తి యగును. కావున సర్వదా శ్రద్ధాభక్తులతోఁ బురాణశ్రవణంబు సేయు

ఫలయును. అందువలన ధర్మార్థకామమోక్షసిద్ధి యగును. యజ్ఞము, దానము, తపము, తీర్థసేవ మొదలగుసత్కర్మంబులవలనం గలుగు ఫలము పురాణశ్రవణమాత్రంబున లభించును. శాస్త్రపురాణాదు లే ధర్మప్రకాశకంబులు గాకున్నచో నిఁక మానవుల కాముష్మికోపాయము లేమున్నవి? వేదశాస్త్రములే లోకమునకు మార్గదర్శకములు. పౌరాణికధర్మము సర్వధా శ్రేష్ఠమైనది. సూర్యతేజంబు లేక జగం బంధకారంబైనట్లే వేదశాస్త్రంబులు లేకున్న లోకముశూన్యంబగును. సృష్టివిధము, వంశమన్వంతరప్రశంస, దానధర్మవ్రతనియమానుష్ఠానములు మొదలగువిషయములు పురాణంబుల వర్ణితంబులై యుండును. మహాపురాణంబులు, నుపపురాణములును గలసి ముప్పదియారు గలవు. అందొక్కదానినైన భక్తితో వినువాఁడును, బఠించువాఁడును మహాఫలంబు నందఁగలఁడు. అరణ్యంబున నుండి పురాణపఠనంబు చేయువాఁడు చతుర్వేదజ్ఞానలాభముం గాంచును. పురాణపఠనంబుచే యజ్ఞదానతపంబులవలనం గలుగుఫలంబు సిద్ధించును.

—◆ లింగార్చనంబునకుఁగారణము. ◆—

ఇట్లు హరపార్వతీసంవాదమును, సూతుఁడు శౌనకాదులకుం జెప్పుటయు నాకర్ణించి యందఱును బ్రహృష్టహృదయులైరి. అప్పుడు శౌనకుం డో మహాత్మా! మానవులు సకలదేవతల నాపాదమస్తకమును బూజించుచు మహాదేవునిలింగమునుమాత్రమే పూజించుటకుఁ గారణమేమి యని ప్రశ్నించుటయు సూతుండిట్లు చెప్పం దొడంగెను. మునివరులారా! పూర్వము స్థావరజంగమాదిసకలపదార్థములును వినష్టంబులై జగం బాతయు జలమయంబై యున్నసమయంబున బ్రహ్మయు, విష్ణుండును, రుద్రుండును జలంబులం దేలియుండిరి. అప్పుడం

బగువారిగతిని బాడితులుకూడ గ్రహింపఁజాలరుగదా! అప్పుడు ప్రచండవాయువులు చెలరేఁగి సప్తసాగరముల నింకింపఁజేయుచుండెను. జలంబంతయును శుష్కం బగుటచే జంగమంబు లన్నియును నశించి పోయెను. పిమ్మటఁ గ్రమంబుగ స్థావరంబులును విశుష్కంబులయ్యెను. అప్పుడు చతుర్దిశలయందును, నలువైపులను, ఉపరిభాగంబున నెనమండ్రను సూర్యులుదయించి ఈద్వాదశాదిత్యులును, దమతీవ్రకిరణంబులచే జగంబును దహింపఁజేయఁజొచ్చిరి. ఆసమయంబునఁ గాలాగ్నిరుద్రుండు పాతాళంబునుండి వెలువడి యెల్లదిశలను నిండి వెలుంగుచుండుటయుఁ బాతాళోర్ధ్వభాగంబులును దిర్యగ్భాగంబును నిశ్శేషంబుగ దగ్ధంబులైపోయెను. అనంతర మద్దేవదేవుండు మరలఁ బాతాళంబునఁ బ్రవేశించెను. పిమ్మటఁ గాలమేఘంబులు క్రమ్మి యెల్లయెడల ధారాపాతంబుగ వర్షించుచు దశదిశలను జలపరిపూర్ణంబులుగాఁ జేసివైచెను. సర్వము నేకార్ణవం బగుటచే భూమ్యాకాశములును, దిగ్విదిక్కులును దెలియకుండఁబోయెను. కేవలజలప్రవాహముమాత్రమే యంతటను వ్యాపించి యగపడుచుండెను. అట్టిప్రళయసమయంబున కేవలావ్యక్తగతులును, నిత్యులు నగుబ్రహ్మవిష్ణుమహేశ్వరులు ఆజలరాశిమధ్యంబునఁ దేలియాడుచుండిరి. అప్పుడు బ్రహ్మయు, విష్ణుదేవుండును మహానలంబును బోలి ప్రజ్వలించుచున్న రౌద్రమూర్తి యగుమహాదేవునకుఁ బ్రణామంబు లాచరించి ‘‘ఓదేవదేవా! నీవే మాకెల్లవిధంబులఁ బ్రభుండవు. కావున నీసంకల్పానుసారంబుగ సృష్టిగావింపుము.” అని కోరుటయు నట్లే చేసెద నని రుద్రుం డాక్షణంబుననే జలనిమగ్నుండయ్యెను. అట్లు సహస్రదేవవత్సరంబులు గడచినను మహాదేవుండు కానరాకుండుటయు నేమిచేయుటకుం దోఁపక హరిబ్రహ్మలు సృష్టినిర్మాణంబునకు సముత్కంఠులై యుండిరి. అప్పుడు విష్ణు

దేవుండు "ఓవిరించీ! ఇఁక వృథాకాలక్షేపమువలనఁ బ్రయోజనము లేదు. నామాట విని నీవు ప్రజాసర్గంబునకుఁ బ్రయత్నింపుము. నేను ను నాయాత్మశక్తిని నీకుఁ బ్రసాదించెదను" అని బోధించుటయు వనజాసనుండు హరివచనంబుల గౌరవించి దేవాసురగంధర్వయక్షరాక్షసాదులను, సర్పగణంబులను, మఱియు సకలజీవులను; స్థావరజంగమ పదార్థయుతంబగు జగంబును సృష్టించెను. అట్లు సృజించిన కొంత కాలంబునకు మహాదేవుండగురుద్రుండు జలంబు వెలువడి జగత్సర్గంబునకు సంకల్పించి తదుపాయంబు నాలోచింపుచుండెను. అట్టితరి నూర్ధ్వాధోభాగంబులను, నలుదెసలను నిండి వివిధజీవసంతతులతో విలసిల్లుచున్న జగత్సృష్టి యంతయు నాతనికి గోచరించెను. ఆకారణముచే నద్దేవునకు చేయునది లేక కోపోద్దీపితుండై బ్రహ్మదేవుండు సృజించినయీజగంబునంతను వినాశంబు గావించెద నని నిశ్చయించి యాత్మతేజంబును వర్ధిల్లఁజేసి తనముఖంబునుండి యనలజ్వాలలను బ్రజ్వలింపఁజేసెను. ఆకాలానలకీలలచే జగంబంతయును దగ్ధం బైపోవుచుండుటం గాంచి బ్రహ్మదేవుండు భీతుండై పరమభక్తిపూర్వకంబుగ నద్దేవదేవునకు నమస్కారంబుగావించి నిశ్చలచిత్తంబున నిట్లు స్తోత్రంబు గావింపందొడంగెను.

ఓశర్వా! స్థాణుమూర్తీ! తిగ్మతేజా! ఈశానా! కాలస్వరూపా! నీకు నమస్కారము. సహస్రాక్షుండును, విరూపాక్షుండును, త్ర్యక్షుండును, యజ్ఞప్రియుండును, శంకుకర్ణుండును, మహాకర్ణుండును, కుంభకర్ణుండును, అర్ణవవాసియు, గజేంద్రకర్ణుండును, గోకర్ణుండును, పాణికర్ణుండు నగునీకు వందనము. శతోదరుండవు, శతావర్తుండవు, శతజిహ్వుండవు, శతాననుండవు, చండమూర్తివి, ముండధారివి, వరదుండవు నగునీకు నమస్కారము. ఊర్ధ్వకేశదంష్ట్రుండవు, నీలగ్రీవుం

డవు, ప్రతిరూపుండవు, విరూపుండవు, భైరవుండవు, శంభుండవు, అమితతేజుండవు, శితికంఠుండవు, శుభ్రుండవు, కపర్దివి, పశుపతివి, త్రిపురాంతకుండవు నైననీకుఁ బ్రణామంబులు. దేవా! నీవు త్రిశూలధారివి, కపాలమాలికాలంకృతుఁడవు; మహాదేవుండవు, దేవదేవుండవు—అట్టి నీకు సాష్టాంగవందనములు. సర్వభూతంబులకు నీశ్వరుండును, యతులచే నక్షరరూపంబున ధ్యానము గావింపఁబడువాఁడును, సర్వవ్యాపియు, పరముండు నగుదేవుండు నాకు శరణం బగుఁగాక! దేవదానవమానవాదిసర్వజీవయుతంబును, బ్రహ్మభూతంబు నగునీజగంబును సృజించిన సర్వేశ్వరుండు నాకు శరణం బగుఁగాక! పార్శ్వంబులయందు హరిబ్రహ్మలు వెలుంగుచుండఁ ద్రిమూర్తిధారియు, శాంతుండు నగు దేవుండు నాకు రక్షకుం డగుఁగాక! చతుర్వేదమయుండును, జ్యేష్ఠుండును, ఆదిమూర్తియు నగుజగత్ప్రభుండు నన్ను రక్షించుఁగాక! బ్రహ్మరూపధరుండును, జగద్యోనియు, మహేశ్వరుండును, సృష్టికారణుండు నగుదేవాదిదేవుని నేనాశ్రయించెదను. సృష్టిప్రతిపాలనంబునకై విష్ణురూపధరుండై యున్నయాదిపురుషుండును, శంభుండునగు సనాతనమూర్తికి నేఁ బ్రణతుండ నయ్యెదను. భూతగణంబులతో విహరించువాఁడును, సర్వభూతప్రభుండును, సృష్టికర్తయు, సంహారకారణుండును, ఆదిపురుషోదితుండు నగుసనాతనమూర్తిని నే సేవించెదను. రజస్స్వభావులగు బ్రాహ్మణులు యజ్ఞంబులయం దెవ్వాని నారాధింతురో యట్టియజ్ఞకర్తయు, శాశ్వతుండు నగుపురాణపురుషుని నే నుపాసించెదను. ప్రళయకాలంబున సర్వజగంబును సంహరించుచు మరల యుగారంభంబున సృష్టించువాఁడును, రుద్రాత్ముండు నగు సనాతనమూర్తి నాకు శరణ్యుం డగుఁగాక! కల్పాంతంబునఁ గాలమూర్తియై సకలజగంబును సంహరించి యవిజ్ఞేయుండై విహరించు

మహాదేవుఁడు నన్నుద్ధరించుఁగాక! స్థాణుండును, ఈశ్వరుండును, పశుపతియు, శితికంఠుండును, మహేశ్వరుండును, భక్తవత్సలుండును నగు దేవుండు నాకు దిక్కగుఁగాక! శూలపాణియు, మహేశ్వరుండును, శర్వుండును, త్రిలోచనుండును, భక్తవత్సలుండు నగుదేవుండు నాకు రక్షకుఁ డగుఁగాక! గంగాధరుండును, హరుండును, రుద్రుండును, శివుండును, శంభుండును, ఉమాపతియు, భక్తవత్సలుండు నగుదేవుండు నాకుఁ బ్రాపగుఁగాక! కామారియు, వామదేవుండును, త్ర్యంబకుండును, త్రిపురాంతకుండును, భక్తవత్సలుండు నగుదేవుండు నాకుఁ బ్రభుం డగుఁగాక! శివుండును, విరూపాక్షుండును, శంకరుండును, ప్రమథనాథుండును, భక్తవత్సలుండు నగుదేవుఁడు నన్నుగ్రహించుఁగాక! ఈశానుండును, శూలియు, అర్ధచంద్రధరుండును కపర్దియు, భక్తవత్సలుండు నగుదేవుండు నన్ననుగ్రహించుఁగాక! బ్రహ్మశిరోహర్తయు, పినాకియు, వృషభధ్వజుండును నగుదేవుఁడు నాచే సన్నుతుండై నన్ను రక్షించుఁగాక! కపాలమాలియు, బాలేందుశేఖరుండును, సర్పభూషణుండు నగుదేవుఁడు మత్పూజితుండై నన్నుఁ గాపాడుఁగాక! ప్రజాసంహారకారియు, భూతేశ్వరుండును, చంద్రశేఖరుండును, కృశానురేతుండును, శ్రీకంఠుండు నగుదేవుం డెల్లయెడల నన్నుఁ గరుణించుఁగాక! గిరీశుండును, వ్యోమకేశుండును, శర్వుండును, భీముండును, సుయజ్ఞుండును, గృపాళుండును నగుదేవుఁడు నన్నుఁ బాలించుఁగాక!

అని యిట్లు చతురాననుండు సన్నుతించుటయు శంకరుండు ప్రసన్నుండై "ఓవిధాతా! భక్తిపూర్వకంబుగ నాశరణంబు నపేక్షించువారికి నేను సకలమంగళంబులను సమకూర్చుచుందును. శ్రద్ధాభక్తులతో నన్నుఁ బూజించువారిని నేననుగ్రహింపకుందునా? నీస్తోత్రం

బునకు నేను సంతుష్టుండనైతిని. నీయభీష్టంబు దీర్చెదను. ఏమికావలయునో కోరుకొనుము" అని సర్వేశ్వరుం డానతిచ్చుటయు జలజాసనుండు "ఓప్రభూ! నీవు నాయెడలఁ బరితుష్టుండవైతివేని నేను సవిస్తరంబుగఁ గావించిన యీసృష్టిని సంహారంబు గావింపక రక్షింపుము." అని ప్రార్థించుటయు మహాదేవుండు జగద్వినాశకరంబగురుద్రతేజంబు నుపసంహరించి యింకను నేమి కావలయు నని యడిగెను. అప్పుడు బ్రహ్మదేవుండు ప్రజాహితంబు నాలోచించి "ఓదేవదేవా! నీదివ్య తేజమును సూర్యమండలంబునఁ బ్రవేశింపఁ జేయుము. నీవాద్యువకు స్రష్టవును, బ్రభుండవును, నియామకుండవును గదా! త్రిమూర్తులమగుమనము సూర్య తేజమునందే యుండి సకలదేవదానవమానవాదులచేతను ద్రికాలార్చనములను గ్రహించుచుందుము. మహాదేవా! కల్పాంతంబునం దీచరాచరప్రపంచమునంతను నీవు సూర్యమూర్తిం దాల్చి దహించుచుందువు. కావున నన్ననుగ్రహింపుము" అని వేడుకొనియెను.

మహాదేవుం డందులకు సమ్మతించి నవ్వుచు ప్రజాసృష్టి కుపయోగింపని యీలింగంబులవలనఁ బ్రయోజనం బేమున్నదని పలుకుచు నాత్మలింగోత్పాటనంబు గావించి భూమధ్యంబున నిక్షేపించెను. అది యాకాశమును భేదించి వర్ధిల్లుచుండెను. దాని యాద్యంతములను గాంచవలయునను నుద్దేశముతో విష్ణుదేవుండు పాతాళంబునకును, బ్రహ్మదేవు డూర్ధ్వలోకంబునకును బోయి యన్వేషించి యిరువురును గృతార్థులు కాఁజాలక పోయిరి. అప్పు డాకాశవాణి "ఓహరివిరించులారా! లోకంబునం దీమహాదేవుని దివ్యలింగమును బూజించువారికి సకలాభీష్టంబులును సిద్ధింపఁగలవు." అని బోధించెను. ఆవచనంబులాలకించి హరిబ్రహ్మలును, సకలదేవతలును, భక్తిపూర్వకంబుగఁ దత్తచిత్తులై మహాదేవలింగమును బూజింప నారంభించిరి.

—♦ లింగస్తోత్రము ♦—

అప్పుడు భగవానుం డగువిష్ణుదేవుండు సర్వతోముఖంబును, అనంతంబు నగుశివలింగముం గాంచి భయభక్తివినమితుండై మహాదేవునిదివ్యనామంబులచే నిట్లు స్తుతింపఁదొడఁగెను. శివుండును శాంతుండును, స్థాణుండును, అమితతేజుండును, ఈశానుండును పశుపతియునగుదేవునకు నిత్యమును నమస్కరించెదను. ఓశితికంఠా! రుద్రా! నీకు నమస్కారము. మహాదేవుండవు, శూలహస్తుండవు, భీముండవు, శంభుండవు నగునీకుఁ బ్రణామంబులు. భర్గునకు, త్రినేత్రునకు, గంగాధరునకు నేను నిరంతరమును వందనము లాచరించెదను. హరుండును, శుభ్రుండును, గౌరీప్రియుండును, స్మరారియు నగుత్రిపురాంతకు నానమస్కారము. వామదేవుండును, వేద్యుండును, శిపివిష్టుండును, మహేశ్వరుండును, ఉగ్రుండును, కపాలమాలియు, ప్రమథాధిపుండును, కాముండును, కపర్దియు, విషాణుండును, నీలగ్రీవుండును, నీలలోహితమూర్తియు నగుదేవుని నేనాశ్రయించెదను. విషాదియు, భూతేశ్వరుండును, నిత్యుండును, సంహారకారియు, బాలేందుభూషణుండును, కృశానురేతుండును, శ్రీకంఠుండును, దక్షయజ్ఞధ్వంసకుండును, వ్యోమకేశుండును, శర్వుండు నగుదేవుండు నాకు నిత్యశరణ్యుం డగుఁగాక!

అని యిట్లు శ్రీనాథుండు సన్నుతించుటయు మహాదేవుండు ప్రసన్నుండై "ఓహరిబ్రహ్మలారా! మీస్తోత్రంబునకు నేను సంతుష్టుండ నైతిని. మీయభీష్టసిద్ధి యగుఁగాక" అనియెను. అంత భగవానుం డగువిష్ణుదేవుండు శివలింగప్రసాదంబున శత్రుదుర్జయత్వంబును, త్రిలోకపూజ్యత్వంబును, ప్రజాపాలనశక్తియుం గాంచెను. బ్రహ్మదేవుండు మన్వంతరంబులవఱకును దనసృష్టి కక్షయత్వంబును గాంచెను. ఇట్లు నిర్మలచిత్తంబున భక్తిపూర్వకంబుగా శివలింగమును

స్తుతించువారు ఇహపరలోకసుఖంబులం గాంచఁగలరు. శివలింగపూజాఫలంబువలన స్వర్గసుఖంబును మోక్షలాభంబు నగును. శివలింగమును బూజించుమానవులకు సర్వాభీష్టంబులును లభించును. రాజ్యకాములకు రాజ్యప్రాప్తియు, శ్రీకాములకు సంపత్ప్రాప్తియు, సుఖకాములకు సుఖప్రాప్తియు సిద్ధించును.

ఆదిసర్గము

ప్రధానుండును, నిత్యుండును, సదసదాత్మకుండు నగుపురుషుండును, ప్రధానపురుషుండై జగంబుల సృజించువాఁడును, లోకభావనుండును, సర్వభూతసృష్టియు, నారాయణపరాయణుండును, బ్రహ్మస్వరూపముగా మునివరులకు వేద్యుండును, అమితతేజుండును, కల్పకుండును, పవిత్రుండును, హిరణ్యగర్భుండును, పురుషుండును, ఈశ్వరుండును, అజుండును, స్థాణుస్వరూపుండును, వరిష్ఠుండును, జగత్కర్తయు నగుబ్రహ్మదేవునకు నమస్కారంబు గావించి యత్యుత్తమం బగుసృష్టింగూర్చి చెప్పెదను. బ్రహ్మదేవుండు సృష్టికిని, విష్ణుదేవుండు పాలనంబునకును, మహాదేవుండు సంహారంబునకును కర్తలై యున్నారు. ఆదికాలంబున బ్రహ్మకంటె సృష్టికర్త యన్యుం డెవ్వఁడును లేఁడు. స్వయంభూతుం డగునాభగవానుండు ప్రజాసృష్టి గావింపఁ గుతూహలుండై ప్రప్రథమంబున జలరాశిని సృజించెను. ఆజలంబుల యందు వీర్యంబును సృష్టించెను. నరరూపుఁడగు దేవునిచేఁ గల్పితం బగుటచే జలంబునకు నారంబనియు, ప్రళయకాలంబున జలంబుల యందే నివసించియుండుటచే విష్ణుదేవునకు నారాయణుండనియు నామనిర్దేశంబయ్యెను. ఆనారాయణునుండి హిరణ్యవర్ణం బగు నొకయండం బుదయించి జలంబులం దేలుచుండెను. ఆయండమును భేదించుకొని

బ్రహ్మదేవుం డుత్పన్నుం డయ్యెను. అందుచే నద్దేవునకు స్వయంభు
వను నామంబు గలిగెను. ఆహిరణ్యగర్భుం డు బహుకాలం బయ్యండ
బునందుండి దానిని రెండుఖండములుగ భేదించి యొకఖండము
వంబుగను, రెండవఖండమును భూమిగను జేసెను. పిమ్మట భూ
కధోభాగంబున సప్తలోకంబులను, దివంబున కూర్ధ్వభాగంబున స
లోకములను గల్పించెను. ఈచతుర్దశభువనాంతరాళంబులయందు నా
కాశమును సృష్టించెను. ఆసమయంబున భూమ్యాకాశములును ద
దిశలును గూడ జలనిమగ్నములై యుండెను. అప్పు డద్దేవుండు కాలం
బును, మనంబును, వాక్కును, కామక్రోధంబులను, రతిని సృజించెను.
అనంతరము మరీచి, అత్రి, అంగిరుండు, పులస్త్యుండు, పులహుండు,
క్రతువు, వసిష్ఠుండు మున్నగుమహాతేజుల నేడ్వురను మానసపుత్రు
నుగా సృష్టించెను. అనంతరము బ్రహ్మమానసపుత్రులై యేకాద
రుద్రులు సృజింపంబడిరి. అందఱికంటెను ముందుగా బ్రహ్మదేవుం
తనమనంబునుండి సనత్కుమారునిం బుట్టించెను. ఆసనత్కుమారుండు
తన తేజంబును సంక్షిప్తంబుగావించి యుండెను. మరీచిప్రభృతులగు
సప్తర్షులవలనను దేవర్షిగణమాన్యంబులగు సమస్తమహావంశంబులు ను
త్పన్నంబు లయ్యెను. మఱియు విద్యుత్తు, వజ్రము, మేఘము, ఇంద్ర
ధనువు జలరాశిని మొదట సృష్టించి పిమ్మటం బర్జన్యుని బుట్టించెను.
తరువాత యజ్ఞసిద్ధికొఱకు ఋగ్వేదమును, యజుర్వేదమును, సామ
దమును గల్పించెను. పూజ్యులగుమునివరు లీవేదత్రయముచే సా
వతలను యజించుచుందురు. సర్వజగత్కర్త యగుబ్రహ్మదే
తనముఖమునుండి దేవతలను, వక్షమునుండి పితృగణంబులను,
ట మానవులను, జఘనమునుండి యసురగణంబులను బుట్టించెను
దేవుని యితరాంగంబులనుండి క్రమంబుగ ప్రధానాప్రధానులగు

స్వజీవులును సంభవించిరి. ఇట్లు సృష్టిం గావించియు వనజాసనుండు జగంబున సంపూర్ణముగ జీవవృద్ధి గాకుండుటను విచారించి యప్పుడు తనదేహంబును రెండు భాగంబులు చేసి స్త్రీపురుషరూపంబులం గావించెను. అనంతర మమ్మహాత్ముండు తనమహిమచే విశ్వమంతటను దనసృష్టిని వ్యాపింపఁజేయుచు ప్రథమంబున విరాణ్మూర్తి యగువిష్ణుదేవుని సృజించెను. విరాడ్రూపియు, నద్వితీయుండును, బురుషుండును, భగవానుండు నగువిష్ణుదేవుండు మనువున కనంతరము సృష్టింపఁబడిన కారణముచే ద్వితీయమనువుగా సుప్రసిద్ధుం డయ్యెను. ఆజగత్ప్రభుం డప్పుడు సృష్టిం గావించెను. ఆనారాయణసృష్టియందలి సకలజీవులు నయోనిజులైరి. ఇది యాదిసర్గవృత్తాంతము. ఈచరిత్రము నాకర్ణించువారు దీర్ఘాయుష్మంతులును, యశస్వులును, ధనవంతులును, పుత్రపౌత్రసంపన్నులునై యిహలోకంబున సకలసుఖంబులం గాంచుచు, పరలోకంబున నభిమతసద్గతిలాభంబుల నందఁగలరు.

—♦ పృథూత్పత్తి. ♦—

బ్రహ్మదేవుండు మొదటఁ గొంతప్రజాసర్గంబు గావించి యట్టి మానససృష్టివలనఁ బ్రజావృద్ధియగుట దుష్కరంబని భావించి తన ప్రభావంబునను, ధర్మబలంబువలనను శతరూపయనునొకరమణీమణిని సృజించెను. అద్దేవి యేకశతవర్షంబులు కఠినతపంబు చేసి యాదిపురుషుం డగుప్రజాపతిని బతిగాఁ బడసెను. అయ్యాదిపురుషుం డగుస్వాయంభువు మనునామంబున విఖ్యాతుండై యేకోత్తరశతయుగపర్యంతమును జీవించెను. ఆతనికిఁ బ్రియవ్రతుండును, ఉత్తానపాదుండు నను తనయులును, వీరక యనుతనయయుఁ గలిగిరి. మహాభాగ యగుకామ్య యనుకాంతయందుఁ గర్దమప్రజాపతివలన సామ్రాట్టుఁడు, అత్రి,

విరాటుఁడు, ప్రభువు ననునలుగురుసుతులు పుట్టిరి. ఇంద్రతుల్యుండగు నుత్తానపాదుండు ధర్మతనూజయగు సునీతి యనుసుందరివలన బహు పుత్రులం గాంచెను. అందు ధ్రువుండు త్రిసహస్రదివ్యవర్షంబులు మహాతపంబు చేసి బ్రహ్మలోకసదృశం బగుసప్తర్షిమండల సమ్ముఖం బున నక్షయపదంబుం గాంచెను. ఆతనికి పుష్టియు, ధాన్యుండు నను నిరువురుతనూజులుదయించిరి. అందు పుష్టి, యవంతికన్యయగుమూర్ఛ యందు రిపుఁడు, పురంజయుఁడు, విప్రుఁడు, వృకలుఁడు, వృకతేజుఁడు నను పుత్రపంచకముం గాంచెను. అందు రిపునకు చాక్షుషుం డను మను వుదయించెను. ఆచాక్షుషమనువునకు పుష్కరిణియను భార్య వలన వరుణుండు జనించెను. మఱియు నాతఁడు నడ్వలయనుకాంత వలన రురుఁడు, పురుఁడు, శతద్యుమ్నుఁడు, తపస్వి, సత్యజిత్తు, కవి, అగ్నిష్టోముఁడు, అతిరాత్రుఁడు, అతిమన్యుఁడు, సుయశుఁడు ననుపదు గురు తనూజులం గాంచెను. గురుపత్నియగు నాగ్నేయిగర్భంబున అంగుఁడు, సుమనుఁడు, ఖ్యాతి, క్రతువు, అంగిరసుఁడు, స్మృతియను నార్గురుసుతులు జనించిరి అంగునకు సునీథయం దు వేనుం డను నొక యాత్మజుం డుదయించెను. అవ్వేనుం డధర్మపరుండును, దురాచారుం డునై ప్రజాక్రోధంబున గతాసుం డగుటయు లోకహితంబుకొఱకు మునివరు లాతనిదక్షిణభుజంబును మథించుటయుఁ గవచధనుర్ధారియు నాదిత్యతేజుండు నగుపృథుండను కుమారుండు జనించెను. ఆతఁడే క్షత్రియకులంబున కాదిపురుషుండై ప్రథమంబున సర్వభూపరిపాల నంబు గావించి రాజసూయాధ్వరమును నిర్వహించెను. ఆతనికి సూతుఁడు మాగధుఁడు నను నిద్దఱుపుత్రులు గలిగిరి. ప్రజాహితంబు గోరి యాపృథురాజేంద్రుండు దేవర్షిపితృగణంబులతోడను, అసురగం ధర్వాప్సరోగణంబులతోడను, పుణ్యజనగణంబులతోడను తరులతా

పర్వతంబులతోడను గలసి పృథ్వీదోహనంబు గావించెను. అమ్మహీపాలుని నిరంతర యజ్ఞద్రవ్యంబులచే దేవతలందఱును జీవించుచుండిరి.

—◆ దక్షోత్పత్తి. ◆—

ఆపృథుచక్రవర్తికి హవిర్ధాని, హవిర్ధానుఁడు నను నిద్దఱుతనయులు గల్గిరి. హవిర్ధానునకు శిఖండియందు ప్రాచీనబర్హి పుట్టెను. అతనివలనఁ బ్రాచీనాగ్రంబులగు కుశ లుత్పన్నంబు లయ్యెను. అతఁడు సముద్రతనయను బెండ్లియాడి పదిమందికుమారులం గాంచెను. ఆప్రచేతసులు పదుగురును ధనుర్వేదంబును గూలంకషముగ నభ్యసించి యేకధర్మపరాయణులై సముద్రజలంబుల వసించి పదివేలసంవత్సరములు మహాతపంబు గావించిరి. అట్లు వారందఱును తపోనిమగ్నులై యుండుటయు భూమండలమంతయు నరణ్యమయంబై సస్యోత్పత్తి కవకాశము లేకుండఁబోయెను. జగమంతయు నరాజకంబగుటచేఁ బ్రజాక్షయంబగుచుండెను. అదియంతయుం గాంచి ప్రచేతసులు సముద్రమునుండి యగ్నిని వాయువును వ్యాపింపఁజేయుటయు, వాయువు వృక్షోత్పాటనంబును, అగ్ని వృక్షదహనంబును గావింపనారంభించెను. అట్లు వృక్షవినాశనంబగుచుండుటయు నోషధీశ్వరుం డగుసోముండు ప్రచేతసులపాలికిఁ బోయి "ఓరాజకుమారులారా! మీకోపము నుపసంహరింపుఁడు. ఈభూజంబుల కీడ్పాటు గలుగునని నేనముందే గ్రహించి యీవృక్షకన్యకను నాగర్భంబున ధరించి యుంటిని. ఓమహాభాగులారా! సోమవంశవర్ధని యగునిక్కన్యకను మీరు పరిగ్రహింపుఁడు. ఈమెగర్భంబున మహాత్ముం డగుదక్షప్రజాపతి జన్మింపఁగలఁడు. మీతేజంబులయుం దర్ధాంశమును, నాయంశమును గాంచి బ్రహ్మతేజుండగుదక్షప్రజాపతి మరలఁ బూర్వాధికంబుగఁ బ్రజాసర్గం

బు చేయఁగలఁడు." అని బోధించుటయు, ప్రచేతసు లాసోమునికన్యను దమ్మహాధర్మిణిగా స్వీకరించిరి. ఆమెగర్భమునందు దక్షప్రజాపతి యుదయించెను. మహాతేజుండగు దక్షుండు సోమునంశంబున సర్వజ న్నించి స్థావరజంగమంబులను, ద్విపాదచతుష్పాదయుతంబులగు సకల జీవులను సంకల్పమాత్రంబుననే సృజించెను. పిమ్మట నాతఁడు కన్యా సృష్టిం గావించి ధర్మునకుఁ బదుగురుకన్యలను, కశ్యపునకుఁ బదియో దశేఁకన్యకలను, చంద్రున కిరువదియేడ్వురుకన్యకలను దానము చేసెను. అనంతరము దేవదానవాదులును, సర్పవిహంగాదులు నుత్పన్నంబు లయ్యెను. అదిమొదలుగఁ బ్రజలందఱును స్త్రీపుంసంయోగంబు వలననే జనింపందొడంగిరి. ఆదికాలంబున సందర్శనసంస్పర్శనాదులచే మాత్రమే సృష్టి యగుచుండెనని పురాణంబులవలనఁ దెలియవచ్చు చున్నది.

అని సూతుండు చెప్పుటయు మును "ఓసూతనందనా! దక్ష ప్రజాపతి బ్రహ్మదేవుని యంగుష్ఠమునుండి జన్మించెనని నీవిదివఱకు వచించి యుంటివి. ఇప్పుడు ప్రచేతసులవలన నుదయించెనని చెప్పి తివి. చంద్రునకు దౌహిత్రుండైనదక్షుండు మరలఁ జంద్రున కెట్లు కన్యాదానంబు గావించెను? మాకీసంశయమును నివారింపవలయు నని ప్రార్థించిరి. సూతుండు మందహాసంబు చేసి యోమహాభాగు లారా! ఈజగంబునఁ బ్రతికల్పంబునందును జీవులుత్పత్తివినాశనంబు లం గాంచుచుందురు. దక్షాదిప్రజాపతులుగూడ నట్టివారే యని యెఱింగి ప్రాజ్ఞులు నిస్సందేహులై యుందురు. దక్షప్రజాపతిచేఁ గావిం పఁబడిన స్థావరజంగమాదిసృష్టిక్రమముఁగూర్చి పఠించువారును విను వారును పుత్రపౌత్రవంతులై దీర్ఘాయుష్మంతులై యిహసుఖంబులం గాంచుచుఁ బరలోకంబున స్వర్గభోగంబు లనుభవింపఁగలరు.

దేవదానవాదిసర్గము.

దక్షప్రజాపతి మొట్టమొదట మానససృష్టినారంభించి యం దువలనఁ బ్రజాభివృద్ధి యగుట దుష్కరం బని భావించి తపస్వియగు వీరణప్రజాపతితనయను బెండ్లియాడి యామెవలన నైదువేలమంది పుత్రులం బడసెను. బ్రహ్మపుత్రుం డగునారదుండు దక్షకన్యామూలంబునఁ గశ్యపునివలన జగంబునఁ బురుషసృష్టివర్ధిల్లఁగలదని విని యున్నవాఁడుగావున నాతఁ డప్పుడు దక్షసంతానముం గాంచి "ఓమూర్ఖులారా! దిక్పరిజ్ఞానమే లేని మీరు సృష్టిసముద్యమంబు గావింతురేల? జ్ఞానమును సంపాదించుకొనుఁడు" అని బోధించుటయు వారందఱును బరివ్రాజకులై దిక్కుల నన్వేషించుటకై బయలుదేఱి పోయిరి. అట్లు వారు పోవుటయు దక్షుండు మరల నైదువందలమంది తనయులం గల్గించెను. వారందఱును సర్గంబున కుపక్రమించుటయు మరల నారదుం డాహర్యశ్వులం గాంచి "ఓయవివేకులారా! భూపరిమాణమునే యెఱుఁగనిమీరు సృష్టికొఱకుఁ బ్రయత్నించుట యుక్తముగాదు." అని చెప్పుటయు వా రనంతం బగునాకాశపదంబును బట్టి పోయి పరాభవనామకం బగు దేశంబును జేరి సముద్రమునం జొచ్చిన నదులవలె నిప్పటికిని వెనుదిరిగి రాలేక యుండిరి. పిమ్మట దక్షుఁడు సృజించినపుత్రులంతఱును దమసోదరుల నన్వేషింపఁ బ్రయత్నించి హతాశులై నశించుచుండిరి. ఇట్లు తనసృష్టియత్నం బంతయు విఫలం బగుచుండుటయు దక్షప్రజాపతి చింతించి వీరణివలన మరల సఱువది పుత్రికల నుత్పాదించెను. అందు అరుంధతి, వసు, జామి, లంబ, భాను, మరుద్వతి, సంకల్ప, ముహూర్త, సాధ్య, విశ్వ యను పదుగురను ధర్మునకు గన్యాదానంబు చేసెను. వారిలో విశ్వయందు విశ్వేదేవతలును, సాధ్యయందు సాధ్యులును, మరుద్వతియం దూనపంచాశద్వా

యుగణంబులును, వసుగర్భంబునం దష్టవసువులును, భానుగర్భంబున ద్వాదశార్కులును, ముహూర్తయందు ముహూర్తజులును, లంబయందు ఘోషుండును, జామియందు నాగవీథియు, అరుంధతియందు పృథ్వీవిషయంబును సంకల్పయందు సంకల్పమును జనించెను. అయ్యెడం ధ్రువుండు, సోముండు, ధరుండు, అనిలుండు, అనలుండు, ప్రత్యూషుండు, ప్రభాసుండు, ననువారష్టవసువు లనంబడుదురు. అంద యునకు వేతండుండు, శ్రముండు, శాంతుండు, ముని యనువారు జనించిరి. ధ్రువునకు లోకోత్పాదనకారణుండగు కాలుండును, సోమునకు వర్చసుండును, ధరునకు దేవాన్నవాహి యగుద్రవిణుండును, అనిలునకు శివయందు పురోజవుండు, అవిజ్ఞాతుండును, అనలునకు శరగుచ్ఛంబునం గుమారుండును జన్మించిరి. అక్కుమారుండు కృత్తికాగర్భజాతుం డగుటచే కార్త్తికేయనామంబునం బ్రసిద్ధుం డయ్యెను. ప్రత్యూషునకు దేవలుండు జనించెను. ఆతని కిరువురుతనయులు గలిగి వారు సంతానవంతులైరని పెద్దలు చెప్పుదురు. త్రిలోకసుందరియు, బ్రహ్మచారిణియు, కామగమనయు, యోగసిద్ధయు నగుబృహస్పతిసోదరి యష్టమవసువగు ప్రభాసునకు ధర్మపత్ని యయ్యెను. ఆమెగర్భంబున బహుశిల్పనిపుణుండును, దేవతాగృహనిర్మాతయు, అలంకారస్రష్టయు శిల్పశ్రేష్ఠుండును, దివ్యవిమాననిర్మాణకుశలబుద్ధియు, మహాభాగ్యశాలియు నగువిశ్వకర్మ యుదయించెను. అజైకపాదుండు, అహిర్బుధ్న్యుండు త్వష్ట, రుద్రుండు, హరుండు, బహురూపుండు, త్ర్యంబకుండు, వృషాకపి, శంభుండు, కపర్ది, రైవతుండు, ననువారు త్రిభువనేశ్వరులగు నేకాదశరుద్రులు. త్వష్టపుత్రుండు మహాయశస్వియు, శ్రీయుతుండు నై విశ్వరూపనామంబున విఖ్యాతుం డయ్యెను. ఇది రుద్రవంశము. అదితి, దితి, దను, అరిష్ట, సురస, ఇల, సురభి, వినత, తామ్రి, క్రోధ

సము, కద్రు, శని యనుపదముగ్గురుకన్యలను దక్షుండు కశ్యపున కిచ్చెను. ఆ౽మన్వంతరంబున సర్వశ్రేష్ఠులగు పన్నిద్దఱు సురవరుల జన్మించి యుండిరి. వారందఱును జేరి చాక్షుషమన్వంతరసమయంబున మనమందఱము నదితిగర్భంబున సాధుసంగళాఢ్యమై జన్మింపవలయు నని నిశ్చయించుకొనిరి. అట్లే వారు చాక్షుషమన్వంతరంబునఁ గశ్యపున కౌరసులై యదితియం దింద్రోపేంద్రులు జనించినతరువాత అర్యముండు, ధాత, త్వష్ట, పూషుండు, వివస్వంతుండు, సవిత, మిత్రావరుణులు, అంశుఁడు, భగుఁడు, అతితేజుఁడు ననునామంబులతో జనించి ద్వాదశాదిత్యనామంబునఁ బ్రసిద్ధులైరి. వారే రైవతమన్వంతరంబునను ద్వాదశాదిత్యులై జనించిరి. చంద్రుని యిరువదియేడ్గురుభార్యలను సుప్రతులై యుండిరి. వారిసంతతి యంతయును, దీప్తిమంతమై విలసిల్లెను. అరిష్టనేమిభార్యలగర్భంబులయందుఁ బదియాఱుగురు సుతు లుదయించిరి. బహుపుత్రునకు నలుగురుతనయులుమాత్రమే కలిగిరి. దేవర్షియగుకృశాశ్వునకు దేవతలశస్త్రాస్త్రంబు లుత్పన్నంబు లయ్యెను. ఈసకలదేవతలును యుగసహస్రాంతంబున మరల జనించుచుందురు. అందు ముప్పదిముగ్గురుమాత్రము యథేచ్ఛానుసారంబుగ జనింపఁగలరు. వారికిని భవవినాశంబులు గలవు. సూర్యుండు ప్రతిదినంబు నుదయించునట్లే దేవతలును బ్రతియుగంబున నుదయించుచుందురు. కశ్యపునకు దితియందు, హిరణ్యకశిపుండు, హిరణ్యాక్షుండు నను మహాబలవంతు లిద్దఱుపుత్రులు గలిగిరి; సింహికయను తనయ జనించెను. ఆసింహికను విప్రచిత్తి పెండ్లియాడెను. అతిబలుం డగు హిరణ్యకశిపునకు అనుహ్లాదుఁడు, హ్లాదుఁడు, ప్రహ్లాదుఁడు, సంహ్లాదుఁడు నను నలుగురు పుట్టిరి. హ్లాదునకు హ్లాదుండును, ఆయుష్మంతుండును, శివుండును, కాలుండును జనించిరి. ప్రహ్లాదునకు విరేచ

నుండును, అతనికి బలియును జన్మించిరి. ఆబలికి నూర్గురుపుత్రులు గలిగిరి. అందు జ్యేష్ఠుండు బాణాసురుండు.—హిరణ్యాక్షునకు కుకురుండు, శకుని, భూతసంతాపనుండు, మహానాదుండు, కాలనాభుండు ననునైదుగురు సుతులుదయించిరి. పరాక్రమవంతులును, బలవంతులు నగునూర్గురుతనయులు దనుగర్భంబునఁ గశ్యపునకు జనించిరి. వారిలో ద్విశిరుండు, శకురుండు, పరిభువు, ఖలి, శివ్రుండు, అయోముఖుఁడు, శంబరుండు, కపిలుండు, వామనుండు, విశ్వానరుండు, పులోముఁడు, విద్రావణుండు, మహాశిరుండు, స్వర్భానుండు, వృషపర్వుండు, వీర్యవంతుండు, విప్రచిత్తి యనువారు ప్రధానులు. అందు స్వర్భానునకుఁ బ్రభ యనుతనయయు, పులోమున కింద్రపత్నియగు శచియు, వృషపర్వునకు హాయశిర, ఉపదానవి, శర్మిష్ఠయును ముప్వురుతనూజలును గలిగిరి. విశ్వానరునకు పులోమ, కాలిక యను నిద్దఱుపుత్రికలుదయించిరి. ఆయిరువురను ప్రజాపతి యగుమరీచి పెండ్లియాడి దానవకులానందదాయకు లగు నాఱువేలమంది పుత్రులం గాంచెను. పౌలోమకాలకేయు లనువారు మహాబలవంతులై యమరులకవధ్యులై హిరణ్యపురంబున వసించి యుండిరి. పితామహుండగు బ్రహ్మదేవుని యనుగ్రహముచేఁ బాండునందనుం డగునర్జునుండు వారినందఱను వినాశంబు గావించెను. విప్రచిత్తికి సింహికయందు సైంహికేయులు పదుముగ్గురు జనించిరి. వీరు దైత్యదానవసంసర్గజాతులగుటచే నజేయపరాక్రములైరి. రాహువు, శల్యుండును మిగుల బలవంతులు. బలుఁడు, మహాబలుండు, వాతాపి, నముచి, ఇల్వలుండు, స్వసృపుండు, అజకుండు, నరకుండు, కాలనాభుండు, శరమాణుండు, శరకల్పుండు మొదలగువారు వంశవృద్ధికరులైరి. వీరిపుత్రపౌత్రగణంబులవలన దనువంశం బభివృద్ధిం గాంచెను. నిత్యతపఃపరతంత్రుం డగుసంహ్లాదునివ

శంబున నివాతకవచగణంబులు జనించెను. మఱియుఁ గశ్యపునకుఁ దా మ్రగర్భంబున ఖరాదు లుదయించిరి. మఱియు కాకో, లూక, శ్యేన, భాస, సుగ్రీవ, గృధ్రి, శుక పక్షికాంత లుదయించి యాయాపక్షిజా తులను వర్ధిల్లఁ జేసిరి. అశ్వములు, ఉష్ట్రములు, గర్ధభంబులునుగూడ తామ్రయందే జనించెను. వినతగర్భంబున అరుణుఁడు, గరుడుండును బుట్టిరి. అందరుణుండు సూర్యతేజంబును సహింపఁగల శక్తిం గాంచి సూర్యసారథియై జగద్విఖ్యాతుం డయ్యెను. గరుడుండు పక్షిరాజై సుపర్ణనామంబునఁ బ్రసిద్ధుం డయ్యెను. సురసగర్భంబున బహుమస్తక యుతంబులును, గగనచరంబులును, బాహాబలయుతంబులును, బృహ త్కాయంబులు నగుసర్పంబు లనేకంబులు జనించెను. అందు సర్పరా జగు శేషుఁడు, వాసుకి, తక్షకుఁడు, ఐరావతుఁడు, మహాపద్ముఁడు, కంబళుఁడు, అశ్వతరుఁడు, ఏలాపత్రుఁడు, పద్ముఁడు, కర్కోటకుఁడు, ధనంజయుఁడు, మహానీలుఁడు, మహాపర్ణుఁడు, ధృతరాష్ట్రుఁడు, వలా హకుఁడు, కుహరుఁడు, పుష్పదంతుఁడు, దుర్ముఖుఁడు, సుముఖుఁడు, బహుళుఁడు, ఖరరోముఁడు, పాణి మొదలగువారు సర్పప్రధానులై విఖ్యాతులైరి. మఱియు సురభియందు శశంబులు జనించెను. ఇల యందు తృణలతావృక్షంబులు గలిగెను. స్వసయందు యక్షరాక్షసు లుదయించిరి. అరిష్టయందు సకలజీవులు జన్మించిరి. ఇట్టికశ్యపసంతా నము జగంబంతటను వ్యాపించెను. ఇది యంతయును స్వారోచిషమ న్వంతరసృష్టి యని యెఱుంగనగును. వైవస్వతమన్వంతరంబున వరు ణుం డాచరించు మహాయజ్ఞంబునఁ బ్రజాపతి యగుబ్రహ్మ హోతయై యుండెను. ఆసమయంబున నాతని మానసమునుండి ప్రజాసృష్టి యయ్యెను. పూర్వకాలంబున బ్రహ్మమానసపుత్రులగుమరీచిప్రభృతి సప్తర్షిగణంబులే బ్రహ్మపుత్రులుగాఁ బ్రసిద్ధులైరి. అనంతరము దేవదా

నవయుద్ధంబున దానవులు నిహతులగుటయు నపుత్రిక యగుదితి భర్త యగుకశ్యపుని చెంత కేతెంచి శ్రద్ధాభక్తులతో నాతని నారాధించుచుండెను. ఆమెయుపచారంబుల కమ్మునిశ్రేష్ఠుండు సంతుష్టుండై నీకేమి కావలయునో కోరుకొమ్మనియెను. అప్పుడు దితి "నాథా! ఇంద్రుని వధించుటకు సమర్థుండగుతనయుని నాకుఁ బ్రసాదింపుము" అని వేడుకొనియెను. మహాతపుండగుకశ్యపుం డట్లే యనుగ్రహించెను. రమణీరత్నమగు దితి యప్పుడు కశ్యపునివలన గర్భమును ధరించెను. అది యెఱింగి కశ్యపుండు ప్రహృష్టుండై తపంబునకుం బోయెను. దేవనాథుం డగునింద్రుం డీవృత్తాంతమంతయు నెఱింగి యెట్లయిన దితిగర్భంబును వినష్టంబు గావింప నిశ్చయించి ఛిద్రాన్వేషణముం జేయుచుండెను. ఏకశతవత్సరంబులుముగియకుండుకాలంబున నొకప్పుడు దితి పాదప్రక్షాళనంబు చేసికొనకుండఁ బశ్చిమశిరస్కయై నిదురించుచుండుటం గాంచి దేవేంద్రుండు దితిగర్భంబునఁ బ్రవేశించి యందలిపిండమును సప్తఖండంబులుగా భేదించెను. వజ్రిహతిచే నా పిండఖండములు రోదనము గావించుటయు గర్భస్థుం డగునింద్రుండు వారిని వారించి మరల నొక్కొక్కఖండమును సప్తఖండములుగా ఖండించెను. ఆనలువదితొమ్మండ్రును వియత్సంచారసమర్థులును, మహాబలవంతులు నగుమరుద్గణంబులై పుట్టి యింద్రునకు సహాయులైరి. వారు క్రమంబుగ వర్ధిల్లుటయు భగవానుండగు హరి వారికిఁ బ్రత్యేకముగ రాజ్యప్రదానముం గావించెను.

—• ఆధిపత్యకల్పనము. •—

పృథుచక్రవర్తి ద్విజులకు వీరుధులను, నక్షత్రగ్రహంబులకును యజ్ఞతపంబులకును సోముని, జలంబులకు వరుణుని, రాజగణంబులకు

వైశ్రవణుని, ద్వాదశాదిత్యులకు భగవానుండగు విష్ణుదేవుని, వసువులకుఁ బావకుని, ప్రజాపతులకు దక్షుని, మరుత్తులకు వాసవుని, దైత్యదానవుల కమితతేజుండగు ప్రహ్లాదుని, పితృదేవతలకు వైవస్వతుని, మాతృగణంబులకును, వ్రతంబులకును, మంత్రంబులకును, గో[illegible]కును, యక్షులకును, రాక్షసులకును, పార్థివులకును, సర్వభూతపిశాచంబులకును శూలపాణి యగు మహాదేవుని, శైలంబులకు హిమవంతుని, నదులకు సముద్రుని, మృగంబులకు శార్దూలమును, గోవులకు వృషభంబును, వనస్పతులకు వృక్షమును, దిక్కులకు దిక్పాలకులను, ప్రభువులుగాఁ జేసి యభిషేకించెను. మఱియు విరాట్ప్రజాపతిపుత్రుని పూర్వదిగ్భాగమునకును, కర్దమప్రజాపతితనయుండగు సుధన్వుని దక్షిణదిగ్భాగంబునకును, రజసిసుతుండును సర్వకార్యదక్షుండును, మహాత్ముండు నగు కేతుమంతుని పశ్చిమదిగ్భాగంబునకును, పర్జన్యప్రజాపతిసూనుండగు హిరణ్యరోముని నుత్తరదిగ్భాగంబునకును ప్రభువులుగాఁ జేసెను.

పృథుచరిత్రము

తొల్లి ధర్మరక్షణకర్తయు, నత్రితుల్యుండును, అత్రికులసంభూతుండు నగు నంగుఁడను ప్రజాపతి మహీమండలమును బరిపాలించుచుండెను. ఆతనికి మృత్యుతనూజ యగు సునీథయందు వేనుండను తనయుండు గలిగెను. అక్కుమారుండు మాతామహదోషవశంబున స్వధర్మపరిత్యక్తుండును, అధర్మపరుండును, స్వేచ్ఛావిహారియునై ధర్మశాస్త్రవిరుద్ధంబులగు శాసనంబులం గావించి వర్ణధర్మంబుల నతిక్రమించి యాక్రమప్రవర్తకుండగుచుండెను. ఆదుష్టశాసనపరిపాలనంబున నెవ్వరును వేదాధ్యయనంబు చేయుట కవకాశము లేకుండెను. ఎందును వషట్కా

కాదిశబ్దంబులు వినరాకుండెను. దీక్షితులు యజ్ఞకార్యనిర్వాహకులు గాఁజాలకుండిరి. సోమపానం బనుమాటయే లేకుండెను. "నారాజ్యంబున యజ్ఞంబులును, హోమంబులు నెవ్వరును గావింపఁగూడదు" అని యాతఁడు నిరంతరమును శాసించుచుండెను. ఆతఁడు నిరంకుశుండై యయోగ్యంబులగు పన్నులను ప్రజలవలన బలవంతముగ గ్రహించుచుఁ బీడించుచుండెను. ఒకప్పుడు మరీచిప్రభృతు లగు మహర్షు లమ్మహీపాలుంగాంచి "రాజేంద్రా! మేము బహువత్సరవ్యాప్యం బగుయజ్ఞంబు గావింపఁబూనితిమి. నీవధర్మాచరణంబు గావింపకుము. అధర్మమును త్యజించుటే సాధువులధర్మము నీవు ప్రజలకుఁ బ్రభుండవై పుట్టితివి. కావున నీవే వారిని పాలింపవలయును. ధర్మయుక్తముగఁ బ్రజాపాలనంబు చేయుదు వని నీవిప్పుడు మాయెదుట బ్రతిజ్ఞ చేయవలయును" అని బోధించిరి. కాని నిర్భాగ్యుం డగువేనుఁడు వారిసదుపదేశములకు లక్ష్యము చేయక వికటహాసము చేయుచు "ధర్మమును సృజించువాఁడు నాకంటెను నింకెవ్వఁడున్నాఁడు ? అట్టినాకుఁగూడ నొకరు బోధించుటయా ? ధర్మ మన నేమో మూఢులకెట్లు తెలియును! విశేషించి మీకుఁగూడ నాసంగతి తెలియుట లేదు. నేనీభూమండలమునంతను గరగతంబుగఁ జేసికొని, సకలసముద్రములను స్వస్థానచ్యుతంబులుగాఁ జేయఁగలను. భూమ్యంతరాళములను భేదింపఁగలను. ఇట్టి నాసామర్థ్యముంగూర్చి మీరెంతమాత్రమును సంశయింపవలదు." అని ప్రత్యుత్తరం బిచ్చెను. ఎంతప్రయత్నించినను మాతామహుఁడగు నారాజాధముని సన్మార్గమునకుం ద్రిప్పఁజాలక తుదకు మహర్షులు మహాబలసంయుతుండగు వేనుని నిర్బంధించి యాతని యూరుదేశంబున మథనంబు గావింపఁగా నందుండి ఖర్వశరీరుండును, కృష్ణవర్ణము నగునొకపురుషుం డుదయించి కృతాం

జనితుఁడై మునులయెదుట నిలువంబడియెను. అతివిహ్వలుం డగునాతనిం గాంచి యత్రిముని "నిషీద" అనెను. ఆహేతువుచే నత్రిమునీంద్రుండు నిషాదవంశమునకు సృష్టికర్త యయ్యెను. ఆవేనుని పాపసంతతినుండి మత్స్యోపజీవులగు ధీవరుల నత్రిమునీంద్రుండు సృజించెను. మఱియుఁ జండశాసనుం డగు నవ్వేనుని పాపసమూహమునుండి వింధ్యపర్వతప్రాంతవాసులును, అధర్మప్రవర్తకులు నగు పుళిందతుంబురజాతులును, చండాలురును జనించిరి. అనంతర మమ్మహర్షులు మరల వేనుని దక్షిణహస్తమును మథింప నారంభించిరి. అప్పుడు సుందరాకారుండును, పావక తేజుండు నగు పృథుచక్రవర్తి మహారవయుతంబును, ఆద్యంబు నగు నజగవంబను ధనుస్సుతోడను, అద్భుతశరంబులతోడను, ఆత్మరక్షాకరంబగు సుందరకవచంబుతోడను సకలజీవానందకరుండై జనించెను. అప్పుడెల్లదిక్పాలురును దమతమస్థానంబుల నధిగమించిరి. దుష్పుత్రుం డయ్యును వేనుండు స్వర్గముం గాంచెను. సత్పుత్రజననము సద్గతికారణంబు గదా! పురుషశ్రేష్ఠుం డగు పృథుండు తండ్రిని బున్నామనరకమునుండి యుద్ధరించెను. సముద్రంబులును నదులును నాతని కభిషేకించుటకై రత్నోపహారంబులం గైకొని నలుదెసలనుండియు వెలువడి యాతనిచెంత కేతెంచెను. ప్రజాపాలనదక్షుండును, దీప్తిమంతుండును, మహాబలవంతుండును, ప్రతాపనిధియు నగు వేనునందనుండు బ్రహ్మాదిదేవగణంబులచేతను, సకలమునిగణంబులచేతను, ప్రజాగణంబులచేతను రాజ్యాభిషిక్తుండై తండ్రికాలంబున నతివిరక్తులైయున్న ప్రజలనందఱ ననురక్తులం గావించెను. పృథుచక్రవర్తి యట్లు ప్రజారంజకుండై యత్యద్భుతవిధానంబున రాజ్యపాలనము చేయుచుండెను. ఆతనిప్రయాణంబులయందు నదులు పాయవిడిచి మార్గము నిచ్చుచుండెను. పర్వతంబులు తమయం

తరాశింబులనుండి యాతనికిఁ బథమును విడుచుచుండెను. ఆతని జయ కేతనంబున కెందును నిరోధంబు లేకుండెను. ఆతనిపరిపాలనంబున విత్తులు చల్లకయే సస్యోత్పత్తి యగుచుండెను. అనలసంయోగంబు లేకుండనే సంకల్పమాత్రంబున వంటకంబులు సిద్ధంబు లగుచుండెను. గోవులు కోరినన్ని పాలను బిదుకుచుండెను. ప్రతిపత్రపుటంబునను మధువు లభించుచుండెడును. ఆసార్వభౌముండు పితామహునింగూర్చి మహాయజ్ఞంబు గావించుసమయంబున సౌత్యదివసంబున సూతిగర్భంబు నుండి సూతుండు జనించెను. అప్పుడే మాగధుం డుద్భవించెను. మహర్షులాసూతమాగధులను పృథురాజేంద్రునిఁ గీర్తించుటకు నియోగించిరి. అప్పుడువారు మహర్షులారా! ఈచక్రవర్తిచరిత్రము నించు కంతయు నెఱుంగనిమే మీతని నెట్లు స్తుతింపఁగల మని విన్నవించుటయు నీమహారాజుశుభలక్షణములనుబట్టి యీతనిభావిచరిత్రమును వర్ణింపుఁడని యాజ్ఞాపించిరి. వారును సంతుష్టులై బహువిధంబుల నమ్మహారాజును బ్రశంసించుటయుఁ బ్రజారంజకుం డగుపృథుండు సుప్రీతుండై సూతున కనూపదేశంబును, మాగధునకు మగధదేశంబును దానంబు చేసెను అప్పుడు బ్రహ్మాదిదేవతలందఱును పరమానంద భరితహృదయులై ప్రహావర్గముం గాంచి మీకెల్లరకు నీప్రభుండు వృత్తిప్రదానముం గావింపఁగలఁడని తెలిపిరి. అంత బ్రాహ్మణు లందఱును గలసి యమ్మహారాజును సమీపించి మాబోఁటినీప్రజలకందఱకును జీవనాధారముం గల్పింపవలయునని యర్థించిరి. ఆమాటలు విని ప్రజాపరిపాలనతత్పరుండగు పృథుచక్రవర్తి యటనుండి చటాలున లేచి ధనుర్బాణహస్తుండై భూదేవిని వెంబడించెను. భగవతిభూదేవి యారాజేంద్రుం గాంచి భీతిల్లి గోరూపముం దాల్చిపలాయిత యయ్యెను. పృథుండు నామెను దఱిమికొనుచుఁ బోవుచుండెను. అట్లు భూదేవి

భయభ్రాంతయై సకలలోకంబులను బరిభ్రమించి యెందును రక్ష
ణంబు గానక తుదకు పృథురాజు శరణంబుగోరి కృతాంజలియై "ఓమ
హారాజా! నేను లేకున్నచోఁ నీవీప్రజలనందఱ నెట్లు భరింపఁగలవు?
సకలజీవులును నాయందే వసించియున్నారు. నేనే యందఱను భరింప
వలయునుగదా! నాకొఱకే యెందఱో రాజన్యులు నశించి యున్నా
రు. మహాత్మా! నీవు శుభాకాంక్షివే యైనచో నన్ను వధింపఁ బ్రయ
త్నింపకుము. ఉపాయమెఱింగి యారంభించిన సర్వకార్యంబు లను
సిద్ధింపఁగలవు. కావున నీప్రజలనందఱను బరిపాలింపఁగలమంచియుపా
యము నాలోచించి పని చేయుము. కోపము నుపసంహరింపుము. నే
నెల్లవిధంబుల నీకానుకూల్యంబు గావించెదను. మఱియొకమాట విను
ము. పశుపక్షిగణంబులయందుఁగూడ స్త్రీజనం బవధ్యమైనది. నేనబ
లనుగదా! ఓపృథ్వీపతీ! నీవు ధర్మంబును త్యజింపకుము. నన్ను
రక్షించి లోకకల్యాణంబు గావించునుపాయం బాలోచింపుము" అని
వేడుకొనుటయు ధార్మికవరుండును, బుద్ధిమంతుండు నగుపృథు చక్ర
వర్తి తనకోపంబును మరలించుకొని "ఓభూదేవీ! బహుజీవరక్షణా
ర్థంబునకై యొకజీవిని సంహరించుట పాపంబు గానేరదు. ఒక్కప్రాణికొ
ఱకు బహుప్రాణులను వధించుట మహాపాపమగును. ఓవసుంధరా!
నేను సకలప్రజారక్షణంబుకొఱకు నిన్నుఁ బీడింపఁ బ్రయత్నించితిని.
నీవు నామాట విని జీవహితంబు గావింపనిచ్చగింతువేని నాయాజ్ఞాను
సారంబుగ సకలజీవులకును జీవనోపాయంబు గల్పింపుము" అని
హెచ్చరించెను.

భగవతి యగుభూదేవి యాసార్వభౌముం గాంచి "మహారా
జా! నన్నుఁ ఇక హింసింపకుము. నాకనుకూలం బగువత్సంబును
గల్పింపుము. దానిమూలంబున నేను నీయభిమతఫలదుగ్ధంబులఁ బిడి

కైదము. ఎల్లమెతలఁ బర్వతసమూహంబులచే నావరింపఁబడి యున్న నాకు సమత్వంబుఁ గూర్పుము. అప్పుడు నేనంతటను దుగ్ధప్రదానంబు గావింతును.'' అని ప్రార్థించుటయు నాపృథ్వీపాలుండు తనధనుష్కోటిచేఁ బర్వతంబులను దూరంబుగఁ జిమ్మివైచి భూమిని సమతలంబుగఁ గావించెను. అంతకుఁ బూర్వ మీభూమండలమునఁ బురగ్రామవిభాగంబు గాని, సస్యోత్పత్తి గాని, కృషివాణిజ్యాదికర్మంబులు గాని లేవు. ఏదేశొకసమప్రదేశమున జీవులు నేలమీఁదనే వసించుచుండిరి. ప్రజలందఱకు నప్పుడు ఫలమూలకములుమాత్రమే యాహారములై యుండెను. అప్పుడు పృథుచక్రవర్తి స్వాయంభువమనువును వత్సంబుగాఁ జేసి భూమివలన నోషధీసంతతులం బిదికెను. మహాప్రతాపవంతుం డగు నాతనిచేఁ గల్పింపఁబడిన యన్నంబులవలననే ప్రజ లిప్పటికిని బ్రతిదినమును జీవించుచున్నారు. అనంతర మాభూదేవివలన మహర్షులందఱును సోముని వత్సంబుగను, ఛందంబులఁ బాత్రింబుగను జేసి శాశ్వతం బగుతపోదుగ్ధమును, దేవతలింద్రుని వత్సంబుగను, స్వర్ణము బాత్రముగను, సూర్యుండు దోగ్ధగను జేసి యమృతదుగ్ధంబును, పితృదేవతలు యముండు వత్సంబుగను, రౌప్యము పాత్రంబుగను, కాలుండు దోగ్ధగను జేసి స్వధాదుగ్ధంబును, సర్పగణంబులు నాగరాజగు తక్షకుని వత్సంబుగను, అలాబుపాత్రంబుగ, ఐరావతనాగము దోగ్ధగను జేసి విషదుగ్ధంబును, అసురులు విరోచనుని వత్సంబుగను, లోహము పాత్రంబుగను, మధుండు దోగ్ధగను జేసి మాయాదుగ్ధంబును, యక్షులు కుబేరుని వత్సంబుగను, ఆమపాత్రంబును జేసి యంతర్ధానదుగ్ధంబును, పిశాచరాక్షసులు సుమాలిని వత్సంబుగను, రాక్షసాధిపతిని దోగ్ధగను జేసి రక్తదుగ్ధంబును, గంధర్వాప్సరోగణంబులు గంధర్వరాజగుచిత్రరథుండు వత్సంబుగను, వసురుచి దోగ్ధగను

చేసి పద్మపాత్రమున నభిమతదుగ్ధంబును, పర్వతంబులు హిమవంతుండు వత్సుండును, మేరువుదోగ్ధగను జేసి యోషధీరత్నదుగ్ధంబులను నీవిధముగ నెల్లజీవులును దమతమ యభీష్టానుసారంబు లగుక్షీరంబులను బిదుకుకొనిరి. సముద్రపరివేష్టిత మగునీభూతల మంతయును మధుకైటభులను రాక్షసుల మేదస్సుచేఁ బరిప్లుతమైనది. పృథుచక్రవర్తి యీభూమిని సంస్కరించి తనతనయవలెఁ బరిపాలించుటంజేసి దీనికిఁ బృథ్వీనామంబు గలిగెను. ఈధరామండలమును పృథుభూపాలుఁడే దేశదేశంబులుగా విభజించెను. ఆమహారాజ తత్ప్రభావసంపన్నుఁడు. అతఁడు వృత్తికాము లగురాజుల కందఱకును వందనీయుఁడు. ధనకాములగు బ్రాహ్మణవైశ్యశూద్రులకును, రాజ్యాభిలాషులగు బలవద్రిపులకును బూజనీయుఁడు. ప్రప్రథమమునందే యుద్ధము నారంభించిన పృథుసార్వభౌముఁడు వీరయోధుల కందఱకు నాదిపురుషుఁడై యున్నాఁడు. యుద్ధార్థులగుపురుషులు పృథునరేంద్రుని నామమును స్మరించుచు సంగ్రామరంగంబునఁ బ్రవేశించినచో సిగపూవైన వాడకుండ విజయులై యిల్లుచేరఁగలుగుదురు. ఆతనినామస్మరణంబు చేయుచుఁ గృష్యారంభంబు గావించువైశ్యులు సస్యసంపన్నులగుదురు. శూద్రులు రాజేంద్రునినామకీర్తనంబుచేఁ బుణ్యఫలప్రాప్తులగుదురు. ఐశ్వర్యకాములగు మానవులెల్లరును బర్వదివసంబులయందాభూపాలుని మాటిమాటికిని స్మరించుచు నమస్కరింపవలయును.

—♦ మన్వంతరచరిత్రము. ♦—

మునివరులారా! మనువులలో స్వాయంభువుండు మొదటివాఁడు. అతనితరువాత స్వారోచిషాదులు పాలించిరి. ఇప్పుడు వైవస్వతుఁడనుమను పరిపాలించుచున్నాఁడు. తరువాత సావర్ణికుఁడను మనువు

పాలింపఁగలఁడు. ఆతని వెనుక సావర్ణి నామంబున నెనిమిదవ మనువు పాలింపఁగలఁడు. స్వాయంభువమన్వంతరంబున బ్రహ్మమానసపుత్త్రులగు మరీచి, అత్రి, అంగిరసుఁడు, పులహుఁడు, క్రతువు, పులస్త్యుఁడు, వసిష్ఠుఁడు ననువారు మహర్షులై దేవతలు యామనామంబున విఖ్యాతులై యుందురు. స్వారోచిషమన్వంతరంబున ఆగ్నీధ్రుఁడు, అగ్నిబాహుఁడు, మేధ, మేధాతిథి, వసువు, జ్యోతిష్మంతుఁడు, ద్యుతిమంతుఁడు, హవ్యుఁడు, సవనుఁడు, శుభ్రుఁడు ననుఋషులు ధర్మకర్తలై యుందురనియు, తుషితులను దేవతలు స్వర్గపాలకులగుదు రనియు నాయుపురాణంబునఁ బ్రకటితం బయ్యెను. స్వారోచిషునకు హరిఘ్నుఁడు, సుకృతి, జ్యోతి, ఆపోమూర్తి, అయుఁడు, స్మయుఁడు, ప్రథితుఁడు, మనస్యుఁడు, నభుఁడు, సూర్యుఁడు ననుమహాబలపరాక్రమవంతులగు పుత్త్రులు గలరు. ఔత్తమమన్వంతరంబున వసిష్ఠసంతతి యగు నేడుగురు వసిష్ఠులును, బ్రహ్మపుత్త్రులైన యూర్జనాములగు కొందఱును ఋషులై ధర్మనిర్వహణము గావింతురు. అక్కాలంబున దేవతలు ఋషభనాములై యుందురు. ఆమనువునకు ఇషుఁడు, ఊర్జాతుఁడు, ఊర్జుఁడు, మధువు, మాధవుఁడు, శుచి, శుక్రవహుఁడు, నభసుఁడు, నభుఁడు ననువారు పుత్త్రులైరి. తామసమన్వంతరంబున గార్గ్యుఁడు, పృథుఁడు, అగ్ని, జన్యుఁడు, ధాత, కపీనకుఁడు, కపీవానుఁడు ననువారు ఋషులు. అప్పుడు దేవతలు సత్యనామంబునఁ బ్రఖ్యాతు లగుదురు. ఆతనికి ద్యుతి, పోతుఁడు, సౌతపస్యుఁడు, తపుఁడు, శూలుఁడు, తాపసుఁడు, తపోవతి, అకల్మాషుఁడు, తన్వి, ధన్వియనువారు పదుగురుతనయులు, రైవతమన్వంతరంబున వేదబాహుఁడు, జయుఁడు, ముని, వేదశిరుఁడు. హిరణ్యరోముఁడు, పర్జన్యుఁడు, ఊర్ధ్వబాహుఁడు మొదలగువారు ఋషులై దేవతలు వైధ్యనాములై యుందురు. ఆరైవతునకు ధృతి

మ తుఁడు, అవ్యయుఁడు, అవ్యక్తుఁడు, సత్యదర్శి, నిరుత్సవుఁడు, అర ణ్యుఁడు, ప్రకాశుఁడు, నిర్మోహుఁడు, సత్యవంతుఁడు, కృతియను వారు తనయు లని మెఱుంగునది. చాక్షుషమన్వంతరంబున భృగుఁడు, నహుఁడు, వివస్వంతుఁడు, సుధర్ముఁడు, విరజుఁడు, అతినామఁడు, అసహిష్ణుఁడు నను వారు ఋషులును, ఆద్యులు, ప్రసూతులు, ఋభవులు, పృథూగ్రులు, లేఖులు ననుపంచగణంబులును దేవతలు నై యుందురు. షష్ఠమన్వంతరసమయంబున మహాత్ముం డగునంగిరునకు నడ్వలయందు జనించిన సుప్రసిద్ధులైన తురుప్రభృతులు పదుగురుపు త్రులును ఋషులగుదురు.

ఈ వైవస్వతమన్వంతరంబున అత్రి, వసిష్ఠుఁడు, కశ్యపుఁడు, గౌ తముఁడు, భరద్వాజుఁడు, విశ్వామిత్రుఁడు జమదగ్ని యను వారు సప్తర్షులు. మఱియు ఊనపంచాశద్వాయుగణంబులును, ఏకాదశరు ద్రులును, అశ్వినీకుమారులును, ద్వాదశాదిత్యులును, అష్టవసువులు ను, సాధ్యగణంబులును దేవతలై స్వర్గంబున విరాజిల్లుచుందురు. ఆ వైవస్వతున కిక్ష్వాకుప్రభృతిపుత్రపౌత్రులు జగత్ప్రసిద్ధులైయుండిరి. ప్రతిమన్వంతరంబునను ధర్మరక్షణంబుకొఱకు సప్తర్షులు కర్తలై యుం దురు. మన్వంతరంబతీతం బైనంతనే సప్తర్షులును, మనువును, దేవగ ణంబులును, మనుపుత్రులును బ్రహ్మలోకంబుఁ జేరి యుందురు. అనం తరము తపోబలంబుచే నింకొకమనువవచ్చి పరిపాలకుండగును. దక్ష ప్రజాపతితనయయగుప్రియాగర్భంబున సావర్ణినాములు నలుగురు మను వులుదయించి మేరుశైలంబునఁ దపంబు గావించిరి. రుచిప్రజాపతితన యుండగురౌచ్యుఁడనువాఁడొకమనువు. అతఁడు భూతిదేవిగర్భంబున జనించుటచే భౌత్యనామంబునఁగూడఁ బ్రసిద్ధుండయ్యెను. భవిష్యత్కా లంబున నేడ్వురుమనువులు పాలింపఁగలరు. పరశురాముఁడు, వ్యాసుఁడు

భరద్వాజపుత్రుండగుద్రోణునితనయుఁడశ్వత్థామ, గౌతమనందనుం డగుశరద్వంతుఁడు, కుశికాత్మజుండగుగాలవుఁడు, కశ్యపతనూజుఁ డగు పరుఁడు ననువారేడ్వురును భవిష్యత్సప్తర్షులు. మఱియు సావర్ణిమనువు నకు వీరవంతుఁడు, అవనీవంతుఁడు, సుమంత్రుఁడు, ధృతిమంతుఁడు, వసువు, వరిష్ణుఁడు, ఆర్యుఁడు, విష్ణు, రాజు, సుమతి యను పదుగురు సుతు లుదయించిరి. రోహితమన్వంతరంబునఁ బులస్త్యతనయుం డగు మేధాతిథియు, కాశ్యపగోత్రుం డగువసుండును, భార్గవుండగు జ్యోతి ష్మంతుండును, అంగిరుండగుద్యుతిమంతుండును, వసిష్ఠగోత్రజుం డగు సవనుండును, ఆత్రేయుం డగుహార్యుండును, పులహాత్మజుండును సప్త ర్షులగుదురు. అప్పుడు దేవతాగణంబులు ముప్పదిరెండుగుల విరాజిల్లుచుం డును. ఆరోహితునకు ఇష్టకేతు, దీప్తకేతుఁడు, పంచహస్తుఁడు, నిరా కృతి, పృథుశ్రవుఁడు, భూరిద్యుమ్నుఁడు, రుచీకుఁడు, బృహత్తు, గయుఁడు ననువారు తనూజులగుదురు. ద్వితీయసావర్ణిమన్వంతరంబున హావిష్మంతుండును, పులహుండును, భార్గవుండగుసుకృతియు, ఆత్రే యుం డగునపోమూర్తియు, అవ్యయుండును, ప్రమోతియు, నాభా రుండును, నభసుండును ఋషులగుదురు. అక్షత్వంతుఁడు, ఉత్తమౌ జుఁడు, భూరిసేనుఁడు, వీర్యవంతుఁడు, శతానీకుఁడు, నిరమిత్రుఁడు, వృషసేనుఁడు, జయద్రథుఁడు, భూరిద్యుమ్నుఁడు, సువర్చుఁడు నను వారతనిపుత్రులగుదురు. తృతీయసావర్ణిమన్వంతరంబున హావిష్మం తుఁడు, వపుష్మంతుఁడు, ఆత్రేయుఁడు, అనఘుఁడు, చాముధృష్టుఁడు, నిస్వరుఁడు, తేజసుఁడు ననువారుసప్తర్షు లగుదురు. అక్కాలంబున దేవగణత్రయము స్వర్గపాలనంబు చేయుచుండును. సర్వత్రిగుఁడు, సుశర్మ, దేవానీకుఁడు, క్షేమకుఁడు, దృఢేషువు, పణుకుఁడు, ధర్ముఁడు దర్శుఁడు, బాహుఁడు నను వారతని యాత్మజు లగుదురు. చతుర్థసావర్ణి

మన్వంతరంబున ద్యుతియు, సుతపుండును, తపోమూర్తియు, తపోర నుండును, తపోరతియు, తపోనిధియు, తపస్వియు ననువారు సప్తర్షు లగుదురు. దేవతాగణపంచకము స్వర్గంబును బాలించును. రౌచ్యమ న్వంతరంబున ధృతిమంతుండును, హవ్యవంతుండును, తత్త్వదర్శియు, నిరుత్సుకుండును, నిష్ప్రకంపుండును, నిర్మోహుండును, సుతపుండును సప్తర్షులగుదురు. శైబ్యమన్వంతరంబున అగ్నీధ్రుండును, మాగధుం డును, అతిబాహుండును, శుచియు, యుక్తుండును, శకుండును, అజి తుండును సప్తర్షులగుదురు. ప్రభాతకాలంబున భూతభవిష్యద్వర్తమాన కాలంబులయందలి యీమహాపురుషులందఱిని స్మరించువారు సుఖు లగుదురు. త్రయోదశమన్వంతరంబున దేవతాగణపంచకము స్వర్గం బున విరాజిల్లుచుండును. తిగ్మతిగ్మభీముడు, బుధ్నుడు, తనూగ్రుడు, అనుగ్రుడు, అతిథామని ప్రమాథుడు, విష్ణుడు, సంక్రందనుడు, తేజస్వి శంబరుడు ననువారు [illegible] దనయులు. భౌత్య మన్వంతరంబుతోఁ బూర్వకల్పంబు పరిపూర్ణంబగును. ఇట్లు భూత భవిష్యద్వర్తమానమన్వంతరంబులవృత్తాంతమునుగూర్చి యమితతేజుం డగుసనత్కుమారుండు వ్యాసునకు బోధించెను. స్వధర్మంబుచేఁ బ్రజా రక్షణంబు గావించుచు సహస్రయుగంబులకు మునిగణంబు లెల్లరును బ్రహ్మసహితంబుగ బ్రహ్మలోకంబుఁ జేరుదురు. డెబ్బదియొక్కయుగం బులకాలము మన్వంతరంబు గాఁగలదు. మన్వంతరాంతంబున జగం బంతయును విలయంబు నంది బ్రహ్మచే సృష్టి యగుచుండును. శతస హస్రకల్పంబులకుఁ గల్పశేషంబగును. అప్పుడు విశ్వంబంతయు రవికిరణంబులచే దగ్ధంబై పోవును. కల్పాంతంబున సకలదేవతలును బ్రహ్మయునుగూడ నారాయణునందు విలీనులగుదురు. మహాకాలుం డగుపరమేశ్వరుడు జగత్సంహారంబు గావించును.

—♦ యమాదులజననము ♦—

మునివరులారా! భగవానుం డగుకశ్యపునకు దాక్షాయణి గర్భంబున వివస్వంతుండు పుట్టి త్వష్ట్రప్రజాపతి తనయయగు సంజ్ఞను బెండ్లియాడి వైవస్వతుండు, శ్రాద్ధదేవుండు నను పుత్రులను, యమున యను తనయను గాంచెను. శ్రాద్ధదేవుం డగుయముండును, యమునయుం గవలు. పరమరూపవతియు, యువతియు నగుసంజ్ఞాదేవి సూర్యదేవుని తేజస్తాపమును సహింపంజాలక యుద్విగ్నయై తనదేహమునుండి ఛాయ యనుసుందరీమణిని సృజించి "ఓరమణీ! నీకు శుభం బగుంగాక! నేనిప్పుడు నాపుట్టినింటికిం బోయెదను. నాకుం బ్రియంబు చేయంగోరుదువేని నీవు నిశ్చలచిత్తంబున నాయింట నుండి యీనాపుత్రద్వయమును, పుత్రికను భద్రముగాం బెంచుచుండుము" అని యాదేశించుటయు ఛాయాదేవి సమ్మతించి "అమ్మా! నాకేశగ్రహణపర్యంతమును గష్టమును సహించి నేనిం దుండంగలను. నీవు సుఖంబుగం బుట్టినింటికిం బొమ్ము!" అని చెప్పెను. సంజ్ఞాదేవి తనకావించినపనికి సిగ్గుపడుచుం బితృగృహంబునకుం బోయెను. తండ్రియు నామెను నిందించి మరల నత్తింటికిం బొమ్మని ప్రతిదినము గోపపడుచుండెను. అదియును సహింపంజాలక యద్దేవి తనరూపమును గోపనంబు చేసికొని బడబాకృతిం దాల్చి పోయి యుత్తరకురుదేశంబులయందు సంచరించుచుండెను. ఇటసూర్యదేవుండును దగ్గఱనున్న ఛాయయే నిజపత్నియగుసంజ్ఞాదేవి యని భావించి యామెయం దొకపుత్రునిం గనియెను. అతండు సావర్ణినామంబున మనువై ప్రఖ్యాతుండయ్యెను. సంజ్ఞామూర్తిం దాల్చియున్న ఛాయ కనిష్ఠపుత్రుండగుసావర్ణి నధికముగం బ్రేమించుచుం దన్ను వేరుగ చేయుచుండుటం గాంచి జ్యేష్ఠుం డగుయముండు బాల్యచాపలంబువలనను, భవితవ్యత దుర్నివారం బగుటవలనను

క్రుద్ధుండై ఛాయాదేవిని గాలితోఁ దన్నెను. ఆచరణాఘాతముచేఁ గలి
గినకోపావేశంబున హతజ్ఞానుఁడై స్వధర్మంబు మఱచి ఛాయాదేవి కటు
వచనంబులతో "తల్లివగునన్నవమానించితివి గావున నీచరణంబు
భగ్నం బగుఁగాక" యని యముని శపించెను. కుమారుం డగు
యముం డామాట నాలించి శాపభీతుండై పఱుగెత్తుకొని తండ్రిచెం
తకుం బోయి కృతాంజలియై "జనకా! పుత్రులనందఱను సమదృ
ష్టితోఁ బాలించుట మాతృధర్మముగదా! అట్లయ్యును మాతల్లి తన
కనిష్ఠపుత్రుని బాగుగ నలంకరించి నన్ను నిరసించుటయుఁ గోపించి
నేనామెను దన్నితిని. ఈనాయపరాధమును మన్నింపవలయును. ఓదే
వదేవా! మాతల్లి నాపాదము పతితంబగునట్లు శపించినది. నీయను
గ్రహముచే నాకట్టియుపాయము గలుగకుండుఁగాక!" అని ప్రార్థించు
టయు నాదిత్యభగవానుండు "కుమారా! భవితవ్యమిట్లున్నది. కాక
యున్నచో ధర్మజ్ఞుండవు, సత్యవ్రతుండవునగు నీకుఁగూడఁగోప మేల
కలుగవలయును? నాయనా! నీతల్లిమాట నసత్యములుగాఁ జేయుటకు
నేనును సమర్థుఁడను గాఁజాలను. క్రిములు నీచరణమాంసముచుహ
రించి భూతలంబునకుఁ గొనిపోఁగలవు. అందువలన నీమాతృవచనము
సత్యము గాఁగలదు" అని యూఱడించి వివస్వంతుండు క్రోధోద్వి
గ్నుండై ఛాయాదేవిం గాంచి "ఓసీ! కన్నబిడ్డలందఱును దల్లికి
సమానులే కదా! ఇట్టిచో నీవు కనిష్ఠునియందే ప్రేమగలిగియుండు
టకుఁ గారణమేమి? సత్యము వచింపుము!" అని యదలించుటయు
నద్దేవి నిగూఢం బగుసమసవృత్తాంతమును విస్పష్టముగ నాతనికి నివే
దించెను. ఆమాటలాలించి సూర్యదేవుండు కోపముచే మండిపడుచు
విశ్వకర్మయింటికిం బోవుటయు, త్వష్ట్రి యాతని సమయోచితంబుగఁ
బూజించి తన్ను దహింపఁబూనియున్నయాప్రభాకరు నించుక శాం

తింపఁ జేసి "మహాత్మా! అతితీక్ష్ణంబు లగు నీకిరణముల తాపమును మా సంజ్ఞ సహింపఁజాలకపోయినది. ఇంతటి తీవ్రరూపముం దాల్చి యుండుట నీకుచితము గాదు. ఓగ్రహపతీ! ఇక్కారణంబుననే నా తనయ యాత్మయోగబలంబుచే బడబాకృతిం దాల్చి యుత్తమంబులును, నవతృణమయంబులు నగు వనంబులయందుఁ దిరుగుచుఁ బ్రాణములను నిలుపుకొని యున్నది. నీకు నాయం దనుగ్రహము గలదేని నాకును, సకలలోకంబులకును సహ్యంబును, గమనీయంబు నగునట్లు నీ రూపమును జక్కఁబఱచెదను. అందుకొఱకు నీవనుగ్రహింపవలయును" అని ప్రార్థించుటయు మార్తాండుండు విగతక్రోధుండై యట్లే చేయుమని యంగీకరించెను. మహాత్ముం డగు త్వష్ట్రయు, నద్దేవుని శాణయంత్రంబున నిలిపి యాతనికిరణతాపమునకు న్యూనత్వముం గల్పించెను. అందుచేఁ దీవ్రతేజంబునకు హ్రాసత్వంబు గలిగి ప్రభాకరునకు మనోహరాకారంబు సంఘటిల్లెను. తరువాత నాలోకసాక్షి తన యోగదృష్టిచే సంజ్ఞాదేవియున్నతావెఱింగి యశ్వరూపంబున నటకుం బోయి యశ్వినీరూపిణియగు నామెను వెంబడించుటయు న్నాదేవి పరపురుషశంకచే నాతనిఁ దప్పించుకొని పాఱిపోవఁ దొడంగెను. సూర్యుండు నామెను విడువక యద్దేవి ముఖవివరంబునను, నాసారంధ్రంబులను శుక్రక్షేపంబు గావించెను. అందువలన దేవవైద్యులగు నశ్వినీకుమారు లిరువురుదయించిరి. వారికి నాసత్యులనికూడ నామాంతరము గలదు. అప్పుడు సంజ్ఞాదేవి మనోహరాకారులగు కుమారులను గాంచి పరమానందభరితాంతఃకరణయై యయ్యశ్వమూర్తి తన నాథుం డగు నాదిత్యమూర్తియే యని తెలిసికొని యాతనిపాదంబులపై వ్రాలి క్షమాప్రార్థనముం గావించుట సూర్యదేవుం డామె ననుగ్రహించెను.

ధర్మరాజగు యముండు తల్లియెడలఁ గావించిన యపకారంబు

నకుఁ బశ్చాత్పుత్రుండై ధర్మానుసారంబుగ జగత్పాలనంబు చేయుచు దీప్తిమంతుండై నిజకర్మబలంబునఁ బితృగణాధిపత్యంబును, లోకపాలకత్వంబును గాంచఁగలిగెను. తపఃపరాయణుం డగుసావర్ణి ప్రజాపతి యయ్యెను. కాలాంతరంబున నాతఁడు మనువు కాఁగలఁడు. ఆతఁడు సుదుర్గమంబగు మేరుశైలంబునఁ దపంబు చేయుచుండెను. ఆతని సహోదరుండగుశనియు గ్రహశ్రేష్ఠత్వముం గాంచెను. విశ్వకర్మ సూర్యకిరణరజంబువలన విష్ణుచక్రమును నిర్మించెను. ఆదివ్యాయుధము దానవవినాశకరంబై రణరంగమున నప్రతిహతశక్తిమంతంబై విఖ్యాతిం గాంచెను. సూర్యపుత్రికయగుయమున త్రిభువనపవిత్రకారిణి యగు నదీమతల్లియై పొగడొందెను. ఈచరిత్రమును వినువారును, భావంబున నిల్పుకొనువారును విపద్విముక్తులై కీర్తిమంతు లగుదురు.

— వంశకథనము. —

వైవస్వతమనువునకు ఇక్ష్వాకుఁడు, శిబి, నాభాగుఁడు, ధృష్ణుఁడు, శర్యాతి, నరిష్యంతుఁడు, రిష్టుఁడు, కరూశుఁడు, ప్రియవ్రతుఁడు నను తొమ్మండ్రుపుత్రు లుదయించి జనకసమానులై ప్రఖ్యాతిం గాంచిరి. ఆపుత్రులు జనింపకమున్ను వైవస్వతుండు పుత్రార్థియై పుత్రేష్టిం గావించుటయు యజ్ఞవేదినుండి, దివ్యవస్త్రాలంకారవిభూషితయు, దివ్యసుందరవిగ్రహయు నగు ఇలయను కన్యక యుదయించెను. ఆమెంగాంచి వైవస్వతుండు "ఇలా! నావెంటరమ్ము!" అనియెను. పుత్రాభిలాషి యగునాతనివచనంబు లాలించి యిలారమణి ధర్మబద్ధంబులగువచనంబులతో "ఓవాగ్విశారదా! నేను మిత్రావరుణులను దేవతలయంశంబున జనించితిని. కావున నేను వారికడకుం బోయి వారి యనుజ్ఞం గైకొని వచ్చెదను. అప్పుడు నాధర్మంబున కెట్టికళం

కంబును గలుగదు." అని చెప్పి యాక్షణమునందే యాసుందరి మిత్రావరుణులసన్నిధికిం బోయి కృతాంజలియై "ఓదేవతలారా! నేను మీయంశంబులం గాంచి పుట్టితిని. నేనేమి చేయవలయునో మీరాజ్ఞాపింపవలయును" అని కోరెను. ఆమె పలుకులకు మిత్రావరుణులు సంతసించి "ఓకుమారీ! నీవు ధర్మజ్ఞురాలవు. నీవినయంబునకును, దమంబునకును, సత్యంబునకును మేమత్యంతమును బ్రీతుల మైతిమి. మహాభాగ్యవతీ! నీవు మాయిరువురి చరిత్రమునకును విఖ్యాతిం గూర్పఁగలవు. నీవు వైవస్వతునకుఁ బుత్రుండవై సుద్యుమ్ననామంబునఁ ద్రిభువనంబులయందును బ్రసిద్ధుండవగుదువు. మఱియు సకలలోకప్రియుండవును, ధర్మశీలుండవును, మనువంశకర్తవు నయ్యెదవు." అని యభినందించుటయు నారమణీరత్నము వారికడ సెలవుగైకొని మరలఁ దండ్రియగు వైవస్వతుని చెంతకుఁ బోవుచుండెను. ఆసమయంబునఁ జంద్రాత్మజుం డగుబుధుం డామెనుగాంచి మోహించి సంసర్గంబుగావించుటయు నద్దేవి గర్భంబునఁ బురూరవుండను తనయుండు ప్రభవించెను. ఆపురూరవుండు పుట్టినంతనే యత్యాశ్చర్యముగా నయ్యిలాకన్య సుద్యుమ్నుం డయ్యెను. ఆసుద్యుమ్నునకు ఉత్కళుఁడు, గయుఁడు, వినతాశ్వుఁడు ననుధర్మశీలురు మువ్వురు తనయులు గలిగిరి. అందుత్కళుఁడు ఉత్కళనామకం బగుదక్షిణదిగ్భాగమును, వినతాశ్వుండు పశ్చిమదిగ్భాగమును, గయుండు పూర్వదిగ్భాగమును బరిపాలించిరి.

సూర్యభగవానుని యాజ్ఞానుసారముగా వైవస్వతుండీభూమండలంబును దశభాగంబులుగఁ జేసి పదుగురుపుత్రులకు నొసంగెను. అందిక్ష్వాకుండు మధ్యదేశముం గైకొని వసిష్ఠానుమతంబునఁ బ్రతిష్ఠాననగరంబువందుండి ధర్మపాలనంబు గావించెను. స్త్రీపురుషచిహ్నధారి యగుసుద్యుమ్నుండును రాజ్యభాగంబు గైకొని దానిని బుధ్యా

రవున కొసంగెను. నరిష్యంతునకు బహుపుత్రు లుదయించి శకనామంబునఁ బ్రసిద్ధులైరి. నాభాగునకు నంబరీషుండు జనించి బాహ్లికదేశంబును బాలించెను. శర్యాతికి ఆనర్తుండను తనయుండును, సుకన్య యను తనయయుఁ గలిగిరి. ఆసుకన్య చ్యవనునకుఁ బత్నియై ప్రఖ్యాతి నందెను. ఆనర్తునకు మహాతేజస్వి యగు రేవుండను వాఁడుదయించి కుశస్థలి యనురాజధానియం దుండి యానర్తదేశమును బరిపాలించెను. ఆరేవునకు రైవతుండను సుతుండు గలిగెను. ఆతఁడొకప్పుడు కుమారీసహితుఁడై బ్రహ్మలోకంబునకుం బోయి యటగంధర్వగానశ్రవణంబున ముగ్ధుండై యట్లే యుండుటయు ముహూర్తమాత్రంబున భూలోకమునందు బహుశతయుగంబులు గడచిపోయెను. అయినను నాతఁడు బ్రహ్మలోకంబునందుండుటచే వృద్ధుండుగాక యెప్పటివలెఁ దరుణుండై పుత్రికాసహితంబుగ మరల భూమండలంబునకు వచ్చి చూచునప్పటికి తనరాజ్యమంతయు యాదవులచే నాక్రమింపఁబడి యుండెను. బహుద్వారశోభితంబును మనోహరంబును వాసుదేవనివాసంబును, యదువృష్ణిభోజాంధకయోధపరిరక్షితంబును నగుద్వారకానగర మారాజ్యమునకు రాజధానియై యుండెను. అప్పుడు రేవతుండు తనకాలము నాటి విషయంబులు దేనిని గనఁజాలక బహుయుగాంతరములు గడచిపోయినట్లు గ్రహించి తనతనూజయగు రేవతిని శ్రీకృష్ణాగ్రజుండగు బలరామున కొసంగి సుమేరుశృంగంబునకుం బోయి తపంబు చేసికొనుచుండెను. ఆరేవతుండు బ్రహ్మలోకంబునం దున్నప్పు డాతనికి క్షుత్పిపాసలును, మృత్యుభయంబును లేకయుండెను. మరల భూలోకంబునకు వచ్చునప్పటికాతని రాజధాని యగు కుశస్థలి క్రూరరాక్షసులచే విధ్వస్తంబు గావింపఁబడియెను:—ఆరేవతునకు నూర్గురు తనయులు గలరు. వారివంశము దశదిశలను వ్యాపించెను. ధృష్టునిపుత్రు లిరువురును

బ్రాహ్మణగణంబులతోఁ జేరిపోయిరి. కరూశునిపుత్రులు కారూశనామంబున విఖ్యాతులైరి. అంత కారూశునిపుత్రుఁడు పృషధ్రుం డనువాఁడు గురుగోహింసం గావించి గురుశాపంబుచే శూద్రుండై పోయెను. ఇది వైవస్వతమనువంశవృత్తాంతము—

వైవస్వతుని జ్యేష్ఠపుత్రుండగు నిక్ష్వాకుండు భూరిదక్షిణలతో బహుయజ్ఞంబులం గావించి జగన్నుతుం డయ్యెను. ఆతనినూర్గురుతనయులయందును వికుక్షి యనువాఁ డయోధ్యారాజ్యమునకుఁ బ్రభుం డయ్యెను. ఆవికుక్షికి శకునిప్రభృతులు పంచదశపుత్రు లుదయించి క్షత్రివంశోద్ధారకులై యుత్తరాపథమును బాలించిరి. ఆవికుక్షి శ్రాద్ధార్థమై శశమాంసమును దెచ్చి శ్రాద్ధంబు ముగియకుండఁగనే యమ్మాంసమును భక్షించుటం జేసి శశాదనామంబున వ్యవహరింపఁబడియెను. అతనిజనకుం డగునిక్ష్వాకుండు వసిష్ఠాజ్ఞచే నాతని రాజ్యభ్రష్టునిం గావించి యరణ్యంబున కనిచి తానే యయోధ్యారాజ్యమును బాలించెను. అయోధ్యేశ్వరునకు కకుత్స్థుం డనుతనయుండు గలిగి కీర్తిమంతుం డయ్యెను. ఆకకుత్స్థున కరినాభుండును, ఆతనికి పృథుండును, ఆతనికి విష్టరాశ్వుండును, అతని కింద్రుండును, అతనికి యువనాశ్వుండును, అతనికి శ్రావ్రుడును, అతనికి శ్రావస్తుండును, జనించిరి. ఆశ్రావస్తుండు శ్రావసినగరంబును నిర్మించెను. అతనికి మహాయశస్వి యగుబృహదశ్వుండును, అతనికి ధార్మికాగ్రణి యగుకువలాశ్వుండును, జనించిరి. కువలాశ్వుండు జగత్కంటకుం డగు దుందుండనుదానవుని సంహరించి దుందుమారనామంబునఁ గీర్తితుండయ్యెను. అతనికి ధానుష్కాగ్రేసరులు నూర్గురుతనయు లుదయించిరి. కువలాశ్వుండు తనతనూజుల కందఱకును రాజ్యంబును విభజించి యిచ్చి తప

శ్చరణంబునకై వనంబునకుఁ బోవుచుండ మార్గమధ్యంబున బ్రాహ్మణ శ్రేష్ఠుం డగునుతంకుం డనువాఁ డాతని వారించి "ఓమహారాజా! ఈభూమండలమును నీవే పరిపాలింపవలయును. నీచే రక్షితంబగు నీజగంబు నిరుపద్రవంబు గాఁగలదు. కావున నీవు వనంబునకుఁ బోవలదు. నాయాశ్రమసమీపంబున సమతలం బగుమరుభూమియందు బలగర్వితుండును, భయంకరుండును, బృహత్కాయుండు నగుధుంధుండను దానవుండు లోకభీకరం బగుతపంబు చేసి మధుదైత్యతనయుం డగునాతఁడు తపోబలంబుచే దేవతలకవధ్యుండై సముద్రవాలుకామధ్యంబున దాఁగియుండి సకలలోకవినాశంబు గావించునుద్దేశముతో నున్నాఁడు. ఆతఁ డొక్కవత్సరంబున కొక్కనిశ్వాసంబు విడుచును. ఆసమయమున పురవనపర్వతసహితంబుగా నీభూమండలము కంపించి పోవును. ఆనిశ్వాసప్రభంజనముచే నగ్నిస్ఫులింగములతో ధూళిరాశి వెలువడి యాదిత్యపథంబునకును భూనభోంతరాళమున వ్యాపించి సప్తాహపర్యంతమును లోకోపద్రవంబు గావించుచుండును. ఓనరనాథా! ఆరాక్షసభయంబుచే మాయాశ్రమవాసులెల్లరును నిలువఁజాలకున్నారు. లోకహితంబుకొఱకు నీవారక్కసుని సంహరింపవలయును. నీవిమ్మహోపకారంబు గావించినచో నీజగంబంతయును స్వస్థము గాఁగలదు. ఇట్టిఘనకార్యంబు నిర్వహించుటకు నీవే సమర్థుఁడవు. ఓయనఘా! నీయందుఁ దనతేజమును వర్ధిల్లఁజేయునట్లు పూర్వయుగంబున విష్ణుదేవుండు నాకు వరంబిచ్చియున్నాఁడు. ఇహలోకంబునఁ బ్రజాపరిపాలనంబువలననే మహత్తరంబగుపుణ్యప్రాప్తి యగుచుండ నరణ్యవాసంబువలన నేమిప్రయోజనము? నీకు వనవాసాభిలాష కలుగకుండుఁగాక! రాజన్యులకుఁ బ్రజాపాలనంబుతోఁ దుల్యంబగు ధర్మం బేదియును లేదు. పూర్వరాజన్యులు ప్రజాపరిపాలనంబువలన

నుపార్జించినంతటిపుణ్యమును మఱియేఘనకార్యమువలనను గడింపలేదు." అని బోధించుటయు రాజర్షియగుకువలాశ్వుఁడు పుత్రసహితుండై దుందుదానవసంహారార్థమై యుతంకుని వెంట సముద్రతీరంబునకుం బోయెను. ఆసమయంబున భగవానుం డగువిష్ణుదేవుని దివ్యతేజము కువలాశ్వునందుఁ బ్రవేశించెను. అప్పుడు గంభీరధ్వానముతో "ఈ రాజేశ్వరుండు దుంధుమారుండు కాఁగలఁడు" అని దివ్యవాణి వచించెను.

అంత దుర్జయుండగు నమ్మహీనాథుండు పుత్రగణయుతుండై జలధితీరవాలుకాప్రదేశంబు చేరి యావాలుకాసముద్రమును ద్రవ్వటకై కుమారుల కాజ్ఞయొసంగెను. తోడనే వారట్లు గావించుటయు పశ్చిమభాగంబున వాలుకామధ్యవర్తి యగుదానవుండు బయల్పడియెను. ఆతనిముఖంబునుండి జగంబంతయును దాహింపఁజేయఁజాలు నగ్నిజ్వాలలు వెలువడియెను. మఱియు నాతనిదేహమునుండి లోకంబులముంచివేయునంతటిజలప్రవాహము బయలువెడలెను. ఆయగ్నిజ్వాలలయందుఁ బడి కువలాశ్వుని పుత్రులలోఁ దొంబదిమొగ్గురు దగ్ధులైపోయిరి. అంతఁ గువలాశ్వుండు క్రోధోజ్జ్వలుండై యారక్కసుని సమీపించి యాగ్నేయాస్త్రముచే నాతఁడు గావించినజలవాహినిని శుష్కీభవింపఁజేసి, వారుణాస్త్రముచే నాతనివదనానలమును జల్లార్చి యొక్కదివ్యాస్త్రంబుచే జలమధ్యస్థుండగునా లోకకంటకుని నిహతుం గావించి యుతంకునకు సంతృప్తిం గలిగించెను. అమ్మహాకార్యంబు సాధించిన మహాతేజస్వియగు కువలాశ్వునియెడల నుతంకుండు ప్రసన్నుండై యాతనికక్షయధనంబును, నిత్యవిజయంబును, నిరంతరధర్మబుద్ధియు, నక్షయస్వర్గసుఖంబును దుందునిముఖానలకీలలచే దగ్ధులైన యాతనితనయులకు స్వర్గవాసంబును గలుగునట్లు వరంబులొసంగెను.

అక్కువలాశ్వునకు దృఢాశ్వుఁడు, హంసాశ్వుఁడు, కపిలాశ్వుఁడు
ననుమువ్వురుతనయులుమాత్రముమిగిలియుండిరి. అందు దృఢాశ్వుం
డును, అతనికి నిత్యధర్మపరుం డగునికుంభుండును, ఆతనికి సంహతా
శ్వుండును, అతని కృశాశ్వుండును జనించిరి. మఱిసంహతాశ్వునకు
హైమవతి యను నొకతనయ జనించెను. ఆమె తనయుండగుప్రసేన
జిత్తు గౌరియనుకన్యను బరిణయం బయ్యెను. ఆగౌరి పతిశాపంబుచే
బాహుదానది యయ్యెను. ఆమెకుఁ ద్రిభువనఖ్యాతుండగుయువనా
శ్వుండు జనించెను. అతనికిమాంధాతపుట్టి శశబిందుతనయయగుచైత్ర
రథిని బెండ్లియాడి యామెవలన పురుకుత్సుఁడు, ముచికుందుఁడునను
నిరువురుసుతులం గాంచెను. పురుకుత్సునకు త్రిసదస్యుండును, ఆత
నికి త్రిధన్వుండును, ఆతనికి త్రయ్యారుణియు, అతనికి పరాక్రమ
వంతుం డగుసత్యవ్రతుండును జనించిరి. ఆసత్యవ్రతుండు పాణిగ్రహ
ణమంత్రంబులకు విఘ్నం బాపాదించి కామపరవశుండై వివాహితవ
ధువును బలవంతముగహరించెను. మహారాజగుత్రయ్యారుణి యధర్మ
పరాయణుండగు తనయునిపైఁ గోపించి యిల్లువెడలఁగొట్టించెను. అట్లు
పితృత్యక్తుండైన సత్యవ్రతుండు దిక్కులేక చండాలవాటికం జేరి జీవిం
చుచుండెను. అయ్యధర్మంబునకు దేవాధీశ్వరుండు కోపించి యాదే
శంబున ద్వాదశవర్షంబు లనావృష్టిం గల్పించెను. ఆకాలమునందు
మహాతపస్వి యగువిశ్వామిత్రుఁడు సహధర్మిణిని ద్యజించి సముద్రతీ
రంబు చేరియత్యుత్కటం బగుతపంబు చేయుచుండెను. అప్పుడమ్మ
హర్షి భార్య యాదుర్భిక్షసమయంబునఁ బుత్రులను బోషింపఁజాలక
మధ్యమపుత్రుని మెడకుఁ ద్రాడుగట్టి శతసువర్ణంబులకు విక్రయించి
యాధనమువలనఁ దక్కినపుత్రులను బెంచుకొనవలయు నని ప్రయ
త్నించెను. సత్యవ్రతుం డాఋషిపత్ని యనర్హకృత్యంబును వారించి

విశ్వామిత్రుని ప్రియంబుకొఱకును, ఆతని ప్రసాదంబుకొఱకును అమ్ముని కుమారుని బంధముక్తుం గావించి ప్రతిపాలించెను. తల్లిచే గళప్రదేశమున బంధితుండైన కారణముచే నవ్విశ్వామిత్రనందనునకు గాలవుండను నామంబు గలిగెను.

అది మొదలుగా సత్యవ్రతుండు విశ్వామిత్రునియెడలం గల భక్తివలన నాతనిపత్నీపుత్రులను కృపాపరుండై పోషించుచుండెను. ఆతఁడు నిత్యమును వనంబునం గల వరాహమహిషమృగసమూహంబులను వధించి యామాంసమును విశ్వామిత్రాశ్రమంబున నిక్షేపించుచుండెను. అయ్యాహారంబువలన మునిపత్నియును, బుత్రులును సుఖంబుగ జీవించుచుండిరి. చిన్నతనంబునుండియు దుర్గుణంబులతోడనే వర్ధిల్లుచున్న సత్యవ్రతునియెడల కులగురుం డగువసిష్ఠుం డెప్పుడును విరక్తుండై యుండెను. కావుననే తండ్రి యాతనిఁ ద్యజించినప్పు డేమియును జెప్పకయూరకుండెను. ఎప్పటికైన బుద్ధివచ్చునేమో యనునుద్దేశముచేతనే గాని వసిష్ఠుని కాతనియం దెట్టిమాత్సర్యంబును లేదు. అనంతరము కొంతకాలంబునకు మహారాజగుత్రయ్యారుణి దివంగతుఁడయ్యెను. సత్యవ్రతుండు పండ్రెండువత్సరములు వనచారియై యున్నవాఁడుగావున నొకప్పు డాతఁడు మహాత్ముం డగువసిష్ఠునాశ్రమంబునఁ బ్రవేశించి సర్వకామదం బగునమ్మునిధేనువును వధించి యమ్మాంసమునఁ గొంత దాను భుజించి తక్కినవానితో విశ్వామిత్రనందనులకు విందు చేసెను. ఆదుష్కృత్యము నాలకించి వసిష్ఠుండు క్రోధోద్రిక్తుండై "ఓరిదురాత్మా! నీవతిక్రూరంబులగుశంకువులంబోలిన మూఁడు మహాదోషంబులం గావించితివి. ధర్మాత్ముం డగుతండ్రికి సంతుష్టిం గల్పించుట యొకయపచారము. నీకులగురుండనగునాగోవును వధించుట రెండవఅపరాధము. అప్రోక్షితం బగుపదార్థమును భుజించుట మూ

డవదోషము. కావున నీవు త్రిశంకుండ వైతివి" అనియెను. అప్పటి నుండియు సత్యవ్రతునకుఁ ద్రిశంకునామంబు గలిగెను. తరువాత విశ్వామిత్రుండు తపస్సిద్ధుండై స్వీయాశ్రమంబునకువచ్చి తనపత్నీపుత్రులు సత్యవ్రతునియాదరంబునఁ బరిపాలితులైనవృత్తాంతము నాలకించి యాతనియెడలఁ బ్రీతుండై యాతనికి వరప్రదానంబుగావింపను ద్యుక్తుం డయ్యెను. తపోనిధి యగువిశ్వామిత్రుండు సత్యవ్రతుని పితృసింహాసనము నధిరోహింపఁజేసి రాజ్యాభిషేకంబు గావించి యాతనిచే మహాయజ్ఞంబు చేయించి దేవతలాతనియెడ నప్రసన్నులైయున్నను, వసిష్ఠుండు విరక్తుండై యున్నను లక్ష్యము చేయక త్రిశంకునాముం డగుసత్యవ్రతుని సశరీరస్వర్గారోహకునిం గావించెను. కేకయరాజతనయయగు సత్యరథ యనుపత్నియం దాసత్యవ్రతుండు హరిశ్చంద్రుం డనుపుత్రునిం బడసెను. ఆహరిశ్చంద్రుండు బహుయజ్ఞంబులు భూరిదక్షిణలతో నిర్వహించి సార్వభౌముండయ్యెను. ఆతనికి రోహితుండును, ఆతనికి వృకుండును, ఆతనికి బాహుండును జనించిరి. హైహయులు, తాళజంఘులు ననురక్కసులా బాహుని రాజ్యపదచ్యుతునిం గావించి దూరముగఁ దఱిమివైచిరి. బాహుండు సమర్థుం డయ్యును హింస యధర్మం బని తలంచి యద్దానవులను సంహరింపక ఔర్వమునియాశ్రమంబునకుం బోయి యాతనిచే రక్షితుండై యుండెను. ఆతనికి విషవశంబున సగరుండను తనయుండు గలిగెను. సగరుఁడు ఔర్వమునిప్రసాదంబున నాగ్నేయమంత్రసిద్ధిం గాంచి స్వరాజ్యంబునకుం జేరి హైహయతాళజంఘులను ప్రతాడితులం గావించి శక, బహూదక, పారద, ఖశాదిమ్లేచ్ఛజనంబులఁ బరాజితులం గావించెను.

ఇట్లు సూతుండు చెప్పుటయు మహర్షులు సగరుండు విషసహితుండై పుట్టుటకుఁ గారణంబేమని ప్రశ్నించిరి. సూతుండిట్లు చెప్పం

దోడంగెను. అట్లు బాహుం డపహృతరాజ్యుండై వనవాసంబు చేయుచుఁ గొన్నాళ్లకు మరణించెను. అప్పటి కాతనిపత్నియాదవి గర్భిణియై యుండియు నాతనితో సహగమనంబు గావించుట కుద్యుక్తయయ్యెను. అంతకుఁ బూర్వమే యీర్ష్యావశంబున సవతి యామెకు విషప్రయోగము గావించెను. అయ్యాదవి భర్తకొఱకు చితినిపేర్చి యగ్నిని బ్రజ్వలింపఁజేసి తానుగూడ నందుఁ బ్రవేశించుటకు సిద్ధమై యుండ నింతలో భృగుకులతిలకుం డగు నౌర్వుండు వచ్చి యామెను వారించి తనయాశ్రమంబునకుం గొనిపోయెను. అయ్యాశ్రమమందే యామెగర్భము విషసహితంబుగ వినిస్సృతం బయ్యెను. అందుండి సగరుం డుదయించెను. మహాత్ముం డగు నౌర్వుఁడే యారాజకుమారునకు జాతకర్మాదిక్రియలను సంపన్నంబులుగాఁ జేసెను. క్రమముగా నమ్మునివరుం డక్కుమారునిచే వేదశాస్త్రాధ్యయనంబు సేయించి యాగ్నేయాస్త్రం బాతనికిఁ బ్రసాదించెను. అయ్యస్త్రప్రభావము చేతను, నిజబాహుబలంబుచేతను సగరకుమారుండు రణక్షేత్రంబున హైహయాదులను నిర్జించి పితృరాజ్యమును మరలఁ గైకొని త్రిభువనాసాధారణంబగు కీర్తిచేఁ బ్రకాశించెను. తరువాత నాతఁడు శకయవనకాంభోజపహ్లవగణంబులఁ బ్రతాడితులం గావించుచుండుటయు వారందఱును బోయి వసిష్ఠమునీంద్రునిశరణంబు వేఁడుకొనిరి. వసిష్ఠుండును వారికభయం బొసంగి సగరుని శాంతింపఁజేసెను. గురువాక్యపరిపాలకుం డగుసగరుండు వారిని వధింపక వారినందఱను ధర్మచ్యుతులుగను దేశాంతరగతులుగను, కేశపరివర్తితులుగను గావించెను. మహాత్ముం డగుసగరుండు శకులను మస్తకార్ధముండితులం గావించి సముద్రతీరంబునకుఁ దఱిమివైచెను. యవనకాంభోజులను సర్వమస్తకముండితులం గావించెను. పారదులు శ్మశ్రుధారులగునట్లు చేసెను. వీరికిఁ దఱికిని

వేదాధ్యయనాధికారము లేకుండునట్లు శాసించెను. ఈవిధముగ సగరచక్రవర్తి యాసకలక్షత్రియులను ధర్మహీనులం గావించెను. విజయశీలుం డగుసగరచక్రవర్తి ధర్మానుసారంబుగ మహీపాలనంబు చేయుచు నశ్వమేధయాగదీక్షితుండై యొకప్పుడు యజ్ఞాశ్వమును దిగ్విహారణార్థమై పూర్వదక్షిణసముద్రతీరంబున విడిచెను. యజ్ఞభీతుం డగు నింద్రుం డాతురంగము నపహరించి పాతాళంబున దాఁచెను. సగరుం డాసంగతి నెఱింగి పాతాళమువఱకును ఖననంబు గావించుటకై నిజతనూజుల నియోగించెను. వారందఱును గలసి పాతాళంబువఱకును ద్రవ్వుకొనుచుఁ బోయి యచ్చట నాదిపురుషుండును, విశ్వరూపుండును, మునీంద్రుండు నగుకపిలభగవానుని సమీపించిరి. తపోనిమగ్నచిత్తుం డగుకపిలున కప్పుడు తపోభంగం బగుటయు నాతని నేత్రంబుల నుండి క్రోధానలజ్వాలలు వెలువడియెను. ఆయనలకీలలం బడి సగరసుతు లాఱువేలమందియును క్షణమాత్రమున భస్మీభూతులైపోయిరి. అందు హర్షకేతుఁడు, సుకేతుఁడు, ధర్మరథుఁడు, పంచజనుఁడు నను నలుగురుపుత్రులుమాత్రము మిగిలిరి. వారే సగరవంశమునకు ప్రతిష్ఠాపకులైరి భగవానుండగు విష్ణుండు సగరునకు వంశాభివృద్ధియు, విజ్ఞానవృద్ధియు, యశోవృద్ధియు, సంపదభివృద్ధియు, సముద్రజనకత్వంబు నగునట్లుగా నైదువరంబులను బ్రసాదించెను. సగరాజ్ఞచే నాతని తనయులవలన ద్రవ్వఁబడిన సముద్రమునకప్పటినుండియు సాగరమను పేరు గలిగెను. సగరుం డాసముద్రసాహాయ్యమున నే మరల యజ్ఞాశ్వముం బడసి మఖనిర్వహణంబు చేయుటయే కాక యనంతరము శతాశ్వమేధంబులను భూరిదక్షిణలతో నిర్వర్తించెను.

సగరునకు నిర్మలచరిత్రలగు నిరువురు దేవేరులుండిరి. వారిసేవకు సంతుష్టుండై ఔర్వమునీంద్రుండు వరప్రదానంబు గావించుచు

శ్యమించుటయు నందొకతె మహాబలవంతు లగునాఱువేలమంది తనయులను గోరెను. రెండవయామె వంశాభివృద్ధికరుం డగునొకపుత్రు నర్థించెను. పుత్రలోభంబుచే బహుపుత్రులను వాంఛించిన సగరునిపట్టమహిషి కొంతకాలంబునకు బీజపూర్ణంబగు నొక యలాబువును బ్రసవించెను. అప్పుడు దాదు లందు బీజరూపంబున నున్న పిండంబులను ఘృతకుండంబులయందు నిక్షేపించి రక్షించుటయుఁ గ్రమక్రమముగా షట్సహస్రకుమారులు నుదయించి తల్లిదండ్రులకు పరమానందము గూర్చిరి. కపిలనేత్రానలంబుచే దగ్ధులైనయా సగరకుమారులలో మిగిలినయైదుగురియందును పంచజనుండను కుమారుండు రాజ్యముం గాంచెను. ఆ పంచజనున కంశుమంతుండును, అతనికి దిలీపుండును, అతనికి భగీరథుండును జనించిరి. భగీరథుండు భగవతి యగు గంగాదేవిని హిమాలయమునుండి సాగరమునకుఁ బ్రవహింపఁ జేసి గంగాజనకుండయ్యెను. అది కారణంబుగా గంగకు భాగీరథియను నుపనామంబు గలిగెను. ఆ భగీరథునకు శ్రుతసేనుండును, అతనికిఁ బరమధార్మికుం డగు నాభాగుండును, అతని కంబరీషుండును, అతనికి సింధుద్వీపుండును, అతనికి వీర్యవంతుం డగు నయుతాజిత్తును, అతనికి మహాయశస్వి యగు ఋతుపర్ణుండును, జనించిరి, ఆ ఋతుపర్ణుండు అద్భుతద్యూతక్రీడానిపుణుండగు నలచక్రవర్తికి సఖుండయ్యెను. ఆ ఋతుపర్ణున కనుపర్ణుండును, అతనికి మిత్రప్రియుం డగు కల్మాషపాదుండును, అతనికి సర్వకర్ముండును, అతని కనరణ్యుండును, అతనికి విద్వాంసుం డగు ముండిద్రుహుండును, అతనికి రామచంద్రుని ప్రపితామహుం డగు నిషధుండును జనించిరి. ఆ నిషధుండు స్వర్గమునుండి భూమండలమునకు విచ్చేసి ముహూర్తమాత్రజీవితంబునందే తన విజ్ఞానమును, సత్యచరిత్రమును బ్రకటించి త్రిభువనసంనుతముం గావించెను. నిషధునకు మహాభూ

జుం డగురఘుండును, అతని కజుండును, అతనికి దశరథుండును, అతనికిఁ గీర్తిమంతుం డగుశ్రీరామచంద్రుండును జనించిరి. రామచంద్రునకుఁ గుశుండును, అతని కతిథియు, అతనికి నిషధుండును, అతనికి నలుండును, అతనికి నభసుండును, అతనికి పుండరీకుండును, అతనికి క్షేమధన్వియు, అతనికి దేవానీకుండును, అతనికి అహీనగుండును, అతనికి సహస్వంతుండును జనించిరి. ఇది యిక్ష్వాకు వంశము. ఈసూర్యవంశోద్భవులగు రాజులందఱును బహుయజ్ఞంబులను, బహుదానంబులను గావించి విఖ్యాతిం గాంచిరి. ఈసూర్యవంశవిస్తృతింగూర్చి పఠించువారు ఇహపరలోకసుఖంబులను వంశాభివృద్ధిని గాంచఁగలరు.

పితృకల్పము

శ్రాద్ధమహాత్మ్యంబును, తత్ఫలంబును, పితృప్రీతిఁగావించుట వలన సంతానమునకుఁ గలుగు శ్రేయంబునుగూర్చియు పితృగణోత్పత్తింగూర్చియుఁ దెలుపవలయునని ధర్మరాజు భీష్ముని వేఁడుకొనుటయు గాంగేయుం డిట్లు చెప్పం దొడంగెను. ఓయుధిష్ఠిరా! సర్వాభీష్టఫలప్రదం బగుశ్రాద్ధకర్మంబువలనఁ బితృదేవతలను సంతర్పితులం గావించువా రిహపరలోకసౌఖ్యములం గాంచఁగలరు." అని చెప్పుటయు ధర్మజుండు "పితామహా! ఎవ్వనితండ్రికి స్వర్గంబులభించునో, ఎట్టివానిజనకుండు నరకపతితుం డగునో యెఱింగింపవలయును. జీవులెల్లరును గర్మానుసారంబుగ శుభాశుభఫలంబులు గాంచుచుందు రని శాస్త్రంబులు బోధించుచున్నవి. శ్రాద్ధద్రవ్యములు నరకస్థులగు పితరుల కెట్లు చేరునోపుత్రులు నరకపతితులగు పితృగణంబుల నెట్లుద్ధరింపఁగలరో తెలుపఁగోరెదను. దేవతలుగూడఁ బితృశ్రాద్ధంబు గావింతురని వినియుంటిని. ఈవిషయంబునఁగలుగు నెల్లసంశయములను

నివారింపవలయును" అని ప్రార్థించెను. సర్వజ్ఞుం డగుభీష్ముం డాతని యెడల సంప్రీతుండై "ఓరిపుసూదనా! పరమగుహ్యంబగునీధర్మము నెఱింగించెదవినుము. పూర్వము పరలోకగతుం డగునాతండ్రియె నాకీధర్మమును బోధించియుండెను. ఒకప్పుడు నేను మజ్జనకుని మృత దివసంబునఁ బిండప్రదానంబు చేయుటకు సంసిద్ధుఁడనైయుండఁగా మాతండ్రి భూగర్భమును భేదించుకొని వచ్చి తనహస్తమును చాచి స్వహస్తంబునఁ బిండదానము చేయుఁగోరెను. పితృకరంబునఁ బిండ ప్రదానము చేయు నియమము కల్పసూత్రంబున లేదు. అయినను నేను సంసయింపక కుశమధ్యమున నట్లే పిండదానము గావించితిని. అందువలన నాజనకుండు ప్రసన్నుండై మధురభాషణంబులతో "ఓ భరతకులతిలకా' నేను నీవలనఁ బుత్రవంతుండ నైతిని. ధార్మికుఁ డవు, పండితుఁడవు నగునీవు నన్నుద్ధరించితివి." అనుటయు నేను "మహాత్మా! రాజు దేనిని ప్రమాణంబుగఁ జేసికొని ధర్మనిర్వాహ ణంబు గావించునో తెలుపవలయును. ప్రజలుకూడ నట్లే రాజానుమ తంబు ధర్మంబుగఁ బ్రవర్తించుచుందురుగదా!" అనిన నాజనకుండు "కుమారా! శాశ్వతం బగువేదమే ధర్మమునకుఁ బ్రమాణము. నీవు నాకీర్తిని రక్షించితివి. నాకు భక్తుండవైతివి. అందుచే నేను నీయెడలఁ బ్రసన్నుండనైతిని. కావున నీకు సర్వోత్కృష్టవరప్రదా నంబు గావించెదను. నావరప్రభావముచే నీకు జీవితేచ్ఛయున్నంతవ ఱకు మృత్యువు నిన్ను గ్రసింపఁజాలకుండుఁగాక! త్రిలోకదుర్లభం బగునీవరంబును గ్రహింపుము. ఇంకను నేమికావలయునో కోరుము" అని యనుగ్రహించుటయు నేను పితృదేవున కభివాదనంబు చేసి కృతాంజలిపుటుండనై "ఓమానదా! నీవు నాయెడలఁ బ్రసన్నుండ వగుటచేతనే నేను కృతార్థుండ నైతిని. నాయందు దయగలదేని

నాప్రశ్నంబులకు బ్రత్యుత్తరంబు నీయవలయును. మహాత్మా! పితృగణంబులు దేవతలకుంగూడఁ బూజనీయు లని విని యుంటిని. వే రెటు సంగు శ్రాద్ధద్రవ్యముచే వార లెట్లు సంప్రీతు లగుదురు? లోకాంతర గతులగుపితృదేవతలకు శ్రాద్ధంబు నిర్వర్తించుటవలన నెట్లు ఫలసిద్ధి యగును? ఈవిషయంబున నాసంశయంబు నివారింపవలయును” అని ప్రార్థించితిని. అప్పుడు నాతండ్రి “కుమారా! ఇవ్విషయంబును సంక్షేపముగ నెఱింగించెద నాకర్ణింపుము. వత్సా! దేవతలకుఁగూడ వంద్యులగుపితృదేవతలు బ్రహ్మపుత్రు లని యెఱుంగుము. దేవదానవమానవయక్షరాక్షసగంధర్వపన్నగాదు లెల్లరును బితృదేవతల నారాధించుచుందురు. దేవదానవగంధర్వాదు లెల్లరును నిశ్చలచిత్తంబున భక్తిపూర్వకంబుగ పితృదేవతలను శ్రాద్ధకర్మంబులచే సంతృప్తులం గావింపవలయునని వేదంబులయందు బ్రహ్మదేవుం డాదేశించియుండెను. నామగోత్రంబులను జెప్పుచు పితృదేవతల నారాధించుచుండుము. అందువలన వారు సంతృప్తులై సర్వదా నీకఖిలమంగళములను సమకూర్చుచుందురు. పితృగణంబులు స్వర్గమందున్నను, మఱియెందున్నను పుత్రులు వారిని శ్రాద్ధతర్పితులం గావింపవలయును. ఇంకను నివ్విషయంబునందు నీకుఁ గలసంశయంబు లన్నియు మార్కండేయునివలన దీరఁగలవు.” అనిచెప్పి యమ్మహాత్ముం డంతర్హితుండయ్యెను:—

భీష్ముం డొకప్పుడు మార్కండేయుని దర్శించి యివ్విషయంబునఁ బ్రశ్నించుటయు నతం డిట్లనియెను. “ఓమహారాజా! పితృదేవతాప్రసాదమువలనను, పితృభక్తివలనను నాకు చిరజీవనంబును, నుత్తమయశంబును లభించెను. నేనొకానొకయుగావసానంబున సుమే

రుపర్వతశిఖరంబున వసించి బహుశతవర్షంబులు కఠోరతపంబు గావించితిని. అప్పు డొకనాఁడు తన తేజంబుచే భూనభోంతరాళంబును వెలిఁగించుచు, మేరుపర్వతశిఖరమధ్యమునుండి యొకదివ్యవిమానము వెలువడియెను. అందు ప్రజ్వలితానలంబువలె దీప్తిమంతం బగునొక పర్యంకంబు శోభిల్లుచుండెను. తన్మధ్యంబున నగ్నిశిఖాసదృశ తేజస్సంపన్నుండును, అంగుష్ఠమాత్రవిగ్రహుండు నగునొకపురుషుం డా వహ్నిమధ్యంబున వహ్నిజ్వాలంబోలి శయనించి యుండెను. అట్లు సాక్షాత్కరించినయాప్రభుని దర్శించినంతనే నేను సాష్టాంగదండప్రణామంబు గావించి ఓప్రభూ! నీ వెవ్వండవో యెఱింగింపవలయు నని ప్రార్థించితిని. ధర్మాత్ముం డగునప్పురుషుం డప్పుడు "ఓమార్కండేయా! తపోధనుండ వగునీవు తపోబలంబున నన్ను దర్శింపఁగలిగితివి. నన్ను బ్రహ్మమానసపుత్త్రుం డగుసనత్కుమారునిగా నెఱుంగుము. నీ కేమి కావలయునో కోరుము. ఇతరులగు బ్రహ్మమానసపుత్త్రు లెవ్వారు నాకనిష్ఠసోదరులు. వారివంశంబు లన్నియును జగద్వ్యాప్తములై యున్నవి. నేను యతిధర్మావలంబినై యాత్మను దేహమధ్యంబున నాయత్తంబు గావించి యెచ్చటఁ దోఁచిన నచ్చటఁ గుమారమూర్తినై సంచరించుచుండుదును. ఆకారణంబున నాసనత్కుమారనామము లోకప్రసిద్ధం బయ్యెను. నాదర్శనంబుఁగోరి తపంబు చేయుచున్న నీయభీష్టంబు సిద్ధింపఁజేయుటకై యిట్లు సాక్షాత్కరించితిని." అని బోధించుటయు మార్కండేయుండు పితృదేవతలయుత్పత్తిం గూర్చి యెఱింగింపవలయు నని ప్రార్థించెను. అప్పుడు సనత్కుమారుండు "మార్కండేయ మునీంద్రా! తొల్లి బ్రహ్మదేవుండు దేవగణంబులను సృజించి తన్నుఁ బూజింపవలయు నని వారిని నియోగించెను. కాని యాదేవతలు బ్రహ్మ నారాధింపక ఫలార్థులై తమ్ముఁ దామే పూజించుకొనఁదొడం

గిరి. అది యెఱింగి పితామహుండు కోపించి "ఓమూఢులారా! మీరు నష్టసంజ్ఞు లగుదురుగాక!" అని శపించెను. అందువలన దేవత లజ్ఞానులై యేమియు నెఱుంగఁజాలక బ్రహ్మదేవునకు సాష్టాంగదండ ప్రణామంబులు గావించి వినయవినమితశిరస్కులై మమ్మనుగ్రహింప వలయు నని వేఁడుకొనిరి. పితామహుండును వారియెడఁ గరుణాళుండై "దీనికిఁ బ్రాయశ్చిత్తమును మీపుత్రుల నడిగి తెలిసికొనుఁడు. అట్లయినచో మీకు జ్ఞానలాభం బగును." అని యానతిచ్చెను. శాప ప్రభావముచే జ్ఞానహీనులైనదేవతలందఱు నప్పుడు తమకుమారుల చెంతకుం బోవుటయు వారిం గాంచి దేవకుమారులు "ఓపుత్రులారా! దయచేయుఁడు." అని పలికిరి. వారికడఁ బ్రాయశ్చిత్తార్థతత్త్వమును గ్రహించి దేవతలందఱును లబ్ధజ్ఞానులై మరల విరించిచెంతకుం బోయి "ఓజగద్విధాతా! మమ్ము మాకుమారులు "పుత్రులారా!" అని సంబోధించుటకుఁ గారణమే" మని ప్రశ్నించిరి. అప్పుడు బ్రహ్మదేవుండు "దేవతలారా! మీరు బ్రహ్మవాదులు గారు. అందుచే మీ కాయర్థంబు బోధపడినది కాదు. కాని మీపుత్రులు వచించినది సత్యమే కాని మిథ్యకాదు. మీరు కేవలశరీరమాత్రకర్తలు. అంతే కాని జ్ఞానదాతలు గారు. మీపుత్రులకు మీరును, మీకు మీపుత్రులును బరస్పరపితరులై యున్నారు. ఇందెంతమాత్రమును సంశయము లేదు." అని బోధించుటయు దేవతలందఱును నిస్సంశయులై తమ్ము పుత్రకరూపంబున సంబోధించినపుత్రగణంబులను బితృగణంబులుగా నంగీకరించిరి.

శ్రాద్ధకర్మంబునందు సోముండు పరితృప్తుండైనచో స్థావరజంగమాన్వితంబులగు జగంబు లన్నియును బరితృప్తంబు లగును. పుష్టికాములై పితృగణంబులకు శ్రాద్ధక్రియల నిర్వర్తించువారు పితృప్రసాదం

బున సంతానవంతులును, మహోన్నతులు నగుదురు. పార్వణశ్రాద్ధంబులయందు గోత్రనామోల్లేఖనంబుచేసి పిండత్రయదానంబుచేయువారు శుభఫలసిద్ధు లగుదురు. పితృదేవతలను శ్రాద్ధతృప్తులంగావించి పితృగణంబులను స్మరింపవలయును. అని యిట్లు బ్రహ్మదేవుండు చెప్పుటయు దేవతలు తామును బితృగణంబులును బరస్పరపితృపుత్రుల మగుదు మని తెలిసికొనిరి.

—♦ పితృసప్తకవివరణము ♦—

పితృదేవత లేడ్గురు. అందు కవ్యవాహుఁడు, అనలుఁడు, సోముఁడు, యముఁడు ననునలుగురును మూర్తిమంతులు. అగ్నిష్వాత్త, అర్యముఁడు, బర్హిషదుఁడనుమువ్వురు నమూర్తులు. మూర్తిరహితు లగు పితృదేవతలను దేవతలు పూజింతురు. మూర్తిమంతు లగు నలువురను బ్రాహ్మణాదివర్ణంబులవారు పూజింతురు. తక్కినపితృదేవతలం దఱును ముందుగా సోము నారాధింతురుగావున యోగులకైనను శ్రాద్ధకర్మం బవశ్యకర్తవ్యము. ఎల్లవారును రజతపాత్రములతోఁ బితృశ్రాద్ధంబు చేయవలయును. అశక్తులైనచో రజతయుతం బగుతామ్రపాత్రంబైన నుపయోగింపవచ్చును. ప్రథమంబున వహ్నిని క్రమంబుగా సోముని, యమునిఁ బరితృప్తులం గావింపవలయును. దక్షిణోత్తరాయణంబులం దెప్పుడైనను అగ్నిమధ్యంబునను, దదభావంబున జలమధ్యంబునను బితృతర్పణంబు చేయవలయును. పితృదేవతలు సంతుష్టులైనచో పుష్టిని, సంతానమును, స్వర్గసౌఖ్యమును, ఆరోగ్యమును, సకలాభీష్టంబులను వర్ధిల్లఁజేయుదురు. పితృకార్యము దేవకార్యంబునకంటెను శ్రేష్ఠమైనది. ఓమార్కండేయా! నీవు పితృభక్తుండ వగుట

చేతనే జరాశూన్యుండవు నమరుండవు నైతివి. పితృభక్తులకు గలుగు ఫలము యోగసిద్ధులకైనను లభింపదు. అని యుపదేశించి సనత్కుమారుండు మార్కండేయునకుఁ ద్రిభువనదుర్లభం బగుత్రికాలదర్శన సామర్థ్యమును, దివ్యదృష్టియు, యోగిగతియును బ్రసాదించెను.

భరద్వాజునిపుత్రు లగుబ్రాహ్మణులు యోగసిద్ధులయ్యును దుష్కర్మంబులచే భ్రష్టులైరి. వాగ్దుష్టుఁడు, క్రోధనుఁడు, హింస్రుఁడు, పిశునుఁడు, కపి, స్వసృపుఁడు, పితృవర్తి యనుసార్థకనామములగల కౌశికపుత్రులు గర్గమునికి శిష్యులై యుండిరి. వారు తమతండ్రియనంతరమున గురుగృహమందే వసించి గురుని యాజ్ఞానుసారముగా కపిల యనుపేరుగల యతనిధేనువును సవత్సంబుగఁ బొలంబునకుఁ దోలుకొనిపోయి మేపుకొని వచ్చుచుండిరి. ఒకనాఁడు దుష్టుండనువాఁడు క్షుధార్తుండై మేయుచున్నయావును జంపి తినవలయునని యుద్యమించెను. అప్పుడు కపియును, స్వసృపుండును గోహత్య చేయుట యుచితము గాదని యతనికి బోధించిరి. తక్కినవారు నాఁకలిగొని యుండుటవలన వారిమాటలను నిరాకరించిరి. అప్పుడు వారిలోఁ బితృవర్తి యనువాఁడు నిత్యశ్రాద్ధకారియై యుండెను. వాఁడు తనసోదరుల నుద్దేశించి “భ్రాతలారా! మీరు బ్రాహ్మణుల కకర్తవ్యంబగుగోహత్యకుఁ బూని యున్నారు. ఇది తప్పదేని యీహింస పితృదేవతోద్దేశముగా నిర్వహించి ధర్మానుసారంబుగా శ్రాద్ధంబు చేసినచోఁ బాపంబు గలుగదు. పితృగణారాధనంబునకై కావించిన గోహత్యయైనను నధర్మంబు గానేరదు.” అని చెప్పుటయు నాతనియుపదేశ మంగీకరించి యందఱును, ఆధేనువును జంపి యమ్మాంసముతోఁ బితృదేవతల నర్చించి యనంతరము తాము భుజించి యింటికిఁ బోయి యావును పులి చంపివైచినదని గురునకు నివేదించిరి. గురుండును శిష్యుల

వాక్యంబులను విశ్వసించి యూరకుండెను. గురునని ధి నసత్యము చెప్పినందుకై గోహంతకు లగుకౌశికపుత్రులకు దోషంబు ఘటిల్లెను. అందువలన వారందఱును జలోదరరోగముచే బాధింపఁబడి క్రమంబుగ నాయుశ్శేషం బగుటయు మరణించి తమపాపమునకుఫలంబుగ దశార్ణదేశంబున వ్యాధకులంబున బలవంతుండును, ప్రశాంతచిత్తుండు నగులుబ్ధకునకు జన్మించిరి. తరువాతవారు పూర్వము గోహత్యచేసిన ను దానితో పితృశ్రాద్ధము గావించినవారగుటచే కాలంజరపర్వతంబున మృగంబులై పుట్టిరి. వారికిఁ బ్రతిజన్మమందును బూర్వజ్ఞానము గలిగియుండెను. పిమ్మట వారు, క్షమావంతులును, స్త్రీసంగవర్జితులును, అవివాహితులును, శుభకర్ములును, స్వధర్మనిరతులును, వనవాసులునైరి. వారు పూర్వకాలంబున గురునియొద్ద నెల్లధర్మంబుల వినియున్నవారుగావున దేహాంతరమందు ధర్మబుద్ధిగలవారికి సంసారమందు నివృత్తి గలిగెను. క్రమముగా వారు మితాహారులై తపంబు చేసి కాలంజరపర్వతంబున దేహత్యాగంబుచేసినచిహ్నంబు లిప్పటికిని బ్రొత్తగాఁ గానవచ్చును. అట్లు వారు శుభాశుభకర్మఫలంబుల నుజ్జగించుటవలన నుత్తరజన్మంబునందు శరద్వీపంబునఁ జక్రవాకంబులై పుట్టిరి. గురునితో నసత్యమాడినదోషంబుచే వారికిఁ బక్షిజన్మంబు గలిగెను. కాని వారు నిస్పృహులును, నిరహంకారులును, శాంతులును, నిర్ద్వంద్వులును, నిష్పరిగ్రహులును, నివృత్తులునై యుండిరి. పూర్వంబున గావించినబ్రహ్మచర్యప్రభావముచే వారందఱును బరస్పరసహచరులైరి. శ్రాద్ధానుష్ఠానంబువలన వారి కాజన్మంబునందును జ్ఞానభ్రంశంబు గాలేదు. ఆచక్రవాకులు సుమనుఁడు, సువాక్కు, శుద్ధుఁడు, పాంచాలుఁడు, ఛిద్రదర్శకుఁడు, సునేత్రుఁడు, సుతంత్రుఁడు ననునామంబులతో వ్యవహరింపఁబడుచుండెను. ఇట్లుండగా మహా

ప్రభావసంపన్నుం డగునృపేశ్వరుం డంతఃపురజనపరివృతుండై యా చక్రవాకంబులు విహరించువనంబునకు విచ్చేసెను. ఆతనివైభవముం గాంచి సుతంతుండనుచక్రవాకుండు నేఁజేసినపుణ్యంబును దపంబును గలదేని నాకీయుత్కృష్టము లభించునుగదా యని యాశపడియెను. ఆతనిసహచరు లగుమఱియిద్దఱు చక్రవాకులు, అట్లయిన మేము నీకు మంత్రులమయ్యెదమనిరి. అప్పుడు యోగరతుం డగుసుతంతుండు 'తథాస్తు' అనియెను. అది చూచి సువాక్కనువాఁడు నీవు యోగి వయ్యును నికృష్టంబగుకోరికం గోరితివి కావున కాంపిల్యనగరంబునకు రాజవై జనింపఁగలవు. వీరిరువురును నీమంత్రులగుదురనియెను. అప్పుడు తక్కినచక్రవాకులందఱును గలసి యామువ్వురియెడలను బ్రసన్నులై మీకట్టి జన్మంబు గలిగినను మరల యోగులు గాఁగలరని యనుగ్రహించిరి.

× × × × ×

తక్కిననలుగురుచక్రవాకులును కాంపిల్యనగరంబున దరిద్రబ్రాహ్మణకుటుంబమున జనించి ధృతిమంతుఁడు, సుమహాత్ముఁడు, తత్వదర్శి, నిరుత్సుకుఁడు నను నామంబులచే విఖ్యాతులై వేదాధ్యయనసంపన్నులును, ఆత్మదర్శులును, యోగనిరతులు నగుసిద్ధులైరి.

— వ్యాసపూజ. —

ఓయాచార్యా! నీవు మహావిష్ణుఁడవు. వ్యాసమూర్తి వగు నీకు నమస్కారము. ఓమహేంద్రా! నీవు నాయందుఁ బ్రసన్నుండ వైతివేని నాకు సదాశివప్రసాదంబు లభింపఁగలదు." అని ప్రార్థించి

పురాణపఠనంబు సమాప్తంబైనవెనుక పండితగణంబున బహుదక్షిణా దానంబులచేఁ దనుపవలయును. పిమ్మట పౌరాణికునకు వందనంబు చేసి కరభూషణంబులను, గర్ణకుండలంబులను నూత్నవస్త్రంబులను, సువర్ణంబును సమర్పించి యథావిధిగ నాతనిఁ బూజింపవలయును. మఱియు శివపూజానంతరంబున సవత్సం బగుధేనుదానమును చేయవలయును. పురాణశ్రవణంబునకు దక్షిణగా పలపరిమితసువర్ణముతో నిర్మించినసింహామును, వస్త్రయుగ్మమును గూడ నర్పింపవలయును. ఇట్లు చేయువారు భవబంధవిముక్తు లగుదురు. విధివిధానంబునఁ బురాణశ్రవణంబు గావించుట యధికఫలప్రదంబుగావున ఆస్తికులగువా రెల్లరును విధ్యుక్తముగఁ బురాణము నాశ్రయింపవలయును.



ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయము,

(1911 వ సంవత్సరములో స్థాపింపఁబడినది.)

పిఠాపురము.

నవలలు—నవరసభరితములగు నవలలు—పుణ్యచరిత్రములు. 200-250 పుటలకు మించకుండ—రెండుమాసముల కొక్కటిగా వెలువడును.

చందాదారుల సౌకర్యమునకై నవలల వెలలు చౌకచేసి పోస్టేజి మేమే భరించి పూర్వపునిబంధనలీక్రిందివిధముగా మార్చినాము.

—♦ నిబంధనలు ♦—

1. ఇందుఁ జందాదారులుగఁ జేరువారు ప్రవేశరుసుముక్రింద ముందుగా 0-4-0 చెల్లింపవలయును.

2. ఇందు రెండేసిమాసములకొక్కటిగ వెలువడుచుండు మంచి రేపరుబైండుగల ప్రతిగ్రంథమును పోస్టేజి మనీఆర్డరు కమీషనులు మేమేభరించి రు 1-0-0 కిమాత్రమే చందాదారులకుఁ బంపుచుందుము.

3. చందాదారు లగువారు వెనుకటిగ్రంథములన్నియుఁ గొనవలయునను నియమములేదు. కాని వారు కోరినచో వెనుకటిపుస్తకములుకూడఁ జందాదారుల వెలలకే పంపుచుందుము. క్రొత్తగ వెలువడుచుండు గ్రంథములు మాత్రము చందాదారులు తప్పక పుచ్చుకొనుచుండవలయును.

4. ఇందుఁ బ్రకటింపఁబడు అనుబంధములు చందాదారులు తప్పక పుచ్చుకొనవలయునను నియమములేదు. కోరినవారికే పంపుచుందుము.

5. సంవత్సరముచందా అనఁగా ముందుప్రకటింపఁబడు ఆఱు పుస్తకములకు రు 5-4-0 లు ముందుగఁ బంపువారికి ఆఱుపుస్తకములవరకు ప్రతిపుస్తకమును అన్‌రిజిస్టర్డుపార్సెలుగా పంపుచుందుము.

శ్రీదేవాయనమః

పురాణగ్రంథమాలిక,

పిఠాపురము.

మనపూర్వులమహామహిమలు, సత్యచారిత్రములు, భగవన్మహిమలు, ధర్మములు, నీతులు, నీతిబోధకములగు కథలు, దేవతల చరిత్రములు, రాక్షసులచర్యలు, భగవంతునియనుగ్రహము—ఇత్యాదివిషయములతో నిండియున్న యిహపరసాధకంబు లగుమనపురాణోపపురాణములు, ఇతిహాసములు మొదలగునుత్తమగ్రంథములను సులభశైలిని వచనరూపమున నాంధ్రీకరించి యాంధ్రమహాజనులహస్తముల కందించుటకై స్థాపింపఁబడినది. రెండేసినెలల కొక్కొక్కసంపుటము చొప్పున 200—250 పుటలవంతున డెమ్మీసైజునఁ బ్రకటింపఁబడుచుండును. ఆంధ్రమహాజను లందఱును మాయుద్యమమునకుఁదోడ్పడి గీర్వాణభాషయందున్న మహాపురాణాదులను మన తెలుఁగువారికిఁ దెలియునట్లుగా నొనర్చుచున్నమాకుఁ బ్రోత్సాహముఁ గలిగింతురుగావుత మని వేఁడికొనుచున్నాము.

నిబంధనలు

(1) ఇంతుఁ జందాదారులగువారు రు 0-4-0 ప్రవేశరుసుము చెల్లింపవలయును.

(2) చందాదారులకు పోస్టేజీ మనీఆర్డరుఖర్చులు మేమే భరించి యొక్కొక్కసంపుట మొకరూపాయకుమాత్రమే పంపుచుందుము. (చందాదారులుకానివారికి పోస్టేజిగాక రు 1-8-0 లు.)

ముందు రాఁబోవు పుష్పము.

బ్రహ్మపురాణము.

మూడవ భాగము

పురాణగ్రంథమాలయందు ప్రకటింపఁబడి వెలకు సిద్ధముగ నున్న గ్రంథములు.

		చందాదారులకు పోస్టేజితో వెల.	ఇతరులకు పోస్టేజికాక వెల.
1. శివపురాణము	౧ సం.	1-0-0	1-8-0
2. శివపురాణము	౨ సం.	1-0-0	1-8-0
3. శివపురాణము	౩ సం.	1-0-0	1-8-0
4. శివపురాణము	౪ సం.	1-0-0	1-8-0
5. శివపురాణము	౫ సం.	1-0-0	1-8-0
6. బ్రహ్మపురాణము	౧ సం.	1-0-0	1-8-0
7. బ్రహ్మపురాణము	౨ సం.	1-0-0	1-8-0
8. వామనపురాణము	౧ సం.	1-0-0	1-8-0
9. వామనపురాణము	౨ సం.	1-0-0	1-8-0
10. వామనపురాణము	౩ సం.	1-0-0	1-8-0
11. శివపురాణము	౬ సం.	1-0-0	1-8-0
12. శివపురాణము	౭ సం.	1-0-0	1-8-0

☞ వామనపురాణము సంపూర్ణగ్రంథము:—చందాదారులకు పోస్టేజీతో రు 2-8-0. ఇతరులకు పోస్టేజీగాక రు 4-0-0.

సంపాదకుఁడు, పురాణగ్రంథమాలికా కార్యస్థానము, పిఠాపురము.

ప్రతులు దొరకువారు ;—

నడకుదుటి వీరరాజు పంతులుగారు,

సంపాదకుఁడు,

పురాణగ్రంథమాలిక,

పిఠాపురము. (తూర్పుగోదావరి)

అని వ్రాయవలయును.